
కథలు

# ద లాస్ ఆఫ్ ఇన్నోసెన్స్




కుప్పిలి పద్మ

# ద లాస్ ఆఫ్ యిన్నోసెన్స్

కుప్పిలి పద్మ కథలు





# ద లాస్ ఆఫ్ యిన్నోసెన్స్

కుప్పిలి పద్మ

కథలు

**THE LOSS OF INNOCENCE** collection of short stories by **KUPPILI PADMA**

First publication: 14th October 2015. Copies 1000. © Kuppili Padma. Publishers: **MUKTA PUBLICATIONS.** Cover design and illustrations **LAXMAN AELAY**. Cover printed at **PRAGATHI ART PRINTERS.** Composed and designed at **AKSHARA CREATORS**. Printed at **CHARITA IMPRESSIONS.** Copies available at **KUPPILI PADMA,** 201, Vijayalaxmi Apartments, Methodist Colony, Begumpet, Hyderabad-500 016. **VISALANDHRA PUBLISHING HOUSE,** Vijayawada and its branches in Andhra Pradesh. **NAVACHETANA PUBLISHING HOUSE,** Hyderabad and its Branches in Telangana; **NOVADAYA BOOK HOUSE,** Kachiguda, Hyderabad.

e book: **www.kinige.com.**

**Rs. 120**

kuppilipadma@yahoo.com
kuppilipadma@gmail.com
www.kuppilipadma.com



**యీ లాస్ ఆఫ్ యిన్నోసెన్స్‌లో...**


| | | |
|---|---|---|
| ద లాస్ ఆఫ్ యిన్నోసెన్స్ | ... | 24 |
| నా స్నేహితురాలి పేరు... 'సుధీర' | ... | 48 |
| ఫ్రంట్ సీట్ | ... | 66 |
| మదర్‌హుడ్ @ రియాల్టీ చెక్ | ... | 80 |
| గాల్లో తేలినట్టుందే... | ... | 96 |
| సహస్ర | ... | 110 |
| మాన్వి | ... | 128 |
| బ్రేకప్ బొకే... | ... | 148 |
| పున్నమిలా వచ్చిపొమ్మని | ... | 158 |
| అతుల్య | ... | 170 |
| మౌన | ... | 188 |



**మంచి చదువరి, స్నేహితులు**
**ప్రముఖ వైద్యులు**

**డా॥ యం.వి. రావు** గారికి...

*యశోద హాస్పిటల్స్*

## యిప్పటి వరకూ...

**కథా సంపుటాలు**

| | |
|---|---|
| మనసుకో దాహం | - ఫిబ్రవరి 26, 1994 |
| ముక్త | - ఆగస్టు 1997 |
| సాలభంజిక | - అక్టోబర్ 14, 2001 |
| మంచుపూల వాన | - అక్టోబర్ 14, 2008 |
| వాన చెప్పిన రహస్యం | - అక్టోబర్ 14, 2014 |
| ద లాస్ ఆఫ్ యిన్నోసెన్స్ | - అక్టోబర్ 14, 2015 |

**నవలలు**

| | |
|---|---|
| పడగనీడలో... | - 1995 |
| అహల్య | - 1996 |
| మహి | - 2009, 2011 |

**ప్రేమలేఖలు**

| | |
|---|---|
| అమృతవర్షిణి | - 1993 |

**మ్యూజింగ్స్**

| | |
|---|---|
| శీతవేళ రానీయకు | - జూన్ 1999, 2009 |

**కవిత్వం**

| | |
|---|---|
| కొన్ని పూలవనాలు కాసిన్ని తేనెచుక్కలు | - 2015 |

*నన్ను, నా రచనలనీ ప్రేమించే పాఠకులందరికీ పేరుపేరునా...*

*యీ కథలను ప్రచురించిన పత్రికా సంపాదకులకీ...*

*యీ లాస్ ఆఫ్ యిన్నోసెన్స్‌కి ముందుమాట రాసిన*
*వీక్షణం సంపాదకులు, ప్రముఖ సాహితీవేత్త*
*యన్. వేణుగోపాల్‌గారికీ...*

*ముఖచిత్రంపై తన రంగులని చిలకరించిన*
*ఏలె లక్ష్మణ్‌గారికీ...*

*అక్షరాలని పుస్తకంగా పొదిగిన అక్షర సీతగారికీ...*

*మా మంచి మిత్రులు వేమన వసంతలక్ష్మిగారికీ,*
*ఎ.ఎన్. జగన్నాథశర్మగారికీ, అనిల్ యస్. రాయల్‌గారికీ,*
*అనంతకృష్ణగారికీ, ఆకెళ్ల రాజ్‌కుమార్‌గారికీ,*
*ఆర్.యం. ఉమామహేశ్వరరావుగారికీ,*
*అరిపిరాల సత్యప్రసాద్‌గారికీ...*

*యీ చిన్ని కానుకని బోలెడంత మొహమాటంతో అందుకొంటున్న*
*స్నేహితులు డా॥ యం.వి. రావుగారికీ...*

**నా హృదయపూర్వక కృతజ్ఞతలు...**

కథలు యెందుకు రాస్తున్నాను అంటే- చిన్నతనం మీద ప్రేమ వదలక. జీవితాన్ని రోజువారీ ప్రపంచంలోనే యింకొంచెం విశాలంగా జీవించాలి అని కోరుకునే హక్కుని వదులుకోలేక అనే చెప్పాలి.

వొక స్త్రీ జీవితానుభవం నుంచి నిలబడి ఆలోచిస్తుంటే యిది యే వొక్క స్త్రీ ఆలోచనే కాదు. ప్రపంచవ్యాప్తంగా మా ముందుతరం స్త్రీ వాదులు ఆలోచిస్తున్న అనేక విషయాలు అర్థమవుతూ వచ్చాయి. యీ కథలని స్త్రీవాద స్పృహ నుంచి రాస్తున్నాననే యెరుక, స్త్రీవాదం కూడా ప్రపంచంలో వస్తున్న అనేక ఆర్థిక, సామాజిక మాధ్యమాల మధ్య నిలబడే తన స్వరాన్ని వినిపించాలన్న విషయం లోతుగా అర్థ మవసాగింది. స్త్రీవాదం కేవలం స్త్రీలకి సంబందించినది మాత్రమే కాదని పురుషుల జీవితాల గురించి కూడా స్త్రీవాద కోణం నుంచి ఆలోచించాను. స్త్రీలు కూడా ఆధిపత్యవర్గాలలో ఆధిపత్య రాజ కీయాల్లో భాగస్వామ్యం కలిగి వుంటారని తెలిసేకొద్దీ స్త్రీవాదం అంటే కేవలం స్త్రీలని విక్టిమ్స్‌గా మాత్రమే చూపించటం కాదు అని ఆయా రాజకీయాలని కథల్లో రాస్తున్నాను.

దాదాపు అన్ని కథల్లో ప్రొటోగనిస్ట్ స్త్రీ.

మొదట్లో కథలు రాస్తున్నప్పుడు ఆ టీనేజ్‌కి సంబంధించిన చూపుని, వొక టీనేజర్ ఆంతరంగాన్ని, వొక స్త్రీ దృష్టికోణాన్ని ప్రతిబింబించే కథలు 'మనసుకో దాహం'లో, అప్పుడప్పుడే కుటుంబ వాతావరణం నుంచి బయటకి అడుగు పెట్టాలంటే యెలా పెట్టాలాని ఆలోచించు కొంటూ నిలబడటానికి నగరముందని నగరానికి వచ్చే అమ్మాయిలూ, వున్న నగరం చాలా వేగంగా మారిపోతుండటం, సంక్లిష్టంగా వుండటం, యిలాంటిచోట యెలా నిలబడాలి అనుకుంటున్నవాళ్ళ కథలు 'ముక్త'లో రాశాను. నగరంలో వస్తున్న మార్పులకి కారణం ప్రపంచంలో వస్తున్న అనేక మార్పులు అనే విషయం అర్థమవుతున్న ప్పుడు 'సాలభంజిక' కథలు చెప్పటం, అన్నీ వుండి కూడా యెదు ర్కొంటున్న యెమోషనల్ వయొలెన్స్‌ని 'మంచుపూల వాన'లో, రవ్వంత ప్రేమ కూడా బయటి ప్రపంచంలో యెలా బాధాకరమవు తుందో 'వాన చెప్పిన రహస్యం'లో చెపితే, వీటన్నిటి మధ్య నిలబడి వెతుక్కుంటున్న చోటులో దాదాపు అన్నివిధాలా కోల్పోతోన్న అమా యకత్వం 'ది లాస్ అఫ్ యిన్నోసెన్స్'లో ప్రతిబింబించాయి.

సారంగ, మార్చి 11, 2015

**-కుప్పిలి పద్మ**

# అమాయకత్వం కోల్పోతున్న కొత్త జీవితాల కథలు

## ఎన్. వేణుగోపాల్

కుప్పిలి పద్మ కథలను ఇరవై సంవత్సరాలకు పైగానే చూస్తున్నాను. పదిహేను సంవత్సరాల కింద తాను రాసిన సాలభంజిక కథ చదివి, సమాజంలోకి వస్తున్న కొత్త జీవితాలను, కొత్త జీవన విధానాలను అర్థం చేసుకుని రాయగలిగిన రచయితగా గుర్తించి, అటువంటి రచయితలకు ప్రోత్సాహం అవసరమని అప్పుడు నేను రాస్తున్న ఒక వారం వారం శీర్షికలో ఆ కథ గురించి రాశాను. అప్పటి నుంచి అడపాదడపా తన కథల గురించి నా అభిప్రాయాలు చెపుతున్నాను. బహుశా ఆ కారణం వల్లనేనేమో పద్మ ఈ కథాసంపుటానికి నేను నాలుగు మాటలు రాయా లని అడిగింది.

ఈ కథలలోకి వెళ్లేముందు అసలు ఇటువంటి కొత్త జీవితాల పట్ల, ఆ జీవిత సమస్యల పట్ల సమాజపు దృక్పథాన్ని, ప్రత్యేకించి ఆలోచనా పరుల దృక్పథాన్ని, జాగ్రత్తగా పరిశీలించవలసి ఉందనుకుంటాను.

ఈ కొత్త జీవితం ఇప్పటికింకా రెండు మూడు దశాబ్దాలు గడిచి నప్పటికీ సార్వత్రికం కాలేదు. దాని స్వభావం వల్లనే అది సార్వత్రికం కాజాలదు కూడ. ఎక్కువలో ఎక్కువ అది ఎగువ మధ్యతరగతిని తాకి, ఆ కింది వర్గాల మీద ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావం వేయగలుగుతున్నది. అది అల్పసంఖ్యాకుల జీవితాల్లోకి మాత్రమే ప్రవేశించి ఉండవచ్చుగాని అంచులలో ఉన్నదని కూడ అనలేం. ప్రచార సాధనాల హడావిడి వల్ల ఒక రకంగా అదే ప్రధానస్రవంతి అనే అపోహ కలగడానికి కూడ అవకాశం ఏర్పడుతున్నది.

ఇళ్లు, ఇళ్లలో వస్తువులు, అలంకరణలు, వాహనాలు, దుస్తులు, తిను బండారాలు, సంబంధాలు, మాటతీరు, వ్యక్తీకరణలు వంటి ఎన్నో వ్యక్తిగత అంశాల మీద ఈ ప్రభావం ఉంటున్నది. సినిమాలో, టెలి విజన్‌లో, పత్రికలలో ఇదే ప్రామాణిక జీవనస్రవంతి అన్నట్టుగా చూపు తుండడం వల్ల రెండు ప్రమాదకరమైన పరిణామాలు కూడ చాప కింది నీటిలా సమాజమంతా విస్తరిస్తున్నాయి. జిలుగువెలుగులతో ఆకర్షణీయంగా చూపడం వల్ల అదే అనుసరణీయమైన జీవన ప్రమాణం అనుకుని, అనుకరించడానికి ఎక్కువమంది ప్రయత్నిం చడం ఒక పరిణామం కాగా, ఆ జీవన ప్రమాణాన్ని అందుకోలేమని తెలిసి, అందువల్ల తమ జీవితమే వ్యర్థమనే న్యూనతా భావనకు మరింతమంది గురికావడం మరొక పరిణామం. అటు అనుకరణ సంస్కృతి అయినా ఇటు ఆత్మన్యూనతా సంస్కృతి అయినా మనిషిని తన నుంచి తనను దూరం చేసేవే. అంటే మనిషిని సంఘం నుంచి, సమష్టితత్వం నుంచి దూరం చేసేవే. అలా మన సమాజంలో ఈ కొత్త జీవితాల ప్రవేశం అంతకు ముందు ఉన్న అంతరాలకు మరొక కొత్త అంతరాన్ని కలుపుతున్నది. ఒక కొత్త ఘర్షణనూ వేదననూ సృష్టిస్తున్నది. ఒక కొత్త పరాయీ కరణను ప్రవేశపెడుతున్నది.

ఈ నేపథ్యంలో ఈ కొత్త జీవనరంగాల గురించీ, వాటిలోపలా, వాటి వల్లా సమాజంలో తలెత్తుతున్న ఘర్షణల గురించీ, వాటి ప్రభావం

గురించీ మరింత ఎక్కువగా అర్థం చేసుకోవలసిన, మాట్లాడుకోవలసిన అవసరం పెరుగుతున్నది. ఈ జీవితాల గురించి సానుకూలంగా, ఆకర్షణతో, మోజుతో, సమ్మోహకంగా చెపుతున్న ధోరణి పెరుగుతున్నందువల్ల, వాస్తవికంగా వాటిలోని గుణదోషాలను, సమస్యలను, ఆందోళనలను అర్థం చేసుకోవలసి ఉన్నది. ఆ జీవితాలలోని మంచిగాని, చెడుగాని సమాజంలోని ఇతర వర్గాల జీవితాల మీద ఎటువంటి ప్రభావం వేయగలవో తెలుసుకోవడానికి ఆ జీవితాల గురించీ తెలుసుకోవాలి, ఆ ప్రభావాల గురించీ తెలుసుకోవాలి. ఇంత బలమైన జీవన ప్రభావం సహజంగానే కళకూ కథకూ వస్తువు కాకతప్పదు.

ఆ అత్యవసరమైన పనిని పద్మ తన కథల ద్వారా గత రెండు దశాబ్దాలుగా చేస్తున్నదని నాకనిపిస్తున్నది. ఇప్పుడిక్కడ సంకలనం చేసిన పదకొండు కథలు కూడ ఆ పనిలో భాగమే అనుకుంటాను.

*ద లాస్ ఆఫ్ ఇన్నోసెన్స్* అనే పుస్తక శీర్షిక ఈ పుస్తకంలో భాగమైన ఒకానొక కథ శీర్షిక మాత్రమే కాదు. ఈ కథలన్నిటికీ ఆధారభూమిక అయిన సార్వత్రిక ఇతివృత్తంగా అర్థవంతమైనది. మరోమాటలో చెప్పాలంటే అది మన సమాజపు ఒకానొక స్థితి. నైసర్గికమైన, సహజమైన అమాయకత్వాన్ని కోల్పోతున్న స్థితిలో ఇవాళ సమాజంలో గణనీయమైన భాగం ఉంది. ఈ అమాయకత్వం కోల్పోతే దాని స్థానంలో వచ్చేది ఏమిటనేది చర్చనీయాంశం కావచ్చు. కాని వలసవాద మార్కెట్ ప్రవేశించిన నాటి నుంచీ భారతీయ సామాజిక జీవితం అమాయకత్వాన్ని కోల్పోతూనే ఉంది. ఆ మూడు వందల సంవత్సరాల చరిత్ర ఇక్కడ అవసరంలేదు గాని గత రెండు మూడు దశాబ్దాలలో ఈ అమాయకత్వాన్ని కోల్పోయే ప్రక్రియ వేగవంతంగానూ, విస్తారంగానూ, లోతుగానూ జరుగుతున్నది. ఒక మనిషయినా సమాజమయినా అమాయకత్వం కోల్పోతే, ఆ స్థానంలో జ్ఞానమో, వివేకమో రావచ్చు. లేదా, తెంపరితనమో, తుంటరితనమో రావచ్చు. అజ్ఞానమూ

అవివేకమూ కూడ ఆకర్షణీయమైన ముసుగులు వేసుకుని రావచ్చు. ఈ పరిణామం ఎలా జరిగినప్పటికీ, సామాజిక అమాయకత్వం కోల్పోయే క్రమం ఆసక్తి కరమైనది. అది వ్యక్తిగత జీవితాలలో ప్రతి ఫలిస్తూ వ్యక్తులు తమ అమాయకత్వం కోల్పోయే క్రమాన్ని ఒక కళారూపంలో చిత్రించడం మరింత ఆసక్తికరమైనది. ఒకరకంగా చూస్తే ఈ పదకొండు కథలూ కూడ ఒక సమాజం అమాయకత్వాన్ని కోల్పోయే క్రమానికి వ్యక్తిగతస్థాయి ప్రతిఫలనాల చిత్రణలే.

ద లాస్ ఆఫ్ ఇన్నోసెన్స్‌లో విహాన్ - దర్శనల మధ్య ఉన్న సంబంధానికి పాత పద్ధతిలో పరస్పర నమ్మకం పునాది కాదు. బహుశా పరస్పర అప నమ్మకమే, అవతలి వాళ్లు అబద్ధం చెపుతున్నారన్న నమ్మకమే పునాది కావచ్చు. అమాయకత్వం కోల్పోవడం అంటే అదే. కాకపోతే దానికి లాంగ్ కమిట్‌మెంట్స్ యివ్వలేకపోవడం అనీ, బ్యాగేజ్ వద్దను కోవడం అనీ, కెరీర్‌లో సెటిల్ కావడం అనీ కొత్త అర్థాలు చెప్పుకునే తెలివితేటలు ఇప్పుడు వచ్చాయి. ‘యే ఫీల్డ్ అయితేనేం కేట్ రేస్‌లో అందరం... యేదో రకంగా భాగస్తులమే...’ అనడం అలా అమాయ కత్వం కోల్పోతున్నవాళ్ల అంతరంగానికీ, బహిరంగ సమర్థనకీ ఒక సూచిక. అసలు ఆ కేట్ రేస్ ఎవరు సృష్టించారు, ఎవరి ప్రయోజనాల కోసం సృష్టించారు, ఆ కేట్ రేస్‌లోకి వెళ్లేవాళ్లు ఇష్టపూర్వకంగా వెళు తున్నారా, సామాజిక స్థితి వాళ్లను అటు నెట్టి, వాళ్ల నుంచి అమాయ కత్వాన్ని కొల్లగొడుతున్నదా, అలా వెళ్లినందువల్ల వాళ్లేమి సాధిస్తున్నారు అని ఆలోచించడానికి పురికొల్పడమే కథ సాధించదలచిన ప్రయోజనం.

ఈ కొత్త తరం అమాయకత్వం కోల్పోవడాన్ని నిజానికి చాలా రంగాల్లో, కోణాల్లో, స్థాయిల్లో అర్థం చేసుకోవలసి ఉంది. అది సంఘ పరివార్, ఖాప్ పంచాయతీలు చూస్తున్న ఏకైక, సంకుచిత, పురు షాధిపత్య అర్థంలో మాత్రమే జరగడం లేదు. సంక్లిష్టమైన, అసాధా రణమైన రూపాల్లో జరుగుతున్నది. నైతిక పోలీసులు చెపుతున్న

సద్యోలైంగిక సంబంధం, కాజువల్ సెక్స్, వైవాహికేతర సంబంధం, స్వేచ్ఛాయుతమైన ప్రవర్తన వంటి పాత నైతిక అర్థాలు మాత్రమే ఈ అమాయకత్వ విచ్ఛేద పరిణామాన్ని పూర్తిగా వివరించజాలవు. అసలు ఆ ప్రక్రియకు ప్రతిసారీ ప్రతికూల అర్థం మాత్రమే ఉంటుం దని కూడ అనుకోలేం. ఒక్కోసారి అధ్యయనం వల్ల, స్పందనల వల్ల, భావుకత వల్ల ప్రపంచానికి కొత్త కిటికీలు తెరుచుకుని, వ్యక్తిత్వం వికసించి, జీవన సార్థకతకు వినూత్న అర్థాలు స్ఫురించి కూడ అమాయకత్వం కోల్పోయే పరిస్థితి రావచ్చు. ఆ సానుకూల అర్థాలలో కూడ అమాయకత్వ విచ్ఛేదాన్ని అర్థం చేసుకోవలసి ఉంది.

'నా స్నేహితురాలి పేరు సుధీర'లో కూడ అమాయకత్వం కోల్పోయి, పర్యావరణ విధ్వంసక పథకాలకు నిధులు సమకూర్చే ఉన్నతాధికారి అంతరంగంలో ఘర్షణ, ఆ పర్యావరణ విధ్వంసాన్ని ప్రశ్నించే స్వచ్ఛంద సంస్థలో పనిచేసే అతని ఆత్మీయ స్నేహితురాలి ఓదార్పు ఇతివృత్తం. అతను చేసిన కుంభకోణాలు బయటపడి, ఎవరో ఒకరిని బాధ్యులను చేయాలి గనుక అతన్నే పక్కనపెడతారు. అతను అథః పాతాళానికి జారిపోయాననుకుంటాడు. అప్పుడు సాంత్వన పలక డానికి వచ్చిన స్నేహితురాలు, 'ఇది మన జనరేషన్ క్రైసిస్' అంటుంది. దానికి 'క్విక్ మనీ, ఇన్‌స్టెంట్ గ్రాటిఫికేషన్' కారణాలని చెపుతుంది. 'మొత్తం సిస్టమ్‌ని తలకిందులు చేసేశాక జరుగుతున్న లేదా జరిగిన పొరపాట్లకి యిద్దరినో ముగ్గురినో బాధ్యులను చేసేసి ప్రపంచం ముందు దోషులుగా నిలబెట్టే ప్రోసెస్‌లో అసలు ప్రజలకి మేలుచేసే విషయాలపై దృష్టినే పెట్టటం లేదు. ఆ బాధ్యతని యెవరు తీసు కొంటారు? నిజంగా ఆ కొద్దిమందే దోషులా... యిదంతా గ్లోబల్ యెకానమీ సృష్టించే వికృతం...' అని చెపుతుంది.

మెరుగైన ఆర్థికస్థితి ఉన్న మధ్యతరగతి కుటుంబాలలో అంతర్లీనంగా ఎంత పితృస్వామిక భావజాలం ఉన్నప్పటికీ, అమ్మాయిల పట్ల ప్రేమాభిమానాలు కనబరచడం, ముద్దు చేయడం, వాళ్ల ఇష్టాయిష్టాలు

తీర్చడం కొంత మెరుగ్గానే ఉన్నాయి. కాని కూతురికి ఉండే ఆ హోదా అదే వయసులో ఉండే కోడలికి లేకపోవడంలోనే పితృస్వామ్యం బయటపడు తుంది. 'నీకున్న ఫ్రీడమ్ నాకు కూడా మా యింట్లో వుండేది. యిది నా యిల్లు అంటారు. కానీ కాదు. యిది నేను పెళ్లి చేసుకొన్న అబ్బాయి, అంటే నా భర్త యిల్లు. అదీ తేడా... నీకున్నలాంటి ఫ్రీడమ్ నాకు రాదు. పైకి కనిపించని రూల్స్ చాలా ఉంటాయి. మ్యారేజి అయ్యాకే నాకు యివన్నీ యెక్స్‌పీరియెన్స్‌లోకి వచ్చాయి,' అని 'ఫ్రంట్ సీట్'లో గ్రీష్మ తన ఆడబిడ్డ ధాన్యతో అనే మాటలు పితృస్వామిక నిర్బంధానికీ, కొత్త తరం యువతుల గ్రహింపుకూ నిదర్శనం. ఇది కూడ మరొకస్థాయిలో అమాయకత్వ విధ్వంసమే.

సరొగసీ వ్యాపారంగా మారిపోయిన స్థితిని చెప్పే కథ 'మదర్ హుడ్ @ రియాలిటీ చెక్.' నిజానికి మాతృత్వాన్ని ఇన్నాళ్లూ పవిత్రంగా ప్రచారం చేసి, దాని చుట్టూ లెక్కలేనన్ని పుక్కిటి పురాణాలు అల్లిన వ్యవస్థే ఇవాళ దాన్ని వ్యాపారంగా మార్చి, గర్భాశయాన్ని అద్దెకు ఇచ్చే సరుకుగా మార్చేసింది. 'కొన్నాళ్లు మా కడుపుని అద్దెకి యివ్వటం' అని సత్యవతి చాలా మామూలుగా అనడంగాని, టీవీల వాళ్లు సరొగసీ మీద హ్యూమన్ ఇంటరెస్ట్ స్టోరీ పేరుతో తమ ఇష్టం వచ్చిన మాటలు ఈ 'అద్దె గర్భవతుల' నోళ్లలో పెట్టడంగాని, సరొగసీ తల్లుల మీద డాక్యుమెంటరీలు తీసీ, ఉద్యమాలు చేసీ వాటిని కూడ వ్యాపారం చేయడం గాని, మొత్తంగా మాతృత్వ భావనా, స్త్రీత్వ భావనా, తల్లీ బిడ్డల సంబంధపు భావనా అన్నీ కూడ తమ అమాయకత్వాన్ని ఎలా కోల్పో తున్నాయో వివరిస్తుందీ కథ. 'యిండియా అన్ని విషయాలలో యెంతో మారిపోయింది... రోజురోజుకి చాలా వేగంగా వెస్ట్రనైజ్ అయిపోతోంది. యింకా యింకా అయిపోతుంది. మన ప్రేమలు, విలువలు, సెంటి మెంట్స్, లైఫ్ స్టయిల్ క్షణాల్లో మారిపోతున్నాయి...' అని ఈ కథలో నిశాంతి అనే మాట ఒక దృక్కోణం నుంచి ఇవాళ్టి స్థితిని వివరిస్తుంది. సమాజంలో సర్వత్రా వ్యాపిస్తున్న స్వార్థాన్నీ మోసాన్నీ చిత్రించిన ఈ కథ ముగింపు కాస్త తేలిపోయినట్టుంది

గాని మొత్తానికి అవసరమైన, ఆలోచనాస్ఫోరకమైన చర్చలనూ, సన్నివేశాలనూ సృష్టించింది.

కొత్తతరం పోగొట్టుకుంటున్న అమాయకత్వంలో, తెచ్చుకుంటున్న కొత్త అలవాట్లలో, విలువల్లో అధికారాన్ని, సంప్రదాయాన్ని ప్రశ్నించడం అనే సానుకూల లక్షణంతో పాటే అనారోగ్యానికీ, అసాంఘికత్వానికీ దారితీసే అలవాట్లు కూడ ఉంటున్నాయి. మద్యపానాన్నీ, మాదక ద్రవ్యాల వాడకాన్నీ నైతిక కారణాలవల్ల వ్యతిరేకించనక్కరలేదు గాని అవి మరొకరు మప్పుతున్నందువల్ల, మరొకరి వ్యాపారం కోసం, యువతరాన్ని జోకొట్టడం కోసం వస్తున్నాయా ఆలోచించవలసి వుంది. 'గాల్లో తేలి నట్టుందే' కథ ఈ విలువల ఘర్షణను చిత్రిస్తుంది. 'హో మైగాడ్... మమ్మీ నిజంగా నువ్వు యిన్నోసెంట్. క్రైమ్ యేంటి? నీకు తెలుసా 21 ఏళ్లు నిండని వాళ్లకీ డ్రింక్స్ యిస్తారు పబ్సులో. హుక్కా క్లబ్సులో, పబ్సులో రకరకాల పేర్లతో గంజాయే కాదు, కొన్ని రకాల డ్రగ్స్ దొరుకు తాయి. యిదంతా కామన్. క్రైమ్ కాదు. వీటికొచ్చే వాళ్లంతా యెలీట్ రిచ్ సెక్షన్స్ నుంచే. వీటిని రన్ చేసేది పవర్‌ఫుల్ పీపుల్. అలా వాళ్లు సర్వ్ చేయటం క్రైమ్ కానప్పుడు మేం తీసుకోవటం క్రైమ్ యెలా అవుతుంది...' అన్న సుస్మిత మాటలు కొత్త మార్పులను మాత్రమే కాదు, ఆ మార్పుల వెనుక ఉన్న, లాభ పడుతున్న శక్తులను కూడ చూపుతున్నాయి. 'యీ జనరేషన్ చాలా అందమయినది. తెలివైనది. యెన్నెన్నో విషయాలని సునాయాసంగా కనిపెడ్తూ ఉంది. యిదే జనరేషన్‌లో కొంతమంది యిలాంటి అలవాట్లకి బానిసలవుతూ యిదంతా ఫన్ అంటారు. యిలాంటి వాళ్లు యెక్కువగా డిస్ట్రక్షన్ వైపు మొగ్గు చూపిస్తున్నారు. వాళ్లకసలు భయం లేదు. ప్రాణాల మీద మమకారం లేదు.... నువ్వంటున్నావు రూల్స్ బ్రేక్ చేయడాన్ని యిష్టపడుతున్నారని. అన్ని జనరేషన్స్‌లో రూల్స్‌ని బ్రేక్ చేయటం వుంది. కాకపోతే అప్పుడు యెక్కువగా వొక వికాసం కోసం చేసేవారు. యిప్పుడు అదంతా వొక విధ్వంసం. అదే మానసికానందం...'' అని నందినికి వివరిస్తారు మాస్టారు.

ఈ సంపుటంలో 'అతుల్య' ఒకందుకూ, 'మౌన' మరొకందుకూ ముఖ్యమైన కథలు. సాధారణంగా ఆమోదయోగ్యమైన, ప్రగతిశీలమైన విలువలు ఉన్న స్వతంత్రులైన, ఇద్దరు యువతీ యువకుల మధ్య అభిరుచుల వల్ల ప్రేమ మొలకెత్తి అది సహజీవనాకాంక్ష దాకా పరిణమిస్తే, యథాస్థితివాద విలువల చట్రం ఆ ప్రేమనూ సహజీవనా కాంక్షనూ ఎలా అనుమానిస్తుందో, తిరస్కరిస్తుందో చూపే కథ అతుల్య. ప్రేమ భావన నైసర్గికమైనదీ సహజమైనదీ గనుక దాన్ని అమాయకత్వానికి చిహ్నంగా తీసుకోవచ్చు. ప్రేమలో కూడ లెక్కలూ వ్యూహాలూ ఉండే అవకాశాలు పెరుగుతున్నప్పటికీ ఒక సహజ మానవ సంబంధంగా ప్రేమకు ఆ విలువ ఎన్నటికీపోదు. కాని కొనసాగుతున్న విలువల్లో ఆ అమాయకత్వం విచ్ఛిన్నం కాకతప్పదు. అది డబ్బా, జీవనస్థితా, స్థిరత్వమా, పెద్దరికమా- ఏ పేరుతో వ్యక్తమైనా అంతి మంగా అది యథాస్థితి. అంటే ఒకరకంగా చెప్పాలంటే యథాస్థితిని కాపాడాలనే కోరికే అమాయకత్వ విచ్ఛిన్న హేతువు కావచ్చుననే సున్నిత అంశాన్ని చెప్పిన కథ ఇది.

ఇక 'మౌన' ఇద్దరు స్త్రీల మధ్య ప్రేమానురాగాలు జనించి, అది సహ జీవనాకాంక్ష దాకా వెళితే తప్పేమిటనే ప్రశ్న దగ్గర ప్రారంభించి, ఆ ఇద్దరూ ఎన్నో ఏళ్లు సహజీవనం సాగించాక, ఒక హఠాత్పరిణామంలో ఒకరు అదృశ్యమైనప్పుడు, మరొకరు రెండు వైపుల కుటుంబాల నుంచీ, సామాజికవ్యవస్థల నుంచీ ఎదుర్కొనే ప్రశ్నలదాకా, ఇబ్బందుల దాకా ఎన్నెన్నో అంశాలను చర్చించిన కథ. ఏ ఇద్దరు వ్యక్తుల మధ్యనైనా ప్రేమానురాగాలు, సహజీవనం ఉండవచ్చుగదా, అది అసహజం ఎట్లా అవుతుంది అనుకోవడం అమాయకత్వంగా కనబడే సమాజంలో ఆ అమాయకత్వ విచ్ఛేదం ఎంత హింసాత్మకంగా, వేదనామయంగా వుండ వచ్చునో ఈ కథ చెపుతుంది.

మిగిలిన నాలుగు కథలు- 'సహస్ర, మాన్వి, బ్రేకప్ బొకే, పున్నమిలా వచ్చిపొమ్మని' కూడ కొత్త జీవన శకలాలను, జీవన సందర్భాలను చిత్రిస్తూ వాటి ద్వారా విలువల ఘర్షణను చెప్పడానికి ప్రయత్నించినవే.

'సహస్ర' కథలో కొత్తతరానికి సమానత్వ విలువలు, సామాజిక ఆందో ళనలు కూడ పరిహాసమయ్యే వాతావరణం (ఫస్ట్ సెషన్‌లోకి పొరపాటున వెళ్లినవాళ్లు బయటికొచ్చి నవ్వుతూ, 'ఆడపిల్లల్ని మగ పిల్లల్ని యింట్లో వేరుగా పెంచుతారంట. యీక్వల్‌గా చూడాలంట. వీళ్లకేం తెలుసు, కాంపస్ సెలెక్షన్స్‌లో అమ్మాయిలకే యెక్కువ జాబ్స్ వస్తున్నాయని. మనల్ని పట్టించుకొనేవాళ్లే లేరు. యెప్పటివో మాటాడ తారు,' అని విసుక్కొన్నారు.) ఎలా ఉందో, ఆ తరంలోంచి కొందరి నైనా ఎట్లా సామాజిక స్పందనలలోకి ప్రేరేపించవచ్చునో చెప్పే సానుకూల దృక్పథపు, ఆర్ద్రమైన కథ.

ఉన్నత మధ్యతరగతిలో ఉన్న ఈ యువతరానికి పరిచితులైన కింది వర్గాల వ్యక్తులు ఎక్కువగా పరిచారకులు, జిమ్‌లో ట్రెయినర్లు, ఇళ్లలో పనిమనుషులు. వాళ్ల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం సాధారణంగా జరగదుగాని బహుశా స్త్రీ పురుష విభేదం, ఘర్షణ సమస్యల్లో సారూప్యత ఉంటుంది. అటువంటి సమస్యను లేవనెత్తిన కథ 'మాన్వి.' 'మేం మా జీవితాలని నిర్మించుకొన్నప్పటిలా యిప్పటి మీ జీవితాలులేవు. మీవి చాలా చాలా ఐసొలేటెడ్ అయిపోతున్న జీవితాలు. యిష్టం, ప్రేమ, యివన్నీ శాశ్వతమైన యెమోషన్స్ యేం కాదు. సహ చరులుగా వుండటం యెంతో అందమైన అపురూపమైన బంధమైనా, అనుబంధాలన్నింటిలోకెల్లా చాల వల్నరబుల్ అను బంధం...' అనే మాటలు అమాయకత్వం కోల్పోవడం ఆనంద దాయకంగా ఏమీ వుండడం లేదని చూపుతాయి.

ఒకరకంగా పుష్పవిలాపంలా మొదలయ్యే 'బ్రేకప్ బొకే' ఒక వైవిధ్య పూరితమైన కథ. అన్ని సందర్భాలకీ పుష్పగుచ్ఛాలతో బహిరంగ, సుస్పష్ట ప్రకటనలే తప్ప, ఏ అనుబంధాన్నీ సున్నితంగా, ఆర్ద్రంగా, ఆత్మీయంగా ప్రకటించడానికి వీలుకాదన్నంతగా బొకే సంస్కృతి పెరిగిపోయిన మార్కెట్ వాతావరణంలో ప్రేమ భగ్నమైన సందర్భానికి కూడ బొకే ఇవ్వవచ్చునా? 'ప్రేమ పోవటాన్ని యింత అమానవీయంగా

వ్యక్తపర్చాలా... నేనింతవరకు యిలాంటి బొకే పంపలేదు... పంపను కూడా,' అంటుంది ఇంకా కాస్త తడి ఉన్న బొకేల దుకాణం యజమాని జాస్మిన్. 'కానీ అది యెమర్జింగ్ ట్రెండ్... నువ్వు నీ బిజినెస్‌ని ఆ ట్రెండ్‌కి దూరంగా యెలా వుంచగలవు? నీ రెగ్యులర్ క్లయింట్ యీ షాప్‌లో అన్ని రకాల ఆర్డర్స్ యిచ్చి యీ వొక్కదానికోసం మరోచోటకి వెళ్లలేడు కదా... బిజినెస్‌లో పర్సనల్ ఫీలింగ్స్ యేంటి,' అంటాడు స్నేహితుడు సుశాంత్.

కొత్త జీవితాలలో ఒక ప్రధాన భాగం మంచి జీవితాలంటే ఎక్కువ డబ్బు అని అర్థం చెప్పుకుని అది సంపాదించడానికి విదేశాలకు వెళ్లి, అక్కడ మానవ సంబంధాలకు మొఖం వాచి, మానవ సంబంధాలు వున్నాయనుకున్న దగ్గరికి రాలేక, ఈలోగా తర్వాతి తరం భవిష్యత్తు కోసం ఆలోచించి ఘర్షణ పడుతున్న వాళ్లెందరో ఉన్నారు. వారి ఘర్షణను ఒక సున్నితమైన స్త్రీ పాత్ర ద్వారా చిత్రించిన కథ 'పున్నమిలా వచ్చి పొమ్మని.' 'నువ్వు అలవాటు పడిపోతావనుకున్నాను. యిక్కడికి వచ్చిన వాళ్లెవ్వరూ నీలా యింకా మా వూరు, యిల్లు అంటూ బెంగ పెట్టుకోవటం చూడలేదు. అంతా హ్యాపీగా, ప్రౌడ్‌గా ఫీలవుతుంటారు. యిక్కడికి రావాలని, తమ ఫ్యూచర్ బ్రైట్‌గా వుండాలని ప్రతిరోజు అమెరికన్ వీసా కోసం యిండియాలో క్యూలు కడుతున్నారు...' అని ఆమె భర్త అనే మాటల్లో ఆ విలువల ఘర్షణ స్పష్టమవుతుంది.

పద్మ భాషలో సమ్మోహకమైన, ఆకర్షణీయమైన లక్షణమూ ఉంది. ఒక్కొక్కసారి అది సహజత్వానికి దూరమైందని అనుమానించడానికి ఆస్కారం ఇచ్చే లక్షణమూ ఉంది. ఆమె సృష్టించే సన్నివేశాలు, సంభాషణలు, చివరికి పాత్రల పేర్లు కూడ అసహజమైనవని అనుకునే అవకాశం ఉంది. ఒక్కొక్కచోట పాత్రల, సంభాషణల, ప్రవర్తనల ఔచిత్యం మీద కూడ సందేహం కలుగుతుంది. కళారూపానికి విశ్వసనీయత, సంభావ్యత పునాది అంశాలు. అవి లేవని లేశమాత్రం

అనిపించినా ఆ కళారూపం ఇవ్వదలచిన సందేశం కూడ దెబ్బ తింటుంది.


ఈ చిన్న లోపాలు అలా ఉంచి ఈ కథల గురించి మొత్తంగా ఆలోచిస్తే, 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లో మార్క్స్, ఎంగెల్స్‌లు బూర్జువా వర్గ ప్రాబల్యం, మార్కెట్ ప్రవేశించిన చోట ఏం జరిగిందని చెప్పారో గుర్తుకొచ్చింది: 'బూర్జువావర్గం... మత, రాజకీయ భ్రమల ముసుగులు కప్పిన దోపిడీ స్థానంలో నగ్నమైన, సిగ్గులేని, ప్రత్యక్షమైన, అమానుషమైన దోపిడీని ప్రవేశపెట్టింది. ఇంతవరకూ గౌరవనీయంగానూ, భక్తిపూర్వక మైన భయంతోనూ పరిగణించిన ప్రతి వృత్తి మీది ఆచ్ఛాదననూ బూర్జువావర్గం పీకి పారేసింది. వైద్యుడినీ, న్యాయవాదినీ, మతగురువునీ, కవినీ, శాస్త్రవేత్తనూ డబ్బుకోసం తనకు ఊడిగంచేసే కిరాయి కూలీలుగా మార్చివేసింది. బూర్జువావర్గం కుటుంబం నుంచి దాని రాగబంధురమైన మేలిముసుగును చించి పారవేసి కుటుంబ బంధాన్ని కేవలం డబ్బుతో కూడిన సంబంధంగా దిగజార్చింది... సమస్త సామాజిక స్థితులను ఎడ తెగకుండా కలతపెట్టడం, అనిశ్చితత్వాన్నీ, ఆందోళననూ నిరంతర పరిణామాలుగా మార్చడం బూర్జువాశకపు ప్రత్యేకతలు... గడ్డ కట్టుకుని, తుప్పుపట్టిపోయిన సంబంధాలూ, వాటితో పాటు సనాతమైన, పూజనీయంగా చూసిన దురభిమానాలూ తుడిచిపెట్టుకుపోతాయి. కొత్తగా ఏర్పడిన సంబంధాలు గట్టిపడక ముందే పాతబడిపోతాయి. ఘనీభ వించిన ప్రతీదీ కరిగి గాలిలో బాష్పమైపోతుంది. పవిత్రమైన ప్రతిదీ మలినమైపోతుంది...'

ఈ మాటలు రాసింది 1848లో. ఆ తర్వాత గడిచిన నూట అర్వై సంవత్సరాలలో ఆ స్థితి మరింత తీవ్రతరమైంది. ఆ బూర్జువావర్గం తన తొలినాటి ప్రగతిశీల స్వభావాన్నీ, సమాజాన్ని ఇలా సమూలంగా మార్చే బాధ్యతనూ వదులుకుంది. భారత సమాజం వంటి సమాజాలలో పాత, అభివృద్ధి నిరోధక వ్యవస్థలలో తనకు పనికి వస్తాయనుకునే

చెడుగులతో మిలాఖత్తు పెట్టుకుంది. ఇప్పుడిది పాతనంతా ఊడ్చి పారేసే కొత్త కాదు. పాత కొత్తల మేలు కలయిక కూడ కాదు. పాత కొత్తల కీడు కలయిక. ఇక్కడ డాలర్ల వేట, ఇంగ్లిష్ చదువులు, అపార ప్రపంచజ్ఞానం, అందరాని జీవనశైలివంటి అత్యాధునిక అంశాలూ, స్త్రీపురుష అసమానత, కులవివక్ష, మతోన్మాదం, మూఢనమ్మకాల వంటి ప్రాచీన అంశాలూ సామరస్యంగా సహజీవనం చేస్తుంటాయి. ఆ పాతకొత్తల కీడు కలయిక స్థితికి సూచికలు ఈ కథలు.

*హైదరాబాద్, 25 సెప్టెంబర్, 2015*

# ద లాస్ ఆఫ్ యిన్నోసెన్స్



మంచు దుప్పటి కప్పుకున్న కొండల దొంతర్ల పై పరచుకొన్న మంచు మైదానాల పక్కగా నీలి గగనం నుంచి ల్యాండ్ అవుతోన్న విమానం లోంచి నేల వైపు చూస్తోంటే వో చిర పరిచితమైన మనోదేహ స్వర పరి మళమొకటి దర్శనని మెల్లమెల్లగా పలకరిస్తోంది. చక్రం నేలని తాకీ తాకగానే అంతా హడావిడిగా సెల్ ఫోన్స్ ఆన్ చేశారు. ఫ్రెంచ్, యింగ్లీష్ భాషల కలగాపులగపు పలకరిం పుల సవ్వడి. దర్శన యెరైవల్స్ లాంజ్ వైపు వస్తుంటే విహాన్ యెదు రొచ్చాడు. పొడువుగా పెరిగిన అతని

జుట్టుని చేతివేళ్లతో చిన్నగా చెరుపుతూ 'నైస్' అంటూ అతన్ని హగ్ చేసు కొంది. యిద్దరూ బయటికి వచ్చారు.

అతని పక్కన జీప్‌లో కూర్చుంటూ, "వో భలే వుందే... సెల్ఫ్ డ్రైవింగ్ కోసం రెంట్‌కిస్తారా," అడిగింది దర్శన.

'వూ."

దారికి అటుయిటూ వొంపులు తిరిగిన పచ్చని కొండలు. అసలే మంచు కురిసే కాలం, పైగా రాత్రి చిన్న వానజల్లు. ఆకులు పువ్వులు కొండలు భూమి తడిసిపోయిన సువాసన మత్తుగా కమ్ముకొంటుంటే ఆమె అతని అతి పల్చని గడ్డంపై చూపుడువేలితో టచ్ చేస్తూ, "హౌ వోల్డ్ యీజ్ యిట్" అడిగింది.

"వన్ డే. రాత్రి నువ్వొస్తున్నావని చెప్పాక యీ రోజు వుదయం షేవ్ చేయలేదు," అన్నాడు విహాన్.

"వో నేనిలా సడన్‌గా రావటంతో నిజంగానే నీ వర్క్ డిస్టర్బ్ కాలేదుగా," అడిగింది.

'నాట్ యెటాల్, నిన్నే షూట్ పూర్తి అయిపోయింది. టీమ్ రాత్రే వెళ్లిపోయింది. ఫుల్ ఆఫ్ కలర్స్‌తో వున్న యీ ప్లేస్‌లో నువ్వుంటే బాగుండునని చాలాసార్లు అనుకొన్నా. సడన్‌గా నువ్వొస్తానంటే థ్రిల్ అయ్యా. సో యీ వీకెండ్ యిక్కడే నీతో స్పెండ్ చేయటం... రియల్లీ ఐ యామ్ వెరీ హ్యాపీ," అన్నాడు విహాన్.

"వో... థ్యాంక్ యు."

జీప్ యెత్తైన కొండపై నుంచి వెళ్లుతోంది. నిలువెత్తు హోటల్. పక్కనే పొదరిల్లులాంటి కాటేజస్. రూమ్‌లోకి వస్తూనే కిటికీకి వున్న లేతాకుపచ్చ కర్టెన్స్‌ని రెండు చేతులతో రెండు వైపులకి జరిపింది. యెదురుగా ముదు రాకుపచ్చ కొండలపై విలాసంగా పరుచుకొన్న మంచు. అతను ఆమె వెనగ్గా నిల్చుని ఆమె భుజంపై చుబుకాన్ని ఆన్చి రెండు చేతుల్ని ఆమె మెడ చుట్టూ వేసి బుగ్గపై చిన్ని ముద్దు పెట్టాడు. బయటకి చూస్తున్న ఆమె తల తిప్పి అతని వైపు చూస్తూ, "యింత అందమైన ప్రదేశంలో యెన్ని పాటలు షూట్ చేశారు," అడిగింది.

"రెండు పాటలు, నాలుగు సీన్స్," అన్నాడు.

"ఆ ప్రదేశాలన్నీ తిరిగి చూడొచ్చా," అడిగింది.

"చూద్దాం."

"నీకు చూసేసినవేగా అనిపిస్తుందేమో."

'అనిపించదు దర్శన. షూట్ చేస్తున్నప్పుడు చుట్టూ అందం కళ్లలోకి యింకదు. లైట్ మిస్సవుతామా... యిది స్క్రీన్ మీద యెలా వుంటుంది... యూనిట్ దృష్టంతా ప్రొడక్ట్ మీదే. అందులో మా డైరెక్టర్‌గారు లొకేషన్‌లో పనిపై తప్ప యింకే విషయంపై దృష్టి వుంటే వూరుకోరు. కాఫీ తాగుతావా."

"వూ."

వేడివేడి బ్లాక్ కాఫీ కలిపి యిచ్చాడు.

సిప్ చేసి, "బ్లాక్ కాఫీ బాగా ప్రిపేర్ చేస్తావ్," అందామె.

"థ్యాంక్ యూ... బయటకి వెళదామా," అడిగాడు.

యిద్దరూ బయటకి వచ్చారు.

జీప్ పచ్చని మంచు తెరల్లోంచి కొండ వాలుల్లోంచి పయనిస్తోంది.

మంచు కమ్ముకొంటున్న విహాన్ చల్లని బుగ్గపై దర్శన ముద్దు పెట్టింది. అతని బుగ్గపై ఆమె పెదవుల ఆకృతి. తిరిగి క్షణంలో ఆ అధర చిత్రం మంచుతో నిండిపోతుంటే ఆమె తిరిగి అతని బుగ్గకి వేగంగా తన పెదవులని అన్చింది. తిరిగి ఛాయ. మళ్లీ మంచు... "నిన్ను ముద్దు పెట్టుకోవటానికి నాతో యీ వేళ మంచు పోటీపడుతోంది," నవ్వుతూ అంది దర్శన.

అతను అతి నిశ్శబ్దంగా నవ్వాడు.

దర్శన యెప్పుడు యిలానే హై స్పిరిట్స్‌లో వుంటుంది. పోయినసారి వచ్చినప్పుడు బాస్‌తో చికాకు వుందని చెప్పింది. అయినా యిలానే యెనర్జిటిక్‌గా వుంది. యెందుకో రీజన్ తెలీదు.

"'నీ ఆఫీస్ ప్రోబ్లమ్ సాల్వ్ అయిందా."

"జాబ్‌లో అలాంటివి తప్పవని కాస్త అర్థం అయింది," అంది.

"యెలాంటివి..."

“మా టీమ్ లీడర్‌తో చికాకు. ప్రతి విషయానికి చికాకు పెడతాడు. అతను మొదట్నుంచి యీ యెన్విరాన్‌మెంట్ నుంచి రాలేదు. సో యిక్కడ యెలా వుంటుందో తెలీదు. చాల కన్‌ఫ్యూజ్డ్ ఫెలో. అంతేకాకుండా కాస్త యిన్‌ఫీరియారిటి కాంప్లెక్స్. దాన్ని సుపీరియర్ క్వాలిటీగా ప్రదర్శించాలనే తాపత్రయం. వుద్యోగాలు వుద్యోగాల్లానే వుంటాయి. వాటి విషయంలో యెక్కువ బాదర్ కాకూడదని మా కౌన్సలర్ చెప్పింది,” అంది దర్శన.

“అయినా నీ బిహేవియర్‌లో అలాంటి చికాకే పోయినసారి కని పించలేదు... యిప్పుడూ లేదు. అలా యెలా వుండగలవ్...”

“సింపుల్ విహా. నా హేపీనెస్ అంతా నువ్వు. అందుకే మిగిలిన చికాకులేం తాకవ్,” అతని చెవిలో ముద్దు పెడుతూ అంది.

“సో యూ ఆర్ హ్యాపి. గుడ్...” విహాన్ మాటలు పూర్తి కాకుండానే ఫోన్ మోగింది.

“హాయ్... స్వీట్ హార్ట్. ష్యూర్.”

“నేనర్జంట్‌గా వెళ్లాలి దర్శన. యిక్కడ నుంచి క్యాబ్ బుక్ చేస్తాను. హోటల్‌కి వెళ్లిపోతావా,” అడిగాడు.

యేంటన్నట్టు చూసింది.

“ఐ నీడ్ టు గో,” అని అతను అంటుండగానే తిరిగి ఫోన్.

“కమింగ్... కమింగ్,” అని అతను హడావిడిగా జీప్ తిప్పుకొంటూ దర్శనని దిగమన్నట్టు సైగ చేస్తోంటే ఆమె దిగింది.

అతను వెళ్లిపోయాడు.

ఆ కొండల యేటవాలు బాటపై ఆమె వొంటరిగా నిలబడింది. ఆమెకి అసలు అతను తనని వదిలి అలా యెందుకు వెళ్లిపోయాడో, అసలు అంత అర్జెంట్ విషయం యేమైవుంటుందోనని ఆలోచిస్తూ నిల్చుంది కాసేపు. చాల ముఖ్యమైన విషయమేదో కాకపోతే అలా వెళ్లిపోడు కదా... పిచ్చబ్బాయి... వెనక్కి తిరిగేగా వెళుతున్నాడు తనని యేదో వొక టాక్సీ పాయింట్ దగ్గర ఆపొచ్చుగా. ముందు అలానే అను కొన్నట్టున్నాడు... మళ్లీ ఫోన్ వచ్చేసరికి ఆ విషయమే మర్చిపోయినట్టు న్నాడు. జీప్ కూడా దిగిపోమన్నాడు. ముందుకు వెళితే ట్యాక్సీ దొరుకు

తుందా... వెనక్కి వెళితే దొరుకుతుందా... అటుయిటు టూరిస్ట్‌లతో వెళు తోన్న వాహనాలు కనిపిస్తున్నాయి. వాటిని ఆపితే... యెటు వెళ్లాలో అడిగితే... తిరిగి వచ్చిన దార్నే వెనక్కే నడుస్తుంటే ఆమె మనసు దిల్ తడప్ తడప్...హమ్ చేస్తూ నడుస్తోంది. యిలాంటి అందమైన కొండల్లోకి వచ్చాకే కదా మధుమతి కనిపిస్తుంది. ఆజారే పరదేసి... వూహో... అంటుండగానే దబదబా నాలుగు చినుకులు రాలయి... సంగీతానికి యెంత పవర్ వుందో కదా... యిలా పాడుతున్నానో లేదో అలా వాన... వో గాడ్ యేం కనిపించవేంటి... ఫోన్ చేస్తే విహాన్‌కి. వో గాడ్... హాండ్ బ్యాగ్ జీప్‌లోనే వుండిపోయింది. మొబైల్ అందులో వుంది. ఆహా... అచ్చు సినిమాలో హీరోయిన్ లా చేతిలో డబ్బుల్లేవ్... ఫోన్ లేదు. కొత్త ప్లేస్. దారీ తెలీదు. సరిగ్గా యిలాంటి వేళే హీరో వస్తాడు... హీరో వస్తాడా... అరే దర్శనా వదిలి వెళ్లిందే హీరో కదా... యింక హీరో రావటం యేంటి... వెరైటీగా విలన్ వస్తాడేమో... విలన్ లిఫ్ట్ యిచ్చి హీరో దగ్గరకి తీసుకు వెళతాడేమో... వెరైటీ కథ... డిఫరెంట్ లవ్‌స్టోరీ... బాప్‌రే టీవీ చూసి చూసి కామెడి అలవాటైపోయింది.

ఆమె ఆగింది. యిలా యెంత దూరం నడుస్తుంది. కాళ్లు లాగు తున్నాయి. కాసేపు దారి పక్కన కూర్చుంది. దాహం వేస్తోంది. యెలా... యిలా కాదు యేదో వొక వాహనాన్ని ఆపటమే... ప్రయత్నించి వో టూరిస్ట్ మినీబస్సు యెక్కింది. కొంత దూరం వెళ్లాక 'మనీ లేదు...' అంటూ క్లీనర్ లాంటి అతనికి మెల్లగా విషయం చెప్పింది. ఫోన్ నెంబర్ యిస్తానంది. అతని నెంబర్ యివ్వమంది. మనీ యిచ్చేస్తానంది.

"బస్సు యెక్కకముందే చెప్పాల్సింది... డబ్బుల్లేవని," అన్నాడు.

ఆమె నవ్వి, "యింత కథని అక్కడ చెప్పి మిమ్మల్ని వొప్పించటం టైమ్ వేస్ట్ కదా... అయినా మీరు హెల్ప్ చేసేవారిలానే కనిపించారు," అంది.

ఆమె డబ్బులు యిచ్చినా యివ్వకపోయినా పర్లేదు. తనని పొగి డింది అదే చాలు యీ జన్మకి అని అతను అనుకోలేదు. యిలాంటి అందమైన మాటకారి అమ్మాయిలని తను చాలామందినే చూశాడు. మనీ

ముఖ్యం... అనుకొంటూ, "నా ఫోన్నుంచి కాల్ చేసి సెంటర్ దగ్గరకి మనీ తెమ్మ నండి," అన్నాడు.

ఆమె విహాన్‌కి కాల్ చేసింది. అతను ఫోన్ లిఫ్ట్ చేయలేదు. అదే అతనికి చెప్పింది. రేపు మనీ యిచ్చేస్తానని చెప్పి తన నెంబర్‌కి అతని మొబైల్ నుంచి ఫోన్ చేసింది.

అక్కడ నుంచి దారి కనుక్కొంటూ మెల్లగా నడుచుకొంటూ హోటల్‌కి వచ్చింది. నిండైన కొండల ప్రాంతమేమో అప్పటకే చీకట్లు అల్లు కొంటున్నాయి.

రూమ్‌లోకి వెళ్లి అలా సోఫాలో వాలింది. ఆకలి తెలుస్తోంది చాలా సేపటిగా. ముందు వో కప్పు కాఫీ కలుపుకొని తాగింది.

విహాన్ యేమయ్యాడు... యింతసేపు యెటు వెళ్లిపోయాడు... అసలు యేమయింది... రూమ్‌లోంచి కాల్ చేసింది. నో రిప్లై... కాసేపు అతని కాల్ కోసం చూసి స్నానం చేసింది. ఫుడ్ ఆర్డర్ చేద్దామా అనుకొంది. యెటూకాని యీ టైమ్‌లో  తింటే డిన్నర్ చేయటం కష్టం. విహాతోనే డిన్నర్ చెయ్యాలి. ఫ్రూట్ బాస్కెట్‌లోంచి వో స్ట్రాబెర్రీ తీసుకొంది. ఆ ఫ్రూట్ చూస్తూ 'అచ్చు విహాన్ లిప్స్‌లా వుంది,' అనుకొంది.

టివి ఆన్ చేసి టైమ్ చూసింది. టైమ్ యేడున్నర. యింటికి ఫోన్ చెయ్యాలి. అమ్మకి వుదయం నుంచి చేయలేదు. నెంబర్ గుర్తులేదు. సెల్ లేదు. 'అసలు యీ అబ్బాయి యేమయ్యాడో...' తిరిగి తిరిగి ఆలోచనలు అక్కడికే వెళుతున్నాయి. అరే అతనేంటి కనీసం తన కాల్స్‌కి కూడా రెస్పాండ్ కావటం లేదు. విహాకి తెలిసినవాళ్లు యిక్కడ తనకెవ్వరూ తెలీదు. తిరిగి కాల్ చేసింది. నో రెస్పాన్స్. యేమయి వుంటుంది... అంతకు మించి ఆమె మనసు కారణాలని వెతకటం వైపో లేదా వూహిం చటం వైపో వెళ్లటం లేదు.

తలుపు తట్టిన  శబ్దం వినగానే ఛంగున గెంతుకొంటూ వెళ్లి తలుపు తీసింది. బెడ్ చేయటానికి వచ్చినతన్ని చూసి ముందు వద్దని చెప్పబోయి తిరిగి చేయమంది, కాసేపైనా యెవరో వొకరు రూమ్‌లో తన ఆలోచన లకి అడ్డకట్ట వేస్తారని.

అతను బెడ్ చేసి, 'గుడ్‌నైట్,' అన్నాడు.

అతనికి టిప్ యివ్వటానికి కూడా తన దగ్గర డబ్బులు లేవు.

అతను వో క్షణం ఆగి వెళ్లిపోయాడు.

మరో కాఫీ తాగింది.

లాబీకొచ్చింది. రిసెప్షన్‌కి వెళ్లి వాళ్లని సెల్‌ఫోన్ అడిగింది. విహాకి మెసేజ్ పెట్టింది. కాసేపు యెదురుచూసింది. నో రిప్లై... వుదయమంతా ఆ యెత్తైన కొండలు గుట్టలు మలుపులోంచి నడిచిందేమో అలసి పోయింది.

గదికొచ్చి అలా బెడ్ మీద వాలిందో లేదో నిద్రొచ్చేసింది.

ఆ పక్కనే మరో హోటల్ సూట్‌లో మగతనిద్రలో వున్న విహా ఫోన్ సైలెంట్‌లో వుంది. హఠాత్‌గా అతనికి దర్శన గుర్తొచ్చింది. మై గాడ్... తనని కాంటాక్ట్ చెయ్యాలి... అనుకొంటూ ఫోన్ తీశాడు. కాల్ చేశాడు. నో రిప్లై. నిద్రపోయిందా... అనుకొంటూ యస్‌యంయస్ చూశాడు. వో గాడ్... తన హాండ్‌బ్యాగ్ జీప్‌లోనే మర్చిపోయిందా. 'హోటల్‌కి కాల్ చేద్దాం,' అనుకొం టుండగా మంచి నిద్రలో మంచం మీద వున్న ముప్ఫై మూడేళ్ల హనీ కాస్త కదిలింది. అతను పక్కనున్న రూమ్‌లోకి వెళ్లాడు.

హోటల్‌కి కాల్ చేయపోతోండగా, ''డార్లింగ్,'' మత్తైన స్వరంతో హనీ గదిలోకి వచ్చి అతని వొడిలో తలపెట్టుకొని పడుకొని అతని నడుం చుట్టూ చేతులు చేసి, ''నన్ను వదిలి యిక్కడేం చేస్తున్నావ్...'' అంది.

అతను వొంగి ఆమె బుగ్గపై ముద్దు పెట్టాడు. ఆమె మరింతగా అతన్ని పెనవేసుకొంటూ, ''నేనుండగా నో ఫోన్స్ అని చెప్పానా... నేనొచ్చి నప్పుడు నీ రెండు చేతుల్లో వుండాల్సింది నేనేనని చెప్పానా... నాకు దొరికే టైమే తక్కువ... అందుకేగా నీ షూట్ అవ్వగానే సర్‌ప్రైజ్‌గా వచ్చేశాను,'' అని అతన్ని హత్తుకొంది. అప్రయత్నంగా అతను ఆమెని హగ్ చేసు కొన్నాడు.

తెల్లవారుతోంటే మెలుకువ వచ్చింది దర్శనకి. వెంటనే విహాన్‌కి కాల్ చేసింది.

సడన్‌గా ఆమెకి భయం వేసింది. యేమయింది... యెందుకిలా. అసలు కాంటాక్ట్ చేయనంత పని యేముంటుంది. యేమై వుంటుంది.

యెవరిని అడగాలి... తామిద్దరికి వున్న కామన్ ఫ్రెండ్స్... వాళ్లిక్కడ లేరు. అక్కడివాళ్లకి యీ విషయం తెలీదు. నెంబర్స్ లేవ్. నిన్న వొక టాప్‌లెస్ జీప్‌లో వచ్చాడు కదా... రెంట్‌కి యిస్తారని చెప్పాడు... అలాంటి జీప్స్ యిచ్చేవాళ్లు యిక్కడ యెంతమంది వుంటారు. ట్రావెల్ డస్క్‌కి కాల్ చేసింది. నిన్న విహాన్‌కి జీప్ యిక్కడ నుంచే బుక్ చేశారు, అని అడిగింది.

"సారీ... అలా వివరాలు యివ్వలేం," అన్నారు.

ఆమె లాంజ్‌లోకి వచ్చింది. మేనేజర్‌ని కలిసి నిన్న విహాన్ బయటకి వెళ్లాడు. యిప్పటివరకు రాలేదని.. యిలా విషయం చెపితే కంగారు పడొచ్చు. అతను యింకెవరికైనా చెప్పొచ్చు. విహాని యెంబ్రాసింగ్ సిట్యుయేషన్‌లో పెట్టటం యెందుకు.

"జీప్ వొకటి కావాలి... యెక్కడిస్తారు," అడిగింది.

వాళ్ల నెంబర్ నోట్ చేసుకొని, వో క్యాబ్ తీసుకొని అక్కడికి వెళ్లింది. అక్కడెలా మాటాడాలో ముందే రిహార్సల్స్ వేసుకొంది.

"నిన్న మా ఫ్రెండ్ తీసుకెళ్లారు... అలాంటి జీప్ వుందా," అని అడిగింది.

"యెవరు," అడిగాడు అతను.

"విహాన్..."

"ఆ పేరుతో యేం లేదే," అన్నాడతను సిస్టమ్‌లో బుకింగ్స్ చూసి.

"వూ... మే బీ... సినిమా కంపెనీ పేరు... లేదా హోటల్ పేరు మీదా..." అంది.

"వో... సినిమా డైరెక్టర్ సాబ్... అలాంటిది యిప్పుడు లేదు. అన్నీ బుక్ అయి వెళ్లిపోయాయి," అన్నాడు.

"అతను రిటన్ చేసేశాడా... అదీ వెళ్లిపోయిందా?"

"లేదు... రేపిస్తారంటా... వాళ్ల అసిస్టెంట్ యిందాకే ఫోన్ చేశాడు," అన్నాడతను.

'వో... థ్యాంక్ గాడ్... యెవరోవొకరితో యేదో వొక కమ్యునికేషన్ వుంది,' ఆమెకి వూరటగా అనిపించింది.

''అవి లేకపోతే వద్దులేండి. థ్యాంక్ యూ,'' అని అక్కడ నుంచి హోటల్‌కి వచ్చి రెస్టారెంట్‌కి వెళ్ళింది. బ్రేక్‌ఫాస్ట్ చేసి గదికి వచ్చింది.

రేపటి వరకు రాడా... యెలా... యింతసేపు తనని అతనెందుకు కాంటాక్ట్ చేయలేదు. యిన్ని గంటల్లో వో రెండు క్షణాలైనా యెందుకు దొరకలేదు... యేమైవుంటుంది. పనా... లేక అతని హెల్త్‌కి యేమైనా అయిందా... తిరిగి ఆదుర్దా. యింట్లో వాళ్లని కాంటాక్ట్ చేయటం యెలా. సెల్‌ఫోన్‌లోనే సమస్తం స్టోర్ చేసేటప్పటికి నెంబర్స్ యెక్కడ రాయక పోవటం... ఛ... అనుకొంటూ బిజినెస్ సెంటర్‌కి వెళ్లింది. సిస్టమ్ తీసుకొని ఫేస్‌బుక్ వాల్‌పై చెల్లెలికి జస్ట్ యిన్ఫర్మేషన్ పోస్ట్ చేసింది. తల్లికి మెయిల్ రాసింది. తను రోజూ మెయిల్ చెక్ చేయదు కదా... అనుకొంటూ, 'మమ్మీకి హాయ్ చెప్పు... సెల్ మిస్‌ప్లేస్ అయింది,' అని తిరిగి చెల్లెలికి వాల్ మీద పోస్ట్ చేసింది. నీకోసం యెదురు చూస్తున్నానని పంపింది.

తిరిగి గదికి వచ్చింది.

పర్సు లేదు... క్రెడిట్‌కార్డ్ లేదు... ఫోన్ లేదు... తెలిసిన మనుష్యులు లేరు... ఆమెకి అసలు యేంటిదంతా అనిపించింది. గదిలో కూర్చుంటే యివే ఆలోచనలు అనుకొంటూ బయటకి వచ్చింది.

ఆ సన్నని చలిలో ఆ అపరిచిత దారుల్లో నడుస్తుంటే విహాతో స్పెండ్ చేయాలని యెంతగా కలలు కందో మనసులో మెదిలింది. యీ చల్లని చలిలో లేతవెచ్చదనం ప్రవహించే విహా చేతుల్లో వొదిగిపోవటం యెంత హాయిగా వుంటుంది. అసలు విహా సమక్షమే మోహరాగాలని యెప్పటి కప్పుడు కొత్తగా ఆలపిస్తుంటాయి.

ఆమె వొక్కక్షణం వులిక్కిపడింది... అదే జీప్... విహా... తన పక్క నుంచే వెళుతున్నాడు. తనని చూసుండడు. పక్కన యెవరో వున్నారు... విహా తన కోసం హోటల్‌లో కాంటాక్ట్ చేస్తాడేమో... యిప్పటికే కాంటాక్ట్ చేశాడేమో...

ఆమె తిరిగి హోటల్ రూమ్‌కి వచ్చింది. యెలాంటి మెసేజ్ లేదు.

నిరీక్షిస్తునే వుంది... మధ్యాహ్నం మూడవుతుంటే వచ్చాడు.

''వో సారీ డియర్. స్టక్ విత్ వర్క్,'' ఆమెని హగ్ చేసుకొంటూ అన్నాడు.

పర్ఫ్యూమ్... అతని బ్రాండ్ కాదు.

"వొక్కసారైనా కాంటాక్ట్ చెయ్యాల్సింది. చాల టెన్స్‌గా అనిపించింది."

"యెక్కడ డార్లింగ్... మొన్న చేసిన షూట్‌లో ప్రోబ్లమ్ వచ్చింది. అందుకే బయటకి రాలేకపోయాను. యిప్పుడే యిలా రావటం," అన్నాడు.

దర్శనకి అతను కొత్తగా తోచాడు. యేదో తేడా... అడగాలా వద్దా... నో వద్దు... అనుకొంటూ నిన్నట్నుంచి తను పడిన ఆదుర్దా, యిన్‌కన్వీనియన్స్ చెప్పి, "నిన్నట్నుంచి నువ్వు వొక్కసారైనా నన్ను కాంటాక్ట్ చేయలేని స్థితిలో వుండటం రియల్లీ స్ట్రేంజ్... నీ సిట్యుయేషన్ నాకు తెలీదు... కాని యెందుకో యిదంతా అన్‌ప్లెజంట్‌గా వుంది. నీ కోసం నీ జీప్ రెంట్ కిచ్చిన ప్లేస్‌కి వెళ్లాను. అతనికి అతని జీప్ విషయంలో అప్‌డేట్ వుంది. ఆ విషయంలో తీసుకొన్నంత శ్రద్ధ కూడా నువ్వు నా విషయంలో తీసుకోలేదు," అంటుంటే ఆమె కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి.

"యెక్స్‌ట్రీమ్లీ సారీ..." గిల్టీగా అనిపించింది విహాన్‌కి.

"యిట్సు వోకె విహా," నిర్లిప్తంగా అంది.

ఆమెకి అతను వుదయం కనిపించటం పదేపదే గుర్తొస్తోంది.

ఆమె కాసేపు ఆగి, "అడగటం కరెక్టో కాదో తెలీదు. కానీ వుదయం నిన్ను చూశాను," అంది.

అంటే తనని క్రాస్‌చెక్ చేస్తోందా... హనీని చూసిందా... అతనికి వుక్రోషం వచ్చేసింది. అది కాస్తా కోపంగా మారింది.

"నన్ను చూసినప్పుడు చూశాను అని కాకుండా యిలా క్రాస్‌చెక్ చేస్తావా... అన్ ఫేర్," చికాగ్గా అన్నాడు.

దర్శనకి వింతగ అనిపించింది అతని చికాకు.

"నీ సంస్కారమంతా యేమయింది. వొకమ్మాయిని చూడగానే యిలా అనుమానంగా బిహేవ్ చేస్తున్నావా," రూడ్‌గా అన్నాడు.

అమ్మాయా....పక్కనెవరో వున్నట్టు అనిపించింది కాని అమ్మాయో అబ్బాయో తెలీదు... అరే యిలా మాటాడుతున్నాడేంటి... అనుకొంటూ

“నీ పక్కనెవరున్నారో నే చూడలేదు. వున్నట్టు అనిపించింది అంతే... అసలు నిన్ను క్లియర్‌గా కూడా చూడలేదు... అలా మాటాడతావేంటీ,” బాధపడుతూ అంది.

“దర్శనా... నా ప్రొఫెషన్‌లో అందరితో పనిచెయ్యాల్సి వస్తుంది. యిలా ప్రోవింగ్‌గా వుంటే యెలా... నిన్ను అంతసేపు అలా వెయిటింగ్‌లో పెట్టటం కరెక్ట్ కాదని నేనే చెపుతున్నా... కానీ నువ్వేంటో మాటాడుతున్నావ్...” మరింత విసుగ్గా అన్నాడు.

“విహా... నే చూడలేదు. నువ్వలా పని అంటూ చెపుతున్నప్పుడు నువ్వు కనిపించిన విషయం చెపితే బాగుండదనే ముందు నే మాటాడలేదు. కానీ యేంటోలా వుంది నువ్వు మాటాడుతోంది... అందుకే మాటాడాను... యిట్స్ వోకె,” అంది దర్శన.

అతను కూడ కాసేపు నిశ్శబ్దంగా వున్నాడు.

ఫ్లైట్ టైమ్ అవుతోంటే ఆమె, “టైమ్ అవుతోంది. యెర్‌పోర్ట్‌కి బయలుదేరాలి,” అంది.

యిద్దరూ బయటకి వచ్చారు. జీప్ యెక్కారు. జీప్‌లోనూ అదే ఫర్ఫ్యూమ్ పరిమళం.... అతని షర్ట్‌పై నుంచి వచ్చిన పరిమళమే.

అదే దారి... అవే మేఘాలు... అదే మంచు... కాని యిద్దరి మధ్యా అనుకోని యిరుకు.

యేర్‌పోర్ట్‌లో దిగాక ఆమె లోపలికి వెళ్లబోతూ అతన్ని హగ్ చేసుకొంది. అతని చేతులు ఆమెని తటపటాయింపుగా దగ్గరకి తీసుకొన్నాయి. ఆమెకి దు:ఖం వచ్చేసింది. వెక్కివెక్కి యేడ్చింది.

అతనికి మరింత గిల్టీగా అనిపించింది. కాని ఆ విషయాన్ని యెలా హాండిల్ చెయ్యాలో తెలియక, “యేంటా యేడుపు’,’ చికాగ్గా అన్నాడు.

ఆమె కళ్లు తుడుచుకొంటూ, “బై,” అంది.

కళ్ళయితే తుడుచుకొంది కాని వికలమైపోయిన మనసుని యెలా క్లీన్ చెయ్యాలో తెలియక సతమతమౌతూ చెకిన్ చేసింది.

యేర్‌పోర్ట్ నుంచి వెళుతుండగా విహాన్ మొబైల్ మోగింది.

“ఫ్లైట్‌లో వున్నాను... నువ్వెప్పుడొస్తావ్...” అడిగింది దర్శన.

"యేమో... బై..." అన్నాడు.

ఆమెకి మరింత దుఃఖం వచ్చింది.

అతను వో చోట జీప్ ఆపాడు... అతని మనసంతా చికాగ్గా వుంది. 'దర్శన తనతో స్పెండ్ చేయాలని వచ్చింది. తనకి చాలా యిష్టం దర్శన సమక్షమంటే. తనతో యీ రెండ్రోజులు గడుపుదామని తను యీగర్‌గా యెదురుచూశాడు. కాని అనుకోకుండా హనీ వచ్చింది. హనీ తన కెరీర్‌కి చాలా చాలా యింపార్టంట్ రిసోర్స్... తనని యిగ్నోర్ చేయటం కుదరదు. అంతేకాదు, తనకి మరో స్త్రీతో సంబంధం వుందని తెలిస్తే హనీ చాలా అప్‌సెట్ అవుతుంది. దర్శన తన మనిషి... అప్‌సెట్ అయినా సర్ది చెప్పొచ్చు అనుకొన్నాను. కాని తను తనని చూసింది... హనీని చూసిందా లేదా అన్నది తనకి తెలీదు. అర్థంకావటం లేదు. తనకెందుకో యిదంతా గిల్టీగా అని పిస్తుంది. దర్శనకి జవాబు చెప్పలేక సంభాషణ పొడిగించటం యిష్టం లేక కాస్త గట్టిగా మాటాడాను. చాలా బాధపడింది...' అనుకొంటూ ఆమెకి కాల్ చేశాడు.

అమె లిఫ్ట్ చేయగానే, "వచ్చే వారం వస్తాను," అన్నాడు.

ఆమె చాలా సంతోషంతో, "థ్యాంక్ యూ," అంది.

'యేదో విసుగులో అలా బిహేవ్ చేశాడు కాని తను మారిపోలేదు. అయినా వొక్క యిన్సిడెంట్‌తో మనుష్యులని అంచనా వేయటం కరెక్ట్ కాదుకదా. అదో బాడ్ టైమ్... అలా జరిగిపోయింది. ఫర్‌గెట్ యిట్...' అనుకొంది.

ఆమె రిలాక్స్ అయిందనిపించింది విహాన్‌కి.

"మేమ్... టేకాఫ్..." చిరునవ్వుతో అంది యెర్‌హోస్టెస్.

"బై... ల్యాండ్ అయ్యాక కాల్ చేస్తాను," అంది.

ఆమె మనసు విమానంతో పాటు అలా మేఘాలలో తేలిపోతోన్న ట్టుంది.

'ఘాట్ కాబట్టి కాస్త టర్బులెన్స్ వుంది. యిట్స్ వెరీ కామన్...' అనుకొంది దర్శన.

◆ ◆ ◆

రోజూ ఆఫీస్‌కి వెళ్లటం, రావటం. ఫోన్‌లో విహాన్‌తో మాటాడటం. విహాన్ వస్తానన్న టైమ్‌కి రావటంలేదు. ఆఫీస్‌లో బాస్ చికాకు యెక్కువ గానే వుంది.

''వోసారి అతనితో లాంగ్ డ్రైవ్‌కి వెళ్లు... నీకీ గోల వదిలిపోతుంది,'' కన్నుగీటుతూ అంది కొలీగ్ వినీత.

''ఐ కాన్ట్...'' అంది దర్శన.

''వో మై డియర్ నీదంతా చాదస్తం. నువ్వు నీ వర్క్‌తో మాత్రమే శాటిస్‌ఫై చేయలేవ్. మేమది ముందే రియలైజ్ అయ్యాం. అందుకే యిప్పుడు చూడు మాకు రోజు వాడి సతాయింపు వుండదు. పైగా రోజు పేంపర్ చేస్తాడు. వో పెగ్... వో హగ్ అంతే. లైఫంతా కూల్,'' అంది.

''యిది కాకపోతే మరొకటి... వీడికంత యింపార్టెన్స్ వేస్ట్,'' అంది దర్శన.

''ఆర్ యూ మేడ్... యెక్కడైనా యింతే... దానికోసం మరో ఆర్గనై జేషన్‌కి మారటం వేస్ట్... నీకు తెలుసా నా కాస్మోటిక్స్ బిల్ వొకడికి, నా ఫేషియల్, సెలూన్ బిల్ వొకడికి యిచ్చేస్తుంటాను ప్రతి నెల. దర్శనా యీ యేజ్‌లోనే యీ మగవాళ్లకి మనపై ఆసక్తి వుంటుంది. క్యాష్ యిట్... ఆ తర్వాత పెళ్లి, పిల్లలు. మన హబ్బీ కూడా మన ముఖాన్ని ఆసక్తిగా చూడడు. అతనికి అవకాశాలు కెరీర్‌లో బోల్డుంటాయి... మన బాస్‌లా... మన బాస్ వైఫ్ యెంత అందంగా వుంటుందో... అతనికి యీ అవకాశం వుంది యెంజాయ్ చేస్తున్నాడు. అసలు లైఫ్‌లో యివన్ని టెంపరెరీ... వీటికి యెక్కువ యింపార్టెన్స్ యివ్వటం కూడా టైమ్‌వేస్ట్,'' నవ్వుతూ అంది వినీత.

''వర్క్ ప్లేస్‌లో యిలాంటి హెరాస్‌మెంట్...'' యింకా ఆమె వాఖ్య పూర్తికాకుండానే వినీత నవ్వుతూ, ''వో పాగల్... అవన్నీ అందరికీ తెలుసు కానీ అవేవి చాలాచోట్ల వర్క్‌వుట్ కావ్. సింపిల్ బేబీ... వొక్కసారి నువ్వు ప్రోబ్లమేటిక్ అని తెలిసిందనుకో ఆ బాస్ జాబ్ కాదు పోయేది... నీదే. అంతే కాదు నువ్వు యెక్కడ జాబ్‌కి వెళ్లినా స్వీట్‌గా మాటాడి, వో కప్పు కాపిచినో యిచ్చి పంపించేస్తారు. మన వాల్యూస్ మనలని నిచ్చెనలని

యెక్కిం చాలి కాని యెక్కటానికి నిచ్చెనే లేకుండా చేయకూడదు కదా... వొక్కసారి ఆలోచించు,'' అంది వినీత.

దర్శనకి నవ్వొచ్చింది. తన చుట్టూ వాతావరణం యెలాంటిదో తనకి నిజంగా తెలీదా... తెలుసు... యెన్ని చూడటం లేదు... తమ సీనియర్స్‌లో కొందరు యిలాంటి ఫన్ యేజ్‌ని దాటేసినందుకు బాధపడటం... యంగ్ స్టర్స్‌తో పోటీపడటానికి మరింత యెక్స్‌ట్రా వర్క్ చేయటం... అసలు అమ్మాయిలుగా పుట్టనందుకు అబ్బాయిలు బాధపడటం, అలా వెళ్లటం వొక యిష్యూనే కానిచోట అదే యిష్యూగా తనెవ్వరితో మాటాడుతుంది... విహాని చూస్తే మల్లెలపొదయ్యే శరీరం మరెవ్వరిని చూసినా అలా విక సించదు... శరీరాన్ని చాల క్యాజువల్‌గా తీసుకోవటం తనకెందుకు సాధ్యం కావటం లేదు... అలా కానివాళ్లు యిక్కడ నుంచి వెళ్లిపోవటం తెలుసు. కాంప్రమైజ్ అయిన వాళ్లు తెలుసు. యిలాంటి నాన్‌సెన్స్ లేని వర్క్‌ప్లేసేస్ యీ రంగంలోనూ వున్నాయి. మనం యెక్కడ నిలబడాల్సి వస్తుందో మన చేతుల్లో లేదు. ఛ... బాస్ నస సాధ్యమైనంత వరకు తను భరిస్తుంది. కాని ఐ కాంట్ డు సచ్ థింగ్స్.

విహాకి ఫోన్ చేసింది.

నో రిప్లై...

యింటికి వచ్చినా దర్శనకి విహా నుంచి కాల్ రాలేదు.

దర్శన వచ్చినప్పట్నుంచి కాస్త డల్‌గా వుండటం చూసిన రాధిక, ''విహా యెప్పుడొస్తున్నాడు,'' అడిగింది.

''వస్తానన్నాడమ్మా... కాని డేట్ తెలీదు,'' అంది.

''వాళ్ల పేరెంట్స్‌తో మేరేజ్ విషయం మాటాడదామని చెప్పు,'' అంది రాధిక.

''వోకే.'' అంది దర్శన.

విహాకి తిరిగి కాల్ చేసింది.

''వూ... చెప్పు,'' అన్నాడు.

అతనంత పొడిగా అనగానే ఆమెకి యెలా మాట్లాడాలో తెలియ లేదు.

“బిజిగా వున్నావా... మళ్లీ కాల్ చేయనా?”

“లేదు లేదు... చెప్పు...”

“మమ్మీ నువ్వు యెప్పుడొస్తున్నావని అడిగింది. ఆంటీ, అంకుల్‌తో మన మ్యారేజ్ విషయం మాటాడతానంది,” సంతోషంగా చెప్పింది దర్శన.

“మ్యారేజ్...” చిన్నగా నవ్వి, “దర్శనా అప్పుడే పెళ్లా... నో, కెరీర్‌లో సెటిల్ అవ్వాలి కదా,” అన్నాడు.

“లైఫ్ పేర్‌లల్‌గా నడుస్తుంది విహా.”

“బాప్‌రే... ప్రస్తుతం లాంగ్ కమిట్‌మెంట్స్ యివ్వలేను... యీ పెళ్లి పిల్లలు... ప్రస్తుతం బ్యాగేజ్ వద్దు. ఆంటీ అడిగితే యిలా చెప్పలేను. సో... వాళ్లు నాతో మాటాడకుండా నువ్వే చూడు... ఆంటీ, అంకుల్ నాతో యీ విషయం మాటాడితే నీతో అసలు మాటాడను. అంతే. యిప్పుడే మ్యారేజ్ వద్దని నువ్వే పోస్ట్‌పోన్ చేస్తున్నట్టు చెప్పు,” అన్నాడు.

“అదేంటి విహా... నేనెలా చెపుతాను. వాళ్లని నేనెలా ఆపుతాను. మేరేజ్ చేసుకొందాం.”

“వో... అయితే యిదంతా నీ ఆలోచనా.”

“లేదు... మమ్మీనే అడిగింది. అయినా యెన్నాళ్లు పోస్ట్‌పోన్ చేస్తాం. నిన్ను కలవటానికి ఆ వూర్లు వచ్చినప్పుడంతా మమ్మీకి మనం యిలా పెళ్లి కాకుండా స్పెండ్ చేస్తున్నామని యెవరైనా అడుగుతారని భయం భయంగా వుంటుంది. నిన్ను చూడకుండా వుండలేను. చూడటానికి వెళతా నంటాను. వద్దనలేక పంపిస్తారు యింట్లో. మనం కూడ వాళ్ల వైపు నుంచి ఆలోచించాలి కదా... అయినా నేనిలా యెక్కువ రోజులు నీకు దూరంగా వుండటం చాలా దిగులుగా వుంటుంది. అసలు నేను నీకే యిబ్బంది కలిగించను కదా... నీ కెరీర్‌కి నేనెలా అడ్డు...” దిగులుగా అడిగింది దర్శన.

“మళ్లీ మాటాడతాను దర్శనా... యెవరో వచ్చారు,” అన్నాడు.

దర్శన, “వోకే,” అంది.

యెలా యీ యిష్యూని హేండిల్ చేయటం. దర్శనని యిప్పుడు పెళ్లి చేసుకొంటే ఖచ్చితంగా తన కెరీర్‌కి దెబ్బ. హనీకి యిండస్ట్రీలో పెద్ద

పెద్ద వాళ్లతో వ్యాపార సంబంధాలున్నాయి. తనింకా యెస్టాబ్లిష్డ్ డైరెక్టర్ కాదు. తనకి యిండస్ట్రీలో ఫ్యామిలి కనెక్షన్స్ లేవ్. అసలే బాలీవుడ్... వొక్క సినిమా పోయినా తిరిగి యెవ్వరూ యిన్వెస్ట్ చేయరు. తనకి హనీ సపోర్ట్ కావాలి. హనీకి తన యిరవై ఆరేళ్ల శరీరం కావాలి. హనీకి తనపై ఆసక్తి పోయేలోగా తన కోసం వొక్క ప్రొడ్యూసర్‌నైనా ఫిక్స్ చేయించు కోవాలి. తన జీవితాంతం యీ హనీ వుండదు. ఆ విషయం హనీకి తెలుసు. తన జీవితానికో నిచ్చెన వేయించుకొనే వరకు హనీ కావాలి. యీలోగా యెమో షనల్ కమిట్‌మెంట్స్‌కి దూరంగా వుండాలి. అసలు హనీ తర్వాత మరో హనీలాంటి వాళ్లు రారని యేంటి... తన మార్కెట్ కావాలనుకొనే వరకు తనని మార్కెట్ చేసేవాళ్లు కావాలి. యీ మొత్తంలో తనని కమ్ముకోటానికి మంచుతో పోటీపడే దర్శనని యెలా నమ్మిం చటం... యెలా మేనేజ్ చేయటం. ఆపాలి... కొన్నాళ్లు తనని ఆపాలి... వొకేసారి వద్దంటే బాధపడు తుంది. పోస్ట్‌పోన్ చెయ్యాలి. ముందు హర్ట్ అయినా తనే కొన్నాళ్లకి మర్చిపోతుంది. ఆరోజులాంటి సంఘటన అదే మొదటిది కాబట్టి దర్శన తనని యెటాక్ చేయకుండా తనే యెదురు దాడి చేశాడు... ఆ విషయం తనకి తెలుసు. తిరిగితిరిగి యిలాంటివి మరో రూపంలో యెదురు కావొచ్చు. దర్శనతో యిలా మాటాడొచ్చు కానీ హనీకి యెప్పుడైనా తను దర్శనతో కనిపిస్తే, హనీ, దర్శన విషయం అడిగితే హనీపై దర్శనపై అరిచినట్టు మాటాడగలనా... అసలే గ్లామర్‌ఫీల్డ్ ... యేదోరోజు యేదో వొక యీవెంట్‌కి హనీ కలిసి వెళదామంటుంది. వద్దనలేడు. లైవ్ టెలికాస్ట్‌లో చూసి దర్శన అప్‌సెట్ కావొచ్చు... యెందు కిన్ని కాంప్లికేషన్స్. ఖచ్చితంగా వద్దంటే.... వొకవేళ యీ యిండస్ట్రీలో సక్సెస్ కాకపోతే అంత అందమైన దర్శన, తనని యెంతగానో యిష్టపడే దర్శనని మిస్ చేసుకోవటమే. వో మై గాడ్... యింత టెన్షన్ అవసరమా... తనకి తన కెరీర్ యింపార్టెంట్.

యెందరెందరికో అణిగిమణిగి అందరి చుట్టూ తిరుగుతోంది వోడి పోటానికా... యేమైనా డైరెక్టర్ విహాన్... అని తెరపై సింగిల్ కార్డ్ చూసు కోవాలి.

చెప్పెయ్యాలి...చెప్పెయ్యాలి.... దర్శనకి చెప్పెయ్యాలి.

◆ ◆ ◆

ఆఫీస్‌లోని కౌన్సిలర్స్ అయితే తమ విషయాలని కాన్ఫిడెన్షియల్‌గా వుంచుతారా లేదానే అనుమానం... మరోవైపు రోజూ వాళ్లని చూడాలి కదా యెందుకీ యెంబరాస్‌మెంట్ అని దర్శన బయట వో సీనియర్ కౌన్సిలర్ దగ్గర అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేసుకొని వెళ్లింది.

"వో దర్శనా... మళ్లీ బాస్‌తో గొడవా... చూడు బాస్ మనల్ని సపోర్ట్ చేయటం లేదని కొలీగ్స్‌కి తెలిసిందనుకో... వాళ్లు లెక్కచెయ్యరు. నువ్వు యెవరితో పని చేయించాలో ఆ టీమ్ నీ మాట వినరు. యీరోజు జరిగింది అదే. నిన్ను వోవర్ కమ్ చేసి వాళ్లు నీ బాస్ దగ్గరకి వెళ్తారు. నీ బాస్ వాళ్లనే సపోర్ట్ చేస్తున్నాడు. అది చాలా సహజం. అదే బాస్ పవర్. హైయర్ మేనేజ్ మెంట్ మన కంప్లైంట్స్‌ని పట్టించుకోదని యింతకు ముందు చెప్పాను కదా... మరో విషయం కూడా గుర్తుపెట్టుకో. వాళ్లే యెప్పుడైనా యెవ్వరినైనా పంపించాలనుకొంటే వాళ్లపై కంప్లైంట్ వున్న వాళ్లని యూజ్ చేసుకొంటుంది. అప్పటివరకు పట్టించుకోదు. అందుకే యీ మిడిల్ మేనేజ్ మెంట్ చాలా పవర్‌ఫుల్. యిప్పుడు చూడు నిన్నే పరిస్థితికి తీసుకొచ్చాడో. నీ టీమ్ నుంచే నీకు వ్యతిరేకతని తెచ్చాడు. యిదంతా పవర్ గేమ్ దర్శనా... యెందుకు నేనంటే లెక్కలేదు... అధారిటీని యిష్టపడని వాళ్లకి ఆ అధారిటీ టేస్ట్ చూపించాలనుకొంటారు. అంటే నాట్ రియల్లీ క్రేవింగ్ ఫర్ యూ. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్టార్ట్ చెయ్యాలి... సో..." అంటూ యింకా యేదో చెప్పబోతోన్న ఉజ్వలతో, "యిన్ని పాలిటిక్స్ మీకెలా తెలుసు," అడిగింది దర్శన.

"యెక్స్‌పీరియన్స్," అంటూ నవ్వింది ఉజ్వల.

"యిన్ని పాలిటిక్స్, యింత అధారిటీ అవసరమా వర్క్‌ప్లేస్‌లో."

"వర్క్‌ప్లేస్ యేంటి దర్శనా... ప్రతిచోట యివే ఆపరేట్ అవుతున్నాయి. పర్సనల్ లైఫ్ కూడా దీనికి అతీతం కాదుకదా," అంది ఉజ్వల.

'పర్సనల్ లైఫ్...' వులిక్కిపడింది దర్శన.

"ప్రేమలో..." చప్పున అడిగింది.

ఉజ్వల కాసేపు మౌనంగా వుండి, "యస్... కొన్ని సిట్యుయేషన్స్‌లో యేవీ వేటికీ అతీతం కాదు. అందులో మీది బ్రేక్ కే బాద్ జనరేషన్. యిమోషనల్ డిసిప్లీన్ కాస్త తక్కువే. కెరీర్, యిమేజ్ డామినేట్ చేస్తు న్నాయ్. దేనినైనా నిమిషాలపై వదులుకొనేట్టు మానసికంగా మిమ్మల్ని సిద్ధం చేసే పరికరాలు చుట్టూ వున్నాయి. యింకో విషయం చెప్పనా, యిది యెక్కువగా సిటీస్‌లో కనిపిస్తోంది. యింక కాస్మోపాలిటన్ సిటిస్‌లో అయితే మరీ యెక్కువగా వుంది. యిలాంటివి మీరు వర్క్ చేసే ఫీల్డ్ పై కూడా ఆధారపడి వుంటాయి," అంది ఉజ్వల.

దర్శనకి చప్పున విహాన్ ప్రవర్తన గుర్తొచ్చింది.

అదంతా యేంటి... మారుతున్నాడా...

"వోకే... దర్శనా, డామేజ్‌ని యెక్కువ చేయకుండా మీ బాస్‌తో వో స్మూత్‌నెస్ తెచ్చుకోటానికి ట్రై చేయ్... ప్రవాహానికి యెదురీదటం అశాంతినే యిస్తుంది. నువ్వు ఆ అశాంతిని యెంతవరకు యెదుర్కోగలవో చూసుకో. లేదంటే మరో జాబ్.. లేదంటే బి పార్ట్ ఆఫ్ క్యాట్ రేస్... దర్శనా. ఆల్ ది బెస్ట్," అంది ఉజ్వల.

"థ్యాంక్ యూ," అని బయటకి వచ్చింది దర్శన.

కార్తీకపుగాలి శరీరాన్ని వూయల వూపుదామనుకొంటోంది... మనసేమో విహాన్ మారుతున్నాడాని ఆలోచిస్తోంది.

వొకేసారి ప్రొఫెషనల్ లైఫ్‌లోనూ పర్సనల్ లైఫ్‌లోనూ డిస్ట్రబెన్స్. వుద్యోగాన్ని చప్పున వదిలేస్తే యెలా... వోవైపు రిసెషన్. వుద్యోగం చేస్తూ మరోటి చూసుకోవాలి... అప్పటివరకు యితన్ని యెలా మేనేజ్ చెయ్యాలి. ఛ విహాని స్పర్శించిన మనసు, శరీరం యెదురు తిరుగుతున్నాయి.

వొకవేళ విహాన్ తన జీవితంలో లేకపోతే తను అతన్ని ఫ్లర్ట్ చేయ టానికి లేదా ఫ్లర్ట్‌ని వొప్పుకోటానికి వోకేనా... స్ట్రేంజ్...హైపోథిటికల్ క్వెచ్చన్స్.

తన కొలీగ్స్‌కి బాయ్‌ఫ్రెండ్స్ వున్నారుకదా... షిట్... నో యిలా ఆలో చించటంయేంటి...

ముందు యెక్కడికైనా వెళ్లాలి... యిలా వొంటరిగా వుంటే యివే ఆలోచనలు... యెక్కడికి... యిదో దురదృష్టం. సరదాగా గడపటానికి బోల్డంత ప్రపంచం. మనసుకి కష్టమేస్తే చెప్పుకోటానికి వొక్కరు కూడా లేరు.

విహాన్‌కి కాల్ చేసింది. నో రిప్లై. యీ మధ్య చాలాసార్లు యిలాంటి మాటలే వినాల్సి వస్తోంది.

యిటాలియన్ సినిమాని సబ్‌టైటిల్స్‌తో చదువుతూ చూస్తోన్న విహాన్ 'యిప్పుడు ఆన్సర్ చేస్తే పెళ్లి అంటుందేమో... మూడంతా అప్‌సెట్ అవు తుంది. తర్వాత మాటాడొచ్చులే,' అని ఫోన్ తీయలేదు.

దర్శన కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

సినిమా తర్వాత సినిమా చూస్తూ అందులో యేయే సన్నివేశాలని తన సినిమాలో పెట్టుకోవచ్చో లేదా యెడాప్ట్ చేయొచ్చో ఆలోచిస్తూ, మధ్యలో హనీ కాల్ చేస్తే ఆమెని పేంపర్ చేస్తూ దర్శనకి ఫోన్ చేయటమే మర్చిపోయాడు. ఆమె రెండు మూడుసార్లు చేసినా తీయలేదు.

దర్శన మనసంతా వికలమైపోయింది.

యెలా వుండేవాళ్లం యెలా అయిపోయింది పరిస్థితి. అస్సలు భయం లేని నిష్కల్మషమైన అనురాగం వుండేది.

యిప్పుడు ఫోన్ చేస్తే తీస్తాడా, తీయడనే సందిగ్ధం. పనిలో వున్నా డేమో తర్వాత చేస్తాడనే యెదురుచూపు వో యెండమావి. చికాకుపడ తాడేమో... విసుక్కుంటాడేమో లేదా యేదో వో కారణం చెప్పి అసలు మాటాడడేమో... అన్నీ భయాలే... ఆలోచిస్తూ ఆఫీస్‌కి రెడీ అవుతోంటే, యీరోజు యెలాంటి చికాకులో ఆఫీస్‌లో... అని భయం. ఆమెకి సడన్‌గా కుడిచెయ్యి లాగుతున్నట్టనిపించింది.

విహాన్‌కి కాల్ చేసింది. నిద్రలోంచి, "హలో," అన్నాడు.

"నిద్రపోతున్నావా... వోకే. యీవినింగ్ కాల్ చేస్తా," అంది.

విహాన్ ఫోన్ తీసినందుకు మనసు కాస్త తెరిపినపడినట్టయింది.

ఆఫీస్‌కి మాత్రం అవే భయాందోళనలతో వెళ్లింది.

◆ ◆ ◆

సినిహీరో అవ్వాలనే ప్రయత్నాలలో వున్న మరో యువకుడిని హనీ తనతో సింగపూర్ తీసుకువెళ్లిందని తెలిసి విహాన్‌కి కంగారుగా అనిపించింది. తనకింకా వో అవకాశం కూడా రాలేదు. హనీ యింత తొందరగా షిఫ్ట్ అయిపోతే యెలా... ఆమె వలన యెక్కడా అసిస్టెంట్‌గా పనిచేయకుండానే తనకి అసోసియేట్ డైరెక్టర్‌గా అవకాశం రావటమే చాలా యెక్కువనుకొందా.... యెలా... తనకి హనీ విషయాలు యేం తెలీనట్టు ఫోన్ చేసి మాటాడితే... అదే కరెక్ట్... కాంటాక్ట్ పోగొట్టుకోకూడదు. హనీకి ఫోన్ చేశాడు. నో రిప్లై.

గాన్ కేస్.... మళ్లీ రేపట్నుంచి తన సపోర్టివ్ సిస్టమ్స్‌ని వెతుక్కోవాలి. అతని మనసంతా చికాకు. దర్శనకి కాల్ చేశాడు... స్విచ్ ఆఫ్... యెందుకని... వో, ఆఫీస్ టైమ్‌లో సెల్‌ఫోన్ని తీసుకువెళ్లనివ్వరు కదా... యిలా రూమ్‌లో కూర్చుంటే అవకాశాలు రావు... వెళ్లాలి... పరిచయాలు పెంచుకోవాలి...

విహాన్ బయటకి వెళ్లబోతుంటే రూమ్మేట్ ఆకాష్ లోపలికి వచ్చాడు. అతని ముఖంలో స్పష్టమైన విసుగు. అతను వుదయమే వో ప్రొడక్షన్ హౌస్ వాళ్లు పిలిస్తే వెళ్లాడు. హీరో అవ్వాలనే ప్రయత్నాల్లో వున్నాడు. డ్యాన్స్ చక్కగా చేస్తాడు. హేండ్‌సమ్. తన మాతృభాషే కాకుండా హిందీ, యింగ్లీష్ ఫ్లూయంట్‌గా మాటాడతాడు. రోజూ జిమ్‌కి వెళతాడు. అలాంటి వాళ్లు బోల్డంతమంది యిండస్ట్రీలో వొక్క ఛాన్స్ అనుకొని కలల కౌముదుల్లా తిరుగుతుంటారు. అలాంటి వాళ్లల్లో ఆకాష్ వొక్కడు.

"వాట్ డూడ్," అన్నాడు విహాన్.

" షిట్... యూ నో... అతను గే.... కంపెనీ కావాలంట... వోకే అయితే రేపు ఫోన్ చేయమన్నాడు... యూ ఆర్ లక్కీ... హనీ వెరీ గుడ్ కాంటాక్ట్. ఐ డోన్ట్ హేవ్ గే థాట్స్... ఫర్ గెటిట్..." విసుగ్గా అన్నాడు ఆకాష్.

" హనీ షిఫ్ట్ అయిపోయినట్టుంది..." బిట్టర్‌గా నవ్వాడు విహాన్.

"వో... యెవరా న్యూ బకరా," అడిగాడు ఆకాష్.

''నేను కూడా యిప్పుడు అన్నిరకాల ప్రయత్నాలు మొదలు పెట్టాలి... ప్రొడక్షన్ హౌస్ ఆఫీస్‌కి వెళుతున్నాను. బై...'' అన్నాడు.

◆ ◆ ◆

దర్శన పనిచేస్తోంది కానీ ఆమెని రకరకాల ఆలోచనలు కమ్ము కుంటున్నాయి. యెంత ఆనందంగా వుండేవి చదువుకొనే రోజులు... మంచి వుద్యోగం అని అంతా తనని యెంతగా మెచ్చుకొన్నారు. వుద్యోగం వచ్చాక తనపై యింట్లో వాళ్ళ కంట్రోల్ కూడా పూర్తిగా తగ్గిపోయింది. తనకి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. విహాన్ పరిచయం, ప్రేమని పూర్తిగా వోకే అన్నారు. తన చుట్టూ ప్రతి వొక్కరు బోల్డంత సంతోషంగా వున్నారు. యెందుకు తన జీవితం వొక్కసారే యిలా వేదనగా అయిపోయింది... యెక్కడ యేం జరిగింది... అవును ఆరోజు విహాన్ యెవరో అమ్మాయి అన్నాడు... యెవరా అమ్మాయి... హీరోయిన్... మరో అసోసియేటా... యెవరు... ఆ అమ్మాయి తో వుండి తనకి కాల్ చేయలేదా... అలా కంప్లీట్‌గా వొక అమ్మాయితో వుండిపోవటమే కాకుండా తన ప్రెజన్స్‌ని కూడా దాచిపెట్టాల్సిన అవసరం వచ్చిందంటే ఆ అమ్మాయికీ విహాన్‌కీ మధ్య యేం జరుగుతోంది. విహాన్ యెప్పుడు కెరీర్‌కి యింపార్టెన్స్ యిచ్చేవాడు. కాని అంతకుముందెప్పుడు విహాన్ పెళ్లిని బ్యాగేజ్ అనలేదు. యిప్పుడు అతను మాటాడుతోన్న కొత్త జార్గాన్ భావమేమి తిరుమలేశా...

బాస్ పిలుపు.

ఆమెకి తెలీకుండానే గుండెల్లో చిన్ని దడ మొదలైయింది. గొడవ పడొద్దు... బయట వుద్యోగాలు లేవ్. యీ జాబ్ లేకపోతే ఫైనాన్షియల్‌గా యింట్లో వాళ్ల మీద ఆధారపడాలి. అప్పుడు నీకింత స్వేచ్ఛ వుండదు. యెప్పుడంటే అప్పుడు విహాని కలవటానికి ఫ్లైట్‌లో వెళ్లటం కష్టమవు తుంది. కారు యి.యమ్.ఐ కళ్ల ముందు కదిలింది.

''గుడ్ మార్నింగ్ సర్... వో... పికాక్ బ్లూ టై. యీ కలర్‌లో టైస్ రావటం చాలా రేర్. వెరీ నైస్,'' అంది అప్రయత్నంగా.

'వో తనతో సరిగ్గా లేకపోతే కష్టమని అర్థమయి వుంటుంది. అయినా అప్పుడే హ్యాపీగా మాటాడొద్దు. లీనియన్స్ యిచ్చినట్టు అవు

తుంది,' అనుకొంటూ, ''వో... థ్యాంక్ యూ... మీ టీమ్‌తో వో మీటింగ్ పెడదాం. యేవైనా యిష్యూస్ వుంటే... లెటస్ డిస్కస్,'' అన్నాడు.

''ష్యూర్ సర్... టీ కావాలి,'' అడిగింది దర్శన.

'యింతకు ముందెప్పుడు యిలా టీ అడగలేదు కదా,' అనుకొంటూ లోలోపల సంతోషిస్తూ, ''ష్యూర్ గ్రీన్ టీ,'' అన్నాడు.

'దొంగముఖం... లోపల సంతోషిస్తునే బయటకి బింకాలు పోతు న్నాడు. చూడరా... నీతో యెలా అడుకొంటానో... యూ స్టుపిడ్,' అను కొంటూ లోలోపల నవ్వుకొంది దర్శన.

◆ ◆ ◆

ఆ సాయంకాలానికి దర్శన మనసంతా గ్లూమీగా అయిపోయింది. తన మనసుకి వ్యతిరేకంగా తను ప్రవర్తించటం, కేట్‌రేస్‌లో తను కేట్ అవ్వటం ఆమెకి చాల అనీజ్‌గా అనిపించింది.

యింటికి వెళ్లి అలా టీవీకి అతుక్కుపోయింది.

ఆరోజు విహాన్‌కి ఫోన్ చేయలేకపోయింది.

హనీ విషయంలో చికాగ్గా వుండి ఆ రాత్రి విహానే ఫోన్ చేశాడు. కాస్త బాగా మాటాడాడు.

దర్శన ఆలోచిస్తోంది... తనలానే విహాన్‌కి కెరీర్‌కి సంబంధించిన యేవైనా కంప్లషన్స్ వున్నాయా... తనలానే సతమతమౌతున్నాడా... యేదో అడ్డుపడుతోంది...

హనీ యెప్పుడొస్తుందో తెలీదు... అవకాశాలు యెలాగనే చికాకు మనసుకి. శరీరం ఖాళీ... పోని దర్శనని రమ్మంటే... ఖండాలా వెళితే... కాస్త రిలాక్స్. యెలాను వీకెండ్‌కి వొక్క సినిమా ఆఫీస్ తీసుండదు.

''దర్శనా... కాస్త ఖాళీగా వున్నాను... వీకెండ్‌కి వీలైతే రా...'' అన్నాడు విహాన్.

''చూస్తాను... వీలైతే వస్తాను,'' అంది.

◆ ◆ ◆

దర్శన వచ్చింది  విహాన్ దగ్గరకి.

ఖండాలాలో యెటు చూసినా వాన చిలకరింపులు... మంచు దొంతర దొంతర్లుగా కమ్ముకొంటూనే వుంది.

అతను డ్రైవ్ చేస్తున్నాడు. ఆమె మనస్సెరీరాలు వొకప్పట్లా విహాని కమ్ముకోటానికి వానజల్లులతో, మంచుదొంతర్లతో పోటీపడటం లేదు.

అతని మనసూ హనీ తిరిగివచ్చాక తనని పట్టించుకొంటుందా లేదాని... లేదా తనకి అవకాశాలు యివ్వడానికి మరో హనీ దొరుకుతుందా లేదాని ఆలోచిస్తుంటే ఆకాష్‌కి వచ్చినటువంటి అవకాశం వస్తే... ఆ ఆలోచనకే అతనికి నవ్వొచ్చింది...


యేమిటన్నట్టు అతని వైపు చూసింది.

ఆకాష్‌కి యెదురైన యిన్సిడెంట్‌ని చప్పున చెప్పేస్తూ, "లేడీ అనుకో యే యేజ్ అయినా అవకాశం కోసం వోకే అనేవాడు," నవ్వుతూ అన్నాడు.

'నీ పరిస్థితి యేంటి విహాన్,' అనుకొంటూ, 'యే ఫీల్డ్ అయితేనేం కేట్ రేస్‌లో అందరం... యేదో రకంగా భాగస్తులమే... వొకరిని వొకరు అర్థం చేసుకోటానికి యెవరి ప్రయత్నాలు వాళ్లు చెయ్యాల్సిందే... యెలాంటి సపోర్టివ్ థింకింగ్ అవసరమో... ఆలోచిస్తోన్న దర్శన ఆలోచనలని, కారు రికార్డ్ ప్లేయర్ నుంచి, 'లవ్ యీజ్ యిన్ నీడ్ ఆఫ్ లవ్ టుడే' స్టీవ్ వండర్ స్వరం బ్రేక్ చేస్తూ వెనువెంటనే కంస్ట్రెక్ట్ చేస్తూ మనసుని హమ్ చేస్తోంది...

*చినుకు మాసపత్రిక, జులై 2013*

# నా స్నేహితురాలి పేరు 'సుధీర'



'సుధీర ముద్దులా చాలా అందంగా కురుస్తోంది వర్షాకాలపు తొలి వాన,' మేడ మీద గదిలోని నిలువెత్తు కిటికి దగ్గర నిల్చున్న అఖిల్ మనసులోకి అప్రయత్నంగా వచ్చిందా భావం.

యీదురు గాలి లేదు. మెరుపులు లేవు. వురుములు లేవు. వాన మాత్రమే కురుస్తోంది. అతని మనసులోని తుఫాన్‌కి వ్యతిరేకంగా వుంది బయట వాతావరణం. గత కొంతకాలం వరకు అఖిల్ మేడపై తన గదిలోని యీ నిలువెత్తు కిటికి దగ్గర నిల్చుంటే వూరి చుట్టూ

పరుచుకొన్న వూదారంగు కొండలు, వాటి వాలుల్లో తడితడిగా మెరుస్తోన్న శుభ్రమైన పచ్చదనం అతని కళ్లల్లో చిలకాకుపచ్చ జావళీలను తిరిగి తిరిగి పూయించేవి. యిప్పుడతని మనసంతా అలజడిగా వుంది. వాస్తవానికి దుఃఖంగా వుంది. యీ మేడ కంటే యేపుగా పెరిగిన మామిడిచెట్టు గుబుర్లలోని కోయిల యీ యేడాదికి యిక సెలవంటూ దిగులుగా పాడుతోంది. యే కొత్త స్నేహాన్ని విడవలేకో... లేక యీ స్నేహం లేకుండా ముందుముందు యెలా బతకాలనే భయంతోనో... సుధీర కోసం అతను ఆత్రుతగా యెదురు చూస్తున్నాడు. సుధీర వస్తానని చెప్పిన సమయం కంటే గంట ముందు నుంచే ఆమె కోసం యెదురుచూస్తున్న అఖిల్‌కి ఆ నల్లని తారురోడ్డుపై వో పాప, బాబు రంగురంగుల గొడుగు వేసుకొని ఆ వానలో నడుచుకొంటూ వెళుతూ కనిపించారు.

వానొస్తే చాలు వాకింగ్‌కి బయలుదేరేది సుధీర తన చిన్న తమ్ముడితో యిలానే రంగురంగుల గొడుగులో. తన యింటి దగ్గర ఆగి తనని రమ్మని పిలిచేది. వానలో వెళితే జలుబు చేస్తుందని అమ్మ పంపించేది కాదు. సుధీరతో వెళ్లాలని తనకి బలంగా అనిపించేది. వాన కోసం కాదు. సుధీర కోసం. సుధీరకి రాని జలుబు తనకి యెలా వస్తుంది అమ్మ చాదస్తం కాకపోతే. అమ్మ పంపించదని తెలిశాక వాన కురిసే ఛాయలు కనిపించ గానే యింట్లోంచి వెళ్లి సుధీర్ వచ్చే దారికాసేవాడిని. 'అఖిల్, అమ్మకి తెలీ కుండా వచ్చావా... అమ్మ దొంగా,' అని నవ్వేది. 'అమ్మకి జలుబొస్తుందని భయం. మీ అమ్మగారికి అలాంటి భయాలు లేవా,' అని అడిగితే, 'మా అమ్మమ్మ చెప్పిన మిరియాల చారన్నం చిట్కాని అమ్మ ఫాలో అవుతోంది,' అని నవ్వేది.

పెద్ద గొడుగులో ముగ్గురం నడుచుకొంటూ వెళ్లేవాళ్లం. అప్పుడప్పుడు ఆ చిన్న తమ్ముడు వచ్చేవాడు కాదు. "వాడికి వానలో నడవాలంటే యిష్టం వుండదు. యీ పెద్దక్కయ్యకి బుల్లి తమ్ముడి తోడు. అదొక్కట్టే కాదులే వానలో యెండలో చలిలో యిలా సర్వకాలాల్లో నడవటమంటే యేంటో, యెలా నడవాలో మాకు తెలియాలంటుంది అమ్మ. నాన్నగారి కేమో యిదంతా చాదస్తంగా కనిపిస్తుంది. మా తమ్ముళ్లి

ద్దరికి టీవీల్లో సినిమాలు చూడటం యిష్టం. నాకు ప్రేమకథల సినిమాలంటే చాలిష్టం అనుకో,'' అందోరోజు.

''యిలా నడవటమంటే,'' అడిగానో రోజు.

''చాలిష్టం. చీమలకంటే, నత్తల కంటే తాబేళ్ల కంటే మనం చూడు యెంత త్వరత్వరగా నడుస్తామో...''

''కాని మనం పక్షుల్లా యెగరలేం కదా,'' అన్నాను.

''అందుకే మనకి మనసిచ్చాడు దేముడు. యెక్కడికైనా యెగరొచ్చంటుంది అమ్మ. కాని పక్షులకి మనసు కూడా వుంది కదమ్మా అంటే, వుంది... తన పిల్లలకి రెక్కలొచ్చే వరకే... వుండాల్సిన దానికంటే యేది యెక్కువ వున్నా అనర్థమే అని పక్షి జీవన విధానం మనతో చెపుతోంది అంటుంది అమ్మ. యెలా అని అడిగితే అనుభవం మీద నీకే అర్థం అవుతుందంటుంది. అవన్నీ యేమో కానీ నాకీ వానలో నడవటమంటే యిష్టం. చూడు యీ ఆరుద్రల రంగు,'' అందోరోజు.

మరోరోజు యిద్దరం జోరున కురుస్తోన్న వానలో నడుస్తున్నాం. మా పాదాల సందుల్లోంచి పారుతోన్న మట్టిరంగు నీరు.

''యీ నీరేంటి. పోదాం పద యింటికి,'' అన్నాను.

''చక్కిలిగింతలుగా లేదూ,' అని అడిగింది.

అప్పటివరకు అలాంటి ఫీలింగ్ యేంలేదు. కాని చిత్రంగా తనా మాట అన్నాక చక్కిలిగింతగా అనిపించింది.

అలా కొంత దూరం వెళ్లాక వాననీటి ప్రవాహంలో కొట్టుకుపోతూ నల్లని నేరేడు పళ్ల సమూసం. 'కాళిదాసు కవిత్వంలా వుంది కదూ ,' అంది సుధీర.

నా కంటే రెండేళ్ల చిన్నది. వొకే వానని యిద్దరం చూస్తుంటాం. వొకే వానలో యిద్దరం తడుస్తుంటాం. కానీ తనకి ఆ వాన గిలిగింతలుగానూ, కాళిదాసు కవిత్వంలా తోస్తుంది. అవే ఆరుద్రలు, అవే సంపెంగలు. అవి నాకు వాటిలానే కనిపిస్తాయి. కానీ ఆమెకి అవి పొయిటిగ్గా అనిపిస్తాయి. అందంగా తోస్తాయి. ఆమె స్నేహంలో ఆమె యేం చెప్పినా అవి నాకు అలానే అనిపించటం, కనిపించటం. రోజురోజుకి ఆమె మనసుకి ఛాయలా తయారవుతోంది నా మనసు.

పదవతరగతి పరీక్షలు అవ్వగానే యింటర్మీడియట్‌లో సిటీలోని రెసిడెన్షియల్ కాలేజ్‌లో నన్ను జాయిన్ చేశారు మా నాన్నగారు. తరువాత యెంసెట్ యెంట్రన్స్. నాకొచ్చిన మార్కులకి మంచి కాలేజ్‌లో సీట్ వచ్చింది. కాలేజ్‌లో జాయినయ్యే ముందు వూరొచ్చాను. సుధీర కోసం వెళ్లాను. బంధువుల పెళ్లికి వూరెళ్లింది. కలవకుండానే కాలేజ్‌కి వెళ్లి పోయాను. అదో కొత్త ప్రపంచం. డేస్ ఆర్ ఫ్లయింగ్. రెండేళ్ల తరువాత వూరొచ్చాను.

ఆ సాయంకాలం తన కోసం యింటికి వెళ్ళితే జెండా యెగరేసే గ్రౌండ్‌లో వుందని వాళ్లమ్మగారు చెపితే అక్కడికి వెళ్ళేసరికి, అక్కడ వాళ్ల నాన్నగారు తనకి కారు డ్రైవింగ్ నేర్పిస్తున్నారు. పక్కనే యిద్దరు తమ్ముళ్లు.

" యెప్పుడొచ్చావ్," ఆ వేసవి సాయంకాలపు రశ్మిలో నవ్వుతోన్న ఆమె బుగ్గ సొట్టల్లో మెరుస్తోన్న ఆనందాశ్చర్యాలు.

"నిన్న."

"నీకు డ్రైవింగ్ వచ్చేసిందా అఖిల్. నాకు వచ్చేసినట్టే వుంది. కాని నాన్నగారు తను పక్కన లేకుండా వొక్కదానిని డ్రైవ్ చేయనివ్వటం లేదు. లైసెన్స్ కూడా లేదనుకో. పద్దెనిమిదేళ్లు యెప్పుడొస్తాయో," అంది నవ్వుతూ.

ఆమె యీ రెండేళ్లలో చాల పొడవైంది. యెప్పటిలానే మెరుస్తోన్న కళ్లు. పొడవైన ఆ రెండు జడలు మరింత పొడవుగా. జీన్స్‌పై ముదురాకు పచ్చ కుర్తీ.

"దా... నువ్వు కుర్చో. డ్రైవ్ చేస్తాను," అంది.

తనపక్కన వాళ్ల నాన్నగారు. వెనకసీట్‌లో నేను, ఆమె తమ్ముళ్లు కుర్చున్నాం. బానే డ్రైవ్ చేసింది. యీ మాత్రం డ్రైవింగ్ రాకుండానే సిటీలో అమ్మాయిలు, అబ్బాయిలు మెయిన్ రోడ్లపైనే డ్రైవ్ చేసేస్తుంటారు. తమ కార్లకి యెదుటి వాళ్ల కార్లకి సొట్టలు పెట్టేస్తుంటారు. సుధీరకి తన నాన్న గారు పర్మిషన్ యిచ్చేవరకు తను వొక్కర్తి మెయిన్ రోడ్డు మీదకి డ్రైవింగ్‌కి వెళ్లదని తెలుసు. అంతలా యెలా డిసిప్లీన్‌గా వుంటుందో. నాకైనా, నా తతిమా ఫ్రెండ్స్‌కైనా రూల్స్ బ్రేక్ చేయటమంటే యిష్టం.

తరువాత రోజు సాయంకాలం యిద్దరం అమ్మవారి గుడికి వెళ్లాం. అమ్మవారి సౌందర్యాన్ని చూసి ముచ్చటపడుతూ, 'మన వూరి అమ్మవారు యెంత సౌందర్యవంతురాలో కదా,' అంది. అలా విషయాలని చెప్పటం లో యేం మారలేదీ సుధీర అనుకొన్నాను. అక్కడ నుంచి కోనేరుగట్టుకి వెళ్లాం. కాలేజ్ కబుర్లు. యింటర్మీడియట్ తరువాత తనకి మాస్ కమ్ చెయ్యాలని వుందంది. ఆ వేసవంతా వీలైనప్పుడు కలుస్తున్నాం. ఆరోజు వాళ్ల యింటికి వెళ్లేసరికి యింట్లో వాళ్లంతా శిఖరాగ్ర సమావేశంలో వున్నట్టున్నారు. నన్ను చూసి వాళ్ల అమ్మగారు, "నువ్వేనా చెప్పు... జర్నలిస్ట్ వుద్యోగాలు బానే వుంటాయి. కాని పెళ్లిళ్లు కష్టం కదా. ఆ టైమింగ్స్‌తో అడ్జస్ట్ అయి యెవరు చేసుకొంటారు చెప్పు. పైగా మామూలు జర్నలిస్ట్ కాదంటా... యిన్విరాన్ మెంట్ జర్నలిస్ట్ అవుతుందంట. యెంచక్కా సైన్స్ మెయిన్ సబ్జెక్ట్‌గా చదివి యూపియస్ యెగ్జామ్స్ రాయమంటున్నాను," అన్నారు ఆంటీ.

తనవైపు చూశాను. తననే సపోర్ట్ చేయమని బతిమాల్తోంది. లేకపోతే పీక పిసికేస్తానని సైగలు చేస్తోంది. ఆమెకి భయపడి ఆమెనే సపోర్ట్ చేశాను.

"యేంటి అంతలా సపోర్ట్ చేస్తున్నావ్. అలాంటి వేళాపాళాలేని వుద్యోగాలు చేసే అమ్మాయిని నువ్వు పెళ్లి చేసుకొంటావా," అడిగారు ఆంటీ.

వొక్కక్షణం మనస్సు ఆలోచించింది. సుధీరైతే... తనకు వోకె. కాని ఆ విషయం యెలా అందరిముందు చెపుతాను. మౌనంగా వుండి పోయాను.

" చూశావా... తనదాక వస్తేకానీ యెవ్వరు ప్రాక్టికల్‌గా మాటాడరు. యిప్పుడు చెప్పు తనకి జర్నలిజం వద్దు కదా," వుత్సాహంగా అడిగారు ఆంటీ.

" బాప్‌రే ఆంటీ నన్ను యిన్వాల్ చేయకండి," నవ్వుతూ చెప్పాను.

అప్పటికి ఆ డిస్కషన్ ఆగింది కానీ తరువాత సుధీర తను అను కొన్న సబ్జెక్ట్‌తో పొరుగూరి కాలేజ్‌లో చేరింది.

యింజినీరింగ్ అయ్యాక యం.బి.యే చదవటానికి అహ్మదాబాద్ వెళ్లిపోయాను. అనేక రాష్ట్రాల నుంచి చదువులకి వచ్చిన అమ్మాయిలు, అబ్బాయిలు వుండేవారు. యెప్పుడు యెక్కడ మొదలయిందో సరిగ్గా చెప్పలేను కాని యే పోటీలోనైనా నెంబర్ వన్‌గా నిలబడాలనే తృష్ణ నా రక్తంలో భాగమైయింది.

చదువు, ఫన్ జీవితం జెట్‌స్పీడ్‌లో పరుగులిడుతోంది. యం.బి.యే అవ్వగానే, యు.యస్.లో మాస్టర్స్ చేసే అవకాశం వచ్చింది. పవర్‌ఫుల్ పర్సన్‌గా యెదగాలనే ఆకాంక్ష ప్రతిక్షణం నన్ను యెలర్ట్‌గా మేధోజ్ఞానం వైపు పరుగులెత్తించేది.

యెలా పవర్‌ఫుల్ పర్సన్ అవ్వాలనే పుస్తకం చదువుతుంటే భలే నవ్వొచ్చేది. అలా యెలా అవుతారు. తపస్సులా అన్నిరకాల జ్ఞానాన్ని నింపుకోవటం చాల ముఖ్యమనిపించేది. కాని డబ్బులని చీప్‌గా సంపాదించటంపై ఆసక్తి వుండేదికాదు. చాలా క్విక్‌గా సంపాదించాలనీ వుండేది కాదు. యీ ప్రపంచాన్ని అపారమైన తెలివితేటలతో డిగ్నిఫైడ్‌గా గుప్పిట్లోకి తెచ్చుకోవాలని వుండేది. వుద్యోగం వెతుక్కుంటూ వచ్చింది. సంస్థని నెంబర్ వన్‌లో పెట్టాలనే ధ్యేయంతో నిరంతరం యెక్కే ఫ్లైట్ దిగే ఫ్లైట్ నడుమ విజయం యెప్పుడు నా జీవనమైందో కూడా తరచి తరచి వెతుక్కున్నా గుర్తురావటం లేదు.

అక్క పెళ్లికి యింటికి వెళ్లాలని బయలుదేరుతోంటే అప్పుడు గుర్తొచ్చింది సుధీర. చాలాకాలం అయింది తనని చూసి. చిత్రంగా తామిద్దరు యే సోషల్ నెట్‌వర్క్ సైట్ నుంచి కనెక్ట్ కాలేదు. యీ మెయిల్ ఐడిస్ షేర్ చేసుకోలేదు. యిన్నేళ్లలో తనకి ఆమె గుర్తొచ్చిన సందర్భాలున్నాయా... యేమో... వాళ్లింటికి వెళ్లేసరికి సుధీర యింట్లో తమ్ముళ్లతో కేరమ్స్ ఆడుతోంది. రెడ్ కాయిన్ వేసే హడావిడిలో వున్నారంతా. 'నేనే వేశాను. నాదే,' అని తమ్ముళ్లతో పోట్లాడుతోన్న సుధీర నన్ను చూసి ఆశ్చర్యంతో కళ్లింత చేసుకొని, "అరే అఖిల్, యెన్నాళ్లకి. డిస్సపియర్ అయిపోయావ్. అయినా నీ విశేషాలన్నీ ఆంటీ, అంకుల్, మీ అక్కయ్య చెపుతుంటారు. అందుకే నువ్వు యిక్కడున్నట్టే అనిపిస్తావ్. యిప్పుడు కాలేజ్‌కి సెలవలు. లేకపోతే కలిసేవాళ్లం కాదు," చిరునవ్వుతో అంది.

నవ్వాను. నేనలా సుధీర విషయాలు యెందుకు తెలుసుకోవటం లేదో... అనుకొన్నాను.

"దా... నా బదులు నువ్వు కారెమ్స్ ఆడు," అంది.

"నాలుగో మనిషి లేరని యిందాకట్నుంచి నన్నిక్కడ కట్టేశారు. నువ్వు నా ప్లేస్‌లోకి రా. నే కాఫీ తీసుకొస్తాను అందరికి," అని ఆంటీ తన ప్లేస్ ఖాళీ చేశారు.

సుధీర, వాళ్ల చిన్న తమ్ముడు వొక టీమ్. తన పెద్ద తమ్ముడు, నేను వొక టీమ్. అసలు క్యారమ్స్ ఆడి యెన్నాళ్లయింది. స్ట్రయికర్‌ని కొట్టటానికి వేళ్లు కదలట్లేదు. గురి కుదరట్లేదు.

"ఆట బాగా ఆడతావనుకొన్నాను. యిలాగైతే మేం వోడిపోవటమే," నవ్వుతూ అన్నా సుధీర పెద్ద తమ్ముడి స్వరంలో నిరాశ స్పష్టంగా కనిపిస్తోంది.

సుధీర మందలింపుగా తమ్ముడి వైపు చూసింది. అప్పట్నుంచి సుధీర తను కొట్టగలిగే క్వాయిన్స్‌ని కూడా అలా అలా వదిలేసేది.

"నీ డ్రైవింగ్ యెలా వుంది," అసందర్భంగా అడిగాను గతం గుర్తొచ్చి.

ఆంటీ యిచ్చిన కాఫీ తాగాక కోవెలకి కారులో తీసుకువెళతానంది సుధీర. తమ్ముళ్లిద్దరు రామన్నారు.

వాళ్ల నాన్నగారిని అడిగి కారు కీస్ తెచ్చుకొంది. అప్పటికీ యిప్పటికీ సుధీర డిసిప్లీన్‌లో యెలాంటి మార్పులేదు. చాలా చక్కగా డ్రైవ్ చేస్తోందామె.

"అందమైన నిండు చందమామ మరికాసేపట్లో విరబూయటానికి భలే తయ్యారై వున్నాడు పొద్దు యెప్పుడు వాల్తుందా అని," అంది డ్రైవ్ చేస్తూ.

"స్కిల్‌ఫుల్ ప్రొఫెషనల్ డ్రైవింగ్ నీది," చెప్పాను.

"అంతా నాన్నగారి తర్ఫీదు. అప్పట్లో నాన్నగారు వెంటనే రోడ్ల మీద డ్రైవింగ్ చెయ్యొద్దంటే చాల అలిగేదాన్ని. కాని యిప్పుడు నా డ్రైవింగ్ చూస్తే నాకే ముచ్చటేస్తుంది. ఐ యామ్ వెరి ధ్యాంక్‌ఫుల్ టు హిమ్," అంది.

యెవరైనా కవిత్వాన్ని రాస్తారు... కాని సుధీర మాట్లాడటమే కవిత్వంలా వుంటుంది. యిలా అందంగా కవితాత్మకంగా మాట్లాడేవాళ్లు నా యెరుకలో  సుధీర తప్ప మరొకరు లేరు.

"నీ చదువు యెలాగుంది," అడిగాను.

"బాగుంది. నీ ప్రొఫెషన్ యెలా వుంది," అడిగింది .

"చాలా బాగుంది. మనలని కలలు కనమంటారు కదా... నాకో కల వుంది. వీలైనంత త్వరలో ప్రపంచంలోనే అత్యంత సక్సెస్‌ఫుల్ బిజినెస్ టైకూన్‌గా నాపై కవర్‌స్టోరీ  టైమ్స్ మ్యాగజైన్‌లో చూసుకోవాలనుంది," అన్నాను.

"వో... రియల్లీ... నీ కల నిజం కావాలి," అంది.

కారు కోవెల ముందు ఆగింది .

యిద్దరం అమ్మవారిని దర్శించుకొని వచ్చి కోవెల ప్రాంగణంలో కూర్చున్నాం. నిండు జాబిల్లి వెన్నెల.

"ఆ బిజీ జీవితం నుంచి యిక్కడికి వచ్చినప్పుడంతా యిలాంటి వో చిన్న వూరు నుంచి వచ్చిన వో కుర్రాడు ప్రపంచంలోని గొప్పగొప్ప దేశాల ఫైనాన్షియల్ మేటర్స్‌కి సంబంధించిన వో కీలకమైన పోస్ట్‌లో వుంటాడని అసలు యెవరైనా అనుకొని వుంటారా... స్ట్రేంజ్..." అన్నాను.

ఆమె నవ్వి, "గొప్పగొప్పవాళ్ల రూట్స్ పొదరిల్లులాంటి వూళ్ల నుంచే వుంటాయనుకొంటాను. నువ్వు కోరుకొన్న స్థాయికి  నువ్వు చేరుకోవటం నీకు సంతోషంగా వుండటం నాకూ సంతోషంగానే వుంది," అని ఆగి, "వొక్కోసారి సంతోషం కూడా వ్యసనంగా మారిపోతుంటుంది. మనము లాంటి స్థితిలో లేకపోవటమూ బాగుంది," అంది.

గతకాలంలో తనకి సుధీరకి నడుమ జరిగిన సన్నివేశాలని, సంభాషణని డిస్టర్బ్ చేస్తూ చిన్న చప్పుడు.

తల తిప్పి చూశాను.

ట్రేలో కాఫీ కప్పుతో పనతను. టేబుల్‌పై వుంచి వెళ్లిపోయాడు.

వాల్‌క్లాక్ వైపు చూశాను. సమయం యింత నిదానంగా నడుస్తుం దేంటి. యిలా వొక వ్యక్తి కోసం యెదురుచూసి యెంత కాలం అయ్యింది. యేమో గుర్తేలేదు. సమయమంటే వుత్పాదన. సమయమంటే సంపద.

నిమిషాలని రూపాయి మారకం విలువగానే చూసిన వ్యక్తి, రిలాక్స్ అవ్వటంలోనూ లెక్కలు కట్టటం, అంచనా వేయటంలో కూరుకుపోయిన మనిషికి కాలం యెలా వేళ్ల సందుల్లోంచి జారిపోయిందో తెలియని వ్యక్తికి, యిప్పుడు ముమ్ముందు జీవితంలో సమయం గడవనితనమే కాదు సమయమే భారమైన కాలమొకటి వస్తుందని అస్సలూహించలేదు. సుధీర కోసం యెదురుచూస్తుంటే సుధీరతో కలసి గడిపిన కాలమే కళ్ల ముందు కదలాడుతోంది.

యింట్లోవాళ్లు పెళ్లి విషయం అడుగుతున్నారు. పెళ్లి... తనకి యెలాంటి జీవన సహచరి కావాలి... చాలా చిత్రంగా తనకే తెలీలేదు తనకెలాంటి అమ్మాయి కావాలో... యింట్లో వాళ్లకే వదిలేస్తే... వాళ్లు కొన్ని సంబంధాలని తెచ్చారు. నిజం చెప్పొద్దు నేను తిరుగుతున్న సర్కిల్‌కి ఆ అమ్మాయిలు యే రకంగాను అందం, చదువు, య్యాటిట్యూడ్, స్టేటస్-యెందులోను సరిపోరు. అలా సంబంధాలు చూస్తున్న సమయంలో ఆఫీస్ సెమినార్‌కి గోవా వెళ్లినప్పుడు తలవని తలంపుగా సుధీర హోటల్ లాంజ్‌లో కనిపించింది. తను పనిచేస్తున్న టీవీఛానల్‌కి గోవా వాతా వరణం మీద స్టోరీ చేయటానికి వచ్చింది. ఆ సాయంకాలం బిజినెస్ డిన్నర్ అయ్యాక సుధీరకి కాల్ చేసి బయటకి వెళదామని అడిగాను. వస్తానంది

నా జ్ఞాపకాలని ఫోన్ రింగ్‌టోన్ డిస్టర్బ్ చేసింది. లాయర్ నుంచి కాల్. యీ కాల్ మాట్లాడటం అవ్వక ముందే సుధీర వచ్చేస్తే...

◆ ◆ ◆

'యింకా యెంత సమయం పడుతుందో అఖిల్ దగ్గరకి చేరుకో టానికి,' అనుకొంటూ కారు ముందున్న వాచ్‌లో టైమ్ చూసింది సుధీర. యింక కొంత టైమ్ పడుతుంది. ఆరోజు గోవాలో డిన్నర్ తరువాత అఖిల్ కలుద్దామన్నప్పుడు ఆ టైమ్ వరకు యెదురు చూసినప్పుడు సమయం కదలని ఫీలింగ్ లేదు. ఆమె మనసు కేన్వాస్ పైకి ఆ రాత్రి రంగులని వెదజల్లిందీ వేళ.

వెళ్లాను ఆ రాత్రి అఖిల్ దగ్గరకి. యిద్దరం సముద్రపు వొడ్డుకి వెళ్లాం. యిలానే లలితలలితంగా కురుస్తోన్న వానజల్లు .

నక్షత్రాల ఆకాశం కింద సముద్రపు అలలపై మెరుస్తోన్న ఓడల తారకలని చూస్తున్నాం. అతనివైపు తిరిగి చూస్తూ, ''యీ నా పక్కన కూడా రెండు తారకలున్నాయి,'' అన్నాను.

''యేవీ,'' అడిగాడతను.

నా కుడిచేతి వేలికొసతో అతని కళ్లపై యెడమ వైపు నుంచి కుడి వైపుకి మృదువుగా స్పర్శించాను.

◆ ◆ ◆

అఖిల్ ఫోన్ మాటాడటం అయిపోయింది. తిరిగి అతనిని జ్ఞాపకాలు అల్లుకున్నాయి. ఆరోజు రాత్రి నా కళ్లమీద యెలాంటి మృదుత్వం వాలింది.

నెమలీక మృదుత్వం. మనసు మిలమిలలాడింది. సుధీర చేతిని చేతుల్లోకి తీసుకొన్నాను. రాత్రి సముద్రపు గాలి అల్లరికి ఆమె వొత్తైన జుట్టు ముసురుమేఘంలా నా చెంపలని, భుజాలని కమ్ముకొంది. మనసు శరీరం యేకమై యీ చిరపరిచిత సుధీర అపరిచితంగా తోస్తోంది కొత్తగా. ఆమెని అత్యంత మెల్లగా దగ్గరకి తీసుకొన్నాను. చాలా చిన్నిముద్దు పెట్టింది చెవి పక్కగా. మోహపుష్పాభిషేకం మనశ్శరీరాలపై.

వొకరికివొకరం దగ్గరగా... జీవనమంత ప్రేమగా మేమలాగే వున్నాం. మేమిద్దరం కలిసి ఆనాటి సూర్యోదయాన్ని, పక్షులు యెగరటాన్ని, పువ్వులు విచ్చుకోటాన్ని, అలపై కదిలిన పడవని కలిసి చూశాం.

తరువాత మేం మా మా పనులకి వెళ్లిపోయాం.

చిత్రంగా నేను నా పనిలో మునిగిపోయాను. సాయంకాలం ఫ్లైట్‌కి తిరిగి ఢిల్లీ బయలుదేరేసరికి నా మొబైల్లో సుధీరవి మూడు మిస్డ్ కాల్స్ వున్నాయి. ఢిల్లీ వెళ్లాక మాటాడదాంలే అనుకొన్నాను. అక్కడ బిజీనే.

మధ్యమధ్యలో సుధీర మిస్డ్ కాల్స్ కనిపిస్తున్నాయి.

వోరోజు రాత్రి సుధీరకి ఫోన్ చేసాను.

ఆమె స్వరం, ''హలో...'' అని ఆగి వెంటనే, ''నేను అలిగాను. యెన్ని సార్లు చేశాను,'' అని నవ్వింది. ఫ్లైట్ యెక్కగానే శరీరాన్ని పలకరించే చిరు చల్లదనం .

“మరిప్పుడు మాటడటం యెలా... అలకలో వుంటే... అలక తగ్గాక చెప్పు,” అన్నాను.

ఆమె నవ్వి, “అలకా యెక్కడా... నువ్వు మాటాడగానే పారిపో యిందిగా . చూడు నీ పక్కన కూర్చుని వుంటుంది,” అని నవ్వింది .

“యు.యెస్.కి రా. మంచు కురుస్తోంది. నీకిష్టంగా,” అన్నాను.

ఆమె నవ్వి, “యిప్పట్లో రాలేను. నెక్స్ట్ వెకేషన్‌కి. నువ్వెప్పుడొ స్తున్నావ్ యిండియాకి,” అడిగింది.

“ప్రస్తుతం యస్.యీ.జెడ్స్‌కి మంచి బూమ్ కదా. అవేకాకుండా చాల ప్రోజెక్ట్స్ వున్నాయి. మా ఫోకస్ రెండు స్టేట్స్ పై వుంది. యే.పి. అండ్ గుజరాత్. సో... యిండియాకి రావాలి. మరి యెక్కువసార్లు ఫిజికల్ యెపీరెన్స్ కూడా అవసరంలేదు. కమ్యూనికేషన్ సిస్టమ్ యెంత పెరిగింది. నువ్వు యెప్పుడొస్తావో చెప్పు. ఆ టైమ్‌లో నా డైరి యెలా వుందో చూసు కోవాలి. ప్లాన్ చేద్దాం,” అన్నాను.

“స్ట్రేంజ్ అఖిల్. నువ్వేమో వాటికి యెలా ఫండ్ చెయ్యాలో, యెలా యిన్‌డివిడ్యూల్ గ్రో అవ్వాలో అన్నదానికి పని చేస్తుంటావ్. నేనేమో యీ ప్రాజెక్ట్స్ ప్రకృతిలో యెలాంటి విధ్వంసాన్ని క్రియేట్ చేస్తున్నాయో, అక్కడి ప్రజలని యెలా నిరాశ్రయుల్ని చేస్తున్నాయో స్టోరీస్ చేస్తాను. వొక సరియైన స్టడీ లేకుండా అడ్డగోలుగా సాగుతోన్న భూముల పందేరాన్ని నేను అంటావ్. మనం మన పనులకి వెళ్లినప్పుడు అక్కడ అనుకోకుండానో, అనుకొనో మనమిద్దరం కలిసినప్పుడు చెర్రీ బ్లోసమ్‌లా విరబూస్తాం... రియల్లీ స్ట్రేంజ్,” అంది సుధీర .

చాలా చిత్రంగా నేనంతవరకు మా పనిలో వుండే వైరుధ్యాన్ని గమనించనే లేదు. అసలు అలాంటి ఆలోచనే రాలేదు. సుధీర కూడా చాలామందిలా పాత అభివృద్ధి ఆలోచనల్లో కొనసాగటం కంట్లో నలుసు పడినట్టు అనిపించింది.

‘సుధీరా, నీది ప్రెజెంట్ జనరేషన్ థింకింగ్ కాదు. గ్రో సుధీర... ప్రపంచం ఐ బ్లింక్ చేసేంత వేగంగా మారిపోతుంది. చైనాలో చూడు యస్.యీ.జెడ్స్ వలన దాదాపు మూడు లక్షల వుద్యోగాలు వచ్చాయి. అసలిప్పుడు ప్రొడక్షన్ డిజైనింగే మారిపోయింది. కన్స్యూమర్ టేస్ట్ చాలా

ఫాస్ట్‌గా  మారిపోతుంటే యెప్పటికప్పుడు చిన్నచిన్న మార్పులు చేసుకొనేలా మిషనరీ డిజైన్ కూడా మారిపోయింది. యివన్నీ నీకు తెలుసు కదా. యింక వాతావరణం పరిరక్షణంటావా మినిస్ట్రీ కియరెన్స్‌లని జాగ్రత్తగానే యిస్తుంది కదా. నిజానికి నువ్వు యీ ప్రాజెక్ట్ లేదా యీ యెస్.యీ.జెడ్స్ తీసుకొచ్చే అభివృద్ధిపై సక్సెస్ స్టోరీస్ చేస్తే ప్రజలకి మేలు జరుగుతుంది. వాళ్లకి యెంప్లాయిమెంట్ వస్తుంది. యీ హై సర్కిల్స్‌లో నీ ప్రెజెన్స్ పాజిటివ్‌గా వుంటుంది. నువ్వా మిడిల్‌క్లాస్ థాట్ ప్రోసెస్‌ని కాస్త వదిలిం చేసుకో సుధీరా,' అని నవ్వుతూ చెప్పేస్తే...

అప్పుడు, 'యిదంతా నువ్వు నమ్మే మాటాడుతున్నావా,' అని ఆమె తిరిగి అడిగితే...

నా ఆ ఆలోచనకే ఆమె మెల్లమెల్లగా ఫారిన్ బాడీ సెన్సేషన్‌లా నా మనసులో మెదలసాగింది.

ఆపై మా యిద్దరి మధ్యా సంభాషణని నేను పెరగనివ్వలేదు.

ఆ తరువాత నాకొస్తున్న సంబంధాలని ప్రపోజల్స్‌ని సీరియస్‌గా చూసి జాగ్రత్తగా నా గ్రోత్‌ని కాంప్లిమెంట్ చేయగలిగే సునయనని యెంచుకొన్నాను. తను నా పనిని ప్రశ్నించదనిపించింది. భర్తగా నా నుంచి తనకి వచ్చే సెలబ్రిటి స్టేటస్‌ని చాలా యెంజాయ్‌ చేస్తుందనిపించింది. సునయన చాల చొరవగలది. మనుషులని యిట్టే ఆకర్షించగల నేర్పు, చాకచక్యం వున్నాయి. ఆమె తండ్రి నేనున్న రంగంలోనే వుండటం వల్ల ఆమె ఫ్యామిలి కూడా నా గ్రోత్‌కి ప్లస్ అవుతారనిపించింది.

పెళ్లికి సుధీరని రమ్మని పిలవలేక పిలవలేక పిలిచాను ఫోన్‌లో.

సుధీర మనసులో యేమనుకొందో యేమో తెలీదు కాని పెళ్లికి వచ్చింది. ఆమెని పెళ్లికి వచ్చిన అనేకమంది తెలిసిన అతిథుల్లో వొక అతిథి లానే ట్రీట్ చేశాను .

అంతే ఆ తరువాత మెల్లమెల్లగా వొకే వూరివాళ్లం స్థాయికే ఆమె మనసులో నిలిచిపోయింది. కానీ  మృదువైన వాన లాంటి ఆమె ముద్దు నా మనసులో తనువులో స్థిరంగా నిలిచిపోయింది. ఆ చిన్ననాటి స్నేహం తొలకరి జల్లులా నన్ను అంటిపెట్టుకొనే వుంది.

నన్ను అరెస్ట్ చేయటం అనివార్యమనే విషయం ప్రతిరోజు ఫైనాన్షియల్ వర్గాల్లో బాగానే అర్థమయింది. పేపర్స్‌లో న్యూస్ స్పెక్‌లేట్ అవుతునే వుంది.

సరిగ్గా అలాంటి సమయంలో సుధీర ఫోన్ చేసింది. కలుస్తానని అడిగింది. అసలు యిలాంటి వార్తలు రావటానికి ముందే చాలా దగ్గర సర్కిల్స్‌లో నామీద వినిపిస్తున్న వొక ప్రధాన అభియోగాన్ని బాగానే మాటాడుకొన్నారు. వెంటనే అంతా దూరం జరగటం మొదలుపెట్టారు. అలా డిస్ససోసియేట్ కావటం సర్వసాధారణం. యెప్పుడూ మోగుతుండే ఫోన్ నిశ్శబ్దంలోకి నెట్టివేయబడింది. యింటికి వచ్చేవాళ్లు తగ్గిపోయారు. ప్రతినెలా నా స్థాయిలో వుండే వివిధ రంగాల్లోని ప్రముఖులంతా కలిసి చేసుకొనే కిట్టీ పార్టీకి పిలుపులేదీసారి. యెప్పుడూ ఫోన్ చేసేవారు, పార్టీలు, విదేశీయాత్రలని కలిసి చేసే స్త్రీల బృందంలో వారెవ్వరు ఫోన్ చేయటం లేదు సునయనాకి. సడన్‌గా వో వెలి మా కుటుంబాన్ని చుట్టుముట్టినట్టుంది.

పేరు ప్రఖ్యాతలతో తులతూగే సమయంలో నా యే గ్లోరీలోనూ నాతో యెప్పుడు ఐడెంటిఫై కాని సుధీర యిప్పుడు వస్తానంది. ఆమె వస్తానన్నప్పుడు హృదయంలో జూకా సవ్వడి. అప్పటికే నేను యీ వూరికి వచ్చేశాను. యిక్కడికే వస్తానంది.

సునయనకి సుధీర వస్తున్న విషయం చెప్పాను. ఆమెకి సుధీరతో స్నేహాన్ని పెళ్లైన మొదట్లోనే చెప్పాను.

అప్పుడు సునయన అంది, "ఐ యామ్ జెలస్."

యెందుకని అడిగాను.

"సుధీర గురించి నువ్వు చెపుతున్నప్పుడు నీ రెండు కళ్లు పట్టనంత మిలమిల. నా విషయంలో నేనెప్పుడు అలాంటి బ్రైట్‌నెస్‌ని చూడలేదు," అంది నవ్వుతూ.

"యిప్పుడు సుధీర యెందుకొస్తోందంటావ్, నీ జీవితంలో యిలాంటి క్రైసిస్ వచ్చిందని సానుభూతి చూపించడానికంటావా, వేల్యూ జడ్జిమెంట్ చేస్తుందేమో," అంది సునయన .

"డోంట్ వర్రీ... ఆమె సుధీర. నా బాల్యమిత్రురాలు," అన్నాను.

తలుపుపై చేతి వేళ్లతో తట్టిన సవ్వడి నా గతకాలపు ఆలోచనలని బ్రేక్ చేస్తూ.

మెల్లగా తెరుచుకొన్న తలుపు. కుర్రాడు.

వెనకే సుధీర.

కుర్రాడు వెళ్లిపోయాడు.

చప్పున దగ్గరకి వెళ్లాడు అఖిల్. యిద్దరు వొకరినొకరు హగ్ చేసుకొన్నారు స్నేహంగా.

'అదే పరిమళం... అవే చూపులు... అదే చిరునవ్వు... అవును సుధీర... నా స్నేహితురాలు,' వుద్వేగంగా అనుకొన్నాడు అఖిల్.

'యితనేనా అఖిల్... వెలిగిపోతున్న చోటు కళ్లల్లో చాలక చెంపలపైకి వుత్సాహపు కాంతితో ధగధగలాడే అఖిల్ యితనేనా... యెంతలా కృంగిపోయాడు,' అనుకుందామె.

అతను యిందాక నిలబడిన కిటికీ దగ్గరకి వెళ్లి ఆమె బయటకి చూస్తోంది. అతనొచ్చి ఆమె వెనక నిల్చున్నాడు. పసితనం జ్ఞాపకాల జల్లయ్ ఆమె వెనక్కి తిరిగి నవ్వింది. అతను ఆమె యెడమ కనుబొమ్మ చివర్న ముద్దు పెట్టాడు. ఆమె చిరునవ్వుతో తిరిగి బయటకి చూస్తోంది. అతను నవ్వుతూ ఆమె భుజాల మీద నుంచి మెడ చుట్టూ కుడిచేతిని వేసి ఆమెతో కలిసి బయటకి చూస్తున్నాడు.

"మన చిన్నప్పటిలా కురుస్తుందే వాన," అంది.

"అవును. అలాగే వున్నట్టనిపిస్తోంది వుదయం నుంచి," అన్నాడు.

"అసలు యేమయింది అఖిల్," అడిగింది సుధీర.

అతను ఆమె నుంచి కాస్త విడివడి వెళ్లి సోఫాలో కూర్చున్నాడు.

ఆమె కూడా వచ్చి అతని యెదురుగా కూర్చుంది.

"నీకు తెలుసు కద సుధీరా... గత కొన్నేళ్లుగా పని జరిగే తీరు యెలా మారిపోయిందో. తొందరతొందరగా పనులు జరగాలి. లేకపోతే ప్రాజెక్ట్స్ ఆగిపోతాయి. అందుకని తొందరతొందరగా నిర్ణయాలు తీసుకోవాలి. లేకపోతే యిన్వెస్ట్‌మెంట్ వొకచోట నుంచి మరో చోటకి వెళ్లిపోతుందనే ఆదుర్దా వుంటుందందరిలో. అది వెళ్లిపోతుంది కూడా. ఫ్లెక్సిబుల్‌గా వుండాలి. డ్రెమెక్రటిగ్గా వుండాలి. అకౌంటబుల్‌గా వుండాలి.

యివన్నీ సరిగ్గా వున్నాయో లేదో చూసుకోవాలంటే బ్యూరోక్రసీ పెరుగుతుంది. నిర్ణయాలు తీసుకోవటం ఆలశ్యం అవుతోంది. అందుకని మొత్తం బ్యూరోక్రసీని కట్ చేసి పేరున్నవాళ్లు ముగ్గురో నలుగురో నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయిం చేక తీసుకొనే నిర్ణయాలలో ట్రాన్స్‌పర్సీ యెంతో తెలీదు. యిలా నిర్ణయాలు తీసుకొంటున్నప్పుడు డబ్బుల సూట్‌కేసులు మారుతుంటాయి. లేదా మరో ఫామ్‌లోనో జరుగుతుంది. ప్రోత్సాహం అనివార్యమవుతోంది. చాలా సార్లు క్విడ్‌ప్రోకో జరుగుతుంటుంది. అసలు ఆ నిర్ణయం సరియైనదా కాదాని కూడా స్పష్టంగా తెలీటంలేదప్పుడు. యేదో కొంత తేడా తెలుస్తుం టుంది కాని అంత ఆలోచించే సమయం వుండదు. క్విక్... క్విక్... అంటూ తలంతా తొందర నిండిపోయుంటుంది. పరిస్థితులు మారతాయి. వొక్కో సారి మంచి చేద్దాం అనుకొంటాం. వొక్కో సారి మోసం చేయొచ్చు. వొక్కోసారి పెద్ద దొంగతనం చేస్తున్నామని వుండకపోవచ్చు. పని చేద్దామనే మొదలుపెట్టొచ్చు. యీ నిర్ణయాలు తీసుకోడానికి ముందు చట్టాల్లో కూడా పెద్ద మార్పులు చేసేంత సమయం వుండకపోవచ్చు. చేసినా అదేమంత సపోర్టివ్‌గా వుండక పోవచ్చు. తీసుకొన్న నిర్ణయాల వలన వేలాదిమంది నిరాశ్రయులవు తారనుకో, జీవితాలు తలకిందులవుతాయనుకో, వారంతా వొక్కసారి ప్రశ్నిస్తారు. మొత్తం కూలిపోతుంది. కూలే వరకు ఫ్లెక్సిబులిటి యెంత భారంగా మారిపోయిందో అర్థంకాదు. యెర్రర్ ఆఫ్ జడ్జిమెంట్ యెక్కడ జరిగిందో, అసలు యీ మొత్తంలో రిస్క్ యెంతుందో అర్థంకాదు. అసలు వొక ప్రోజెక్ట్ లేదా యేదో వొక పెట్టుబడికి సంబంధించిన వొక నిర్ణయం తీసుకొన్నప్పుడు యీ మొత్తాన్ని జాగ్రత్తగా యివాల్యూయేట్ చేసే ప్రోసెస్, పద్ధతి లేకుండా పోయినప్పుడు, వొక్కసారిగా పరిస్థితులు మారిపోయినప్పుడు యెవరి నిర్ణయాలకి యెవరు దోషులుగా నిలబడుతున్నారు. వో ముగ్గురినో నలుగురినో దొంగలని యీ మొత్తానికి బాధ్యులని చేసేస్తే యేం మాటాడాలో తెలీదు. అసలు యేదోవొక ఫ్రేమ్‌వర్క్‌లో పెద్ద మొత్తంలోనో, చిన్నచిన్న మొత్తాల్లోనో క్విక్‌గా డబ్బులు చేసుకోడానికి అవకాశాలు వస్తున్నాయి. వందో వెయ్యో కోట్లు అంటారనుకో ఆ మొత్తం పెద్దదో చిన్నదో అర్థం కాదోసారి. లోకల్ గ్లోబల్ కలగలిసిపోయాక అసలు యీ

మొత్తం చక్రంలో యెలా యిరుక్కుంటున్నామో లేదా యెలాంటి తప్పులు చేస్తున్నాం తెలిసీ  తెలియకుండా,'' అని ఆగాడు.

``అసలు యిందులోకి నువ్వెలా వచ్చావ్.''

``యిక్కడ పరిస్థితులు, విషయాలు తెలుసని నన్నిక్కడికి పంపించారు. యిన్వెస్ట్‌మెంట్‌ని మేమే యెక్కువగా పెట్టాలనే ఆదుర్దా, పందేరంలో ముందుండాలన్న పరుగు. అంతే,'' అన్నాడు.

ఆమె కాస్త ఆగి, ``యిప్పుడు వాళ్లంతా అంటున్న పనులన్నీ నువ్వు చేశావా...'' అడిగింది మెల్లగా .

అతను నవ్వాడు నిర్లిప్తంగా. కాసేపు ఆగి, ``అస్సలు నా యిన్‌వాల్వ్‌మెంట్ లేదని అనలేను. కాని ఆ పనులు అప్పుడు చేసినప్పుడంతా వాటి వలన కనిపించిన అభివృద్ధి, ఫైనాషియల్ వరల్డ్‌లో నేనో లెజెండ్‌ని. త్వర త్వరగా పైకి యెదిగిన నేను అంతే వేగంగా కిందకి తోసేయబడ్డాను. అసలు చేస్తుంది అన్యాయం అనుకొంటే యెవ్వరు యేం చేయలేరనుకొంటాను . అంతా వొక డినైల్ మోడ్‌లో బతుకుతు గ్లోరిని యెంజాయ్ చేస్తుంటాం మాలో చాలామంది... యింత యెందుకు కానీ నీకు మాత్రమే నేను చెప్పగలిగే విషయం చెప్పనా... యస్ అందులో కొన్ని చేశాను. ఆ టైమ్‌లో యిది మంచా చెడా అనే ఆలోచన కూడా లేదు నాలో. జరిగి పోయిన దాంట్లోంచి బయటపడటానికి వున్న మార్గాలన్నింటిని జల్లెడేస్తున్నాం. చూడాలి.''

సుధీర మౌనంగా వుండిపోయింది.

``యిది జరిగినప్పట్నుంచి నా మనసులో పదేపదే వస్తున్న విషయం యేంటంటే నేను నా స్నేహితురాలి ఛాయగానే వుండాల్సింది. అలా వుండుంటే నీతో వున్నప్పుడు నీకు తోచినట్టే తోచేవి వాన, కొలను, యీ వూరు అలానే కనిపించేవి. నీ డిసిప్లీన్‌కి ముచ్చటపడేవాడిని కాని యెప్పుడు ఆ విషయాన్ని జీవితంలోకి ట్రాన్స్‌లేట్ చేసుకోలేకపోయేవాడిని. కానీ నీతో వుంటే యెప్పటికైనా యిన్ ప్రిన్స్‌పల్ డిసిప్లీన్‌గా వుండేవాడిని. అలా నీతో యీ ప్రపంచాన్ని చూసుంటే నిస్సందేహంగా యిలా అధఃపాతాళానికి జారిపోయేవాడిని కాదనిపిస్తోంది. యేమంటావ్,'' అని అడిగాడు.

ఆమె అతని వైపు నిశ్శబ్దంగా చూస్తూ, 'నువ్వు నాతో సంతోషంగా వుండలేకపోయేవాడివి అఖిల్,' అనుకొంది.


"నువ్వు నన్ను యెందుకు కలవాలనుకొన్నావ్ సుధీరా... దాదాపు నాతో యిన్నేళ్లు రెగ్యులర్ కాంటాక్ట్‌లో వున్నవాళ్లంతా దాదాపు నన్ను వెలి వేశారు," అని అడిగాడు.

"మన జనరేషన్ క్రైసిస్ క్విక్ మనీ. యిన్‌స్టెంట్ గ్రాటిఫికేషన్. చాలా విషయాలలో యేది మంచి చెడు అర్థం కాదు. మేం మా పనికోసం వొకొక్కసారి ప్రెస్‌మీట్స్‌కి వెళతాం. అందులో కొన్ని స్టార్‌హోటల్స్‌లో జరుగు తుంటాయి. లంచ్ , డిన్నర్ యిస్తుంటారు. వేరే చోటైనా లంచ్ ప్రొవైడ్ చేస్తుంటారు. కొన్నిసార్లు గిఫ్టు యిస్తుంటారు. క్లోజ్డ్ కవర్స్ యిస్తారొక్కోసారి. ఆ వార్తో యీవెంట్లో రాస్తాం . యెందుకిది అంటే యింపార్టెంట్ అంటాం. నిజంగా యింపార్టెంటా అంటే వొక్కోసారి కావొచ్చు. కాకపోవచ్చు. కాని దాని వెనుక ప్లే చేసేవి వుంటాయి. మొత్తం సిస్టమ్‌ని తలకిందులుగా చేసేశాక జరుగుతున్న లేదా జరిగిన పొరపాట్లకి యిద్దరినో ముగ్గురినో బాధ్యులని చేసేసి ప్రపంచం ముందు దోషులుగా నిలబెట్టే ప్రోసెస్‌లో అసలు ప్రజలకి మేలుచేసే విషయాలపై దృష్టినే పెట్టటం లేదు. ఆ బాధ్యతని యెవరు తీసుకొంటారు. నిజంగా ఆ కొద్దిమందే దోషులా... యిదంతా గ్లోబల్ యెకానమి సృష్టించే వికృతం..." అని ఆగి, "నేను యెందుకొచ్చానా... నా స్నేహితుని పేరు అఖిల్," అని నవ్వి అతని నుదుటి పై ఆత్మీయంగా ముద్దు పెట్టింది.

ఆ ముద్దు అతనిలోని అలజడిని రేకెత్తించే అన్నిరకాల దుమ్ము ధూళిని శుభ్రపరిచి, తన ముందున్న జీవితం యెక్కడున్నా శుచిగా శుభ్రంగా జీవించే ఆకాంక్షని పూయించింది.

*పాలపిట్ట మాసపత్రిక, ఏప్రిల్ 2013*

# ఫ్రంట్ సీట్



“మీ వదిన యింట్లోంచి వెళ్లి పోయినట్టుంది ధాన్యా,” అని విని పిస్తే ఆన్‌లైన్‌లో వేసవి కలెక్షన్‌గా వచ్చిన కొత్త కాటన్ ట్యూనిక్స్‌ని ఆర్డర్ చేస్తున్న ధాన్య తల తిప్పి చూసింది. గది గుమ్మం దగ్గర తల్లి మీనాక్షి నిలబడి వుంది. ఆర్డరిచ్చే ఆనందాన్ని తల్లి డిస్ట్రబ్ చేయటం అస్సలు నచ్చలేదు ధాన్యకి. తల్లి చెపుతుందేం తల్లోకి దూరటం లేదు.

మీనాక్షిగారికి తెలుసు లాప్‌టాప్ ముందుంటే కూతురు చెవి లోకి యే విషయాలు సరిగ్గా విన

పడవని. కూతురు కూర్చున్న మంచం దగ్గరకి వచ్చి, ''విషయం చాలా సీరియస్. కాస్త ఆ సిస్టం ఆఫ్ చేసి నేను చెప్పింది వింటావా,'' అని యింగ్లీష్‌లో అడిగారు. ఆమెకి ఆదుర్దా పెరిగినా, కోపమొచ్చినా యింగ్లీష్ లోనే మాటాడగలరు. తల్లి యే భాషలో మాటాడినా, అసలు యెవ్వరితో నైనా ధాన్య యింగ్లీష్ హిందీ కలిపే మాటాడుతుంది.

''ఆఁ వొక్క నిమిషం,'' అంటూ తన పనిని పూర్తి చేయటంలో నిమగ్నమై వుంది ధాన్య .

ధాన్య పని అయ్యేవరకు వేచి చూడాల్సిందే తప్ప యేంచేసీ కూతురు యెటెన్షన్ని సాధించలేమని మీనాక్షిగారు నిస్పహాయంతో అక్కడే నిలబడి వున్నారు. కుడిపాదం చిటికిన వేలు కాస్త వంకర కాసాగింది. యీ మధ్య యే మాత్రం ఆదుర్దా వచ్చినా ఆ వేలు అలా అవుతోంది. మొదట్లో భయపడి డాక్టర్ దగ్గరకి వెళ్లాలనుకొంటుంటే ఆడపడుచు అది ఆదుర్దా వలనే కావాలంటే గమనించు అని సలహా యిచ్చింది. ఆమెకి నెట్ పరిజ్ఞానం యెక్కువ. కాని గమనిస్తే ఆమె చెప్పింది వాస్తవంగానే అనిపించింది. అయినా సరే డాక్టర్‌కి చూపించమని అత్తగారు అంటూనే వున్నారు.

తన పని పూర్తయ్యాక ధాన్య, ''సారీ, యేంటంటున్నావ్,'' అని నిదానంగా అడిగింది.

''గ్రీష్మ యింట్లోంచి వెళ్లిపోయినట్టుంది,'' మంచం యెదురుగా వున్న సోఫాలో కూర్చుంటూ అన్నారు మీనాక్షి.

''వెళ్లిపోవటమంటే,'' నింపాదిగా అడిగింది ధాన్య.

''మన నుంచి విడిపోదామనుకొంటున్నట్టుంది. గ్రీష్మ యింట్లోంచి వెళ్లిపోయింది. తన మొబైల్ ఆఫ్ చేసేసింది. నువ్వెలాగైనా తనని కాంటాక్ట్ చేయగలవా?'' అడిగారు మీనాక్షి .

''నాకేం అర్థం కావటంలేదు... కాని తనని నువ్వు కాంటాక్ట్ చెయ్యాలి, అంతేగా...'' అంటూ ధాన్య తిరిగి లాప్‌టాప్ ఆన్ చేసింది .

''యిప్పుడు మళ్లీ అదెందుకు,'' అసహనంగా అడిగారు మీనాక్షి .

ధాన్య ఫేస్‌బుక్ లాగిన్ అయి గ్రీష్మ పోస్ట్‌లోకి వెళ్లింది. అకౌంట్ డవున్ .

“వదిన అకౌంట్ క్లోజ్ చేసేసింది. విషయం యేంటో వివరంగా చెప్పు. నాకేం అర్థంకావటం లేదు,” అంది ధాన్య .

“మీ వదిన నిన్న తన స్నేహితురాలి పెళ్లికి వెళుతూ వొక్కో ఫంక్ష నప్పుడు చీరలు మార్చుకోవాలిగా, మార్చుకొన్నాక వాటి మీదకి వుండాలని దాదాపు అన్ని నగల సెట్స్ పట్టుకుపోయింది. యివాళ సాయంత్రానికి యింటికి వస్తానని చెప్పి వెళ్లింది. యిందాక తనే ఫోన్ చేసి యిక్కడికి యిక రానని అన్నయ్యకి డైవర్స్ పంపిస్తానని చెప్పింది. నే మాటాడేలోగా ఫోన్ డిస్కనెట్ చేసేసింది. వెంటనే మీ అన్నయ్య ఫోన్ ఢిల్లీ నుంచి. నాతో మాటాడేశాక, గ్రీష్మ ఫోన్ కలవటం లేదు, ఫోన్ చేసిందా, పెళ్లి నుంచి వచ్చిందాని అడిగాడు. తనకి యీ విషయం తెలీదని అర్థమయింది. అందుకే వచ్చిందని చెప్పేశాను. అన్నయ్య వచ్చేలోగా మనిద్దరం గ్రీష్మని వెతకాలి. యీ విషయం మరెవ్వరికి తెలియకూడదు,” అన్నారు మీనాక్షి.

“వదిన మేజర్ కదా. వెళ్లిపోవటం తన విష్ కదా. వదిన చెప్పిన విషయమే అన్నయ్యకి చెప్పాల్సింది. నువ్వెందు సెన్సార్ చేస్తున్నావ్. మనం వెతకటం యేంటి... అబ్సెర్డ్,” అంది ధాన్య.

“నీకు యివన్నీ అర్థం కావ్. నువ్వింకా చిన్నపిల్లవి. యీ విషయం యెట్టి పరిస్థితుల్లోను మీ అన్నయ్యకి తెలియకూడదు. నీ దగ్గర గ్రీష్మ ఫ్రెండ్స్ నెంబర్స్ వున్నాయా?”

“లేవ్... కానీ నే చిన్నపిల్లనేంటి నాకిప్పుడు పద్దెనిమిదేళ్లు,” అంది.

“యెలా... నా దగ్గర కనీసం వాళ్ల అమ్మగారి నెంబర్ కూడా లేదు. ఫంక్షన్స్‌కి పిలవాల్సినప్పుడు గ్రీష్మ మొబైల్ నుంచే మాటాడాం. యిప్పు డెలా... వొక పని చేద్దాం. తను పనిచేస్తున్న ఆఫీస్ దగ్గరకి వెళదాం,” అన్నారు మీనాక్షి.

“యేంటి హైటెక్ సిటి దగ్గరకా... అక్కడెలా వెతుకుతాం,” ఆసక్తిగా అడిగింది ధాన్య.

“యేమో తెలీదు. కాని వెళ్లాలి. అక్కడికి వెళితే తెలుస్తుందేమో,” అన్నారు మీనాక్షి.

యిదేదో చిత్రంగా వుంది. తను చూసే సిఐడి సీరియల్‌లోని పాత్రలు గుర్తొచ్చాయామెకి. అంత పెద్ద సైబరాబాద్‌లో ఆ గుండ్రని

బిల్డింగ్ దగ్గర తన తల్లి కోడల్ని వెతికే సన్నివేశం చూడాలనే కుతూహలం కలిగింది ధాన్యకి.

ధాన్య కారు డ్రైవ్ చేస్తూ మెటాలికాని వింటుంది. మరొక్కప్పుడైతే ఆ సంగీతాన్ని ఆస్వాదించేవారే మీనాక్షిగారు. యిప్పుడు ఆమెకి వున్న ఆదుర్దా వలన ఆ సంగీతం ఆమెని ఆలోచించుకోనివ్వటం లేదు. అదే సమయంలో కూతురు యింత సాధారణంగా యీ పరిస్థితిని యెలా తీసుకొందో అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తోంది. యేకకాలంలో యిన్ని విషయాలు ఆమె తలలో తిరుగుతుంటే వొకేసారి అనేక జనరేటర్స్‌ని ఆన్ చేసినప్పటి రొద తలలో.

యెప్పుడు హైటెక్ సిటి దగ్గరకి చేరుకొన్నారో కూడా మీనాక్షిగారు గమనించలేదు ధాన్య చెప్పేవరకు. అక్కడవరకు రావటం అయితే వచ్చేశారు కాని తరువాత యేం చెయ్యాలో ఆమెకి తెలీయటంలేదు. కానీ ఆమెకి ఆ బిల్డింగ్ చూస్తుంటే మాత్రం తను గ్రీష్మకి దగ్గరలోనే వున్న ఫీలింగ్.

తల్లి యేం చెపుతుందానే ఆత్రం లేకుండా ధాన్య ట్విటర్‌లో, 'మా అమ్మగారితో హైటెక్ సిటి దగ్గరకి వచ్చాను మా వదినని కలవటానికి. వెనక్కి వెళ్లేటప్పుడు చాక్‌లెట్ రూమ్‌కి వెళ్లాలి,' అని పోస్టింగ్ చేసింది.

"నువ్వెళ్లి వదిన కోసం వచ్చామని చెపుతావా," అడిగారామె.

"నేనా... నో వే. అసలు అలా రానివ్వరుగా. సెక్యూరిటీ... అదంతా వో పెద్ద ప్రోసెస్," అంది ధాన్య.

"నువ్వెళ్లి గ్రీష్మ వుందేమో అడిగిరా," అన్నారు మీనాక్షి.

"అరే, నీకేం అర్థంకావటంలా. తను కొత్తగా జాబ్‌లో జాయిన యింది. యెవరికైనా అప్పుడే తెలిసే అవకాశం లేదు. అయినా అలా యెలా అడుగుతాం. సెక్యూరిటి వాళ్లు చాలా ప్రశ్నలు వేస్తారు. కావాలంటే నువ్వు వెళ్లు," అంది ధాన్య.

"నేనా..." అని ఆమె వో క్షణం ఆగి, "వెళ్లొచ్చు, కాని వచ్చింది నేనని తెలిస్తే గ్రీష్మ లేనని చెప్పేస్తుందేమోననే భయం," అంటూ మీనాక్షిగారు కారు దిగి యిన్ గేట్ వైపు వెళుతుండగా ధాన్య మొబైల్ రింగ్ అయింది.

పేరు లేని అంకెని చూసి యెవరానుకొంటూ, "హలో," అంది ధాన్య.

‘‘ధాన్య, నేను గ్రీష్మని. నువ్వూ, ఆంటీ యెక్కడున్నారు,’’ అని అడిగింది.

‘‘మీ ఆఫీస్ దగ్గరే. నీ కోసం వచ్చాం. మీరెక్కడా?’’ అడిగింది ధాన్య.

‘‘నీ ట్వీట్ మా ఫ్రెండ్ చూసింది. తనే నాకు యస్.యం.యస్. పంపింది. యిప్పుడే ఆఫీస్ అయింది. నువ్వెలాగైనా ఆంటిని యిక్కడ నుంచి తీసుకెళ్లిపోవా. ప్లీజ్,’’ అడిగింది గ్రీష్మ.

‘‘అమ్మ మిమ్మల్ని కలవాలనుకొంటుంది. మీ మొబైల్ నెంబర్ కూడా మారిపోయినట్టుంది.’’

‘‘అవును. నీతో తరువాత మాటాడతాను. యీ నెంబర్ కూడా యెవ్వరికి యివ్వకు,’’ అంది గ్రీష్మ.

ధాన్య మాట్లాడలేదు.

‘‘ప్లీజ్,’’ అంది కనగీష్మ.

‘‘వోకె. కానీ అమ్మ మిమ్మల్ని కలవాలని డిస్పరేట్‌గా వుంది,’’ అంది ధాన్య.

‘‘నే తరువాత మాటాడతాను. ప్లీజ్,’’ అంది గ్రీష్మ.

‘‘వోకే,’’ అని ధాన్య తల్లికి ఫోన్‌చేసి, ‘‘పార్కింగ్ లేదిక్కడ. నువ్వ వచ్చై త్వరగా,’’ అని హడావిడి చేసింది. యింత దూరం వచ్చి గ్రీష్మని కలవకుండ వెళ్లటానికి ఆమె మనసు వొప్పుకోవటం లేదు. అప్పటికే సెక్యూరిటీ వాళ్లు ప్రొసీజర్ పూర్తిచేసి గ్రీష్మ వెళ్లిపోయిందని చెప్పారు. మరోవైపు ధాన్య చెపుతోన్న పార్కింగ్ సమస్య నిజమేననిపించింది. యెవరిని యింకేం అడగకుండా వచ్చేశారామె.

మీనాక్షిగారి ఆలోచనలు పలురకాలుగా పరిగెడుతున్నాయ్. గ్రీష్మ యిలా యెందుకు చేసింది. కనీసం తనకెందుకు చెప్పలేదు.

‘‘చాక్‌లెట్ రూమ్ దగ్గర ఆగుదామా,’’ అడిగింది ధాన్య.

మీనాక్షిగారికి భలే చికాకేసింది. తనింత ఆదుర్దాలో వుంటే యీ పిల్లకేం పట్టదేంటి. వినదు. అంతే, ఆ బుర్రలోకి యేమొస్తే అదే. యేమన లేక సరేనంటూ తలూపారు. యిద్దరూ లోపలికి వెళ్లారు. మీనాక్షిగారికి లోపలున్న వ్యక్తులని చూస్తూ, తను అవుటాఫ్ ద ప్లేస్ అనుకున్నారు, తనేసుకున్న సల్వార్ కమీజ్‌ని వైపు చూసుకొంటూ. తను స్టూడెంట్‌గా

వున్నప్పుడు హేవ్ మోర్ తమ అడ్డాగా వుండేది. ఆ పార్లర్ యిప్పుడూ వుంది. కానీ అది యిప్పుడు దాదాపు ఫ్యామిలీ అవుటింగ్‌గా అయిపో యింది.

గ్రీష్మ యిలా యెందుకు చేసింది. వాళ్లిద్దరి మధ్యా మిస్ అండర్ స్టాండింగ్స్ వున్నాయని తనకెందుకనిపించలేదు. అసలు అలాంటి ఆనవాలే కనిపించలేదే... యేమైవుంటుంది... ఆలోచిస్తున్నారామె.

ధాన్య తను కూర్చున్న ప్లేస్‌ని మొబైల్ కెమెరాలో పిక్చర్ తీసి ఆ పిక్చర్‌తో పాటు తను యెక్కడుందో ట్వీట్ చేసింది. తరువాత కొత్తగా లాంచ్ అయిన యాప్‌లో గేమ్ ఆడుకొంటూ తన ట్వీట్‌కి వస్తున్న రెస్పాన్స్ చూసుకొంటూ తనలో తనే నవ్వుకొంటుంది. యిదంతా గమనిస్తూ యెదురుగా వున్న తనతో మాట్లాడాలని ధాన్య యెందుకు అనుకోవటం లేదు. తన ఆందోళన విషయం యెందుకు పట్టడంలేదు. తనెప్పుడు యిలానే వుంటుంది. కానీ యీరోజు ఆమె ప్రవర్తన తనని బాధపెడు తోంది. యింతకుముందు చాలాసార్లు చికాకుపడింది, యెప్పుడు ఆ ఫోనేనా అనో లాప్‌టాపేనా అనో... కానీ బాధపడలేదు. యిప్పుడు యిలా యెందుకనిపిస్తోంది. గ్రీష్మ యింట్లోంచి వెళ్లిపోవాలనేంత అసంతృప్తిని కాదుకదా చిన్న అసంతృప్తిని కూడా తనెప్పుడు చూడలేదే...

యిద్దరూ బయటకి వచ్చారు.

నోట్లో నువ్వుగింజ కూడా దాగని తన భర్తకి యీ విషయం తెలిస్తే ముందు కొడుక్కి చెప్పేస్తారు. యీ విషయాలేం మీ నాన్నగారికి చెప్పకు అని ధాన్యని హెచ్చరించారు మీనాక్షిగారు.

◆ ◆ ◆

టెస్సారోజా కాఫీషాప్ సోఫాలో కూర్చున్న గ్రీష్మ నవ్వుతూ, "యేంటి నేను యిల్లు వదిలేసిన విషయం ఆంటీ మీ అన్నయ్యకి చెప్పలేదా. అరే మా ప్లాన్ అంతా వేస్ట్ అయిపోదూ," అని తిరిగి నవ్వుతూ, "అసలు నా ప్రోబ్లెమ్ యిలా సాల్వ్ చేయొచ్చనే ఐడియా నా ఫ్రెండ్ యిచ్చింది," అంది.

"యేమైయింది... నాకేం అర్థంకావటం లేదు," అంది ధాన్య.

"నాకు ఆ యింట్లో ఫ్రీడమ్ లేదు," అంది గ్రీష్మ.

అంటే యేంటన్నట్టు చూసింది ధాన్య..

“మ్యారేజ్ అయ్యాక మీ యింటికి వచ్చానా. మీ అన్నయ్య బెడ్ రూమ్‌లోనే నా బట్టలు, మిగిలిన వస్తువులు సర్దుకొన్నాను. నా షూ రేక్ పెట్టుకోడానికి కూడా ఆ గదిలో ప్లేస్ లేదు. నా రూమ్‌ని నేను మిస్ అవుతున్నాను. వోకె. పెళ్లాయ్యాక బెడ్‌రూమ్ షేర్ చేసుకోవాలని తెలుసనుకో. ఆ బెడ్‌రూమ్ వుంటూనే నాకంటూ మరో రూమ్ వుంటే యెంచక్కా మా యింట్లో వున్నప్పుడు నేనెలా నా వస్తువులన్నీ పెట్టుకొనే దాన్నో అలా పెట్టుకొంటాను కదా. నా టెడ్డీబేర్స్, యిష్టమైన పోస్టర్స్ యిలా నా వస్తువులన్నీ అక్కడే వుండిపోయాయి. మీ అన్నయ్యకి యిష్టమైన వస్తువులతో పెళ్లికి ముందే నిండిపోయిన గది అది. అవి తీసేసి నావి పెట్టలేనుకదా... యింక ఫుడ్ యేం చెప్పమంటావ్. నాకు ఫ్రైస్ అలవాటు. మీ యింట్లో చాలా సిస్టమేటిక్‌గా వొక పూట పులుసు, మరో పూట పప్పు యిలా డైటీషియన్ ఛార్ట్‌లా సాగుతుంటుంది మెనూ. తోటకూర తినలేను. తినాల్సిందే. బీరకాయ, పచ్చిజీడిపప్పు లొట్టలేసుకొని తింటుంటారు. మా యింట్లో కూడా యివన్నీ చేస్తారు. కానీ నేను అవేం తినని రోజు వొక ఫ్రై చేస్తారు. మీ అన్నకి నాన్‌వెజ్ లేకపోతే తినడని తనకి కావల్సినవి చేస్తారు. నువ్వు తోటకూర తినవని నీకోసం నీకు నచ్చినవి చేస్తారు. నన్నేం అడగరు. యిక్కడ నాకేం తినాలని వున్నా యిది కావాలని చెప్పలేను. మరో విషయం యేంటంటే నాకు లంచ్ బాక్స్ యిస్తారా నాకు సరిపడినంతే పెడతారు కూరలు. లంచ్ అవర్‌లో అంతా కలిసి తింటాం కదా. వొక్క స్పూన్ కూడా యెక్కువ పెట్టారా బాక్స్‌లో. వో యీ కూర బాగుంది. మళ్లీ చేయించుకురావా అంటారనుకో ఫ్రెండ్స్ కానీ కొలీగ్స్ కానీ, యింట్లో చెప్పలేను. అప్పు డప్పుడు బయట కర్రీ పాయింట్స్ నుంచో, మా పెద్ద మేనత్తనో యేదో వొకటి చేయమని అడిగి పట్టుకెళ్లటం. ఆఫీస్‌కి వెళ్లే దారిలో ఆగి యివ్వన్నీ కలెక్ట్ చేసుకోవటం యెంత కష్టమో ఆలో చించు. మా యింట్లోనైతే వారంలో మూడుసార్లైనా పీజాలని ఆర్డర్ చేసు కొనేదాన్ని. నా గదిలో నేను నా లాప్‌టాప్‌లో ఛాట్ చేస్తునో, మ్యూజిక్ వింటునో, సినిమా చూస్తూనో హాట్ పీజాని యెంతగానో యెంజాయ్ చేసేదాన్ని. అసలు తెలుసా, నేను మా ఫ్రెండ్స్ నా రూమ్‌లో చేరి యెంత

బాగా స్పెండ్ చేసేవాళ్లమో. గోడలన్నీ గ్రాఫిటీతో నిండిపోయేవి. తిరిగి యెప్పుడో అంతా కలిసి పెయింట్ చేసే వాళ్లం. సాంగ్, డాన్స్ వొక్కటేంటీ యీ పెళ్లితో నా లైఫ్‌లో ఫన్ అంతా డిలీట్ అయిపోయింది,'' అంది గ్రీష్మ.

యెంతో యిష్టంగా ఆర్డర్ చేసిన చికెన్ మ్యామూస్ తినటం మర్చి పోయి గ్రీష్మ చెపుతోంది వింటోంది ధాన్య.

''యింకా తెలుసా మా రొమేన్స్, తగాదాలు అన్నీ ఆ నాలుగు గోడల మధ్యే. గది దాటిన వెంటనే మేం యెప్పుడూ పెద్దమనుషుల్లా వుండాలి,'' అంటూ నవ్వింది గ్రీష్మ.

''పీజా ఆర్డర్ చేసుకొంటాను. నా ఫ్రెండ్స్ వస్తారు. మీరు చెప్పిన ఫన్ నా లైఫ్‌లో కూడా వుంది కదా. మా ఫ్రెండ్స్ కావాలని అడిగినవి అమ్మ చేయటమో అలివేలుతో చేయించటమో చేస్తుంది కదా. మీక్కావలంటే మీకు యిస్తుంది కదా...'' అంది ధాన్య.

''యస్ ధాన్యా... నీకున్న ఫ్రీడమ్ నాకు కూడా మా యింట్లో వుండేది. యిది నా యిల్లు అంటారు. కానీ కాదు. యిది నేను పెళ్లి చేసుకొన్న అబ్బాయి అంటే నా భర్త యిల్లు. అదీ తేడా... నీకున్నలాంటి ఫ్రీడమ్ నాకు రాదు. పైకి కనిపించని రూల్స్ చాలుంటాయి. మ్యారేజ్ అయ్యాకే నాకు యివన్నీ యెక్స్‌పీరియన్స్‌లోకి వచ్చాయి,'' అంది గ్రీష్మ.

''అన్నకి చెప్పారా...''

''నువ్వు షార్ట్స్ వేసుకొన్నా, స్లీవ్‌లెస్ వేసుకొన్నా యింట్లో మీ అన్న అభ్యంతరం చెప్పరు కదా. అదే నేను షార్ట్స్, త్రీఫోర్త్ జీన్స్, స్లీవ్‌లెస్ వేసుకోకూడదు. వెస్ట్రన్స్ మీదకి బొట్టు యేం బాగుంటుంది చెప్పు. బొట్టు అన్నిటి మీదకి పెట్టుకోవాలి. జుట్టుకి ఖచ్చితంగా క్లిప్ పెట్టుకోవాలి. యిలా చాలా యిష్యూస్ వున్నాయి. అటువంటి మీ అన్నకి నేను మిస్ అవుతున్న స్పేస్ గురించి యెలా అర్థమవుతుంది. యింకో విషయం చెప్పనా, ఆఫీస్ వాళ్లతో లంచ్‌కైనా డిన్నర్‌కి అయినా సరే మీ అన్నయ్య పర్మిషన్ యిస్తేనే వెళ్లాలి. లేకపోతేలేదు. నా కొలీగ్ వో అమ్మాయి తను తన ఫ్రెండ్స్‌తో పబ్‌కి వెళ్లిన ఫోటో యఫ్‌బిలో పోస్ట్ చేసింది. ఆమెని అన్ ఫ్రెండ్ చేయ మంటాడు. మనిద్దరి మధ్యా రహస్యాలేమంటాయ్‌‹ అని పెళ్లయిన రెండో

రోజునే తను నా పాస్‌వర్డ్‌ని తీసేసుకొన్నాడు. వోసారి మండి నా పాస్‌వర్డ్‌ని మార్చుకొన్నాను. చాల గొడవైయింది. నా నుంచి యేదో దాస్తున్నా వన్నాడు... యేం లేనిదానికి యెందుకొచ్చిన గొడవని పాస్‌వర్డ్ యిచ్చేశాను. నీ ఫోటో అందంగా వుంది కదా అందుకే నువ్వు పెట్టినవాటికి అన్ని లైక్స్ వచ్చాయంటాడు. జెలస్...'' అని నవ్వి, ''యిలా చాలున్నాయి... సరే అలాంటివాటికి యెలానోలా యెడ్జెస్ట్ అవుతా. యెట్ లీస్ట్ నాకు కనీసం నా యిల్లు అనే కంఫర్ట్ వుంటే అనిపిస్తుంది,'' అంది గ్రీష్మ.

''అంటే డైవర్స్?'' అడిగింది ధాన్య.

''కాదు... అని నవ్వుతూ, ''మీ అన్నయ్యని బెదిరించటానికి. అప్పుడు తనే ఆంటిని కన్విన్స్ చేసుకొంటాడు. నేనిలా వెళ్ళిపోయానని చెప్పలేడుగా అనుకొన్నాం, నేను నా ఫ్రెండ్. యిగో కదా. కానీ పెద్దగా ఆలోచించకుండా ఆంటికి నేనే చెప్పేశాను. నా ఫ్రెండ్ అంటికి చెప్పా నంటే నేనో స్టుపిడ్ నంది,'' అంది గ్రీష్మ.

''యిలా బెదిరించే కంటే మాటాడొచ్చుగా.''

''చెప్పి చెప్పి వెక్స్ అయిపోయాను. వేరే యింట్లో వుంటే నా గది నాకుంటుంది. కిచెన్‌లో లిబరేషన్ వుంటుంది. యింట్లో అందరి పర్మిషన్ తీసుకొని ఫ్రెండ్స్‌ని పిలవక్కరలేదు.పెద్దాళ్లున్నారని యింట్లో షాట్స్ వేసుకోవటం మానేనక్కరలేదు. మేం కేడిలైట్ డిన్నర్ చేయవచ్చు. యిల్లంతా పరిగెత్తవచ్చు... తనేమో తన పేరెంట్స్‌ని వదిలి రాడంట. నేను వదిలి రాలేదా... అన్నీ వదులుకోలేదా. యిప్పుడే కదా గ్రీష్మ యెంజాయ్ చేసేది. కొన్నాళ్లు పోతే కిడ్స్... డైపర్స్ మార్చటంతోనే టైమ్ గడిచిపోతుంది. అదీ కాకుండా పిల్లలు వచ్చాక నేను జాబ్ చెయ్యాలని అనుకోవటంలేదు. నా టైమ్ అంతా బేబీకే యివ్వాలనుకొంటున్నాను. అసలు నీకో ముఖ్య మైన విషయం, కారు ఫ్రంట్ సీట్ పాలిటిక్స్ చెప్పనా. మనం ఫ్యామిలీ మొత్తం బయటకి వెళతామా. మీ అన్న డ్రైవింగ్ సీట్‌లో కూర్చుంటారా... ఆ పక్కన యెప్పుడు మీ అమ్మగారో నాన్నాగారో కూర్చుంటారు. నువ్వు, నేను యెప్పుడూ వెనక సీట్లోనేగా కూర్చుంటాం. యెప్పుడు మీ అన్న పక్కన కూర్చోమని వొక్కరూ అనరు. వీకెండ్స్ అందరం కలిసి బయటకి వెళ్లాలి. లేదా మీ అన్న తన ఫ్రెండ్స్‌తో తను వొక్కడు బయటకి వెళ్లిపోతుంటాడు.

అసలు మా యిద్దరమే బయటకి వెళ్లేదే వుండదు. నా ఫ్రెండ్ చెప్పిందిలే తన యెక్స్‌పీరియన్స్, తన అత్తగారింట్లో తన అబ్జర్వేషన్. యీ మోడ్రన్ డేస్‌లో అత్తమామలకి తమ పాతకాలపు పెత్తనంతో పాటు ఫ్రెండ్లీనెస్ పేరుతో యీ మోడ్రన్ హ్యాపీ ఫ్యామిలీ కాన్సెప్ట్‌లోనివి కావాలంట. నిజమే ననిపిస్తుంది. సారీ. యెంతైనా మీ పేరెంట్స్, అన్న కదా,'' అంది ధాన్య.

''యిట్స్ వోకె... చాలా స్ట్రేంజ్‌గా అనిపిస్తున్నాయి పెళ్లైన తరువాత సిట్యూయేషన్స్. యిప్పుడు నేనేం చెయ్యాలి,'' అడిగింది ధాన్య.

''అసలు నువ్వు చెప్పు నా ప్రాబ్లెమ్ నీకు అర్థమయిందా...''

''నేనెప్పుడూ ఆ యిల్లు మీకు యిబ్బందిగా వుందని అనుకోలేదు. నిజానికి ఆ ఆలోచనలు కూడా నాకు లేవ్... కానీ యిప్పుడు మీరు చెపుతుంటే కొత్త ప్లేస్‌లో రేపు నా పరిస్థితి యింతేనా అనిపిస్తుంది. నా దగ్గర కూడా చాల టెడ్డీబేర్స్ వున్నాయి,'' ఆలోచిస్తూ అంది ధాన్య.

''యెగ్జాక్ట్‌లీ. కరెక్ట్‌గా నీకు అర్థం అయింది. యెవరేనా కొత్త ప్లేస్‌లో కంఫర్టబుల్‌గా వుండలేం కదా...'' అంది గ్రీష్మ తనని ధాన్య అర్థం చేసుకొన్నందుకు సంతోషంగా.

''ఐ అండర్‌స్టాండ్...'' అంది ధాన్య.

◆ ◆ ◆

హాల్లో టీవీ సీరియల్ చూస్తున్నారు మీనాక్షిగారు. అత్తింటి నుంచి వేరే వెళ్లిపోయిన కోడలు. అత్త తన కళ్లల్లోంచి శాపనార్థ బాణాలు విసురుతోంది.

''నీ పెళ్లయిన కొత్తలో నువ్వు యెక్కడుండేదానివి,'' అడిగింది ధాన్య తల్లిని.

''యింకెక్కడా మీ నాన్నమ్మ యింట్లో...''

''అక్కడ నీకు ఫ్రీడమ్ వుండేదా,'' తిరిగి అడిగింది ధాన్య.

యెప్పుడూలేంది యిలాంటి ప్రశ్నలు వేస్తుందేంటో. సీరియల్లో సీన్ వల్లేమో అనుకొంటూ, ''యెందుకు?'' అని అడిగారు మీనాక్షిగారు.

''జస్ట్ క్యూరియస్...''

"యేం ఫ్రీడమ్... వుదయం నుంచి పనే... మీ నాన్నమ్మ మోకాలి పీట వేసుకొని పత్రికల్లో సీరియల్స్ చదువుకొంటూ నాతో పనంతా చేయించేది. యింట్లో చాలామంది వుండేవాళ్లమేమో ఆ పనికి అంతుండేదికాదు. మీలా కాదు... పెళ్లి చేసేనాటికే అన్ని పనులు రావాలని చిన్నప్పట్నుంచి పనులన్నీ నేర్పించేవారు..."

"సినిమాలకి వెళ్లేవాళ్లా?"

"నెలకో సినిమా. అందర్నీ తీసుకోని పొలోమని వెళ్లేవారు మీ తాతగారు. యెవరికి నచ్చే సినిమాకి వాళ్లు వెళ్లడానికి వుండేది కాదు..."

" వెళ్లాలనిపిస్తే..."

"అనిపించినా వెళ్లకూడదు. వొకసారి యేమయిందంటే మీ నాన్నగారిని మనిద్దరమే కలిసి సినిమాకి వెళదామని అడిగాను. యెలాగో వొప్పించాను. వాళ్ల అమ్మగారిని పర్మిషన్ అడిగారు. అలాగేలే మీ నాన్నగారికి చెపుతాను అన్నారు. ఆ చెప్పేలోగా ఆమె యింట్లో వాళ్లందరికి అదేదో చిత్రమైన కోరికలా నవ్వుతా నవ్వుతా చెప్పేశారు. యింక పెద్ద వదినైతే యిది మీ ఆలోచనా వదినగారు అని అడగటం. యింటికొచ్చిన చుట్టం మొగుడ్ని కొంగున బాగనే ముడి వేసుకొంటున్నావ్ అని నవ్వులాటలు... యీ గోలంతా చూసి ఛా... యింకెప్పుడూ యేం అడక్కూడదని గట్టిగా అనుకున్నాననుకో... మీ నాన్నతో యిక్కడ వ్యాపారం పెట్టిస్తే బాగుంటుందని మీ తాతగారికి ఆలోచన రావటం. అలా యీ వూరు వచ్చాం. అప్పటికే అన్నయ్యకి పన్నెండేళ్లు. నీకు నాలుగేళ్లు... అప్పటికి యింకేం సరదాలుంటాయ్..." మాటాడుతున్నా ఆమె మనసులోకి ధాన్య యిలా యెందుకు అడుగుతుందానే అనుమానం చొచ్చుకొస్తూనే వుంది.

ధాన్య టీవీ ఛానల్స్‌ని రిమోట్‌తో మారుస్తూనే, "గ్రీష్మ వదిన మాటాడింది..." అని మొత్తం సంభాషణని చెప్పేసింది.

మీనాక్షిగారు ఆశ్చర్యపోయారు. ఆమెకి కాస్త రిలీఫ్‌గా కూడా అనిపించింది. తనింకా గ్రీష్మ వేరే వాళ్లని యిష్టపడిందా... లేదా తన కొడుకే మరో అమ్మాయిని యిష్టపడ్డాడా... యిలా పరిపరివిధాల అనుమానాలు. కానీ తనకెప్పుడూ యిలాంటి విషయాలే తట్టలేదు. గ్రీష్మ స్పేస్‌ని తను లాక్కుంటున్నానని తనకెప్పుడూ అనిపించలేదు. వంటగదిలో పనిని గ్రీష్మకి

చెప్పకపోతే ఆమెకి పని భారం వుండదనుకొన్నాను. ఫ్యామిలీ అంతా కలిసి వెళ్లటంలో సంతోషం వుంది. కానీ గ్రీష్మ అన్నట్టు కారు ముందు సీట్ రాజకీయం కూడా వాస్తవమే కదా. నేను కూడా యెప్పుడూ ఆ వెనక సీట్ లోనే కదా కూర్చునేది. మొదట్లో అత్తగారో, మామగారో, ఆ తరువాత పిల్లలు... యిలా ముందు సీట్‌లో కూర్చుంటే బాగా వళ్లుమండేది. కాని నేనసలు ఆ విషయాన్నే మర్చిపోయి గ్రీష్మకి వెనక సీటేగా యిచ్చింది. యివన్నీ చిన్నచిన్నగా కనిపిస్తాయి కానీ చాలా నొప్పిస్తాయి. యిరిటేట్ చేస్తాయి. అలా వొకొక్కటిగా ఆలోచిస్తుంటే మీనాక్షిగారికి గ్రీష్మ యెదుర్కొంటున్న యిరుకు అర్థమవ్వసాగింది.

'గ్రీష్మతో మాటాడాలి,' అనుకొంటూ పక్కకి చూసేసరికి ధాన్య లేదు. యేమైయిందబ్బా అనుకొంటుండగా, " మామ్ః బాగుందా" అంటూ కొత్త ట్యూనిక్ చూపిస్తూ మెరిసే కళ్లతో.

"యెక్కడిది?"

"మొన్న ఆన్‌లైన్ ఆర్డర్ యిచ్చానుగా... డెలివరీ చేస్తున్నట్టు కాల్ చేశాడు. యీగర్లీ వెయిటింగ్. యిప్పుడే డెలివరీ చేశాడు. నువ్వు సీరియల్లో యిన్వాల్ అయిపోయావ్. కాలింగ్‌బెల్ వినిపించలేదు నీకు. బాగుందా..." టీనేజ్ సంబరం.

అవును... గ్రీష్మ కూడా యిలానే పెరిగొచ్చింది కదా... అసలు కాసేపు క్రితం తనతో మాటాడిన సీరియస్ విషయాలే గుర్తులేనంతగా ఆ కొత్త బట్టల రంగుల్లో మునిగిపోయింది ధాన్య. యిలాంటి సంతోషపు గెంతుల్ని గ్రీష్మ వేయటం తనెప్పుడు చూడలేదు.

"గ్రీష్మతో మాటాడాలి," అన్నారామె.

"యేమైనా అంటావా?"

"ప్చ్... యెప్పుడు మొబైల్, ట్వీట్స్, యఫ్‌బియేనా యింట్లో మనుష్యులు పట్టరా అని మిమ్మల్ని అంటాం కానీ వొక్కోసారి మేం కూడా సునిశితమైనా చూపుని కోల్పోతుంటాం. మారిపోతున్న స్పేస్ యాక్వేషన్ని పట్టుకోవటంలో నేను ఫెయిల్ అయినట్టు," అన్నారామె.

ధాన్య కాల్ చేసింది గ్రీష్మకి.

"సారీ గ్రీష్మా. యింటికి రా. నా కొడుకే కానీ మగపిల్లాడేగా. యిగో

వస్తుంది. అప్పుడు డీల్ చేయలేం. దా యింటికి. యెవరి మనసు కష్టపెట్ట కుండా నీకు నచ్చిన యింట్లో నీతో పాలు పొంగించే బాధ్యత నాది...'' అన్నారామె.

ఆమె ఫోన్ పెట్టేశాక, ''మామ్, నేనింత కాంప్లికేషన్ని ఫేస్ చేయలేను. డీల్ చేయలేను. నాకు యిలాంటివన్నీ ముందే మాటాడి పెళ్లి చేయ్౯'' అంది ధాన్య.

''యెన్ని చూసి చేసినా చిన్నిచిన్ని ప్రాబ్లమ్స్ వస్తునే వుంటాయ్. నీకున్న వంట బద్ధకానికి వంటగదిని హోల్డ్చేసే అత్తగారే నచ్చవచ్చు. నీకు వంట రాకపోవటం ఆమెకి నచ్చకపోవచ్చు. నిన్ను వేరే పెట్టాలనుకోవచ్చు. అప్పుడు నీకు వెళ్లాలనిపించకపోవచ్చు. చెప్పలేం. నేను చెయ్యగలిగిం దొక్కటే, వీలైనంతగా అర్థం చేసుకొనే అత్తమామల్ని వెతకటమే. అదీ యేమంత సులువు కాదనుకో,'' అన్నారామె.


కాలింగ్ బెల్ సవ్వడి.

గ్రీష్మ లోపలికి వచ్చింది.

ఆమె చూపులు మెరుస్తున్నాయ్... ఆ మెరుపుని చూస్తు మీనాక్షి గారు తనెప్పుడు యింతకు ముందు గ్రీష్మలో చూడని మెరుపు... వొకప్పుడు తను కోల్పోయిన మెరుపు. ధాన్యలో నిత్యం విరిసే మెరుపు.

*చినుకు మాసపత్రిక, అక్టోబర్ 2013*

# మదర్‌హుడ్ @ రియాల్టీ చెక్



వోన్... టూ... త్రీ...

సైలన్స్ ఆన్ ద ఫ్లోర్... స్టార్ట్ కెమెరా...

"మీ పేరు..."

"సత్యవతి."

"వయస్సు..."

"26."

"మీ వూరు..."

"చింతపేట."

"యే జిల్లా..."

"మధిర దగ్గర."

"యీ వూరు యెప్పుడు వచ్చావ్..."

"ఐదేళ్లయింది."

“యెందుకొచ్చావ్...”

“పనికోసం.”

“పెళ్లయ్యిందా...”

“ఆఁ”

“యెన్నాళ్లయింది...”

“యేడేళ్లయింది.”

“మీ ఆయనేం చేస్తాడు...”

“మీకెంతమంది పిల్లలు...”

“వొక బాబు.”

“నువ్వు యీ పని చేస్తున్నట్టు మీ యింట్లో యెవరెవరికి తెలుసు...”

“అందరికి తెలుసు.”

“అందరూ అంటే...”

“మీ అత్తగారికి.”

“తెలుసు.”

“తెలుసా... వాళ్లేం అభ్యంతరం చెప్పలేదా...”

“లేదు.”

“యెందుకని...”

“యిందులో అభ్యంతరం చెప్పటానికి యేముంది మేడమ్...”

“యిందులోకి యెందుకొచ్చావ్...”

“యీ పని బాగుంటుంది.”

“బాగోటం అంటే...”

సత్యవతి ఫక్కున నవ్వింది. నోటికి చీరచెంగు అడ్డు పెట్టుకొని తిరిగి తిరిగి నవ్వింది.

“కట్ కట్ కట్...” రూధర్ అరిచాడు. రెండు చేతుల వేళ్లని రెస్ట్‌లెస్‌గా నలుపుకొంటూ, “యేమడిగావ్... యెందుకు నవ్వుతోంది... యేమవుతోంది,” రెస్ట్‌లెస్‌గా అడిగాడు.

సత్యవతి చెపుతోంది ట్రాన్స్‌లేట్ చేస్తున్న సందీప, “వూరికే తనకి నవ్వొచ్చింది. యింతసేపు సీరియస్‌గా కెమెరాని ఫేస్ చేయటం వాళ్లకి అలవాటు వుండదు కదా,” అంది.

“వోకే... వోకే... స్టార్ట్...” రెండు చేతుల్ని విదిలిస్తూ అన్నాడు రూథర్.

“వొన్... టూ... త్రీ... సైలన్స్ ఆన్ ద ఫ్లోర్... స్టార్ట్ కెమెరా...” అన్నాడు రూథర్.

సత్యవతి నవ్వుని అతికష్టం మీద ఆపుకొంటూ కెమెరా వైపు తిరిగింది.

“అసలు నీకు యీ పని విషయం చెప్పింది యెవరు...”

“మా యింటి పక్కన వుండే చంద్రావతి చెప్పిందండి...” అని ఆగి మళ్లీ వచ్చే నవ్వుని ఆపుకొంటూ, “మేడమ్, యేం చెప్పాలో తెలుసు... మీరు ప్రశ్నలు అడగకుండానే చెప్పైనా... తొందరగా అయిపోతుంది,” అంది సత్యవతి.

సందీప వెంటనే ట్రాన్స్‌లేట్ చేయకుండా యేం చెప్పాలా అని ఆలోచిస్తుండగానే రూథర్ తిరిగి అసహనంగా యేంటని అడిగాడు.

సత్యవతి చెప్పింది సందీప రూథర్‌కి చెప్పింది.

“చెప్పమను.”

చెప్పమంది సందీప.

“చంద్రావతి యీ పని చేయకముందు హైటెక్ సిటీలో వో రెండు ఫ్లాట్స్‌లో వంట చేస్తుండేది. తనే నేనీ వూరుకొచ్చిన కొత్తలో వో రెండు యిళ్లల్లో వంటపని యిప్పించింది. తను వంటపని చేస్తూనే కొన్నాళ్లు యీ పని చేసింది. వంటపని కంటే యిందులో డబ్బులు యెక్కువ వున్నాయని యీ పనిలోకి వచ్చింది. ‘సత్యా, నీకు చాలా బాధ్యతలున్నాయి, వంట పనిలో వచ్చే డబ్బులు సరిపోవు. యీ పని చేస్తే నాలుగు డబ్బులొస్తాయి,’ అందోరోజు. ఆలోచిస్తే నిజమేననిపించింది. తనతో యీ హాస్పిటల్‌కి వచ్చాను. చిన్న డాక్టరమ్మ అన్ని విషయాలు చెప్పింది. యిందులో నాదేం వుండదు. యెవ్వరితోను పడుకోనక్కర్లేదు. తొమ్మిది నెలలు మోస్తే ఆ బిడ్డని వాళ్లకి యిచ్చేస్తాం. డబ్బులకి డబ్బులు... మా కష్టాలు తీరుతాయి. యేదో బిడ్డలు లేనివాళ్లకి పిల్లల్ని యిచ్చిన పున్యం... మా ఆయనకి చెప్పి చిన్న డాక్టరమ్మ దగ్గరకి తీసుకొచ్చాను. చిన్న డాక్టరయ్య మా ఆయనతో మాటాడాడు. మా అత్తమ్మకి చెప్పాం. కూతురి పెళ్లికి లక్ష యిమ్మంది.

సరేనన్నాం. అంతే... మేడమ్. యేమంత పెద్ద విషయం లేదిందులో...''
అని తిరిగి నవ్వింది సత్యవతి.

సందీప ట్రాన్స్‌లేట్ చేసింది విని, ''వ్వా... వో...'' అంటూ నానా రకాలుగా ఆశ్చర్యాన్ని ప్రకటించి రూథర్, ''యిండియాలో ఫ్యామిలీ వాల్యూస్ చాలా యింపార్టెంట్ అంటారు. సెంటిమెంట్స్, మోరల్స్ చాలా యెక్కువంటారు. పీపుల్ జడ్జిమెంటల్ అంటారు. మీరు మదర్‌వుడ్‌కి చాలా యింపార్టెన్స్ యిస్తారంటారు. మరి వీళ్లేంటీ యిదంతా చాలా సింపుల్ అని చెపుతున్నారు... ఫైండౌట్... యింకా యింకా డిగ్ చేయ్౯...'' అన్నాడు రూథర్.

సందీప ముందు తెల్లబోయింది. అవన్నీ అడగాలా... అడిగితే యేమనుకుంటారో... అసలు అంత పెద్ద విషయాలు అర్థం అవుతాయా...

''వాళ్ల అవసరాలు సరే... కానీ యిది పిల్లలతో ముడిపడి వుంది కదా... మీ చుట్టాలు, మీ చుట్టుపక్కల వాళ్లు యేం అనలేదా,'' అడిగింది సందీప.

''పిల్లలు లేనివాళ్లకి పిల్లలు వచ్చేట్టు చేయటానికి హెల్ప్‌గా వుండటం మంచిదే అన్నారు... అసలు యీ మంచిపనిని దేముడిచ్చిన అవకాశంగానే చూస్తాం మేడమ్...'' అంది సత్యవతి.

''మీకెన్ని డబ్బులు యిస్తారు,'' అడిగింది సందీప.

''మా తిండికి నెలకి పదివేలిస్తారు. మందులకి, పరీక్షలకి వాళ్లే పెట్టుకుంటారు. యివికాక డెలివరీ అయ్యాక మూడు లక్షలు యిస్తారు,'' అంది సత్యవతి.

సందీప యింగ్లీష్‌లోకి ట్రాన్స్‌లేట్ చేసింది.

''మీరలా తొమ్మిది నెలలు మోసాక బిడ్డని యిచ్చేయటానికి బాధనిపించదా...''

''బాధా... బాధేముంది...''

''అన్నాళ్లూ మీలో భాగంగా వుండి...''

''ముందే చెపుతారుగా... అందులో మాది అనేది యేముంది. కొన్నాళ్లు మా కడుపుని అద్దెకి యివ్వటం తప్ప,'' అతి మామూలుగా చెప్పింది సత్యవతి.

అంతే సాధారణమైన స్వరంతో ట్రాన్స్‌లేట్ చేసింది సందీప.

"యిలా యిప్పటికి యెంతమందిని కన్నావ్."

"వేరేవాళ్ల కోసమా... యిది రెండోది."

"మొదట కన్న బిడ్డ తల్లిదండ్రులు యెవరు."

"తెలీదు. మాకు వాళ్లని చూపించరు. యిప్పుడు కూడా వాళ్లెవ్వరో మాకు తెలీదు... అసలు పుట్టిన పిల్లలని మాకు చూపించరు. పుట్టింది ఆడో మొగో కూడా తెలీదు," అంది సత్యవతి.

"యెంత కాదనుకున్నా కాస్త బాధ వుంటుంది కదా అలా బిడ్డని యిచ్చేయటానికి..." రూధర్ కోసం అడిగింది సందీప.

సత్యవతి మళ్లీ పైటచెంగుని నోటికి అడ్డు పెట్టుకొని నవ్వుతూ, "బిడ్డని యిచ్చినప్పుడు చాలా బాధ వుంటుంది... పిల్లల్ని యిచ్చినప్పుడు చాలా యేడుస్తాం... పేదరికం వల్ల యిలాంటి పనికొచ్చాం. డబ్బున్నోళ్లు మమ్మల్ని, మా పేదరికాన్ని వాడుకొంటున్నారు, దోచుకొంటున్నారు అని చెప్పమంటారా... పోయినసారి వో టీవీవాళ్లు యిలానే చెప్పమన్నారు. మాకేం బాధ లేదంటే అలాక్కాదు... చాలా యేడుస్తాం... వదల్లేక వదల్లేక పిల్లలని వదుల్తున్నాం... బాగా గుర్తొస్తారు... వొక్కోసారి బిడ్డని యివ్వమని గొడవ చేస్తామని, కొన్నిసార్లు పిల్లల్ని పట్టుకొని పారిపోతామని చెప్పమన్నారు. యిలా పిల్లల్ని కనడానికి వచ్చే ఆడాళ్లు యిలాంటి గొడవలు, మోసం చేస్తారని, యేడుస్తారని యేంటేంటో చెప్పమంటారు మేడమ్... యిలా చెపితే కానీ ప్రోగ్రామ్ చూడరంట. యేదో అన్నారు మేడమ్... యేంటే అది నాగలక్ష్మి... యేదో యింటరస్టింగ్..." అని యింటర్వ్యూస్ యివ్వడానికి వచ్చి పక్కన కూర్చుని యీ యింటర్వ్యూ చూస్తున్న వాళ్లవైపు చూస్తూ అంది సత్యవతి.

అక్కడున్న నలుగురు వొకరి మొకాలొకరు చూసుకుంటూ, "అదేనే... స్టోరీ... యేం స్టోరీ... యేదో అన్నాడబ్బా," వాళ్లల్లో వాళ్లు ఆ మాటని గుర్తు చేసుకోడానికి ప్రయత్నిస్తుంటే, "హ్యూమన్ యింట్రెస్టెడ్ స్టోరీ," అని అడిగింది సందీప.

"ఆఁ అదే మాట... అలాంటిదే... ఆఁ అదే అదే..."

రూథర్ సందీప ట్రాన్స్‌లేట్ చేయటం లేదేంటాని, ట్రాన్స్‌లేట్ చేయమని సైగ చేశాడు.

“దీనికి సంబంధించింది కాదు. పోయినసారి టీవీవాళ్లకి యిచ్చిన యింటర్వ్యూ చెప్తున్నారు,” అంది సందీప.

“వీళ్లు యింతకు ముందు టీవీ యింటర్వ్యూ యిచ్చారా...”

“వూఁ” అంది సందీప.

“అదెలా... నే యెప్పుడూ యే యింటర్వ్యూ యివ్వని ఫ్రెష్ ఫేసెస్ కావాలని కోఆర్డినేటర్‌కి చెప్పాను,” కోపంగా అన్నాడు రూథర్.

షూటింగ్ ఆపి కోఆర్డినేటర్ సుధకి ఫోన్ చేశాడు.

విషయం చెప్పాడు.

“అందరూ కాదు, యెవరో వొకరో యిద్దరో యిచ్చారు. అయినా వాళ్లు అప్పుడు ఫేసెస్ చూపించలేదు. యిప్పుడిది ఫారెన్ కంట్రీస్ కోసం కదా అందుకని కొంతమంది ఫేసెస్ చూపించటానికి వొప్పుకొన్నారు...” అంటూ అతన్ని శాంతింపజేసి, “ఫ్రెష్ ఫేసెస్ అంట. అసలు యీ డాక్యుమెంట్రీస్ వాళ్లు యిచ్చే డబ్బులే తక్కువ. యింటర్వ్యూస్ అని వచ్చే వాళ్లందరికి కొత్త ఫేసెస్ అంటే యెలా... అంతకుముందు యింటర్వ్యూస్ యివ్వనివాళ్లు కావాలంటే యెలా... అంతమంది సరొగేట్ మదర్స్ వుండొద్దా... కొంతమంది డాక్టర్స్ అసలు యింటర్వ్యూస్‌నే యెంకరేజ్ చేయరు. యేదో యీ డాక్యుమెంటరీస్‌ని కొంతమంది ఫారెనర్స్‌ని అట్రాక్ట్ చేయటానికి యేదో వాళ్ల బిజినెస్ కోసం వీటిని యెంకరేజ్ చేస్తారు కానీ, సరొగేట్ మదర్స్‌కి వాళ్ల ప్రైవసీ ముఖ్యమే కదా...” తనని రూథర్ ప్రశ్నించటం తట్టుకోలేని సుధ పైకే యీ మాటలు అంటూ విసుక్కొంది.

యెదురుగా కూర్చుని అఫీషియల్ మెయిల్స్‌కి జవాబులు రాస్తున్న ఆమని, “వీళ్లకి వాళ్లు పే చేస్తారా, యింటర్వ్యూ యిచ్చినందుకు,” అని అడిగింది.

“పే చేయకపోతే వొక్కరూ రారు మాటాడరు,” అంది సుధ.

“వీళ్లందర్నీ నువ్వెలా కాంటాక్ట్ చేస్తావ్,” క్యూరియస్‌గా అడిగింది ఆమని.

''నా వుద్యోగమే అదికదా... యెవరు యే సబ్జెక్ట్ పై డాక్యుమెంటరీ అయినా, ఫిల్మ్ అయినా, టీవీవాళ్ల స్టోరీస్కైనా యిలా ఆయా మనుష్యులని ప్రొవైడ్ చేయటమేగా...'' అంది సుధ.

''వొక్కో యేరియా యెన్నెన్ని రకాలుగా యెంతెంతమందికి జాబ్స్ ప్రొవైడ్ చేస్తోందో కదా...'' అంది ఆమని.

సుధ నవ్వి, ''జాబ్సే కాదు, వీటిపై వుద్యమాలు కూడా బిల్డ్ చేస్తారు తెలుసా... వాటికి కూడా ఫండ్స్ వస్తాయి,'' అంది.

''కథలు కూడా వస్తాయి... నిజంగానే యిందులో మోసం వుందా,'' తెలుసుకోవాలనే నిజాయితీగా అడిగింది ఆమని.

''చూసే చూపుబట్టి వుంటుంది. నాకైతే యిన్వేషన్ని యెలా డినైయ్ చేస్తారనిపిస్తుంది. చాలామంది దీనివలన హ్యాపీగా వున్నప్పుడు యెందుకు యెవరైనా దీనిని క్రిటిసైజ్ చెయ్యాలి. వండర్ఫుల్ కదా పిల్లలు లేనివాళ్లకి పిల్లలు కలగటం,'' అంది సుధ.

తిరిగి రూథర్ ఫోన్.

''వీళ్ల యిళ్లు, యింట్లో వాళ్లని యింటర్వ్యూ చెయ్యాలి.''

''ముందు మీరు అడిగిన ప్యాకేజ్లో యిది లేదుకదా. వాళ్లని వొప్పించటం కష్టం కావచ్చు. వోకే ట్రై చేస్తాను. ఫోన్లో కన్విన్స్ చేయలేను. అక్కడికి వస్తాను. యిక్కడేం వెహికిల్ లేదు. మీ దగ్గరేమైనా వుందా...'' అడిగింది సుధ.

వింటున్న సుధకి నవ్వొచ్చింది. సుధ కారు యీ ఆఫీస్ పార్కింగ్ లోనే వుంది. కానీ తన కారులో వెళ్లితే వాళ్లు పెట్రోల్ డబ్బులు యివ్వరు. వాళ్ల పనికదా... తనెందుకు ఖర్చు చెయ్యాలని వుంటుంది. వాళ్లు వెహికిల్ పంపిస్తామని చెప్పారు.

సుధ షూటింగ్ లొకేషన్కి వచ్చింది.

సత్యవతి, నాగలక్ష్మి యింటి దగ్గర షూటింగ్కి వొప్పుకోలేదు. పేమెంట్ యిస్తామంది సుధ. కాస్త మెత్తబడింది నాగలక్ష్మి.

సత్యవతి ఆలోచనలోపడింది. తన అత్త వూర్నుంచి మొన్నే వచ్చింది. వీళ్లు వస్తే తను చేస్తున్న పని బయటపడిపోతుంది. యింటి దగ్గరైతే మరి కాసిన్ని డబ్బులు వస్తాయి. వాటిని పోగొట్టుకోకూడదు. ఆఁ యిల్లు షూట్

చేసుకొంటే యేమవుతుంది. తన అత్తకి యిందిరమ్మ యిళ్లు గురించి సినిమా అని చెపితే సరి... కానీ యీ ట్రాన్స్‌లేటర్ మేడమ్ వుంది కదా... ఆవిడకి ముందే చెప్పాలి. తన అత్తని యింటి లోన్, పావలా వడ్డీ యిలా యేవో అడగమని చెప్పాలి. వాళ్లకి యింగ్లీష్‌లో యీ పని మంచిదే, బిడ్డలు లేనివాళ్లకి బిడ్డలని యివ్వటం మంచిదే అని చెప్పమనాలి. సుధకి విషయం చెప్పింది సత్యవతి.

సుధ ఆ విషయాన్నే సందీపకి చెప్పింది.

"నేనలా చేయలేను," అంది సందీప.

"అరే యిందులో నువ్వంత చేయలేనిదేముంది..." ఆశ్చర్యంగా అడిగింది సుధ.

"మా కన్వర్సేషన్ అంతా అందులో రికార్డ్ అవుతుంది. తెలుగు తెలిసినవాళ్లు యెవరైనా వింటే నా క్రెడిబిలిటీ యేమవుతుంది... సారీ ఐ కాన్ట్..." అంది సందీప.

"మా ఆర్గనైజేషన్‌కి ఫెసిలిటేటర్స్ కోసం చాలామంది కాంటాక్ట్ చేస్తారు. మీ కాంటాక్ట్ నెంబర్ యివ్వండి," అంది సుధ.

తను మనుష్యులని యెలాగైనా దారిలో పెట్టగలనని సుధకి గొప్ప నమ్మకం.

సందీప తన కార్డ్ యిచ్చింది.

"యే యే లాంగ్వేజెస్‌కి ఫెసిలిటేటర్స్‌గా వుంటారు," అడిగింది సుధ.

"ఫ్రెంచ్, స్పానిష్..." అంది సందీప.

రూథర్ అసహనంగా, "యేమన్నారు... వాళ్ల యిళ్లకి వెళుతున్నామా," అడిగాడు.

"కన్విన్స్ చేస్తున్నాం..." అంది సుధ.

"పే చేస్తామని చెప్పు."

"చాలా అడుగుతున్నారు రూథర్," కాస్త అతనివైపు సింపథిటిక్‌గా చూస్తూ.

"మాటాడు," అన్నాడు రూథర్.

"వోకే..." అని సందీప వైపు తిరిగి, "నీ ప్యాకేజ్‌లో వీళ్ల యిళ్ల యెసైన్ మెంట్ లేదు కదా... మీది మాటాడనా," అని అడిగింది సుధ.

"థాంక్ యూ... మాటాడతాను," అంది సందీప.

'అబ్బో చాలానే వుంది,' అనుకొంది సుధ.

సరొగేట్ మదర్స్ చెప్పిందానికి కాస్త తన టైమ్ వాల్యూని కలిపి యెంత డబ్బులు అవుతాయో చెప్పింది సుధ. వాళ్లకి యివ్వాల్సినవి యిచ్చి మిగిలినవి తీసుకొందాం అనుకొంది. యిప్పుడీ సందీపని వొప్పించకపోతే సత్యవతి యింటర్వ్యూ వుండదు. ఆ మేరకు డబ్బులు పోతాయి. కానీ మరీ భయస్తురాలిలా వుంది. యీ ఫీల్డ్‌కి కొత్తనుకొంటా... యెలా వొప్పించటం...

నాగలక్ష్మి యింటికి ముందు వెళదాం అనుకొన్నారు.

సందీప తన రెమ్యూనరేషన్ విషయం మాటాడింది.

"డే కాల్షీట్ కదా... యెక్స్‌ట్రా యెలా అవుతోంది," అడిగాడు ప్రొడక్షన్ మేనేజర్.

"యెనిమిది గంటలు కదా... కాల్షీట్. యిప్పటికే సెవన్ అవర్స్ అయింది. అక్కడికి వెళ్లి యింటర్వ్యూస్ ఫినిష్ చేయటానికి యెంత టైమ్ అయితే యెయిట్ అవర్స్ తరువాత నుంచి వోటీ అవుతుంది. మీరు అవుట్‌డోర్ మాటాడలేదు కదా. యిది అవుట్‌డోర్," స్పష్టంగా చెప్పింది సందీప.

కాసేపు తర్జనభర్జన పడ్డాక కాస్త బేరం ఆడారు. సందీప తన రెమ్యూనరేషన్ తగ్గించటానికి వొప్పుకోలేదు.

'గట్టిదే... తను ఫీల్డ్‌లోకి వచ్చిన కొత్తలో చాలామంది కాంటాక్ట్స్ కోసం ఫ్రీగా పనిచేసేది. యీ కొత్తపిల్లలు గడుగ్గాయిలు. వీళ్లెవ్వరూ కాంటాక్ట్స్ కోసం పాకులాడటంలేదు,' అనుకొంది సుధ.

సత్యవతి విషయంలో యీ సందీపని యెలా కన్విన్స్ చేయాలా అని ఆలోచిస్తోంది సుధ. మనీ వర్కౌట్ కాలేదు. కాంటాక్ట్స్ మీద గురి లేదు. తను వర్క్ చూపించగలనని చెప్పటాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. యెలా... పోనీ రూథర్‌కే విషయం చెప్పి సందీప అడిగే యిందిరమ్మ యిళ్లో, పావలా వడ్డీనో అడగటాన్ని సత్యవతి అత్తగారి ప్రశ్నలని, జవాబు

లని రికార్డ్ చేయకుండా సందీప చేసే ట్రాన్స్‌లేషన్ని మాత్రమే రికార్డ్ చేయమని చెపితే అప్పుడు సందీపకి యే అభ్యంతరం వుండకపోవచ్చని పించి, అదే విషయం సందీపకి చెప్పింది.

సుధ చెప్పింది వింటున్న సందీపకి సడెన్‌గా, 'అరే రూథర్‌కి కావల్సిందే అది. యింట్లోవాళ్లకి తెలీకుండా జరుగుతోందనే విషయం అతనికి కావాలి. యెందుకు రూథర్‌కి ఆ అవకాశం యివ్వాలి. తనే కొంత కాంప్రమైజ్ కావచ్చు. కానీ యీ విషయం సుధకి తెలీనివ్వకూడదు. వాళ్లతో అలా మాటాడించి తను మరిన్ని డబ్బులు చేసుకొంటుంది. వీళ్లకి యిచ్చే దాని కంటే మిగిలినవాళ్లు చేసుకొనే డబ్బులే యెక్కువగా కనిపిస్తున్నాయి.

యింతలా ఆలోచిస్తోందేంటి... యిదేమంత పెద్ద విషయం అనుకొంది సుధ.

''వాళ్లతో యెందుకులెండి... మేనేజ్ చేస్తాను,'' అంది సందీప.

నాగలక్ష్మి యింటికి వెళ్లారు.

సుధ రాలేదు.

''షూటింగ్ అంటే పర్మిషన్ వుందా,'' అడిగాడు ఆ బస్తీలోని కుర్రాడు.

''పోరా... మా యింటికే కదరా,'' అంది నాగలక్ష్మి.

''వీళ్లని వూరికే వదలకూడదక్కా... మనం యెంత పేదలమో చూపించి మస్తుగా డబ్బులు, అవార్డులు తెచ్చుకుంటారక్కా,'' అని, ''నో పర్మిషన్ నో షూటింగ్,'' అన్నాడు.

ఆ కుర్రాడికి కొంచెం డబ్బులు యిచ్చి నాగలక్ష్మి యింటికి వెళ్లారు.

చాలా చిన్న యిల్లు. యిరుకైన ఆ యింటిని కెమెరాలో బంధించారు.

నాగలక్ష్మి అత్తని చూస్తూ, 'యింత ముసిలిగా అత్తగారేంటో,' అనుకొంటూ, ''మీ కోడలు యీ పని చేయటం యిష్టమేనా,'' అడిగింది సందీప.

''ఆఁ'' అందామె.

''మీకేం అభ్యంతరం లేదా,'' తిరిగి అడిగింది సందీప.

''యెందుకు...'' అందామె.

“మీకీ విషయం చెప్పినప్పుడు యేమనిపించింది.”

“యేం అనిపించలా.”

కట్ కట్... అన్నాడు రూధర్.

“అలా షార్ట్ ఆన్సర్స్ యింట్రెస్టింగ్‌గా వుండవ్. యెలాబ్రేట్ చేయమను,” అన్నాడు.

నాగలక్ష్మికి చెపితే నవ్వి, “నేనంతే చెప్పమన్నాను. యింకా చెప్పమంటే ఆవిడ చెప్పదు. నాకిచ్చిన దాంట్లో తనకి కూడా కాసిన్ని డబ్బులు యిస్తానంటే వొప్పుకొంది,” అంది.

“యెందుకు చెప్పదు,” అడిగాను.

“తనకి నాకు తెలిసినంత విషయం తెలవదు,” అంది.

“అసలు తను మీ అత్తగారేనా,” చప్పున అడిగింది సందీప.

“నా మొగుడు నన్ను, కూతుర్ని వదిలి యెటో పోయాడు మేడమ్. నా బాయ్‌ఫ్రెండ్ మేనత్త. యేదో సుధా మేడమ్ చెప్పారని...” ఆగింది.

రూధర్ అసహనంగా అటూయిటూ తిరుగుతున్నాడు.

“ఆమె హెల్త్ బాగాలేదు. అంతకంటే మాటాడలేదు,” చెప్పింది సందీప.

“అలా అంటే యెలా... యిది చాలా ముఖ్యం కదా...” మరింత అసహనంగా అన్నాడు.

“వాళ్లు చెప్పింది చెప్పటం తప్ప నేనేం చేయగలను.”

“మోటివేట్ హర్.”

“ఐ కాన్ట్... నా యేరియా కాదు.”

“వో మైగాడ్... టైమ్ అయిపోతోంది... క్విక్...”

సందీపకి చికాకు వచ్చేసింది.

“యిందులో రిస్క్ వుంది కదా... ప్రెగ్నెన్సీ రిస్క్ కదా... యీ ప్రొఫెషన్‌లోకి యెందుకు రానిచ్చారు మీ కోడల్ని,” అడిగింది.

ఆవిడ అయోమయంగా నాగలక్ష్మి వైపు చూసింది.

“కానీ యిది మరొకరి సంతోషం కోసం మీ ఆరోగ్యాన్ని, జీవితాన్ని రిస్క్ చేయటం కదా,” తిరిగి అడిగింది సందీపని.

"మేడమ్... మా ఆయన... అదే బాయ్‌ఫ్రెండ్ ఆటో నడుపుతాడు. యేరోజు యెక్కడ యేం జరుగుతుందో తెలీదు. రత్నం వాళ్లాయన పెద్ద పెద్ద బిల్డింగ్స్‌కి రంగులేస్తాడు. యెప్పుడైనా కింద పడొచ్చు. నీలవేణి మగాళ్లతో వెళుతుంది రాత్రుళ్లు. యే తాగుబోతోడు యేం చేస్తాడో తెలీదు. మాకోసం పిల్లల్ని కంటాం కదమ్మా. ప్రమాదం అనుకొంటామా... యెందులో ప్రమాదం లేదు... బతుకే ప్రమాదం..." నవ్వుతూ అంది నాగలక్ష్మి.

సందీపకి యింకేం మాటాడాలో తెలీలేదు.

రూధర్ నాగలక్ష్మి మొగుడు గురించి అడిగాడు. సందీప అడిగింది.

"వూరెళ్లాడు," అంది నాగలక్ష్మి.

చెప్పింది సందీప.

"పెళ్లి ఫోటో చూపించమను. ఆ విజువల్స్ తీసుకొంటాం."

వూర్లో వున్నాయంది నాగలక్ష్మి. సందీపకి నవ్వొచ్చింది.

పెద్దగా నిట్టూర్చి ఆ యింటివి, స్లమ్‌వి విజువల్స్ తీసుకొని అక్కడ నుంచి బయలుదేరాడు రూధర్.

మర్నాడు సత్యవతి యింటికి వెళ్లాలనుకొన్నారు. సుధ ఆమెని వొప్పిస్తానని చెప్పింది.

రూధర్ హోటల్‌కి వెళ్లాడు.

సందీప హాస్టల్‌కి వచ్చింది.

రూమ్మేట్ నిశాంతి ఫోన్‌లో బిజీగా వుంది. స్నానం చేసొచ్చి కిచెన్‌లోకి వెళ్లి డైట్‌కోక్‌ని తెచ్చుకొంది సందీప.

అప్పటికి ఫోన్ మాట్లాడటం పూర్తయిన నిశాంతి యెలాగైంది నీ షూట్ అని అడిగింది. చెప్పగలిగినన్ని చెప్పింది సందీప. నిశాంతి వో యన్జీవోలో జాబ్ చేస్తోంది. గత ఆరునెలలుగా యిద్దరూ యిదే వర్కింగ్ వుమెన్స్ హాస్టల్‌లో వుంటున్నారు.

"యింట్రెస్టింగ్... అలా లేడీస్ మేం సరొగేట్ మదర్స్‌మని చెపుతున్నారా... కెమెరా ముందుకు వస్తున్నారా..." కాస్త ఆశ్చర్యంగా అడిగింది నిశాంతి.

“యిందులో అంత ఆశ్చర్యపోవల్సింది యేముంది... కెమెరాకి ఫేస్ చూపించలేనంత కాని పనేం చేస్తున్నారు,” అడిగింది సందీప.

నిశాంతి కాసేపు ఆలోచించి, “యిందులో యెక్స్‌ప్లాయిటేషన్ వుంది. యెవరికైనా బేబీ కావాలనుకో సరొగేట్ మదర్స్‌గా వాళ్ల యిళ్లల్లో వాళ్లు రారు. అంటే వాళ్ల అక్కచెల్లెళ్లు, వదినలు, మరదళ్లు... యిలా దగ్గరైన వాళ్లు, చుట్టాలు, ఫ్రెండ్స్ రారు. తెలియనివాళ్లు, అదీ యిలా చిన్నచిన్న పనులు చేసుకొనేవాళ్లు మాత్రమే వస్తారు. యెందుకని...”

“వాళ్లకేం అవసరం... అయినా తొమ్మిది నెలలు, అంతకుముందు టెస్ట్‌లకి వెళ్లాలి, యిదంతా టైమ్ కన్స్యూమింగ్ ప్రోసెస్. అసలు వొక బేబీని కనటానికే బోల్డన్ని యెరేంజ్‌మెంట్స్ చేసుకోవాల్సి వస్తుంది. మరొకరి కోసం బేబీనా... అంత మనీ నీడ్ యేముంటుంది చెప్పు.”

“యెగ్జాట్లీ... అదే పాయింట్... మనీ యివ్వగలిగినవాళ్ల కోసం యిలా యీ వుమెన్ తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టాలి. నీకో విషయం తెలుసా! మనీ సంగతి వదిలై. మన వోన్ సిస్టర్ కోసం కూడా మనం యీ పని చేయం. యెందుకని... హజ్బెండ్‌ని వొప్పించాలి. మొత్తం చుట్టాల్లోనే యీ విషయం టాకింగ్ పాయింట్ అవుతుంది. అసలు యీ హజ్బెండ్, చుట్టాలు వదిలై. సొంత సిస్టర్ కోసం మనం యీ సరొగేట్ మదర్స్‌గా వుండటానికి యిష్టపడతామా... పడం. మా యింట్లోనే యిలాంటి సిట్యు యేషన్ వచ్చింది. మా వదిన కోసం. యే వొక్కరూ యేవైపు నుంచి ముందుకు రాలేదు. ప్రేమలు, రక్తసంబంధాల కంటే సోకాల్డ్ విలువలు చాలా పెద్ద రోల్ పే చేస్తాయి. వాళ్లు మా స్టేట్‌లోనే వో యేజెన్సీ నుంచి సరొగసీకి వెళ్లారు. యీ వుమెన్ చేస్తుంది సాధారణమైన పనికాదు. వాళ్లకి ప్రైవసీ అనేది వుంటుంది కదా. యిలా తెరకెక్కించాలనే గోలేమిటో...” అంది నిశాంతి.

“మేం చాలా బాధపడతాం పిల్లల్ని యివ్వటానికని చెప్పమంటాడు. వాళ్లు అదేం లేదంటారు,” నవ్వుతూ అంది సందీప.

“అజ్ఞానం... గ్లోరిఫైడ్ మదర్‌హుడ్ అతని బుర్రలోకి యెక్కించుకొన్నాడు. యిండియా అన్ని విషయాలలో యెంతో మారిపోయింది... రోజురోజుకి చాలా వేగంగా వెస్ట్రనైజ్ అయిపోతోంది. యింకా యింకా

అయిపోతుంది. మన ప్రేమలు, విలువలు, సెంటిమెంట్స్, లైఫ్‌స్టయిల్ క్షణాల్లో మారిపోతున్నాయి... యింకా యెప్పటి కాలం నుంచో యిండియాని చూడటం వీళ్లు మానుకోవాలి...''

''కానీ యిక్కడ చాలా పేదరికం వుంది...'' అంది సందీప.

''పేదరికం వేరేస్... స్టాండడాఫ్ లివింగ్‌లో చాలా చాలా వ్యత్యాసాలుంటాయి... అవి మరింత యెక్కువవుతాయి... సందీప, ఆ అమ్మాయిలని పరిచయం చేస్తావా...'' అడిగింది నిశాంతి.

''చేస్తాను... యెందుకు...''

''చాలాకాలంగా వోన్ యన్జీవో స్టార్ట్ చేద్దాం అనుకొంటున్నాను. యే యేరియాలో పనిచెయ్యాలా అని ఆలోచిస్తున్నాను కొంతకాలంగా... యిదింకా అన్‌టచ్డ్ యేరియా... యిండియా సరొగసీ హబ్ కాబోతోంది. చాలా దేశాలు దీన్ని బేన్ చేశాయి... యేపీ యెలాను మెడికల్ హబ్ కదా... చాలా స్కోప్ వుంది... ఫండ్స్ కూడా వస్తాయి...'' అంటూ లాప్‌టాప్ వోపెన్ చేసి గూగుల్లో సరొగసీ లా, ఫండింగ్ యెజన్సీస్ చకచకా యిన్ఫర్మేషన్ వెతుకుతోంది నిశాంతి.

నిర్ఘాంతపోయింది సందీప.

యిందులో యింత పొటన్షియల్ వుందా... తన అక్క కూడా వో యన్జీవోలోనే పనిచేస్తుంది... తామిద్దరు యిలాంటి ఆర్గనైజేషన్ని ఫ్లోట్ చేస్తే... ఫోన్ తీసుకొని రూమ్‌లోంచి బయటికి వచ్చింది సందీప.

అదే సమయంలో రష్ చూసుకొంటూ రూథర్, రేపు యెలాగైనా మరింత సెంటిమెంట్‌ని కొనాలి... సందీప కరెక్ట్ పర్సన్ కాదు... సుధ... యస్ సుధ... పేదరికం మదర్‌హుడ్‌ని యెలా బాధ పెడుతుందో చెప్పాలి... అతని కళ్ల ముందు రకరకాల కార్పెట్స్... యిన్‌క్లూడింగ్ రెడ్ కార్పెట్...

ఆరోజు నాగలక్ష్మి సంపాదించిన డబ్బులు తీసుకొని ఆమె బాయ్ ఫ్రెండ్ దోస్తులతో పబ్‌కి వెళ్లాడు.

అందరూ తినగా మిగిలిన చికెన్ బిర్యానీని నాగలక్ష్మి కోసం పార్సిల్ చేయించాడు.

యించుమించుగా అదే సమయంలో, “పోయినసారి డబ్బులన్నీ నువ్వే వాడుకొన్నావ్... యీసారి బంగారం పుస్తెలతాడైనా చేయించు కోవాలి...” అంటుంది సత్యవతి. ఆరోజు వచ్చిన డబ్బులతో మొగుడికి, అత్తకి కోడికూర వండింది.

కోడికూరని తింటూ, విస్కీని తాగుతోన్న అతను, “కాస్త ఆగవే,” అన్నాడు టీవీలో సినిమా చూస్తూ.

“కడుపులో బిడ్డ,” అంది సత్యవతి మెల్లగా. బయట పడుకొన్న అత్త పొరపాటున కూడా వినకూడదని.

“మర్చిపోయానే... యెవరి బిడ్డనో గుర్తుండటం లేదు. సరే... యీ ముక్క తిను,” అన్నాడు.

“నా బంగారం గొలుసు,” తిరిగి అంది సత్యవతి.

“నువ్వే బంగారమే... యింక బంగారం యెందుకే,” అంటూ బుగ్గ గిల్లాడు.

“ఆఁ యీ మాటలకేం కానీ యీసారి ఆ డబ్బులు నాకే...”


“మంచి పల్సర్ బండి వుందే...” చెపుతూనే వున్నాడు.

యీసారీ డబ్బు తనది కాదు... సత్యవతి మనసు నిట్టూర్చింది.

మరోసారి బిడ్డని మోస్తానంటే యీ డాక్టరమ్మ వొప్పుకోకపోవచ్చు... మరో యిలాంటి ఆసుపత్రిని వెతకాలా... ఆఁ దొరుకుద్ది... అనుకొంది సత్యవతి తన మెడవైపు చూసుకొంటూ, బంగారంతో మిలమిలా మెరవ బోదా...

*పాలపిట్ట మాసపత్రిక, జూన్ 2012*

# గాల్లో తేలినట్టుందే...



“వో మైగాడ్... మామా ఆర్ యు క్రేజీ... యీ హాలీడేస్‌కి మనమంతా ఆ వూరికా... నో వే... యిదిగో మా ఫ్రెండ్స్‌ంతా కలిసి న్యూ యియర్ సెలబ్రేషన్స్‌కి గోవా వెళ్ళాలని ప్లాన్ చేసుకున్నాం,” అంది సుస్మిత.

“అదికాదు సుస్మి... మనం న్యూ యియర్ నుంచి సంక్రాంతి వరకు మనూరిలోనే వుంటామని అక్కడందరికి చెప్పా. మనమీసారి వెళ్ళాల్సిందే. ఫ్రెండ్స్‌తో రాలేనని చెప్పై,” యెంత వద్దనుకున్నా నందిని స్వరంలో అథారిటీ ధ్వనిస్తోంది.

“బట్ నాతో మాటాడి చెప్పావా? లేదుగా. నీకెప్పుడో చెప్పా గోవా ఫ్రెండ్స్‌తో వెళ్ళాలి, వెళుతున్నానని. కాన్సిల్ చేసుకోలేను. అయినా నే రాకపోతేనేం... డాడీ, దీపు, నువ్వూ వెళ్ళొచ్చుగా,” చూడు నేనెంత తేలిగ్గా సమస్యని పరిష్కరించేశానన్న భావం సుస్మిత గొంతులో కదిలింది.

“అంతా వెళ్ళాల్సిందే సుస్మి,” తిరిగి ఖచ్చితంగా అంది నందిని.

“రియల్లీ, యు బికమ్ క్రేజీ. మొన్నామధ్య విజయవాడ తీసుకెళ్ళావ్. పరమ బోరింగ్ ప్లేస్. యిప్పుడేమో రాజమండ్రి. యిదిగో నీకంత నొస్టాల్జిగ్గా వెళ్ళు. బట్ నన్ను ఫోర్స్ చేయకు,” అంటుండగా యస్.యం.యస్. అలర్ట్ వినిపించింది. మెసేజ్ చదువుతూ, “బై మమా,” అంటూ మెసేజ్‌కి రిప్లై యిస్తూనే నల్లని పొడవాటి బ్యాగ్ చేతిలోకి తీసుకొని చెంగున గది లోంచి బయటికి దూకింది సుస్మిత.

నందినికి వొక్కసారిగా చికాకు పెరిగిపోయింది.

యేం పిల్లో. యీ పిల్లకి తల్లినన్న గౌరవం కూడా లేదు. ఫ్రెండ్స్.... ఫ్రెండ్స్... యెక్కడ్నుంచి పుట్టుకొస్తారో యీ ఫ్రెండ్స్... అయినా వాళ్ళని అనుకోవటం యెందుకు, యీ పిల్లకి బుద్ధి లేకపోతే... యెలా యీ పిల్లని దారికి తెచ్చుకోవటం... అనుకొంటుండగానే నందిని కళ్ళల్లోంచి టపటపా నీళ్ళు రాలాయి.

విజయ్‌తో మాట్లాడితే... విజయ్... ప్చ్... నాన్ సీరియస్. అయినా విజయ్‌తో మాట్లాడి యెలాగైనా సుస్మిని రాజమండ్రి తీసుకెళ్ళాలి. పారి పోతే... ఫ్రెండ్స్‌తో గోవా పారిపోతే...

నందనికి ఆందోళన పెరిగింది.

సెల్ మోగింది. తల్లి అరవింద.

“సుస్మి వుందా,” అడిగారు అరవింద.

“మెసేజ్‌ల మీద మెసేజ్‌లు. యేదో పార్టీ వుందని పారిపోయింది. యీ దిక్కుమాలిన హుక్కా క్లబ్స్‌కి పర్మిషన్ యెందుకిస్తారో. అక్కడ హుక్కా వొకటే కాదు, గంజాయి యింకా యేమున్నాయో... బాగా అలవాటుపడి పోతోందమ్మా... యేం చెయ్యను,” యేడ్చేసింది నందిని.

"నందూ... వూరుకో. నచ్చజెప్పుదాంలే. దారికి తెచ్చుకుందాం," అన్నారు.

కళ్ళు తుడుచుకొంటూ, "యెలా నచ్చచెపుతామమ్మా. బాయ్ ఫ్రెండ్స్, తాగుడో అయితే చెప్పొచ్చు. డ్రగ్స్ అలా కాదుకదా. కావాలనే స్టేజ్ నుంచి వుండకపోతే బతకలేని స్థితికి తీసుకుపోతాయి. రాత్రి బాత్ రూమ్‌లో అగ్గిపెట్టె, సగం తాగిన సిగరెట్ కనిపించాయి. సుస్మిని అడగాలో వద్దో అడిగితే యేంటో అడగకపోతే యేంటో? నాకసలు సుస్మిని యెలా డీల్ చెయ్యాలో తెలియటం లేదు," అయోమయంగా అంది నందిని.

"చూద్దాంలే. సుస్మిని బాగుచేద్దాం. అమ్ములు వాళ్ళ గృహప్రవేశం వుందిగా. ఆ రోజుకి నగలు తీసుకుందామని చార్మినార్‌కి వచ్చాను. లాల్ మరో కస్టమర్‌తో వున్నాడు. జుట్టుకి కలర్ వేయించుకోవాలి. నువ్వేమన్నా చేయించుకుంటావా. పార్లర్‌లో అపాయింట్‌మెంట్ తీసుకొంటా," అన్నారామె.

"టోటల్ బాడీ పనుంది. అపాయింట్‌మెంట్ తీసుకో. యిలాంటి ఫంక్షన్స్‌కి రమ్మన్నా రాదీ పిల్ల. అసలు బంధువులు, ఫంక్షన్స్ యివేం పట్టవేంటమ్మా యీ పిల్లకి," దిగాలుగా అడిగింది నందిని.

"యేం చేస్తాం మన ఖర్మ. యివాళో రేపో మీ అత్తగారు యీ ఫంక్షన్ కోసం వస్తారేమో. ఆవిడ ముందు బయటపడకండి. పిల్ల తాగుతుంది, హుక్కా పీలుస్తుంది, డ్రగ్స్ కూడానని తెలిస్తే యింకేమైనా వుందా. వూరంతా చెప్పేస్తుంది. రేప్పొద్దున్న సుస్మికి పిల్లాడ్నెవరిస్తారు. అయినా బెంగపడకమ్మా" కూతురికి ధైర్యం చెపుతుండగా లాల్ వస్తే మళ్ళీ మాట్లాడతానని ఆవిడ ఫోన్ పెట్టేశారు.

డ్రైక్లీనింగ్ నుంచి వచ్చిన బట్టల్ని తమ బీరువాల్లో సర్ది సుస్మి బట్టలు తీసుకొని సుస్మిత గదిలోకి వచ్చింది నందిని.

బట్టలు సర్దుతోంటే వో పొట్లం. అనుమానమొచ్చి తీసి చూసింది. పొడి...

యేంటిది? గంజాయా?! కొకైన్!... అంతకంటే పవర్‌ఫుల్ డ్రగ్గా... నందిని చేతుల్లో వణుకు.

ఆ చిన్ని పొట్లాన్ని తీసుకొని తమ గదిలోకి వచ్చింది.

విజయ్‌కి కాల్ చేసి విషయం చెప్పింది.

"యింకేం. యెవిడెన్స్ దొరికిందిగా... సుస్మిని అడిగై. సరే నందూ... మలేషియా నుంచి డెలిగేట్స్ వచ్చారని చెప్పానుగా. వాళ్ళతో డిన్నర్‌కి వెళు తున్నా. రాత్రి రాకపోవచ్చు యింటికి. వోకె. మళ్ళీ మాట్లాడదాం," అన్నాడు విజయ్.

నందినికి విసుగొచ్చేసింది.

హాల్లోకి వెళ్ళి నిలువెత్తు కిటికీకున్న లెమన్‌యెల్లో పల్చని కర్టెన్స్‌ని పక్కకి లాగింది.

తళతళలాడుతూ హైటెక్ సిటీ.

పెళ్ళయ్యాక విజయ్‌తో అమెరికా వెళ్ళటం, వుద్యోగం, అక్కడే పిల్ల లిద్దరూ పుట్టారు. సుస్మికి మూడేళ్ళున్నప్పుడు తిరిగి యీ సిటీకి రావటం.

అప్పటికి గ్లోబల్ యెకానమికి తలుపులు పూర్తిగా తెరుచుకున్నాయి. విజయ్ కంపెనీ ఫ్లోట్ చేయటం షేర్ మార్కెటింగ్‌లో షేరు విలువ చక చకా పైకి పెరిగింది. తనూ ఆ కంపెనీలో డైరెక్టర్‌గా పనిచేస్తూనే మరోపక్క రియల్ యెస్టేట్ మొదలుపెట్టింది.

యీ పన్నెండో అంతస్తులో నిలబడి తామెప్పుడూ పైకే చూసేవారు, అందుకోవల్సిన శిఖరాల వైపు.

కానీ యిప్పుడు భూమ్మీద నిలబడాలనిపిస్తోంది. మనసు బలంగా కోరుకుంటుంటే యింట్లోంచి బయటికి వచ్చి లిఫ్ట్ వైపు వెళ్ళింది. లిఫ్ట్‌లోకి రాగానే తలుపులు మూసుకోగానే, పవర్ పోతే... యీ లిఫ్ట్ ఆగిపోతే ఫోన్ పనిచేయదు. తను యిందులో వున్నట్టు యెవరికి తెలీదు. నుదురంతా చెమటలు. లిఫ్ట్‌లో యిరుక్కుపోతే వూపిరి ఆగిపోతుందనే ఆలోచనతో నందిని వుక్కిరిబిక్కిరైంది.

లిఫ్ట్ ఆగింది.

నందిని లిఫ్ట్‌లోంచి బయటికి చప్పున వచ్చింది. చల్లనిగాలి. వొక్క సారే బోల్డంత ఆక్సిజన్ని పీల్చుకొన్న అనుభూతి.

'స్టాండ్ బై జనరేటర్ వుంది. అసలింతకాలం తనకెప్పుడు యిలా లిఫ్ట్‌లో యిరుక్కుపోతాననే ఆలోచనే రాలేదు. యెందుకంత పానిక్‌గా

అనిపించింది. సుస్మిత విషయం తనని మానసికంగా యింత బలహీను రాలిని చేస్తుందా,' ఆమె లాన్ పక్కనున్న పాత్ వే పై నడుస్తూ ఆలోచి స్తోంది.

'రానీ యింటికీరోజు. యెవిడెన్స్ చూపించి గట్టిగా నిలదీయాలి. అసలు తనొచ్చే వరకు యెందుకు వెయిట్ చెయ్యాలి. ఫోన్ చేసి అడిగితే సరి.' సుస్మికి కాల్ చేసింది. నో రెస్పాన్స్. తిరిగి తిరిగి చేసింది. సమాధానం లేదు.

వెళితే... యెక్కడికి వెళుతుంది. యే ఫామ్‌హౌసని చూస్తుంది. యే క్లబ్ అని వెళుతుంది.. యే ఫ్రెండ్ యింట్లోనైనా కలవొచ్చు. లేదా యే కారులోనైనా తిరగొచ్చు. యెక్కడికని వెళ్ళాలి. యెలా కనిపెడుతుంది.

తన కళ్ళ ముందే కదా సుస్మి పెరిగింది. సడన్‌గా తను నాకసలు తెలియని అమ్మాయిగా యెందుకనిపిస్తోంది.

నందినికి దుఃఖం వచ్చేసింది.

వారం రోజుల కిందట సుస్మితో జరిగిన సంభాషణ గుర్తొచ్చింది నందినికి.

"ఆఁ... మమ్మీ... డ్రింక్ చేస్తాం. యస్... అప్పుడప్పుడు స్మోక్ చేస్తాం. యిట్స్ వెరీ కామన్. నువ్వెందుకలా అప్‌సెట్ అవుతున్నావ్," చాలా మామూలుగా చెప్పింది సుస్మిత, వోరోజు రాత్రి తాగొచ్చినందుకు నిల దీస్తున్న తనతో.

కన్నీళ్ళు తుడుచుకుంటూ, "నువ్వు చాలా యంగ్ నాన్నా. నీకింకా పదహారేళ్ళే. నువ్విలా చేయటం కరెక్ట్‌కాదు. అయినా నీకర్థం కానిదేం టంటే ఆల్కహాల్, సిగరెట్స్ చాలా డేంజర్. నువ్వెందుకు వాటివైపు వెళు తున్నావ్. అసలీ యేజ్‌లో తాగటం క్రైమ్ తెలుసా," వీలైనంత మృదువుగా చెప్పటానికి ప్రయత్నించింది తను.

'వో మైగాడ్... మమ్మీ నిజంగా నువ్వు యిన్నోసెంట్. క్రైమ్ యేంటి? నీకు తెలుసా 21 ఏళ్ళు నిండని వాళ్ళకీ డ్రింక్స్ యిస్తారు పబ్స్‌లో. హుక్కా క్లబ్స్‌లో, పబ్స్‌లో రకరకాల పేర్లతో గంజాయే కాదు కొన్ని రకాల డ్రగ్స్ దొరుకుతాయి. యిదంతా కామన్. క్రైమ్ కాదు. వీటికొచ్చే వాళ్ళంతా

యెలీట్, రిచ్ సెక్షన్స్ నుంచే. వీటిని రన్ చేసేది పవర్‌ఫుల్ పీపుల్. అలా వాళ్ళు సర్వ్ చేయటం క్రైమ్ కానప్పుడు మేం తీసుకోవటం క్రైమ్ యెలా అవుతుంది. యిలా యీ పబ్స్, క్లబ్స్, హుక్కా పార్లర్స్ రన్ అవుతున్నాయని అందరికీ తెల్సు,'' అంది సుస్మిత.

``యెయిటీన్ నిండనివాళ్ళకి అసలు అలా డ్రింక్స్ యెలా యిస్తారు? యెవర్నీ వాళ్ళసలు యేజ్ అడగరా?'' అడిగింది తను.

'అప్పుడప్పుడు వాళ్ళకి యెక్కువ టిప్స్ కావాలనుకున్నప్పుడు ఐడెంటిటీ కార్డ్ చూపించమంటారు. మేనేజ్ చేసేస్తాం. అది వాళ్ళకీ తెల్సు. వొక్కొక్కసారి బయట కొనుక్కొని తాగేసి సీసాలు రోడ్డు పక్కన పారేసి, పబ్‌కి వెళ్ళిపోతాం. యిలా చాలామంది చేస్తారు. అప్పుడసలు భలే మజా వుంటుందనుకో, వీళ్ళని ఫూల్స్‌ని చేసినందుకు,' నవ్వుతూ అంది సుస్మిత.

``మీరిలా చేస్తుంటే యెప్పుడో వొకప్పుడు పట్టుబడితే, శిక్ష పడుతుంది తెల్సా,''

సుస్మిత గట్టిగా నవ్వుతూ, 'వో మైగాడ్... మమ్మీ నీయంత ఫీయర్డ్ మనిషిని చూడలేదు. రాత్రేమయిందో తెలుసా, మనీష్ డ్రైవ్ చేస్తున్నాడు. మొత్తం తనతో కలిపి ఐదుగురున్నాం కారులో. కెబిఆర్ పార్క్ దగ్గర పోలీసులు ఆపుతుండగానే మనీష్ గ్లాస్ దింపి వెయ్యి రూపాయల నోటు వాళ్ళ చేతుల్లో వుంచాడు. సలాం కొట్టి దారిచ్చారు. మేమంతా పదహారు పదిహేడేళ్ళ వాళ్ళమేగా. డ్రింక్ చేసున్నాం. కాని సింపుల్‌గా డీల్ చేసేశాం. నువ్వే యిలా అన్నిటికి భయపడుతున్నావ్,' అంది.

యిలా మాట్లాడుతుంటే యేం చెయ్యాలి. రూల్స్ బ్రేక్ చేయటం అంటే యేంటి సుస్మి దృష్టిలో. పిల్లలిద్దర్నీ మంచి కార్పొరేట్ స్కూల్స్‌లో జాయిన్ చేసింది.

అసలు తన కళ్ళ ముందే కదా సుస్మి పెరిగింది. సడెన్‌గా తనసలు నాకసలు తెలియని అమ్మాయిగా యెందుకనిపిస్తుంది? యిదే ప్రశ్న తనని పదేపదే వెంటాడుతోందేంటి? తనలో వున్న లోపమేంటి? వుదయం సుస్మి స్కూలుకి వెళ్ళే టైమ్‌కి తను నిద్రపోతుండేది. సుస్మికి స్కూల్లోనే బ్రేక్‌ఫాస్ట్, లంచ్, యీవెనింగ్ స్నాక్స్ ప్రొవైడ్ చేస్తారు. సుస్మి స్కూల్ నుంచి వచ్చేసరికి తను ఆఫీస్‌లో వుండేది. రాత్రి వాళ్ళ డిన్నర్ టైమ్‌కి తనింకా యింటికి

చేరేది కాదు. అంతా యింట్లో వుండే వంటామె చూసుకొనేది. అసలిప్పుడు ఆలోచిస్తే అనిపిస్తుంది, తను, విజయ్ వాళ్ళకి యివ్వాల్సినంత సమయం యివ్వలేదని. సుస్మి యెప్పుడూ వుదయం పూట స్నానం చెయ్యదు. చాలా మంది పిల్లలంతే. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చాకో లేదా రాత్రి పడుకునే ముందో స్నానం చేస్తారు. యేమయినా తినే ముందు చేతులు, బయటికెళ్ళొచ్చాక కాళ్ళు కడుక్కునే అలవాటే లేదు. మొన్నీ మధ్య స్వైయిన్ ఫ్లూ వచ్చినప్పుడు నివారణకు పదేపదే చేతులు కడుక్కోండని యాడ్స్ వస్తుంటే, 'మన పాత అలవాట్ల నుంచి మనం దూరంగా వెళ్ళిపోయి సమస్య వచ్చినప్పుడు మళ్ళీ వాటిని గుర్తు చేయటం వో పెద్ద మార్కెట్,' అని అమ్మ నవ్వింది.

యివన్నీ చిన్నచిన్న విషయాల్లా కనపడొచ్చు. యిక్కడ నుంచి జీవితం యీరోజు యెక్కడికొచ్చిందంటే తన కన్నకూతురే పదహారేళ్ళ పాప తనకెంతో పరాయిదిగా తోస్తోంది. అసలు విజయ్‌కి యీ మాత్రం ఆలోచన వున్నట్లు లేదు. విజయ్ సుస్మి డ్రింక్ చేస్తుందంటే పెద్దగా నవ్వి, అలాంటి ఫ్రెండ్స్ వున్నారన్నమాట అన్నాడు. తాగొద్దని సుస్మికి చెప్పంటే, 'అలా చెప్తే మనం వోల్డర్ జనరేషన్ అనుకుంటుంది. కొన్నిటిని చూసీ చూడనట్లు వదిలేయాలి. తన ఫ్రెండ్స్, వాళ్ళ ఫామిలీస్ వున్నట్టు మనం వుండమని చికాకు పడవచ్చు. చదువుకుంటుంది. మార్క్స్ బానే వస్తున్నాయి. యింకెందుకు వర్రీ,' అన్నాడు.

మార్కులొకటేే చాలా... యింకా తనేదో కోరుకుంటుంది. వాల్యూస్, కాంపిటేటివ్ స్పిరిట్, అవుట్‌పుట్ వుండాలని, వొక జనరేషన్ నుంచి మరొక జనరేషన్‌కి మరింత అందమైన జీవితం ప్రవహించాలని. కానీ యిప్పుడీ పిల్లల్ని చూస్తుంటే భయమేసేస్తుంది. ఆరోగ్యం యేమవుతుందోననే ఆందోళనా వుంది. అసలింట్లో యిలాంటి పిల్లలుంటే యెంత సంపద వున్నా యేం సంతోషం వుంటుంది... సిక్ ఫీలింగ్.

తిరిగి యింట్లోకొచ్చి విసుగ్గా టీవీ ఆన్ చేసింది నందిని. రిమోట్ పై వేళ్ళు కదులుతున్నాయి. ముందుకెళ్ళి సడన్‌గా బుర్రలో యేదో ఫ్లాష్ అయి వెనక్కి వచ్చింది.

న్యూస్ చూస్తోంది. ఆమె కళ్ళు మెరిశాయి.

ఫోన్ మోగింది.

అరవిందగారు.

"న్యూస్ చూశావా? డ్రగ్స్ మాఫియాలో చాలామందిని పట్టుకున్నారంట. చూశావా..." హడావుడిగా చెపుతున్నారావిడ.

"వూఁ చూస్తున్నా. యీ దెబ్బకి యింక యిక్కడ డ్రగ్స్ దొరకకపోతే నా ప్రోబ్లెమ్ సాల్వ్ అయినట్టే," కాస్త రిలీఫ్ నందిని స్వరంలో.

"నే చెప్పలా సుస్మి మామూలు అయిపోతుందని," దగ్గరుండి వాళ్ళందర్ని తనే పట్టించినంత ధీమాగా చెపుతున్న తల్లి మాటలు వింటుంటే నందినికి నవ్వొచ్చింది.

యీ విషయం చెప్పాలని విజయ్‌కి కాల్ చేసింది నందిని.

నో రిప్లై. యేదో మీటింగ్‌లో వుండుంటాడు.

ఆమె హాల్లోకి వచ్చి కిటికీ కర్టెన్స్ పక్కకి లాగింది. యెప్పటిలా తళతళలాడుతోంది హైటెక్ సిటీ.

ఆమె పైకి చూస్తోంది. పీచు మిఠాయి లాంటి ఆలోచనలు.

యిప్పుడు సిటీలో రియల్ యెస్టేట్ బాగా పడిపోయింది. వైజాగ్‌లో కన్‌స్ట్రక్షన్ మొదలుపెట్టాలి. వుద్యోగం చేస్తునే రియల్ యెస్టేట్ బిజినెస్ చేస్తోన్న తనని, 'మీ మరిదిగారు నీలా పని చెయ్యాలంటారు. నాకేమో వుద్యోగం, యిల్లే సరిపోతుంది,' అన్న పెద్ద చెల్లెలి మాటలు గుర్తొచ్చాయి. కాస్త గర్వంగా అనిపించింది.

తన మనసుని పట్టి పీడిస్తోన్న రుగ్మతకి పరిష్కారం దొరికిందన్న సంతోషంలో నందిని తిరిగి తన పనులపై దృష్టి పెట్టింది. ప్లాన్ చేస్తోంది సక్సెస్ కోసం.

నందిని పనులు చేసుకొని సుస్మి గదిలోకి వెళ్ళింది. లేదు. యీ డూప్లెక్స్ యింటితో యిదో గొడవ. యెవరెక్కడున్నారో తెలీదు అనుకుంటూ కిందికి వచ్చింది.

వంటావిడ చేపల పులుసు చేస్తున్నట్లుంది. వేయించిన మెంతుల వాసన కమ్మగా.

"పాపగారేరి," అడిగింది నందిని.

"యిట్రాలేదమ్మగోరు."

సుస్మికి కాల్ చేసింది.

నో రిప్లై. బయటికి వెళ్ళిపోయిందా. చెప్పకుండా వెళ్ళిపోవటం అలవాటైపోయింది.

'చెప్పి వెళ్ళొచ్చుగా' అంటే, 'వో గాడ్... యామ్ నాట్ గోయింగ్ ఫర్ డైయింగ్. యెక్కడికి పోతా, వస్తానుగా,' అని అరవటం మామూలైపోయింది.

పిల్లలంతా యెంచక్కా చదువుకుంటున్నారు. బాగుంటున్నారు. నా కూతురే యెందుకిలా తయారైయింది. భయంలేదు. యేమైనా అంటే నా యిష్టం, నా స్పేస్ అంటుంది. కొంత తన యాటిట్యూడ్, కొంత యీ డ్రింక్స్, డ్రగ్స్. సరే పోలీసులు డ్రగ్స్ మాఫియాని పట్టేశారుగా. యీ అలవాటు దానంతటది పోతుంది. డ్రింక్స్ తప్పదు. యీ డ్రగ్స్‌తో పోలిస్తే డ్రింక్స్ బెటర్. డ్రగ్స్‌కి యెడిక్ట్ అయిపోతే బాప్‌రే జీవితమే వుండదు. సరే, పద్ధెనిమిదేళ్ళకి తాగొచ్చంటారు. సుస్మి పదహారేళ్ళ నుంచే తాగుతోంది. అంతా కాస్త ముందు. పెద్ద గీత ముందు చిన్న గీతలా యెన్నెన్ని యెడ్జెస్ట్ మెంట్స్... సుస్మి గదిని చెక్ చేస్తే యింకా యేమైనా డ్రగ్స్ దొరుకుతాయా అనుకొంటూ గది తలుపు నెట్టింది.

రాలేదు. యిదేంటి తను యిందాక వచ్చింది. అప్పుడు లాక్ చేసిలేదు. యిప్పుడేంటి? నందినికి ఆందోళన మొదలయింది.

గట్టిగా తలుపుని కొట్టింది.

తీయలేదు.

తను పైకి కిందికి తిరుగుతున్నప్పుడు సుస్మి గదిలోకి వెళ్ళి లాక్ చేసేసుకుని నిద్రపోయింది. మత్తుగా నిద్రపోతుంటుంది. ఆ నిద్ర చూస్తే భయమేస్తుంటుంది. లాక్ చేసుకొని పడుకోవటం సుస్మికి అలవాటు. డోర్ లాక్ చేయొద్దంటే వినదు. లాక్‌ని తీయించేస్తే బాగా గొడవ చేసింది. సెల్‌ఫోన్ యెక్కువ వాడద్దన్నా, బయటికి యెక్కువ వెళ్ళొద్దన్నా, అసలేం చెప్పినా గొడవ, గోల. యింకా గట్టిగా యేమయినా చెప్తే యేం చేసుకుంటుందోననే భయం. యీమధ్య చిన్న చిన్న విషయాల క్కూడా

ప్రాణాలు తీసుకోవటం చూస్తుంటే పిల్లలకి యేం చెప్పాలన్నా భయమేసే స్తుంది.

సరే పోలీసులు వాళ్ళెనెవర్నో పట్టుకున్నారు కదా. నా కష్టాలన్నీ తీరు తాయి. అసలు డబ్బులు చేతి కందకుండా చేసినా అంతంత ఖరీదైన వ్యవహారాలన్నీ నిరాటంకంగా సాగిపోతూనే వున్నాయి. తామంతా ఆ వయస్సులో ఫ్రెండ్స్‌తో వన్ బై టూ టీ షేర్ చేసుకున్నట్టు వీళ్ళు వీట న్నిటినీ షేర్ చేస్తున్నారన్నమాట. యిప్పుడు కొన్ని స్నేహాలు యిలానే వున్నాయ్.

యిందాకటి వరకు చేసి ఆపిన పనులని తిరిగి మొదలుపెట్టింది. వో గంట గడిచింది. సెల్ మోగింది. అమ్మ అరవింద.

"యేంటమ్మా...'

"డ్రగ్స్ మాఫియాని పట్టుకున్నారు కదా. వాళ్ళ దగ్గర చాలామంది పెద్దాళ్ళ నెంబర్లు దొరికాయంట. సుస్మికీ వాళ్ళే సప్లై చేసుంటారంటావా! సుస్మి నెంబర్ యేమైనా వుంటుందంటావా," రహస్యంగా అడుగు తున్నారు అరవింద.

నందినికి తిరిగి చిరాకు మొదలయింది.

చేస్తున్న పని ఆపేసింది. రెస్ట్‌లెస్‌గా తిరుగుతూ ఫ్రిజ్ తీసింది. మూతలు తీసి చూసింది. వో గిన్నెలో బెల్లం పాకం గారెలు కనిపించాయి. వొకటి తింది.

యీ విజయ్ యెక్కడున్నాడో...

"ఫోన్ చేసి నీకో యే.సి.పి. ఫ్రెండు వున్నారు కదా, వాళ్ళ దగ్గర యీ లిస్ట్ యేమైనా దొరుకుతుందేమో అడుగు," అంది నందిని.

"మీడియా దగ్గర నెంబరు వుంటే కంగారెందుకు. వాళ్ళే మనకి కాల్ చేసి బేరం పెడతారులే," అంటూ గుక్కతిప్పుకోకుండా నవ్వుతూ, "నందినీ, వూరికే సుస్మి గురించి ఆలోచించి పని పాడుచేసుకోకు. సుస్మి వొక్కర్తే అలా లేదుగా. మాట్లాడి మానిపిద్దాం. చదువు, కెరీర్, బిహేవియర్ అని హైరానా పడితే మాత్రం యేమవుతుంది. యిదిగో యీ కాపిటల్ యిన్వెస్టర్స్ డీల్స్ అయ్యాక వాళ్ళు వెళ్ళిపోగానే సుస్మి మీద కాన్సన్‌ట్రేట్ చేద్దాం," అన్నాడు విజయ్.

విజయ్ యింత కూల్‌గా యెలా వుంటాడో. యిలా యెలా సాధ్యమో... ఆలోచనల్ని కంట్రోల్ చేసుకుంటూ పనిలో పడింది నందిని. కాసేపు పని చేసింది. ఆ తరువాత వెళ్ళి పడుకుంది.

సుస్మికి తెలివొచ్చింది... తలంతా మత్తు విడిపోయిన మగత. హాల్లోకి వచ్చింది. డైనింగ్ టేబుల్ పై గిన్నెలున్నాయి. అన్నం తినే వోపిక లేక ఫ్రిజ్‌లోంచి ట్రాపికాన ఆరెంజ్ జ్యూస్ డబ్బా తీసి యెత్తి పెట్టుకొని తాగుతుంటే నిద్రలోంచి మెలకువ వచ్చిన నందిని తన గదిలోంచి బయటికి వచ్చింది.

హాల్లోని సుస్మిని చూస్తూ, ''యేమయినా తింటావా నాన్నా,'' అంది టైమ్ చూస్తూ.

తెల్లారి నాలుగైంది.

''నో మమ్మీ, థాంక్స్,'' అని గదిలోకి వెళ్ళి లాప్‌టాప్ ముందు కూర్చుంది సుస్మిత.

నందిని అన్నం, కూర వేడి చేసి కలిపి సుస్మి గదిలోకి వెళ్ళి తినిపించింది. రోజూ యిలానే వేళకాని వేళ లేచి తింటూ వుంటుందా, యేంటో నాకీ కష్టాలు. పోనీలే త్వరలోనే తీరిపోతాయి. వాళ్ళని పట్టేసుకొన్నారుగా.

◆ ◆ ◆

బ్రేకింగ్ న్యూస్... హై ఫై కాల్‌గర్ల్స్... హెవీ బ్యాంగ్‌తో టీవీ స్క్రీన్స్ మీద న్యూస్ ఫ్లాష్ అవుతోంది.

సదా మామూలే... నిన్నటివరకు మీడియా ఫ్లాష్ న్యూస్ డ్రగ్స్... ఆ విషయం గురించి యీరోజు వొక్క ముక్కా కనిపించటం లేదు. యేమై వుంటుంది. యీ సమాజంలో కాల్‌గర్ల్స్ వున్నారని యిప్పుడే తెల్సినట్టు ఆశ్చర్యపోతూ చర్చలు, అభిప్రాయాలు... గోల... గొడవ... యెవరి రక్షణ కోసం అమాయకంగా యీ న్యూస్ బుల్లితెర కెక్కింది... ఆలోచిస్తుంటే నిస్సత్తువ ఆవరించింది నందినిని. అయ్యో, అసలిప్పుడు నా సమస్య యెలా పరిష్కారమవుతుంది. యెవరు చేస్తారు.

విజయ్‌కి ఫోన్ చేసి విషయం చెప్పింది.

“నందూ, అంత సులభంగా మన సిస్టమేమి చెడుని క్లియర్ చేయదు. నువ్వేదో కొన్నాళ్ళు యీ వూర్నించి సుస్మితని దూరంగా పట్టు కెళ్ళిపోతే అలవాటు తప్పుతుందని అనుకుంటున్నావుగా. సరే, ఆ ప్రయత్నం కూడా వొకసారి చెయ్యి. సుస్మిని మీ వూరు రావడానికి వొప్పిస్తా,” అన్నాడు.

◆ ◆ ◆

చిన్నప్పట్నుంచి చదువు చెప్పి, తనని తీర్చిదిద్దిన మాస్టారు దగ్గర కూర్చుని సుస్మి గురించి దుఃఖపడుతూ చెప్పింది నందిని.

ఆయన సుదీర్ఘంగా చూస్తూ, “నీ బాధ నాకర్థమవుతుంది. కానీ, మనమేం చెయ్యగలం. యీ జనరేషన్ చాలా అందమయినది, తెలివైనది. యెన్నెన్నో విషయాలని సునాయాసంగా కనిపెడుతుంది. యిదే జనరేషన్ లో కొంతమంది యిలాంటి అలవాట్లకి బానిసలవుతూ యిదంతా ఫన్ అంటారు. యిలాంటి వాళ్ళు యెక్కువగా డిస్ట్రాక్షన్ వైపు మొగ్గు చూపిస్తున్నారు. వాళ్ళకసలు భయం లేదు. ప్రాణాల మీద మమకారం లేదు. అంతా థ్రిల్. అసలీ జనరేషన్‌లో కొంతమంది చాలా భయంకరమయిన వాతా వరణంలో పెరుగుతున్నారు. వాళ్ళకి యీరోజే ముఖ్యం. తెలుసో తెలియకో వాళ్ళని యీ పరిస్థితుల్లోకి నెట్టేసిన యీ పాపం మనతో సహా యెందరిదో. అంతెందుకు నువ్వూ విజయ్‌ః మీమీ వ్యాపారాల్లో పనుల్లో లంచం యిస్తారు. తీసుకుంటారు కూడా. అదేమంత కాని పనని మీరనుకోవటం లేదుగా. అంతా అంతే. అందుకే ప్రక్షాళన అసాధ్యమవుతోంది. నువ్వంటున్నావు, రూల్స్ బ్రేక్ చేయడాన్ని యిష్టపడుతున్నారని. అన్ని జనరేషన్స్‌లో రూల్స్‌ని బ్రేక్ చేయటం వుంది. కాకపోతే అప్పుడు యెక్కువగా వొక వికాసం కోసం చేసేవారు. యిప్పుడు అదంతా వొక విధ్వంసం. అదే మానసికానందం. సుస్మి సమస్యకి అనేక రకాల పరిష్కారాలు వున్నాయి. వొకటి సైక్రియాట్రిస్ట్‌కి చూపించటం. వాళ్ళ హెల్ప్ తీసుకో. శరీరంలో యెక్కడయినా వొక భాగానికి రుగ్మత వస్తే, మనమేమీ సిగ్గుపడం. చెప్పడానికి భయపడం. అలానే, వొక రుగ్మతగా ధైర్యంగా, పరువు పోతుందనుకోకుండా డాక్టరుకి చూపించు,” చెప్పారాయన.

“సుస్మి బాగుపడుతుందంటారా,” ఆందోళనగా అడిగింది నందిని.

“ఆందోళన చెందకమ్మా. సుస్మికి యీ ప్రపంచంలో మట్టి, వెన్నెల, చలిమంటలు, పువ్వులు, పాటలు, మనుషులు వుంటారని యిప్పు డిప్పుడేగా పరిచయం చేస్తున్నావ్. చూద్దాం, నీ యీ ప్రయత్నం కూడా నీ మనసుకి వో వెలుగునిస్తుందేమో,” మృదువుగా చెప్పారాయన.

మాస్టారు దగ్గర్నుంచి బయటికి వస్తూంటే, చామంతి వనాలపై ఆవరించిన పుష్యమాసపు పొగమంచుని చూస్తూ, ‘వో మైగాడ్... లవ్లీ...’ అంటూ తన బ్లాక్‌బెర్రీలో క్లిక్‌మనిపిస్తూ కనిపించింది సుస్మిత.

*కౌముది అంతర్జాల పత్రిక, ఫిబ్రవరి 2011*

# సహస్ర



కాన్వోకేషన్ పూర్తయి వెనక్కి వస్తుంటే వో వ్యక్తి నా వెంటే నడుస్తోన్న ఫీలింగ్. పదేపదే చెమ్మగిల్లుతోన్న కళ్లు. యింటికి వస్తూనే ల్యాప్‌టాప్ వోపెన్ చేస్తుంటే, ''వస్తునే వోపెన్ చేశావ్. కాళ్ళు కడుక్కుని భోజనానికి రా,'' టి.వి. సీరియల్‌పై నుంచి తల తిప్పకుండానే అంది అమ్మ.

చెప్పటం వరకే తన బాధ్యత అనుకుంటుంది. మన సమాధానంతో ఆమెకి సంబంధం వుండదు.

మెయిల్ వోపెన్ చేశాను.

డియర్ సహస్ర,

ఆరోజు మీరు వేలవేల చేతులతో నన్ను కౌగిలించుకొని వుండి వుండకపోతే యీరోజు జీవితాంతం పరిమళించే యీ ఆనందానికి నోచు కొనేదాన్ని కాదని ఖచ్చితంగా చెప్పగలను. థ్యాంక్ యూ.

యీరోజు నాకిచ్చిన యీ డిగ్రీని, పొందిన గౌరవాన్ని మీకే అంకిత మని చెప్పాను స్టేజ్ మీద.

ఆ వీడియోని అటాచ్ చేస్తున్నాను.

సౌత్ ఆఫ్రికా యెలా వుంది. నూటయైభై యేళ్లు పూర్తి చేసుకున్న వుత్సవాలకి మిమ్మల్ని పిలవటంతో నా యీ కాన్వకేషన్‌కి వుండమని పట్టుపట్టలేకపోయాను.

మీ,

పృధ్వి.

మెయిల్ పంపించాక పాత ఫోటోస్ ఫోల్డర్‌ని వోపెన్ చేశాను.

◆ ◆ ◆

నిఖిల్, అలి, ఐశ్వర్య, తను పబ్‌లో, కాఫీ షాప్స్‌లో, లాంగ్ డ్రైవ్స్‌లో, ట్రావెలింగ్‌లో తీసుకున్న పిక్చర్స్. విశాలమైన నవ్వు. ఫన్ యెటు చూసినా ఫన్. యెలాంటి రోజులవి. యెప్పుడు సెల్‌ఫోన్‌లో టెక్స్టింగ్ చేస్తుండటం. ఫేస్‌బుక్. లేదా యెప్పుడూ బయట తిరగటం.

“నువ్వెప్పుడైనా డ్రింక్ చేశావా,” అడిగాడో రోజు నిఖిల్.

“లేదు,” అన్నాను.

“ఛలో,” అంటూ అందర్నీ కూర్చున్న కాఫీ డే నుంచి బయటకి తీసు కొచ్చాడు.

“యెక్కడికి బే,” అరిచి అందరి వైపు చూస్తూ, “కొత్తగా విన్నారా ఆ తిట్టు. కరెక్ట్‌గా యూస్ చేశానా,” పకపక నవ్వుతూ అడిగింది ఐశ్వర్య.

“రా... నీకింకా కొత్తకొత్త తిట్లు నేర్పిస్తా. నీ కోసమే నేర్చుకొచ్చా,” యింకా గట్టిగా నవ్వుతూ అన్నాడు నిఖిల్.

ఐశ్వర్యకి ప్రపంచంలోవున్న తిట్లన్ని నేర్చుకోవాలని కోరిక. వాటిని వాడటం మరింత యిష్టం.

నిఖిల్ ఐ 20లో అందరం యెక్కాం. రయ్‌మంటూ ఫిరంగి పానికి వెళ్లాం. గుండెల్లో పాప్ పేలింది. అడుగు తీసి అడుగు వేయలేనంత మత్తు.

యిలా యింటికి వెళితే యేమంటారో తెలీదు. ఐశ్వర్యకి తాగటం అలవాటు. మరీ కింద పడటం లేదు. యింటికి కాల్ చేసి, ''ఆంటీ, పృదూని మా యింటికి స్లీప్ వోవర్‌కి పంపించరా,'' గారాలు పోతూ అడిగింది.

టీవీ సీరియల్ హడావిడిలో అమ్మ వోకె అంది. వద్దంటే తనని మోడ్రన్ కాదనుకుంటారని భయం. అమ్మకి యిలాంటి భయాలు యెన్నో. అలా మొదలైన డ్రింక్ చేయటం, స్లీప్‌వోవర్ అలవాటుగా మారిపోయింది.

యింజినీరింగ్ కాలేజెస్ సిటీకి దూరంగా వుండటంతో మా వేర్ అబౌట్స్ యింట్లో వాళ్లకి తెలిసే అవకాశం వుండదు. ఫస్ట్ యియర్ యెగ్జామ్స్ కొద్ది రోజులు వున్నాయి. కాలేజ్‌కి పెద్దగా వెళ్లింది లేదు. పుస్తకాలు తెరిచింది లేదు. అలీ, నిఖిల్ మనీ యిచ్చి క్వచ్చన్ పేపర్, ఆన్సర్స్ తెప్పిస్తామన్నారు. అంతా రిలాక్స్ అయిపోయాం.

ఆరోజు అందరం యూనివర్సల్ బేకర్స్‌లో కూర్చున్నాం. గేమ్ ఆడుతున్నాం. బేకరి చాలా రష్‌గా వుంది. వో అమ్మాయి లోపలకి వచ్చి లైన్‌లో నిల్చుంది.

''కత్తిలా వుంది,'' అన్నాడు అలీ.

''ఐ లవ్ యూ చెప్పరా. నీ కొదిలేస్తా. కాంపిటేషన్‌కి రాను,'' అన్నాడు నిఖిల్.

అలీ వెంటనే వెళ్లలేదు.

''డేర్ లేదా చెప్పు. నే లైన్‌లో పెట్టుకొంటా,'' ఛాలెంజ్ చేశాడు నిఖిల్.

''భయం యేంది,'' పరువుపోతుందని అలీ లేచి ఆమె దగ్గరకి వెళ్లి, ''యక్స్‌క్యూజ్ మి,'' అన్నాడు.

ఆమె వెనక్కి చూసింది.

అతను అడ్డు లెమ్మంటున్నాడేమోననుకొందేమో పక్కకి జరిగింది. అతను తిరిగి, ''యక్స్‌క్యూజ్ మీ,'' అన్నాడు. ఆమె తిరిగి చూసింది.

"ఐ లవ్ యూ," అన్నాడు.

ఆమెకి అతను యేమంటున్నాడో వినిపించింది, కాని వో అపరిచితుడు అందులోను వో టీనేజర్ యిలా యేలా చెపుతాడు. తను పొరపాటుగా విన్నాననే డౌట్‌తో అడిగినట్టుగా, "యేంటి?" అంది.

అతను తిరిగి, "ఐ లవ్ యూ," అన్నాడు.

ఆమె ఆశ్చర్యంతో చూస్తుండగా నవ్వుతూ, "మీరు చాలా అందంగా వున్నారు," అన్నాడు.

ఆమె మరింత ఆశ్చర్యంగా చూస్తుంటే అతనికి పూర్తిగా ధైర్యం వచ్చేసింది. యేమైనా అనేదైతే యిప్పటికే యూ యీడియేట్ అనో, స్టుపిడ్ అనో విరుచుకుపడేది. తిరిగి, "యూ ఆర్ రియల్లీ సెక్సీ," అన్నాడు.

ఆమె అలీ వైపు చూస్తోంది అపనమ్మకంగా.

పక్క టేబిల్ దగ్గర కూర్చున్న మాకు స్పష్టంగా కనిపిస్తున్నారిద్దరు.

అలీ వచ్చి కూర్చున్నాడు. ఆమె యేం కొనకుండానే బయటకి వెళ్ళబోతు వెనక్కి చూసింది. అప్పుడే నిఖిల్, అలీ చేతుల్లో చేతులేసి నవ్వుతూ చప్పట్లు కొడుతున్నాడు. మేమంతా విరగబడి నవ్వుతోంటే ఆమె మా టేబుల్ దగ్గరకి వచ్చింది. మేం అతి కష్టంగా మా నవ్వుల్ని కంట్రోల్ చేసుకున్నాం.

"నీ పేరేంటి?" అడిగిందామె.

"అదో గేమ్. మిస్ అండస్టాండింగ్ చేసుకుంటున్నారేమో..." అన్నాడు నిఖిల్.

"యీ గేమ్ తెలుసు. నీ పేరేంటి?" తిరిగి అడిగిందామె.

"అఖిల్," పేరు కావాలనే మార్చి చెప్పాడు.

"సంస్కారం అనే పదం యెప్పుడైనా విన్నావా," అడిగిందామె.

"యెందుకంత సీరియస్ అవుతారు. యిట్స్ ఫన్" అన్నాడు నిఖిల్.

"అయినా మీరెందుకిలా క్లాస్ పీకాలనుకొంటున్నారు. మా యిష్టం వచ్చిన కామెంట్‌ని మేం అనుకునేవాళ్లకి చెపుతాం," కేర్‌లెస్‌గా అన్నాడు అలీ.

"యేంట్రా అలీ యెక్స్‌ప్లనేషన్స్ యిచ్చేది," చికాగ్గా అన్నాడు నిఖిల్.

"యేమన్నావ్... నీ యిష్టం. నీకసలు యిష్టం అంటేనే తెలీదు. నీ నిజమైన పేరుని కూడా ధైర్యంగా చెప్పలేని నీకు నీవైన యిష్టాలుండవ్.

యేదో వొక క్వాలిటి ధైర్యమో, పెంకితనమో, యిష్టమో.... అసలేంలేదు నీలో. అందుకే నీ కామెంట్‌కో, కాంప్లిమెంట్‌కో విలువ లేదు,'' అని సడన్‌గా నావైపు తిరిగి, ''నీ పేరేంటి. యేం చదువుతున్నారు మీరంతా,'' అడిగిందామె.

''పృధ్వి. యింజినీరింగ్ ఫస్ట్ యియర్,'' గబగబా చెప్పాను.

''అనుకున్నా... అసలు పనీపాటా లేని బ్యాచ్,'' అని ఆమె వెళ్ళిపోయింది.

మేం పగలబడి నవ్వుకున్నాం.

ఫస్ట్ యియర్ యెగ్జామ్స్ అయిపోయాయి.

ఐశ్వర్య శనివారం పబ్ నుంచి వో అర్ధరాత్రి కాల్ చేసి, ''వాడెంత ఛీట్ చేశాడో చూడు. యీడియెట్. సంజనాతో డేట్ చేస్తున్నాడు. యేమంటే నా యిష్టం అంటున్నాడు. విశ్వాస్‌ని బాగా తన్నమని నిఖిల్‌కి ఫోన్ చేసాను,'' అంది.

''నిజాయితీ లేదు. పేరలల్, క్రాస్, మల్టిపుల్ రిలేషన్స్, డేటింగ్. చెత్త మొహాలు,'' తను మోసపోయిన కోపం, వుక్రోషంతో అరుస్తోంది. యేడ్చింది.

బిత్తరపోయాను.

◆ ◆ ◆

ఆదివారం కూడా కార్తీక్ ఫోన్ చేయలేదు. తీయలేదు.

సోమవారం కార్తీక్ కాలేజ్ దగ్గర కనిపిస్తే కాల్ తీయవేంటంటే నవ్వి, ''భయపడ్డావా. నే చెప్పలేదు... వొక్కరోజు కూడా వుండలేదు చూడకుండా,'' అని పక్కనున్న స్నేహితులకి చెప్పాడు.

మేమిద్దరం పక్కనే వున్న గుడికి వెళ్లాం. మా కాలేజ్ వాళ్లే యెక్కువ మంది వున్నారక్కడ. ఆ ప్రాంగణంలోనే గుడి మూసే వరకు కూర్చున్నాం. తరువాత కాలేజ్ క్యాంటీన్‌లో చికెన్ 65, బర్గర్ తిని, కోక్ తాగాం. వో లేస్ ప్యాకెట్, యింకో కోక్ తీసుకొని దగ్గర్లో వున్న తోటలోకి వెళ్లాం. అక్కడ మాలా క్లాసస్ బంక్ కొట్టిన వాళ్లు యెందరో. కబుర్లు, అలగటాలు, బతిమాలటాలు. వొకరిపై మరొకరు వాలి చెప్పుకొనే మాటలు... ప్రేమ ప్రవాహంతో నిండిపోయిన పరిసరాలు. రోజూ సిటీ నుండి వో రెండు

గంటలు కాలేజ్ బస్సులో ప్రయాణించి కాలేజ్‌కి రావటం. రోజూ దాదాపు యిలానే గడిపి, తిరిగి మరో రెండు గంటలు ప్రయాణించి తిరిగి యింటికి వెళ్ళటం. ఫేస్‌బుక్, టెస్టింగ్, వీకెండ్స్‌లో పార్టీస్. ఆ ఫ్రెండ్స్ యీ ఫ్రెండ్స్ వేరు. నే వెళ్లే కాలేజ్‌లో ఫ్రెండ్స్ యింతింత డబ్బులు స్పెండ్ చేయలేరు. ఆ సర్కిల్స్ వేరు. యీ సర్కిల్స్ వేరు. గుడ్‌లుకింగ్, యింగ్లీష్ మాట్లడ గలగటం, కాస్త చొరవ వుండటంతో, యెలాంటి సర్కిల్లోకైనా వెళ్లిపోగలగ టంతో పెద్దగా డబ్బులు ఖర్చు పెట్టకుండానే హైఫై జీవితాన్ని టేస్ట్ చేయటం. లేకపోతే మై గాడ్, యీ మిడిల్ క్లాస్ బోరింగ్ లైఫ్‌లో బతకటం చాలా కష్టం అనుకొనేదాన్ని చాలాసార్లు.

కార్తీక్, తను క్లాస్‌మేట్స్. వాళ్ల నాన్న ఏవో చిన్నచిన్న కాంట్రాక్ట్స్ చేస్తుంటాడు. కార్తీక్‌కి వెస్పా వుంది. మేనేజ్‌మెంట్ సీట్ కొనుక్కున్నాడు. నిఖిల్ యెంత మేనేజ్ చేసినా ఫస్ట్ యియర్ పాస్ కాలేకపోయాను. కార్తీక్ అసలు పరీక్షలే రాయలేదు.

పరీక్షలో వచ్చిన మార్కులు చూసి నాన్నగారు షాక్ అయిపోయారు. యీసారి బాగా రాస్తానని చెప్పాను. కాని జీవితం యెప్పటిలానే పరిగెడు తోంది. రెండో యేడాది పరీక్షలొస్తుంటే యెలా రాయాలో అర్థంకాక కార్తీక్‌ని అడిగా. ఆ యెగ్జామ్స్ విషయం మర్చిపోయి లైఫ్‌ని యెంజాయ్ చేయ మన్నాడు. నన్ను పోషించేది తనే కాబట్టి వర్రీ కావద్దన్నాడు. బానే అనిపిం చింది.

వో రోజు కార్తీక్ వో అమ్మాయితో వెళుతూ కనిపించాడు బైక్ మీద. వెంటనే కాల్ చేశాను. తీయలేదు. వో గంటలో పదిసార్లు చేశాను. తీయ లేదు. చేయలేదు. ఆదుర్దా. ఆరోజు రాత్రి కార్తీక్ కాల్ చేసి వుదయం నుంచి హాస్పటల్లో వున్నాను. యెవరో దగ్గర బంధువుకి బాగులేదని చెప్పాడు. మరి ఆ అమ్మాయి యెవరాని అడగాలా వద్దాని కాసేపు ఆలోచించి, "నువ్వు యేదో వొక పని మీద బయటకి వచ్చినప్పుడు చేయొచ్చుగా" అడిగాను.

"అసలు బయటకి వస్తే కదా," అన్నాడు. వళ్లు మండిపోయింది.

"అబద్ధం," అరిచాను.

"యేంటి," అడిగాడు.

"నిన్ను చూశాను. నువ్వు బ్లూ టీ షర్ట్ వేసుకొన్న అమ్మాయితో వెళు తున్నావ్," కోపంగా అరిచాను.

"వో అదా... మెడిసిన్స్‌కి వెళ్లాను. అందుకే యింత గొడవా. యెం తిష్టంరా నేనంటే... ఐ లవ్ యూ మై స్వీట్ హార్ట్," అన్నాడు.

నిజమా... కాదనిపిస్తోంది. మనసు రగుల్తోంది.

◆ ◆ ◆

ఆరోజు వుదయం వేళ యెప్పటిలా మామా ఫ్రెండ్స్‌తో మాటాడు కొంటున్నాం.

ఆ వార్త లావాలా కమ్ముకొంది. నిర్మలపై యాసిడ్ అటాక్. షాక్.

అంతా గుంపులు గుంపులుగా పరిగెత్తాం కాలేజ్‌లోకి. అసెంబ్లీ హాల్లోకి వెళ్లాం.

బ్రేకింగ్ న్యూస్... ప్రేమించలేదని వో మృగాడి కిరాతకం... యెర్రని బోర్డ్‌పై నల్లని పెద్దపెద్ద అక్షరాలు వెనక్కి ముందుకి కదుల్తూ.

"ప్రేమించలేదంటారేంట్రా... నాలుగేళ్లుగా సతీష్‌తో తిరుగుతోంది కదరా," యెవరో అరిచారు.

"యీమధ్య సతీష్‌ని వదిలేసిందిరా. వినోద్‌తో తిరుగుతోంది. సతీష్ యెంత బ్రతిమాలాడో. వినలేదు. చాలా హర్ట్ చేసిందిరా," యింకెవరో అన్నారు.

టీవీల్లో స్త్రీలు కూర్చుని విశ్లేషణ చేస్తున్నారు. చాలాచాలా మాటాడు తున్నారు. అసలు పరిచయం లేని వో అమ్మాయి విషయాన్ని వాళ్లు యెంతో కన్సర్న్‌తో మాటాడుతున్నారు. తామెందుకు కాలేజ్‌లో రియాక్ట్ కాలేకపోయాం. బాయ్స్ మాత్రం చాలానే మాటాడారు.

చాలామందికి బోయ్‌ఫ్రెండ్స్ వున్నారు. కొన్నిసార్లు బోయ్స్ చీట్ చేస్తారు. గర్ల్స్ మారిపోతుంటారు. కాని యిలా యాసిడ్ పోయటం తమ కాలేజ్‌లో యెప్పుడు జరగలేదు. కానీ వేరే కాలేజెస్‌లో విన్నాం. యింత ఘోరమా అని బయటవాళ్ళంతా అన్నారు కాని మా కాలేజ్‌లోని చాలా మంది అబ్బాయిలు మాత్రం అనుకోలేదు. అమ్మాయిలు యేదో వొక వంకతో తమ హృదయాలతో ఆడుకోవటం మానొచ్చనుకున్నారు.

ఆరోజు టీవీ చూస్తుంటే యీ విషయంపై మాటాడుతోన్న వో వ్యక్తిని చూస్తుంటే యెక్కడో చూసిన ఫీలింగ్. గుర్తుకు రావటం లేదు. కాసేపు తర్వాత మర్చిపోయాను ఆ విషయం...

సడన్‌గా గుర్తొచ్చింది. యస్, ఆ రోజు అలీ ఐ లవ్ యూ చెప్పిన లేడీ. దాదాపు రెండేళ్ల తరువాత చూస్తున్నాను. అంతే అందంగా యెంత బాగుందో... ఆవిడ పేరేంటో... టీవీ ఆఫీస్‌కి యేం కాల్ చేస్తాం.

వో పదిరోజుల తర్వాత మా కాలేజ్‌లో వో యన్.జి.వో. వోరియం టేషన్ క్లాస్ కండక్ట్ చేస్తున్నారని నోటీస్ బోర్డ్‌లో చూశాం. వెళ్ళటానికి యెవ్వరూ ఆసక్తి చూపించలేదు.

ఫస్ట్ సెషన్‌లోకి పొరపాటున వెళ్లినవాళ్లు బయటకొచ్చి నవ్వుతూ, ''ఆడపిల్లల్ని మగపిల్లల్ని యింట్లో వేరుగా పెంచుతారంట. యీక్వల్‌గా చూడాలంట. వీళ్లకేం తెలుసు, కాంపస్ సెలెక్షన్స్‌లో అమ్మాయిలకే యెక్కువ జాబ్స్ వస్తున్నాయని. మనల్ని పట్టించుకొనేవాళ్లే లేరు. యెప్పటివో మాటాడతారు,'' విసుక్కొన్నారు.

సడన్‌గా యిన్‌త్యూషన్ పర్ఫ్యూమ్ ఫ్రగ్రన్స్ అలా అలా స్ప్రెడ్ అవుతున్నట్టుగా తరువాతి సెషన్‌లోకి బ్యూటిఫుల్ లేడీ వచ్చిందనే న్యూస్ కాలేజ్‌లో, బయట వ్యాపించింది. హాలంతా నిండిపోయింది, యెక్కువ మంది అబ్బాయిలతో. డయాస్ మీద చూస్తే ఆమె. నా కళ్ళని నేనే నమ్మ లేకపోయాను.

మైక్ ముందు నిలబడి ఆమె, 'ఐ యామ్ సహస్ర...' అంటుండగానే కొంతమంది, 'సహస్రా...' అని ధీర్ఘం తీశారు.

ఆమె ఆగి, ''గుడ్ మీరంతా సినిమాలు బాగా చూస్తారన్నమాట. సినిమాల్లో మీకేం బాగా యిష్టం,'' అని అడిగిందామె.

''చంపడం... ఫైట్స్.... సాంగ్స్... కామెడీ.....కామెడీ...''

''యస్... యు ఆర్ రైట్. సినిమాల్లోని హింస, మ్యూజిక్, కామెడీ నచ్చుతున్నాయి. గుడ్. మరి మీకు పేరెంట్స్‌పై, టీచర్స్ పై సినిమాల్లో వచ్చే కామెడీ నచ్చుతోందా,'' అని అడిగిందామె.

అంతా నవ్వారు.

''మీ కాలేజ్‌లో మీరు యిష్టపడే ప్లేస్ యేదైనా వుందా... మీ యింట్లో మీకు నచ్చే ప్లేస్ యేంటి,'' అని ఆమె అడిగింది.

ఆలోచిస్తే నాకేం తట్టలేదు. నాకే కాదు యెవ్వరికి యేం గుర్తు రాలేదు.

"మీరు ప్రేమించటం అంటే యేంటో తెలుసుకోడానికి ప్రయత్నించండి..." అని ఆమె మాటాడటం మొదలుపెట్టి మాటాడుతోంటే యెవరికి యేం అందిందో కాని, నా తల తిరిగిపోయింది. ముఖ్యంగా నేనిన్నాళ్లు ఫన్ అనుకొంటుంది, ప్రేమ అనుకొంటుంది వుత్తి గాలి అని అనిపించింది.

సహస్రని వెతుక్కొంటూ బయలుదేరాను.

"సారీ, ఆరోజు మిమ్మల్ని బేకరిలో..." అని మాటలు తడుముకొంటుంటే ఆమె నవ్వి, "యేం చేస్తున్నారు మీ ఫ్రెండ్స్," అని అడిగింది. నవ్వాను.

"కొన్ని సందేహాలున్నాయి," అన్నాను.

మౌనం.

"నిజంగానే అయోమయంగా వుంది. యీ రెండేళ్లుగా యేం చదవలేదు. యెగ్జామ్స్ సరిగా రాయలేదు. యెలా యీ సిట్యుయేషన్నుంచి బయటపడాలి," అడిగాను.

"అసలు నువ్వేం చేస్తుంటావ్ డే అంతా," అడిగిందామె. అన్నీ నిజాలే చెప్పాను.

"యింటర్మీడియెట్‌లో యేం చేసేదానివి," అడిగారామె.

"యంసెట్‌కి ప్రిపేర్ అయ్యాను."

"మంచి ర్యాంక్ వచ్చిందా?"

"లేదు. అందుకే యీ డొక్కు కాలేజ్‌లో సీట్ దొరికింది. సరైన ఫ్యాకల్టీ లేరు. యేవో లేబ్స్. యింట్రెస్టింగానే వుండదు కాలేజ్," చెప్పాను.

"వోకే... అసలు నీకీ ఫీల్డ్ యిష్టమేనా?"

"తెలీదు. చదవమన్నారు. యిందులో ఫ్యూచర్ వుందన్నారు. జాయిన్ అయ్యాను. అసలు చదువు అంటే వుద్యోగానికే కదా," అడిగాను.

"యిందులో కన్‌ఫ్యూషన్ యేముంది... నీ కాలేజ్ లాంటి కాలేజెస్ యీ రాష్ట్రంలో బోల్డున్నాయి. క్వాలిటి, యెట్‌మాస్ఫియర్ యేనాడో గాలికి

యెగిరిపోయాయి. యీ మాత్రం చదువు చెప్పే కాలేజ్‌స్ యెన్ని వున్నాయి. మనకి చాలాచాలా మంచి కాలేజ్‌లో చదువు కావాలంటే పోటీలో మొదటి వరసలో నిలబడాలి. లేదా మన పేరెంట్స్ సీట్‌ని కొనగలిగే స్థితిలోనైనా వుండాలి. అందరికి వొకే విధమైన క్వాలిటి యెడ్యుకేషన్ని యిచ్చే సిస్టమ్ కాదు మనది. చదువుకోవాలి... అర్థం చేసుకోవాలనే ఆకాంక్ష నీకుంటే నిస్సందేహంగా దారులు కనిపిస్తాయి,'' అంది సహస్ర.

పుస్తకాలు తీశాను. అగమ్యగోచరం. కాని ఆమె యిస్తోన్న ధైర్యంతో ముందుకే నడిచా.

''చాలా థ్యాంక్స్,'' చెప్పానో రోజు.

''కాలేజెస్‌కి వోరియంటేషన్ క్లాసెస్ యివ్వడానికి పిలిస్తే వెళ్లటం యిష్టం. అంతమంది పిల్లలతో మాటాడితే వొక్కళ్లన్నా ఆలోచించరా అని పిస్తుంది. అలానే నువ్వు వచ్చావ్,'' అంది సహస్ర.

''నువ్వేంటి అలా మిస్ కొట్టకుండా క్లాసెస్‌కి వెళ్లిపోతున్నావ్. రోజుకి ఐదు నిమిషాలో, పది నిమిషాలో కలుస్తున్నావ్. యిప్పుడంత చదవకపోతే యేంటి. నువ్వు రెగ్యులర్‌గా కలవాలి,'' అని రోజూ కార్తీక్ గొడవే.

యీ టైమ్‌ని వేస్ట్ చేయొద్దు. కలుద్దాం కాని క్లాసెస్ యెగ్గొట్టి మాత్రం వద్దన్నాను.

పలురకాలుగా వివరించాను. అతను అర్థం చేసుకొనే స్థితిలో లేడు. కోపం. విసుగు, చూపించేవాడు. అతన్ని కలవాలంటేనే మాటాడాలంటేనే భయం వేసే పరిస్థితి. అతను అలా బిహేవ్ చేయటంతో మనసంతా వికలమైపోయేది. తిరిగి చదువు పైకి యేకాగ్రత రావాలంటే చాలా కష్ట పడాల్సి వచ్చేది.

విశాల్ మా క్లాస్‌మేట్. గుడ్ స్టూడెంట్. బాగా యెక్స్‌ప్లేన్ చేసేవాడు. అతనితో మాటాడటం కార్తీక్‌కి యిష్టం వుండేది కాదు. యిప్పుడు యిదో టెన్షన్.

''అరే అతను చదువులో హెల్ప్ చేస్తున్నాడు. జస్ట్ ఫ్రెండ్,'' చెప్పానో రోజు.

''నేను యెక్కువ... తనెక్కువా?'' నిలదీశాడు.

"ప్లీజ్, అలా మాటాడకు. కావాలంటే నువ్వూ రా. యిద్దరం కలిసి చదువుకొందాం," అన్నానో రోజు.

"నేను రావాలా... తెలివుండే మాటాడుతున్నావా. వాడి దగ్గర చదివే దేంటి. నువ్వు మానేస్తావా లేదా. యేం అనుకొంటున్నావ్," కచ్చగా వుంద తని గొంతు.

యెలా డీల్ చేయాలో తెలీక సహస్రకి చెప్పాను.

"మీ కాలేజ్‌లో యాసిడ్ యటాక్ జరిగింది కదా... అప్పుడతను యెలా రియాక్ట్ అయ్యాడు," అడిగారామె.

"నిర్మలదే తప్పు అన్నాడు. సతీష్‌ని నిర్మల ఛీట్ చేసిందన్నాడు. వొక్క కార్తీకే కాదు చాలామంది బాయ్స్ అలానే ఫీల్ అయ్యారు. అమ్మాయిలు మాత్రం అలా అంత దారుణంగా బిహేవ్ చేయటం చూసి చాలా భయపడ్డారు. అన్యాయం అన్నారు. యిప్పుడీ కార్తీక్ నాపై అటాక్ చేస్తాడా," భయంతో యేడ్చాను.

"పృధ్వీ, టాలరెన్స్ లెవల్స్ చాలా తక్కువగా వున్నప్పుడు రక రకాలుగా బిహేవియర్ వుండే అవకాశం వుంది. అతను నీ బాయ్‌ఫ్రెండ్. అతన్ని కన్విన్స్ చేయటం అంత తేలిక కాదు యిప్పుడు. ప్రస్తుతం ఛాలెంజ్ చేయకు.

"విశాల్‌ని కాన్ఫిడెన్స్‌లోకి తీసుకో. కాలేజ్‌లో కాకుండా మీ యింట్లోనో వాళ్ల యింట్లోనో లేదా మరేదైనా ప్లేస్‌లోనో మీ యిద్దరు కలిసే అవకాశం వుందేమో చూడు. యెగ్జామ్స్ అయ్యేవరకు యిలా వీలు అవు తుందేమో చూడు. కార్తీక్ కౌన్సలింగ్‌కి వచ్చేట్టు చూద్దాం," అన్నారు.

"అదేంటి... యిది నా జీవితం. నా యిష్టం. విశాల్‌తో మాటాడితే తప్పేం వుంది," కోపంగా అడిగాను.

"నిజమే... యెవరి జీవితం వాళ్లిష్టమే. కార్తీక్ కూడా అలానే అను కొంటున్నాడు. సతీష్ అలానే అనుకున్నాడు. నా యిష్టం అనేది యెదుటి వాళ్ల జీవితాన్ని బాధ పెడుతున్నా, నాశనం చేస్తున్నా మనం ఆలోచించాలి. ఆ ఆలోచనే లేదిప్పుడు. శత్రువు మూర్ఖుడైతే మనం జాగ్రత్తగా వుండాలి. తప్పదు. పరీక్షల ముందు గొడవలు పడతావా... యెవ్వరిని యాజిటేట్ చేయకుండా ముందీ వాగు దాటుతావా. ఆలోచించుకో," చెప్పారు.

ఆలోచిస్తే యిప్పుడీ సమయంలో కార్తీక్‌ని వొప్పించటం కష్టమని పించింది. విశాల్‌తో మాటాడాను.

"వో.కె. నేనే మీ యింటికొస్తాను. యెవ్వరికి చెప్పను. మా యింట్లో మాత్రం చెపుతా. కార్తీక్‌తో గొడవెందుకు. అసలు నీకు తెలుసా సతీష్‌ని నిర్మల రిజక్ట్ చేసినప్పుడు సతీష్ బాధపడ్డాడు. అప్పుడేం చేయాలనుకున్నట్టు లేడు. కాని రోజూ ఫ్రెండ్స్ చాలా వెక్కిరించేవారు. చేతకానివాడి వన్నారు. అదే మేమైతేనా... యిలా చాలా రెచ్చకొట్టేవారు. నిర్మలని యేం చేయాలా అని అంతా రకరకాలుగా ప్లాన్స్ వేసేవారు. తన ముందే నిర్మల అలా మరొకరితో తిరగటం అతను భరించలేకపోయాడు. అసలు అమ్మాయిలు ప్రేమించిన వాళ్ళని త్వరగా మర్చిపోతారని, వాళ్లకి హృదయం వుండదని, డబ్బులుంటే చాలని అనుకుంటారు. అందుకే వొక్కోసారి అలా వైలెంట్‌గా బిహేవ్ చేస్తారు. కార్తీక్‌కి తెలీకుండా వుంటేనే నీకూ నాకూ మంచిది. అన్‌నెస్ససరీ కాంప్లికేషన్స్ అంటే నాకిష్టం వుండదు," అన్నాడు విశాల్.

"నువ్వు వాళ్ళలా యెందుకు లేవ్," చప్పున అడిగా.

"మా పేరెంట్స్ నాకూ మా చెల్లికి పుస్తకాలని పరిచయం చేసేవారు. రీడింగ్ హేబిట్ వుంది. సెల్‌ఫోన్ యిచ్చినప్పుడు మాయిద్దరికి వో విషయం చెప్పారు. కమ్యూనికేషన్‌లో చాలా మంచి యిన్‌వెన్షన్. దీని యూసేజ్ పట్ల మీకో యెరిక లేకపోతే యిది మీ టైమ్‌ని పూర్తిగా కబ్జా చేస్తుంది. యిలా వాళ్లు ప్రతి విషయాన్ని మాతో డిస్కస్ చేస్తారు అందుకేనేమో...' అంటూ, "మే బి నేను యీ కాలపు సినిమా హీరోని కాదేమో," అంటూ నవ్వాడు.

మా యింట్లో అలాంటి కల్చరేం లేదు. లోకం వెంబడి ప్రకటనల పరుగే.

తన మాట విని విశాల్‌తో మాటాడటం మానేశాననుకొని కార్తీక్ ఆ విషయంలో విసిగించటం లేదు. కాని అతను నాపై వో కన్నేసే వుంచాడు. సహస్ర కాలేజ్ వాళ్లతో మాటాడి తరచుగా బాయ్స్‌కి వోరియంటేషన్ క్లాసెస్ తీసుకోవటం మొదలుపెట్టి కార్తీక్‌తో కాస్త పరిచయాన్ని పెంచుకొంది. అమ్మాయిల విషయాలలో యెలా ఆలోచించాలో వాళ్ళతో

డిస్కస్ చేయటంతో కాస్త ధైర్యంగా ఫీలయ్యారు కాలేజ్‌లో అమ్మాయిలు. నేనైతే బాగా వూపిరి పీల్చుకొన్నాను. యెగ్జామ్స్ అయిపోయాయి. ఫెయిలైన వాళ్లుంటే కాలేజ్‌కి చెడ్డ పేరు వస్తుందని మేనేజ్‌మెంట్ యెలా గోలా యిలాంటి వాళ్లని పాస్ చేయిద్దామని ప్రయత్నిస్తే కొంతమంది గట్టెక్కారు. కార్తీక్ అలా కూడా పాస్ కాలేకపోయాడు. పాస్ అయ్యాను.

కార్తీక్ పెళ్ళని గొడవ మొదలుపెట్టాడు. జీవితం ప్రారంభంలోనే అరాకొరా నాలెడ్జ్‌తో యీ ప్రేమలేంటి. తప్పు చేశానా అని అడిగాను సహస్రని.

"యీ ప్రేమలూ, ఆకర్షణలూ మీతోనే మొదలుకాలేదు. మీతోనే ఆఖరు కాదు. దాదాపు అన్ని ప్రేమలూ వొకలానే మొదలవుతాయి. యెటొచ్చి ప్రకంపన వచ్చినప్పుడే ఆ నష్టం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై తెలుస్తుంది. యీ ప్రేమ నిలుస్తుంది, యిది నిలవదు అనే గ్యారెంటీని యివ్వలేం. కాకపోతే యెమోషనల్ కమిట్‌మెంట్ పట్ల డిసిప్లీన్ అవసరం. అనవసరంగా యెవరూ యేవరి హృదయాలని గాయపర్చకూడదు. యిప్పుడు నీకతన్ని ప్రేమించాలని కానీ పెళ్లి చేసుకోవాలని కానీ అనిపించటం లేదు... యెందుకని," అడిగిందామె.

"చదువు కంప్లీట్ చేయలేదు. వుద్యోగం రాదు," చెప్పాను.

"బిజినెస్ చేస్తాడు. లేదా యిప్పుడు చదువు కంప్లీట్ చేస్తాడు. అప్పుడు..."

"అయినా వద్దు," అన్నాను.

"యెందుకు?"

"కార్తీక్ నన్ను విశాల్ విషయంలో భయపెట్టాడు. అతను అనుకొన్నట్టు నే వుంటేనే అతనితో జీవితం. నేను చదువుకోవటం అతనికి నచ్చ లేదు. అసలలా ప్రతి క్షణం భయపడుతూ బతకటం చాలా కష్టం," చెప్పాను.

"నువ్విప్పుడు అతనికి ధైర్యంగా నీ విషయాలు చెప్పగలవా?"

"భయమే... గొడవ చేస్తాడని. నువ్విప్పుడు యింకా చదువుకుంటావా, జాబ్‌లో జాయిన్ అవుతావా అంటాడని భయం. యీ మార్కులకి యేదో వొక జాబ్ వస్తుంది. కాని నేను యం.బి.యే. మంచి కాలేజ్‌లో చేయాలనుకొంటున్నాను," చెప్పాను.

“ముందు ఆ ప్రయత్నాలు చెయ్,” అన్నారామె.

◆ ◆ ◆

ఆరోజు కార్తీక్ దారి కాసి నిలబడ్డాడు.

“నీతో మాటాడాలి రా,” అన్నాడు.

‘అతనితో యెక్కడికి వొంటరిగా వెళ్ళకు...’ సహస్ర చెప్పిన మాటలు గుర్తొచ్చి, “మా యింటికి వెళదాం రా,” అన్నాను.

కార్తీక్ విషయం యింట్లో యింతకు ముందే చెప్పాను. అతని వల్ల ప్రాబ్లెమ్ రావొచ్చని చెప్పాను.

“మీ యింటికా... వాళ్ళకి నే తెలుసా?”

“వూఁ”

అతను యింటికి వచ్చాడు. అమ్మ లోపలి గదిలోనే వుంది.

“మనం పెళ్ళి చేసుకొందాం,” అన్నాడు.

“కార్తీక్, మనం యిష్టపడిన మాట నిజమే. కాని నాకిప్పుడు పెళ్ళి చేసుకోవాలని లేదు,” అన్నాను.

“యేం, యెందుకని. యింకెవరినైనా ప్రేమించావా?” అడిగాడు.

“అటువంటిదేం లేదు కార్తీక్. మనం కాలేజ్‌లో చేరిన రోజుల్లో యిష్టపడ్డాం. కొంతకాలం గడిచింది. యిప్పుడు ప్రస్తుతం చదువుకోవాలనుకుంటున్నాను. ప్లీజ్, అర్థం చేసుకో,” మెల్లగా చెప్పాను.

“ఛీట్... యెంతగా ప్రేమించాను. యీ ఆడవాళ్లనే ట్రస్ట్ చేయకూడదు,” కోపంగా అరిచాడు.

నా కాళ్లు వణుకుతున్నాయి. యేం జరగబోతోంది.

“యిందులో మోసం యేంలేదు కార్తీక్. మనిద్దరికి కుదరదనిపించిది. అంతే,” భయాన్ని దిగమింగుతూ చెప్పాను.

“నాకేం తక్కువ... చదువా...”

“నీ చదువు నీ యిష్టం. అందువల్ల కాదు. వద్దనిపిస్తోంది అంతే,” తిరిగి చెప్పాను.

అమ్మ టీ తీసుకొని వచ్చింది.

అతను అమ్మ వైపు చూసి, “పెళ్ళి వద్దంటుంది,” అన్నాడు.

“అవును బాబూ, చదువుకొంటాననటుంది. మాక్కూడా పెళ్ళి చేయాలనే వుంది. కాని పిల్లల్ని యే విషయంలో ఫోర్స్ చేయకూడదని

సహస్ర చెప్పారు. అదే నిజమైన ప్రేమంట. మాక్కూడా నిజమేనని పించింది,'' అంది అమ్మ.

యిదేంటి అమ్మ యింతలా మాటాడేస్తోంది. అతనికి కూడా వాళ్లు పెళ్ళి చేయాలనుకొంటుంది అతనికిచ్చా... మరొకరికా అని అర్థం కాలేదనుకొంటా.

అతనెక్కడ మూర్ఖంగా యెటాక్ చేస్తాడోనని భయం. పోలీస్‌లకి చెప్పినా వాళ్లేం జీవితాంతం కాపలా కాస్తారా... అసలు యీ కార్తీక్‌కి యెవరి మాటైనా వినే అలవాటుందా...

అప్పటికి అతను వెళ్లాడు యింట్లోంచి కోపంగా, నీ అంతు చూస్తా నంటూ.

సహస్రకి చెప్పాను.

''మీ పేరెంట్స్‌ని అతని పేరెంట్స్‌తో మాటాడమను. అతని మూమెంట్స్‌ని గమనించమని చెప్పు. అతను మామూలుగా తీసుకుంటే వో.కే. లేదంటే మనం తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకొందాం. పోలీస్‌కి రిపోర్ట్ చేయి. నువ్వు మాత్రం కొద్దిరోజులు బయటకి వెళ్ళకు. యిప్పుడతనికి పియర్ గ్రూప్ ప్రషర్ పెద్దగా వుండదు. కాలేజ్ లేదుకదా, మిగిలిన స్నేహితులు యెక్కడున్నారో కనుక్కొందాం,'' అన్నారు.

వాళ్ళ పేరెంట్స్ అతను యేం పిచ్చిపనులు చేస్తాడోననే భయంతో అతన్ని గమనించటం మొదలుపెట్టారు. వాళ్లు సహస్రని కలిశారు. అతనికి వొక బాధ్యతని అప్పచెప్పమంది. వాళ్లు అతనికి వాళ్లు చేస్తున్న బిజినెస్ విషయాలు కొన్ని అప్పచెప్పారు. అతనికి నలుగురిలో వో యింపార్టన్స్ రావటం అతనికో యిగో సాటిస్‌ఫేక్షన్. అతనికి పిల్లనిస్తామని బంధువుల నుంచి వో నాలుగు సంబంధాలు రావటంతో అతనికి తను చాలా విలువైన వ్యక్తిగా తోచటంతో నాపై అటెన్షన్ కాస్త తగ్గింది.

సహస్ర యంగ్ బిజినెస్ పర్సన్స్ కోసం వో పోగ్రామ్ మొదలు పెట్టింది. దానికి అతన్ని యెటెండ్ అవ్వమని పిలిచింది... అతను అటెండ్ అయ్యాడు.

సహస్ర చెప్పిన విషయాలు అతనికి యిన్స్‌పైరింగ్‌గా అనిపించి ఆమెని పర్సనల్‌గా కలవటానికి అపాయింట్‌మెంట్ అడిగాడు.

అప్పుడు సహస్ర మా అందరిని పిలిచి, "మీరెవ్వరూ మీ జీవితంలో అతన్ని మామూలు మనిషిని చేయటానికి యిలా మనమంతా యింజినీరింగ్ చేశామని చెప్పొద్దు. అతను ఫీలవొచ్చు. నిజానికి డైరెక్ట్‌గా కౌన్స్‌లింగ్ చేయటం కరెక్ట్. కానీ చాలామందికి మనసుకి అనారోగ్యం చేస్తే బాగు చేయించుకోవటం పట్ల చాలా వ్యతిరేకత వుంటుంది. యితన్ని యిలా వో పాజిటివ్ దారిలోకి తీసుకురాగలిగాం. యిప్పుడు అతనికి నాపై వో గురి కుదిరింది. అతనిలో యింకాస్త మార్పు తీసుకురావచ్చు," అని చెప్పారు.

"నేనిప్పుడు బయటకి వెళ్లొచ్చా. యంబి.యే.లో జాయిన్ అవుదామనుకొంటున్నాను," అడిగాను.

"నువ్వు కార్తీక్‌కి యిలా జాయిన్ అవుతున్నానని చెప్పు," అన్నారు.

"యెందుకు... గొడవ చేస్తే... తిరిగి నాపై ఆశలు పెంచుకొంటే... మళ్లీ నేనే యెందుకు కెలకటం," భయంగా వుంది నా స్వరం.

"విషయాలని యెంతకాలం అండర్ కార్పెట్ వుంచుతాం," అన్నారు సహస్ర.

కార్తీక్‌కి కాల్ చేసి చెప్పాను.

"ఆల్ ది బెస్ట్. నేనీ నెలలో మలేషియా వెళ్లుతున్నాను బిజినెస్ పని మీద," అన్నాడు.

"వో రియల్లీ. హ్యాపి జర్నీ," చెప్పాను.

"తను మలేషియా వెళ్లుతున్నాడంట."

"అవును. అతను నీతో యెలా మాటాడతాడో తెలియాలనే మాటాడమన్నాను. అతనంటే నీకు భయముందనుకో నువ్వు యెప్పటికి సంతోషంగా వుండలేవ్. నువ్వు వొక్కటి మాత్రం బాగా గుర్తుపెట్టుకో. అతనంటే నీకు లేని యే ఫీలింగ్స్‌ని నువ్వు సరదాకి కూడా వ్యక్తపర్చకు. యితనితోనే కాదు యెవరితోనైనా సరే. అన్ని విషయాలకి రెస్పాన్సిబుల్‌గా వుండటం నేర్చుకో. అదే వొక నిజమైన వికాసం," అంది సహస్ర.

యెంట్రన్స్ రాశాను. మొదటిసారి సీట్ రాలేదు. రెండోసారి రాసినప్పుడు వచ్చింది.

చదువుకోటానికి సరదాలకి టైమ్‌ని యెలా బ్యాలెన్స్ చేయవచ్చో తెలిసిందిప్పుడు.

కార్తీక్‌కి నేనే విధమైన యిమోషన్ కాకుండాపోయి చాలాకాలం అయింది. అతని పెళ్ళి పోయినేడాది అతని బంధువుల అమ్మాయితో జరిగింది. క్యాంపస్ సెలెక్షన్‌కి ఆసక్తి చూపించకపోవటం చూసి మా ప్రొఫెసర్ యెందుకని అడిగారు. టీచింగ్ వైపు వెళ్లాలనుకొంటున్నానని చెప్పాను.

“స్ట్రేంజ్. యెవ్వరికి అలాంటి ఆసక్తి వుడటం లేదు. నాన్ గ్లామరస్ జాబ్ అని కదా యీ జనరేషన్ అభిప్రాయం. అదీకాక అంతా యు.యస్. వెళ్లిపోవాలనే తహతహలో వుంటారు కదా,” అన్నారాయన.


“యస్ సర్, మీరన్నది నిజమే. నాకూ వొకప్పుడు అలానే వుండేది. యిప్పుడలా లేదు. నా తరువాతి జనరేషన్‌తో యిక్కడే నడవాలని వుంది,” అన్నాను.

యీరోజు కాన్వొకేషన్ అయింది అని రాసి ఫోటోస్‌ని అప్‌లోడ్ చేసి లాప్‌టాప్ క్లోజ్ చేసి యింట్లో నుంచి బయటకి వచ్చాను.

కార్తీకపు శీతలగాలుల్లో కమ్ముకొస్తోన్న పున్నాగపూల పరిమళం... సహస్రాకి యెంతో యిష్టమై సుగంధం... యెలాంటి వెర్రితనం, యెటువంటి భయాందోళనల నుంచి యీరోజు యిలాంటి సుగంధపు దారులలో నడిచే ఆత్మదీపాన్ని వెలిగించిన సహస్రకి నేనేం యివ్వగలను... ఆ వెలుగుని నా తరువాతి జనరేషన్‌కి ట్రాన్స్‌లేట్ చేయటం తప్పా.

*కౌముది అంతర్జాల పత్రిక, జనవరి 2011*

# మాన్వి



రాత్రంతా వాన... గభగభా కుర వటం... ఆగటం... మళ్లీ గభగభా కురవటం... అలా రాత్రంతా కురుస్తోన్న వాన. నాలుగు చినుకులు పడగానే అదే పోతుందో, డిపార్ట్‌మెంట్ వారెవరైనా తీసేస్తారో తెలీదు, పవర్ పోతుంది. ఐదు నిమిషాల్లోపే మా యింటి వెనకనున్న, యెడమ వైపు నుండే రెండు అపార్ట్‌మెంట్స్‌లో జనరేటర్స్ దడదడలాడతాయి. అంతే రాత్రి నిశ్శబ్దం చిట్లుతుంది. వాన పాట అపశ్రుతులతో చిందేస్తుంటుంది. అసలే రాత్రి మయూర్ సరిగ్గా మాటాడలేదు.

పని వొత్తిడి వుందన్నాడు. అలాంటి మృదు రహిత వానరాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. తెల్లారకట్ట యెప్పుడు నిద్రపట్టిందో యేమో ఉమ కాలింగ్ బెల్‌ని మోగించే వరకు తెలివే రాలేదు.

"యేమ్మా... రాత్రి నిద్రపట్టలేదా... పెద్దమ్మగారు లేరామ్మా," అంటూ ఉమ పాలప్యాకెట్, న్యూస్ పేపర్స్ పట్టుకొని లోపలకి వచ్చింది.

ఉమకి కాఫీని సమకొలతలతో సరిగ్గా కమ్మగా కలపటం రాదు. కాఫీ కలిపి తనకో కప్పు యిచ్చి, నా కాఫీకప్పు తీసుకొని పెరట్లోకి వచ్చాను. నేలంతా నిన్న పూసిన తెల్లని రేకనందివర్ధనాలు. పచ్చని చెట్టుకొమ్మల నిండుగా యివాళ పూసిన నందివర్ధనాలు. గతవారం నాటిన మందార చెట్టుకి గులాబిరంగు మందారపువ్వు పూసింది. యింతలో చాలా యిళ్ల ల్లోంచి బర్‌బర్‌మంటూ మిక్సీల శబ్దం. రోజూ వుదయం యెనిమిది నుంచి పది వరకు పవర్ కట్. ప్రతిరోజు యీ సమయానికి ఉమ మిక్సీ కొట్టే హడావడిలో వుంటుంది. కానీ యీరోజు అటువంటి ధ్వనులేం విని పించటం లేదు. అమ్మ, నాన్నగారు ప్రతి యేడాది క్రమం తప్పకుండా చేయించుకొనే హెల్త్ చెకప్‌కి వెళ్లారు. కాసేపట్లో వచ్చేస్తారు. అప్పుడీ వంటగది బాధ్యత వుండదు. గొప్ప రిలీఫ్. కాఫీ తాగి వంటగదిలోకి వచ్చే సరికి ఉమ చేతిలోని కప్పులో కాఫీ చల్లారిపోతూ అలానే నిండుగా వుంది.

"ఉమ కాఫీ తాగు, చల్లారిపోతుంది," అని ఆఫీసుకి వెళ్లటానికి రెడీ అవ్వటానికి వాష్‌రూమ్‌లోకి వెళ్లాను.

పవర్ పోయింది. ఫ్రెష్ అయి డైనింగ్ టేబిల్ దగ్గరకి వచ్చేసరికి టేబిల్‌పై యెమర్జన్సీ ల్యాంప్ వెలుగుతోంది.

"మిక్సీ కొట్టటం ఆలశ్యం అయిందమ్మా. కరెంట్ పోయింది. చట్నీ లేదమ్మా," నొచ్చుకొంటూ అంది ఉమ.

పొగలు చిమ్ముతోన్న యిడ్లీల పరిమళాన్ని గుండెల్లోకి పీల్చు కొంటూ, "పంచదారతో తింటాను," అన్నాను. పంచదార యెక్కువ తింటే భవిష్యత్త్‌లో ప్రమాదం అంటున్నారని కానీ లేకపోతే యిడ్లీ, వుప్మా, దోశె యిలా అన్నింటిని పంచదారతో తినటమే నాకిష్టం. పవర్‌కట్ యిచ్చిన అవకాశంగా భావించి యీరోజు యిడ్లీని పంచదారతో తిన్నాను.

ఉమ పనికి వచ్చినప్పట్నుంచి అస్థిమితంగానే కనిపించింది. కాప్సి కమ్ కూర చేసి అందులో ధనియాల పొడి వేయటం మర్చిపోయానని కూర యెలా వుంటుందోనని కొద్దిగా వాపోయింది. ఆఫీస్‌కి బయలు దేరుతూ లంచ్ బాక్స్ యేదని అడిగితే "అయ్యో," అని తలపై వొక్కటి చరుచుకొని వంటగదిలోకి వడివడిగా నడిచింది.

"యేమనుకోకమ్మా," అంది బాక్స్ అందిస్తూ కళ్లు తుడుచుకొంటూ.

ఉమ వైపు చూశాను. కళ్ల నిండుగా నీళ్లు. లంచ్‌బాక్స్ మర్చిపోయి నందుకే... బాప్‌రే... యింత యెఫెక్ట్ అవసరమా అనుకొంటుండగా, "నెలొచ్చిందమ్మా," అంటుండగానే ఆమె కళ్లల్లోంచి ధారాపాతంగా కన్నీటి ధార. క్షణంలో యెర్రబారిన కళ్లు.

'యివాళ్లింకా పదహారో తారీకే కదా... అప్పుడే నెలొచ్చిందంటుం దేంటి... నెల రాగానే యింటి అద్దె, పాల ఖర్చు అని జీతంతోపాటు మరి కొంత డబ్బు అప్పుగా యివ్వమని, ఆ మొత్తాన్ని వచ్చే నెల జీతంలో కట్ చేసుకోమని ప్రతినెలా డబ్బులు అడగటం ఉమకి అలవాటు. ఉమ దగ్గర అలా అడ్వాన్ జీతం వుంటూనే వుంటుంది. మరి యీసారి యేంటో యిలా నెల మధ్యలోనే నెలొచ్చిందని మొదలుపెట్టింది. సరే అమ్మ వస్తుందిగా తను మాటాడుకొంటుంది,' అనుకొంటుండగా అమ్మ లోపలికి వచ్చింది.

అమ్మని చూసి, "నెలొచ్చేసరికి ఆశలన్నీ పోతాయమ్మా. యీసారీ కడుపు పండలేదమ్మా. పిల్లలు లేని బతుకు యేం బతుకమ్మా... యెంతగా ఆ దేముణ్ణి ప్రార్థించాను. యెన్ని వుపవాసాలు చేశాను. అమ్మా, ప్రతి నెలా యింతేనమ్మా... నెల వచ్చిందంటే చాలా యేడుపొస్తుందమ్మా..." ఉమ కళ్లల్లోంచి కన్నీరు. తనే తనని తాను కంట్రోల్ చేసుకొంటూ, "మా ఆయనకి వెటకారం యెక్కువైయిందమ్మా. మా అత్తమ్మ చూసిన సంబంధం చేసుకొంటానంటున్నాడు. లోపం యెవరిలో వుందో పరీక్షలకి రమ్మంటే రాడు. పరీక్షించుకొని మందులు వాడదామంటే వినడు. మా బస్తీలో తన స్నేహితులు, పిల్లలు లేకపోతే యెలా వేరే పెళ్లి చేసుకోమనే అంటున్నారు. వాళ్లు వచ్చినప్పుడు టీ కాసిస్తానా... తింటానికి పెడతానా...

విశ్వాసం లేని నా కొడుకులు... వేరే పెళ్లి చేసుకొంటే నా బతుకేంటని లేదమ్మా... చేసేసుకోమంటున్నారు. ఆడాళ్లు అంతేనమ్మా... పిల్లలు లేకపోతే బతుకేముంటుంది... చేసుకోని, నిన్నూ సాక్కోమనీ చెపుతాం అంటున్నారు. నా మొగుడమ్మా... వాళ్లేంటి సాక్కోమని చెప్పేది. తన కంటే నేనే యెక్కువ సంపాదిస్తాను. కాని మొగుడు వదిలేసిన ఆడదానికి గౌరవం యేముంటుందమ్మా. కడుపున కాయకపోతే బాధే... కానీ నన్ను వదిలేస్తా నంటే యెలాగమ్మా... రాత్రి తాగొచ్చి యీసారీ ఆశ పోయిందాని బాగా గొడవ చేశాడు,'' ఉమ చెపుతునే వుంది.

అమ్మ వింటునే వుంది. ఆఫీసుకి టైమ్ అవుతోంది. రోడ్లన్నీ రద్దీగా వుంటాయి. ఉమ చెప్పేది పూర్తిగా వినకుండానే త్వరత్వరగా బయటకొచ్చి కారు స్టార్ట్ చేశాను.

ఉమ మాటలు గుర్తొస్తున్నాయి. వాటితో పాటు శ్రీలత గుర్తొస్తోంది ప్రస్ఫుటంగా.

జిమ్‌లో నా పర్సనల్ ట్రైనర్ అలీ. ఫ్లోర్ యెక్సైజ్, కార్డియో చేస్తున్నా, మిషన్స్ చేస్తున్నా అందరి వైపు వొకామె కళ్లు పరిశీలనగా చూస్తుండేవి. ఆ చూపులలో యేముందో అర్థం అయ్యేది కాదు. అలీతో కాని మిగిలిన ట్రైనర్స్‌తో కాని ఆమె పెద్దగా మాటాడేది కాదు. క్లయింట్‌తో యెక్స్‌సైజస్‌ని చాల బాగా చేయించేది తప్ప వాళ్లతోనూ వుషారుగా మాటాడటం మాట అటుంచి అసలు మాటలే వుండేవి కాదు. పెనుభారమేదో మోస్తున్న ట్టుండే శ్రీలత వున్న వైపు అప్పుడప్పుడు చూస్తుండటం అలవాటైయింది. అలీ వారంరోజులు సెలవుపై వెళుతున్నాడని ఆ రోజులకి మరో ట్రైనర్‌ని అలాట్ చేస్తామని ఫ్లోర్ లీడర్ చెప్పాడు.

ఆరోజు ఆమె, 'ఐ యామ్ శ్రీలత...' అంటూ యింగ్లీషులో తనని తాను పరిచయం చేసుకొంది. యీమెతో జిమ్... ఫ్రెండ్లీగా వుండదు. యీ వారం యెలాగోలా కానిచ్చాలా... మరో ట్రైనర్‌ని అడగాలా... ఆలో చించాను. వారమేగా ... సర్దుకొంటే అయిపోతుంది.

చిత్రంగా మూడోరోజు శ్రీలత తనిస్తున్న ట్రైనింగ్ యెలా వుందని అడిగింది. ఆమె పెదవులపై చిరునవ్వు వుండదు కాని జిమ్‌లో వో పోస్టర్

వుంటుంది- 'షటప్ ట్రైన్ అప్' అని . అచ్చు ఆ పోస్టర్‌కి పర్యాయ పదంలా తర్ఫీదు యిస్తుంది శ్రీలత. నవ్వుతూ ఆ విషయమే చెప్పాను.

కాసేపు మౌనంగా వుండి, ''నిజమే... యేంటో నవ్వటాన్ని మర్చిపోయాను,'' అంది.

''యేం... యేందుకని,'' అని అడగలేకపోయాను. పర్సనల్ విషయం కదా.

మర్నాడు శ్రీలత, ''మీరు జాయిన్ అయినప్పటి నుంచి చూస్తున్నాను. ఫ్రెండ్లీగా వుంటారందరితో. మీలానే యింకా కొద్దిమంది క్లయింట్స్ వున్నారు. నేనందరిని గమనిస్తుంటాను, నా అవసరార్థం. నేనొకటి చెపుతాను. మీకు వీలైతే వొప్పుకోండి. మీకు నా ట్రైనింగ్ నచ్చింది కదా. యిక్కడ పర్సనల్ ట్రైనర్స్‌గా మమ్మల్ని తీసుకొన్నా, అవకాశాలు యెక్కువగా మగవారికే వెళతాయి. మా వరకు రావు. పర్సనల్ ట్రైనింగ్‌లో యెక్కువ క్లయింట్స్ వుంటే ట్రైనర్స్‌కి యెక్కువ డబ్బులు వస్తాయి. క్లయింట్స్ కూడ జెంట్స్ అయితే బాగా ప్రొఫెషనల్ స్కిల్స్ వుంటాయనుకొంటారు. వాళ్లనే ప్రిఫర్ చేస్తారు. పర్సనల్ ట్రైనింగ్‌కి మాకు అవకాశాలు తక్కువ. మీరు మీ పర్సనల్ ట్రైనర్ వద్దని చెప్పండి. ఫ్లోర్‌లో జనరల్ ట్రైనర్స్ ట్రైన్ చేస్తుంటారుగా. నేను మీతో పూర్తిగా అన్ని యెక్సైజెస్ చేయిస్తాను. మీరు ప్రతి నెల నాకు నాలుగువేలు యివ్వండి. మీరు ఆరువేలు కదా పే చేస్తున్నారు. మీకు రెండు వేలు మిగులుతాయి. యిద్దరికి లాభమే కదా,'' అంది.

అమ్మ దొంగముక్కా , పెద్ద బుర్ర అనుకొన్నాను చప్పున. ఆమె యీ విషయం యెక్కడా చెప్పవద్దని కాని, యీ విషయం బయటకి వస్తే తన వుద్యోగానికి ముప్పు అనేలాంటి హెచ్చరికలు యేం చేయలేదు. అంటే ఆమెకి నా మీద నమ్మకమా... నేనెక్కడా చెప్పనని. లేదా ఆఁ... యేమవుతుందిలే బయటకి యీ విషయం వస్తే మహా అయితే వుద్యోగం పోతుందంతే కదా అనుకొంటుందా. ఆమె ఆలోచన యేదైనా కాని యీ విషయం మాత్రం యెవరికి చెప్పకూడదని అనుకొన్నాను. కానీ ఆమె చెప్పిన ఆఫర్‌ని వొప్పుకోవాలా... తిరస్కరించాలా... జిమ్ యాజమాన్యానికి నమ్మకద్రోహం చేయటం సబబు కాదు కదా... నమ్మకద్రోహం మరీ బరువైన మాటలా తోచింది. కాస్త తేలిక మాటని వెతకాలి.

అసలు యీ సంభాషణ జరుగుతున్నంతసేపు, 'అవును... నవ్వటం మరిచిపోయాను,' అని శ్రీలత అన్న మాట గుర్తుకొస్తూనే వుంది.

నవ్వటం యెందుకు మర్చిపోయిందో... యేమో... ఆమె ప్రపోజల్‌ని వెంటనే వద్దనలేక మాటాడకుండా వూరుకొన్నాను.

మరో రెండ్రోజుల తరువాత అలీ లేనప్పుడు తిరిగి తను అడిగిన విషయాన్ని గుర్తుచేసింది. అప్పుడు నేనేం మాటాడలేకపోయాను. తరువాత రోజు సైకిల్ తొక్కుతుంటే వచ్చి పక్కనే నిలబడి, "డబ్బులు చాలా అవసరం మేడమ్. పెళ్లి అయి ఐదేళ్లు అయింది. పిల్లలు లేరు. డాక్టర్ దగ్గరకి వెళ్లాను, పిసివోడి సమస్య. ఆర్టిఫిషియల్ యిన్‌సమినేషన్ ప్రయత్నిద్దాం అన్నారు. చాలా డబ్బులు అవుతాయి. అందుకే అడిగాను. వుదయం ఆరు నుంచి నా డే మొదలవుతుంది. పావు తక్కువ ఆరు కల్లా వంటచేసి మా హజ్బెండ్‌కి బాక్స్ రెడీ చేసి రోడ్ నెంబర్ 44లో మిస్‌స్ ఠాకూర్ యింటికి వెళతాను. అక్కడ యెనిమిది వరకు ట్రైన్ చేస్తాను. తరువాత హైటెక్ లాంజ్‌లో అసోసియేషన్ హెల్త్ క్లబ్‌లో 10 నుంచి 12 వరకు పనిచేస్తాను. అక్కడ నుంచి యిక్కడికి వస్తాను. తెచ్చుకొన్న లంచ్ చేసి 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తాను. యింత కష్ట పడినా మొత్తం నెలకి కఠాకఠిగా యిరవై ఐదువేలు కూడా కావటం లేదు. అదే నాలా యంబియే చదివినవాళ్లు హైటెక్ సిటిలోని ఆఫీసల్లో వుద్యోగం చేస్తుంటే నెలకి అరవై నుంచి లక్షల్లో సంపాదిస్తున్నారు. మా యంబియేకి యేం విలువుంటుంది. తెలుగు మీడియమ్‌లో, కొన్నాళ్లు యింగ్లీష్ మీడియమ్‌లో. పేరుకి కాన్వెంట్. యింగ్లీష్‌లో మేం దాఠీగా మాటాడలేం. వాళ్లలాను వుండం చూడటానికి. మాకెవరిస్తారు అక్కడ వుద్యోగాలు. యిన్నేసి గంటలు పనిచేసినా మా అవసరాలే తీరవ్. పైగా యిప్పుడీ పిల్లలు కనటం కోసం సంపాదించాలి," అంది శ్రీలత.

"మీ హజ్బెండ్ యేం చేస్తారు?" అని అడిగాను.

"ఆయన యంబియేనే. స్కైలిఫ్ట్ మాల్లో బ్రాండెడ్ షూ షాప్‌లో సేల్స్‌మెన్. వుదయం పది నుంచి రాత్రి పది వరకు వుద్యోగం. తనకి వేరే యిన్‌కమ్ లేదు," అంది శ్రీలత.

సైకిల్ తొక్కటం అయిపోయింది.

యింతలో ఫ్లోర్‌లో యింటర్‌కమ్ మొగింది. శ్రీలత అటు వెళ్లింది.

ఆ రోజుకి తిరిగి శ్రీలత నా దగ్గరకి రాలేదు.

ఆమె అడిగిన విషయం నాకు ఆమోదమో కాదో యేదోవొకటి ఆమెకి చెప్పేస్తే బాగుంటుంది కదా... ఆమె అడిగిన దానికి వొప్పుకోలేనని నాకు తెలుస్తునే వుంది. ఆ విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పడానికి నవ్వుని కోల్పోయిన ఆమె ముఖం అడ్డొస్తోంది. అదే సమయంలో జిమ్ వాళ్ల ట్రస్ట్‌ని బ్రేక్ చేయటానికి నా వ్యాల్యూస్ అడ్డువస్తున్నాయి. ఆమె కారణాలు యెంత బలమైనావైనా కావొచ్చు. యిది పద్ధతి కాదని చెప్ప టానికి మనసొప్పటం లేదు. కానీ యీ రిఫామ్ గొడవ నాకెందుకు. యెలా ఛాలెంజ్ చేస్తాం.

అమ్మకి యింటిని చూసుకోవటం, యూనివర్సిటీకి వెళ్లి పాఠాలు చెప్పటం, వీకెండ్స్‌లో యంగ్ థియేటర్ గ్రూప్‌కి ట్రైనింగ్ యివ్వటం యిలా సమయమంతా బిజిగా వుండటంతో జిమ్‌లో జాయిన్ కాలేదు. కాని యింటికి వుదయమే యోగ టీచర్ వచ్చేవారు. అమ్మ, నాన్నగారు యోగా చేసేవారు. ఆ టీచర్‌కి పెళ్లయ్యాక యింటికొచ్చి యోగా చెప్పటం మానేసి వో నేచర్‌క్యూర్ సెంటర్‌లో టీచర్‌గా చేరారు. అప్పట్నుంచి మరో టీచర్ కుదరలేదు. యోగాకి, ఫ్లోర్ యెక్సైజెస్‌కి శ్రీలతని యింటికి వచ్చి అమ్మనాన్నకి చెప్పమంటే...

అమ్మని అడిగాను. సరేనంది.

◆ ◆ ◆

ఆ సాయంత్రం జిమ్‌కి వెళ్లినప్పుడు శ్రీలత నా దగ్గరకి వచ్చింది. కళ్లు వుబ్బిపోయి వున్నాయి.

''మా పేరెంట్స్‌కి యింటి దగ్గర ట్రైన్ చేయటానికి రాగలరా. వస్తానంటే మీ నెంబర్ మా అమ్మగారికి యిస్తాను. మిగిలిన విషయాలు మీ యిద్దరు మాటాడుకోవచ్చు,'' అన్నాను.

''థ్యాంక్సండి. వస్తాను. రాత్రి మా అత్తమ్మ వూరు నుంచి వచ్చింది. పెళ్లి అయి యిన్నాళ్లయినా పిల్లలు లేరుకదా , యిలా యెన్నాళ్లు పిల్లల కోసం యెదురుచూస్తావ్. మరో పెళ్లి చేసుకో, పిల్లని కూడా చూశామంది.

కొన్నాళ్లు ఆగమ్మా, పిల్లల కోసం డబ్బులు జమ చేస్తున్నామని మా ఆయన చెప్పాడు. యిలా యెప్పటికి పోగయ్యేను. ఆ డబ్బేదో మా యింటికి పోయి అమ్మావాళ్లని అడిగి తీసుకురమ్మంది అత్తమ్మ. మా యింట్లోవాళ్ళు అంత డబ్బు యివ్వలేరని చెప్పాను. డబ్బు పెట్టలేరని నువ్వే చెపుతున్నావ్, విడాకులు యివ్వు. మావాడికి వేరే పెళ్లి చేసేస్తానంటుంది. నా భర్త నన్నెంతో ప్రేమగా చూసుకొంటాడు. వాళ్లమ్మని కొన్నాళ్లు ఆగమంటు న్నాడు. కాని ఖచ్చితంగా మరో పెళ్లి చేసుకోనని వాళ్లమ్మకి కానీ నాక్కానీ చెప్పటం లేదు.  భయమేస్తుంది,'' అంది శ్రీలత.

అసలు యిలాంటి సమస్యలు యెదురైనప్పుడు ఆ మగవాళ్లు యేమనుకుంటారన్నది నాకెప్పుడూ తెలుసుకోవాలని వుంటుంది. అందుకే, ''మరి మీరు మీ భర్తని యిదే విషయం అడిగారా. యేమ న్నారు,'' అని కుతూహలంగా అడిగాను.

''తనేం అనగలడు. అటు అమ్మ, యిటు నేను. వాళ్ల అమ్మ మనసుకి కష్టం కలిగితే చూడలేనంటాడు... పెళ్లి అయిపోయింది. యింక అదే నీ యిల్లు. అత్తింటివారే నీ వాళ్లని, ప్రతిదానికి తమవైపు చూడొద్దని మా అమ్మ పెళ్లినాడు అప్పగింతలప్పుడే చెప్పేసింది. వుద్యోగాలవల్ల యీ సిటిలో అద్దె యింట్లో వుంటున్నాం. కాని మా ఆయనకి వాళ్ల వూరిలో సొంత యిల్లు, పొలం వుంది. మా అత్తమ్మవాళ్లు కాస్త సహాయం చెయ్యొచ్చు. కాని ఆవిడ యేమంటుందంటే విడాకులు తీసుకొన్నావ్ అనుకో,  మీవాళ్లు యింట్లో నిన్ను జీవితాంతం అట్టి పెట్టుకోలేరుగా. మళ్లీ పెళ్లికైనా, నిన్ను చూసుకోడానికైనా అంతో యింతో డబ్బు పెట్టా ల్సిందేగా. అదేదో యిప్పుడే యిస్తే నీకు పిల్లలు పుట్టటానికి కావల్సిన పరీక్షలకో, మందులకో పనికొస్తుందిగా. నీ జీవితమేగా బాగుండేది అంటుంది. నా భర్త కూడా వాళ్లమ్మ చెప్పింది నిజమే కదా అంటుంటాడు. మావాళ్లు నన్నెందుకు యింట్లో పెట్టుకొంటారు. నా గోలేదో నేనేపడ్డా,'' అంది శ్రీలత.

అరే... యిదేమి భర్త. జీవితం పంచుకొందామనేగా పెళ్లి చేసుకొంది. వోపక్క శ్రీలత మాత్రమే రోజంతా ఆ డబ్బు కోసం కష్టపడుతోంది. ఆడపిల్ల

యింటివాళ్లు ఆ ఆడపిల్లకి పెళ్లి చెయ్యాలి... కట్నం, కానుకలు యివ్వాలి. పండుగలకి బట్టలు, కానుకలు పెట్టాలి. పురుడ్లు పొయ్యాలి. యిప్పుడు పిల్లలు పుట్టటానికి మెడికల్ హెల్ప్ కావాలంటే ఆ డబ్బు భార్య పుట్టింటి వాళ్లే సమకూర్చాలి. లేకపోతే రెండో పెళ్లి చేసుకొంటాడతను. విడిపోవాలనే నిర్ణయం యెవరిదైనా అది సహేతుకం అయినా కాకపోయినా ఆ జంటని కలిపి వుంచటం సాధ్యమా... అతను ప్రేమగానే వుంటాడంటుంది. పిల్లలు లేకపోయేసరికి ప్రేమంతా పోయిందా...

''విడిపోవటం అంటే చాలా బాధ కలుగుతుంది కదా. మరి మీ భర్తకి అలా బాధనిపించటం లేదా,'' అడిగాను.

''బాధే... కాని అతను మాత్రం యేం చేస్తాడు. పిల్లలు కావాలి. పిల్లలు లేకపోవటం చాలా పెద్ద బాధ. జీవితాంతం లోటు మేడమ్. యింకొన్నాళ్లు పోతే పిల్లలు పుట్టటం తనక్కూడా కష్టమే కావొచ్చు. నా ముందున్న దారొక్కటే. యెలా అయినా డబ్బు సంపాదించి డాక్టర్ దగ్గరకి వెళ్లటమే. వడ్డీకైనా తీసుకోవాలి. మూడు రూపాయిల వడ్డీకైనా సరే. మీకెవరైనా వడ్డీకి డబ్బులు అప్పు యిచ్చేవాళ్లు తెలుసా. అప్పుడే యిక్కడ కొంతమందిని అడిగాను,'' అంది శ్రీలత.

ఆమె యెలాగైనా తన జీవితపు అస్థిత్వాన్ని నిలుపుకోడానికి అవసర మైన డబ్బులని సంపాదించుకోడానికి పూనకపు చూపులతో చుట్టూ చూస్తోంది.

ఆ వర్క్‌ఔట్ యీ వర్క్‌ఔట్ చేస్తూ అసలు శ్రీలత యింతగా తనంటే యిష్టం లేని భర్తతో, పిల్లలకి మాత్రమే ప్రాముఖ్యం యిచ్చే భర్తతో యెందుకుండాలనుకొంటుంది. యీమె యింతగా ఆ సంబంధాన్ని నిలుపుకోవాలని యెందుకు తపన పడుతోంది. బాధ్యతంతా తనపై వేసు కొని రోజంతా యెంతో అలజడిగా గడుపుతోంది. ఆమె భర్తకి యిలాంటి మనఃస్థితి వున్నట్టు కనిపించటం లేదు. యెందుకని అతను అలా వుండగలుగుతున్నాడు. అదే ఆమెని అడగాలనిపించింది. కానీ ఆ రోజుకి అడగలేకపోయాను.

◆ ◆ ◆

ఆ రాత్రి అమ్మకి శ్రీలత విషయమంతా చెప్పి నా యీ సందేహాలన్నీ చెప్పి, "పిల్లలు పుట్టే విషయంలో సైన్స్ యెంతగా అభివృద్ధి చెందినా డబ్బులు లేకపోతే అన్నింట్లాగే ఆ ట్రీట్‌మెంట్ అందరికి దొరికే అవకాశం దొరకదు కదా," అన్నాను. అమ్మ శ్రద్ధగా వింది తప్ప యేం మాటాడలేదు. అమ్మ యెప్పుడోకప్పుడు నా సందేహాల గురించి మాటాడుతుందని తెలుసు. గతంలో కూడా యేవేనా విషయాలు అడిగినప్పుడు వెంటనే కాకపోయినా తరువాతైనా అమ్మ ఆ విషయాల గురించి మాటాడేది.

అమ్మని ట్రైన్ చేయటానికి శ్రీలత రావటం మొదలుపెట్టింది.

నెలరోజులు అవ్వగానే అమ్మ శ్రీలతకి ఫీజ్ పే చేసింది. యింతకు ముందులా శ్రీలత జిమ్‌లో నాతో పర్సనల్ విషయాలు మాటాడటం లేదు. ఆమె విషయాలు పెద్దగా గుర్తుకు రావటం లేదు.

అయితే ఆమధ్యకాలంలో నేను అడిగిన సందేహాలకి అమ్మ వోరోజు రాత్రి, "శ్రీలత లోకంపోకడ బాగా తెలిసినామె. మామధ్య తన వ్యక్తిగత విషయాలు వస్తున్నాయి. నువ్వడిగావు చూడు ఆమె యెందుకా భర్తని సహిస్తుందని... శ్రీలత యేమందంటే 'తన భర్త పిల్లలు పుట్టినా పుట్టక పోయినా రెండో పెళ్లి చేసుకోనని వాళ్ల అమ్మతో యెందుకు ఖచ్చితంగా చెప్పడు. అంటే అతనికి తనతో వున్న సంబంధం కంటే పిల్లలు చాలా ముఖ్యం. అది తేటతెల్లం. వొకవేళ పిల్లలు లేకపోవటానికి అతను కారణం అయితే తను మరో పెళ్లి చేసుకోవాలనుకొంటుందా. అలాంటి ఆలోచన తనకివస్తే తన ఆ నిర్ణయాన్ని తన అత్తింటివాళ్లు, అమ్మింటివాళ్లు సమర్థిస్తారా. యీ భర్తతో వుండకపోతే యేమవుతుంది... అతను, తన యింట్లోవాళ్లు, అత్తింట్లోవాళ్లు తనని యెందుకు ఐసోలేట్ చేస్తున్నారు. యిలాంటి ప్రశ్నలన్నీ ఆమె వేసుకొంది. వాటికి సమాధానాలు తనే కొన్ని చెప్పుకొంది. నా భర్త నుంచి విడిపోతే, చాలా సహజంగా చాలాయేళ్లుగా మా ఆయన కుటుంబంతో వచ్చిన బంధుత్వాలన్నీ మాయమైపోతాయి. మాకు స్థిరమైన యిరుగుపొరుగు లేదు యీ సిటిలో. మా వుద్యోగాలలో కొలీగ్స్ తరచుగా మారిపోతుంటారు. మాకు టెంపరరీగా మనుష్యులు

తెలుస్తుంటారు తప్ప బలమైన స్నేహాలు వచ్చే అవకాశం లేదు. యెవరైనా చిన్ననాటి స్నేహితులుంటే దాదాపు అన్నీ మొబైల్‌కే పరిమితమైన స్నేహాలు. యీ భర్త, అత్తింటి ఆలోచనలకి బాధపడి వుక్రోషంతోనో, ఆత్మ గౌరవమో అనుకొని టుపుక్కుని డైవర్స్ యిచ్చేస్తే తరువాత నేను వొంటరిగా మిగిలి పోవాలి. తలనొప్పి వచ్చినా, కాల్లో ముల్లు గుచ్చుకొన్నా యెవరు చూస్తారు. యెవరైనా చూస్తారని ఆశ పెట్టుకొని వాళ్ల అవసరాలని చూస్తాం. మన అవసరానికి వాళ్లు నిలబడొచ్చు. నిలబడకపోవచ్చు. మళ్లీ మరోవైపు చూస్తాం. యింతే మిగిలిన జీవితమంతా. మళ్లీ పెళ్లంటారా... అక్కడా యిలాంటివే యేవో సమస్యలు. అయినా బయట సంఘరీతికి భిన్నంగా ఆలోచించే మగవాళ్లూ యెక్కువగా లేరు. వొకప్పుడు వుండేవారను కొంటాను. అందుకే ఆధునిక టెక్నాలజీ మనకిచ్చిన అవకాశాలు ఐవిఎఫ్, సరగొసీ యేదైనా సరే పిల్లని కంటాను. యీ మొగుడు నుంచి బయటకి వచ్చి పడే చికాకుల కంటే యీ ట్రీట్‌మెంట్‌కి అవవరమయ్యే డబ్బులని సమకూర్చుకోవటం తేలికనిపిస్తుంది... యిలా చాలా విషయాలని శ్రీలత చెప్పింది,'' అంది అమ్మ.

ఆశ్చర్యంగా వింటున్న నన్ను చూసి అమ్మ, ''బయటకొస్తే సమాజం యేమంటుందోననే భయం నుంచి, బయటకొచ్చినా జీవించొచ్చనే సమాజపు భరోసా నుంచి, సమాజం వైపు చూడలేని వ్యక్తిగతంగా మిగిలి పోతోన్న యేకాకి ద్వీపాలుగా తయారైపోయామనిపిస్తోంది. శ్రీలత పెలోపియేన్ ట్యూబ్స్ మాత్రమే మూసుకుపోయాయి. అవి పని చేయక పోతే అవి చేసే పనిని చెయ్యటానికి ఐవియఫో, ఆర్టిఫిషియల్ యిన్‌సమి నేషనో వున్నాయి. అనేక మానవ సంబంధాలలో, మరెన్నో విషయాలలో మూసుకుపోతున్న యీ సమాజాన్ని తెరవటానికి యెలాంటి విజ్ఞానం కావాలో,'' అంది అమ్మ.

యిదంతా విన్నాక, 'శ్రీలత పెళ్లయింది కాబట్టి యేమైపోయినా సరే యీ భర్తే,' అనే అభిప్రాయంతో కాకుండా యింకా లోతుగానే యీ జీవన సంబంధం గురించి యోచిస్తుందనిపించింది.

◆ ◆ ◆

రెండ్రోజుల తరువాత ఆఫీస్ పని పై కాన్ఫరెన్స్‌కి మూడురోజుల కోసం కంబోడియా వెళ్లాను.

అటు నుంచి వచ్చాక వారంరోజులు హైటెక్స్ లో మరో కాన్ఫరెన్స్. నే వెళ్లే జిమ్ బ్రాంచ్ అటు కూడా వుండటంతో అక్కడే వర్క్ఔట్‌కి వెళ్లే దాన్ని వీలైనప్పుడంతా. కార్డియో చేసి వచ్చేసేదాన్ని. శ్రీలత జిమ్‌కి వెళ్లి నప్పుడు యెప్పుడైనా గుర్తొచ్చేది. మళ్లీ పని వత్తిడిలో ఆమె ఆలోచన యెటో  వెళ్లిపోయేది.

“శ్రీలత యేదో వూరు వెళ్లాలి. రెండ్రోజులు రానంది. కాని చాలా రోజులుగా రావటం లేదు. ఫోన్ కూడ  స్విచ్ ఆఫ్. నువ్వు జిమ్‌కి వెళ్లి నప్పుడు అడుగు,” అమ్మ చెప్పిందో రోజు.

“రెగ్యులర్‌గా వెళ్లే బ్రాంచ్‌కి వెళ్లినప్పుడు అడుగుతానులే,” అన్నాను.

వో పది రోజుల తరువాత యెప్పుడు వెళ్లే బ్రాంచ్‌కి వెళ్లాను. శ్రీలత కనపడలేదు.

తరువాత రోజూ కనిపించకపోతే, “శ్రీలత కనిపించటం లేదేంటి,” ఛేంజింగ్ రూమ్ అటెండర్ సరోజని అడిగాను.

“తెలీదు మేడమ్,” అని అక్కడ నుంచి వెళ్లిపోయింది.

ట్రాక్‌సూట్ మార్చుకొని జిమ్ కిట్ సర్దుకొంటుంటే సరోజ తిరిగి లోపలికి వచ్చి అక్కడ స్టాఫ్ యెవ్వరు లేరని నిర్ధారించుకొన్నాక, “శ్రీలతని వుద్యోగంలోంచి తీసేశారు. చాలా పెద్ద గొడవ జరిగింది. ఆమె చాలా పెద్ద తప్పుడు పని చేసింది. యెంతైనా డబ్బు మహా చెడ్డది మేడమ్. డబ్బుకోసం గడ్డి తింది శ్రీలతా మేడమ్...” యింతలో యెవరో రావటంతో ఠక్కున టాపిక్ మార్చేసింది సరోజ.

బయటకొచ్చి కారు స్టార్ట్ చేశాను.

యేం చేసుంటుంది శ్రీలత... క్లయింట్స్‌తో లాలూచీలు తెలిసి పోయి వుంటాయా... యెవరైనా కంప్లైంట్ చేసుంటారా. యేం జరిగి ఉంటుంది.

◆ ◆ ◆

యింటికొచ్చాక అమ్మకి చెప్పాను.

"వుద్యోగం పోయిందా... కాని యింటికొచ్చి చెప్పే క్లాసెస్ నుంచి వచ్చే యిన్‌కమ్ కూడా యెందుకు పోగొట్టుకొంటుంది. యేమయిందో?" అంది అమ్మ.

"వుద్యోగం పోయినందుకు యెంబ్రాసింగ్‌గా ఫీలవుతుందేమో," అన్నాను.

"తన విషయమంతా మనకి తెలుసు కదా... మనం వేరేలా యెందు కనుకుంటాం. అయినా తనేమనుకొంటుందో మనం యెలా వూహిస్తాం," అంది అమ్మ.

◆ ◆ ◆

తర్వాతర్వాత శ్రీలత మా మనస్సుల్లోపల యెక్కడికో వెళ్లిపోయింది.

ఆ వేసవికి అది తొలి వసంత మేఘగర్జన. చిన్న జలదరింపు శరీరంలో. జివికె మాల్‌లోని హార్డ్‌రాక్‌లో కాఫీ తాగుతూ నెట్‌బుక్‌లో అమితాబ్ ఘోష్‌ని చదువుతున్నాను. రాబోతున్న వాన యివ్వబోతున్న భూ సుగంధాన్ని వూపిరి నిండా పీల్చుకోవటానికి వెంటనే అక్కడ నుంచి బయటకి వెళ్లిపోవాలనిపించింది. బిల్ పే చేసి, సెకెండ్ లెవెల్ పార్కింగ్ లో కొచ్చి కారు కోసం చూస్తే కనిపించలేదు. అప్పుడు గుర్తొచ్చింది థర్డ్ లెవల్లో వుందని. అక్కడికి మెట్లపై వెళుతుంటే, ఆ మెట్లు యెక్కుతూ పైకొస్తున్న వొకామె, "హలో మేడమ్," అని పలకరించింది.

పోల్చుకోడానికి కొంచెం టైమ్ పట్టింది. శ్రీలత. ఆమె చేతిలో టేబిల్స్ పై పెట్టే ఫ్రెష్ ఫ్లవర్స్‌తో కళాత్మకంగా అమర్చిన బొకేస్.

యిదేంటి యిలా బక్కపల్చగా అయిపోయింది. జుట్టంతా పీచు పీచుగా వుంది. నుదిటిపై కొత్తగా తగ్గిన దెబ్బ తాలూకు మచ్చ. అప్పట్లో నవ్వటం మరచిపోయిన ఆమె, యిప్పుడు నవ్వినా పీక్కుపోయిన చెంపలు ఆ విషయాన్ని మనకి కనిపించనివ్వనంతగా దంతాలకి అతుక్కు పోయిన చెంపల చర్మం.

"గుర్తుపట్టనంతగా సన్నగా అయిపోయాను కదా. అమ్మగారు బాగున్నారా. నా కొత్త నెంబర్ మిస్డ్‌కాల్ యిస్తాను. మీ నెంబర్ చెప్పండి," అంది శ్రీలత.

తొలి చినుకు నేల మీదకి రాకముందే బయటకి వెళ్లాలనే ఆత్రుతగా వున్నా ఆమెని అలా చూడగానే బాధగా అనిపించి ఆగి నా నెంబర్, అమ్మ నెంబర్ చెప్పాను. మిస్డ్ కాల్ యిచ్చింది.

"యిక్కడ కనిపించినట్టు మన జిమ్‌లో యెవ్వరికి చెప్పకండి. నెంబర్ యివ్వకండి," అంది.

మరో గర్జన... వర్షం వచ్చేసేలాగుంది...

'యెందుకు' అని అడక్కుండానే థర్డ్ లెవల్ పార్కింగ్‌కి వచ్చాను. కారు తీసుకొని బయటకి వచ్చాను.

మరీ రద్దీగా లేని రోడ్ల వైపు వెళ్లాలి. లేకపోతే వాననీటికి రోడ్డుపై చిక్కితే మట్టి పరిమళపు ఆనందపు వూయలేమో కానీ ట్రాఫిక్, డ్రైనేజ్ కంపుకి అడ్డంగా దొరికిపోతాం.

యీ వీకెండ్‌లో యీ వానొచ్చింది . కానీ అదే వర్కింగ్ డేస్‌లో వస్తే యిలా రావటం కష్టం. మేఘగర్జన లేకపోతే వానొస్తుందనే తెలీదు. ప్రకృతి తన ఆగమనాన్ని భలే చెపుతుంది. లేక... ఫోన్ మోగింది. చూశాను. అమ్మ.

"శ్రీలత ఫోన్ చేసింది. డబ్బు కోసం యేం చేసిందో తెలుసా... బై యెలెక్షన్స్‌లో చాలాచోట్లకి డబ్బుని తరలించేవారు కదా. అలా తరలించే వాళ్లొకరు శ్రీలతని వో కారులో వెళ్లమన్నారంట, ఆడవాళ్లుంటే పోలీసులు తనిఖీలు చేయరని. వొకవేళ పట్టుబడినా అదంతా డ్రైవింగ్ చేస్తున్నవాళ్లే చూసుకుంటారు. పట్టుకొంటే 'ఖాళీగా వెళుతున్న కారు , ఆమె దారిలో దిగిపోయే పాసింజర్ , డబ్బులొస్తాయని యెక్కించుకొన్నాను,' అని డ్రైవర్ చెప్తాడని చెప్పారంట. సేఫ్‌పాసేజ్‌లా అన్నమాట. యీ పని చేస్తే పదివేలు యిస్తామన్నారంట. యెనిమిది గంటలు యేసి కారులో పాటలు వింటూ ప్రయాణిస్తే పదివేలు వస్తాయని పెద్దగా ఆలోచించకుండా వొప్పుకొందంట. వ్యక్తుల వివరాలు వివరంగా చెప్పలేదు శ్రీలత. నాలుగో చెక్ పోస్ట్ దగ్గర చెకింగ్ చేస్తే డబ్బు దొరికిపోయింది. ఆమెని పోలీసులు వివరాలు అడిగితే కంగారులో తన భర్త పేరు, చేస్తున్న వుద్యోగం చెప్పేసిందంట. వాళ్లు యెంక్వైరీ చేసారంట. పోలీసుల నుంచి యెంక్వైరీ అనగానే

జిమ్ వాళ్లు వుద్యోగం నుంచి తీసేశారు. నిజానిజాలకంటే వూహాగానాలు చాలా పరిగెత్తాయి. అసలు ప్రమాదం ఆమెకి తన భర్త నుంచి యెదురైంది. అతనికి స్నేహితురాలింట్లో ఫంక్షన్‌కి మరో స్నేహితురాలితో కలసి సిటి అవుట్‌స్కట్స్‌లో వున్న వూరు వెళుతున్నానని, తిరిగి రాత్రికే వచ్చేస్తానని చెప్పిందంట. యీ పోలీసుల ఫోన్‌తో అతనికి చాలా అనుమానాలు వచ్చాయి. స్నేహితురాలు లేదు. యేసి కారు. డ్రైవింగ్ చేసే వొక మగ వ్యక్తి తప్ప మరో మనిషి లేదు. అతనికి చాలా కోపం వచ్చిందంట. బాగా కొట్టాడంట. అప్పటికే వాళ్ల అమ్మని రమ్మని ఫోన్ చేశాడంట. వాళ్లమ్మ నీతిలేనిదానివి. వాడెవ్వడితోనో సంబంధం వుందని చాలా మాటలందంట. పిల్లల కోసం డబ్బులొస్తాయని వెళ్లాను తప్ప అతనెవరో కూడా తెలియదు. అతనితో యే సంబంధం లేదని చెప్పినా వాళ్ల అత్తమ్మ, భర్త నమ్మలేదంట. శ్రీలత వాళ్ల అమ్మని పిలిపించారంట. మొత్తమందరూ శ్రీలతని బాగా నిందించారంట. ఆ గొడవలో శ్రీలత భర్త ఆమె పొట్టలో వొక తన్ను తన్నాడంట. కుర్చీకి అడ్డంగా పడటంతో, కుర్చీకున్న మేకు పొట్టలో దిగబడి పొట్టలో గాయమైయి చిన్న ఆపరేషన్ చెయ్యాల్సొచ్చిందంట. యింతగా శ్రీలత కష్టపడినా ఆమె భర్త శ్రీలతని విడిచిపెట్టేసి, మరో పెళ్లి కూడా చేసేసుకున్నాడంట,'' అంది అమ్మ.

``మరి శ్రీలత అతనిపై కేస్ పెట్టలేదా... అన్ని గాయాలు చేస్తే...'' ఆశ్చర్యంగా అడిగాను.

``అదే ట్రాజడి . పోలీసుల రైడ్‌లో పట్టుపడిందనే ప్రచారం తెగ జరిగింది. అందరూ దానికి మరిన్ని అవాస్తవాలని అద్ది మాటాడటంతో ఆమె చాలా అవమానపడింది. అసలు భర్తకి చెప్పకుండా వెళ్లటమే తను చేసిన పెద్ద తప్పని బలంగా నమ్ముతోందామె. చాలా గిల్టీగా ఫీలవుతోంది. యిప్పుడు ఆమెకి పుట్టిల్లు లేదు. అత్తిల్లు లేదు. మొగుడు లేడు. వూరు లేదు. పేరు లేదు. తనిప్పుడు వో బొకే షాపులో బొకె డెలివరీ గర్ల్‌గా పని చేస్తోంది. ప్రస్తుతం ఆమె పేరు మాన్వి. వూరు ముంబై,'' అంది అమ్మ.

అమ్మ వెంటనే యీ విషయాలు చెప్పకుండా వుండలేక ఫోన్‌లోనే చెప్పిందనిపించింది.

యెలాగైనా డబ్బు సంపాదిస్తాను, జీవితాన్ని నిలబెట్టుకుంటానని ఆత్మ విశ్వాసంతో చెప్పే శ్రీలత కళ్ల ముందు మెదిలింది. మనసంతా దిగులు కమ్ముకొంది. ఫ్రెష్ ఫ్లవర్స్‌తో యెదురైన శ్రీలత చూపుల్లోకి చొచ్చు కొచ్చింది. యెప్పటికైనా ఆమె మనసులో విషాదం ఆ పువ్వుల స్వచ్ఛమైన గాలితో ఆవిరైపోతే బాగుండుననిపించింది.

కానీ అలా జరగలేదు. ఆ పువ్వుల దుకాణానికి ఆర్డర్ యివ్వటానికి వచ్చిన వొకామె, వొకప్పుడు శ్రీలత పనిచేసిన జిమ్ క్లయింట్. శ్రీలతని చూసి, ఆమె పేరు మాన్వి కాదని , ఆమె ట్రాక్ రికార్డ్ బాగులేక జిమ్ వాళ్లు వుద్యోగంలోంచి తీసేశారని చెప్పింది. అంతే శ్రీలత జాబ్ పోయింది. తరువాత ఆమె యేమయిందో తెలీదు.

జిమ్‌లో యెనెన్నో యెక్సైజెస్‌ని యెంత బాగానో నేర్పించే శ్రీలత, కావల్సిన ఆకృతిని తన క్లయింట్స్‌కి యిచ్చే శ్రీలత, తన జీవితాన్ని తనకి నచ్చినట్టు తీర్చిదిద్దుకొనే ప్రయత్నంలో యెప్పటికైనా సంతోషాన్ని పొందు తుందనిపిస్తుంటుంది.

యిప్పుడీ ఉమ పిల్లల సమస్య చెప్పగానే శ్రీలత బాగా గుర్తు కొచ్చింది. డిస్టర్బ్‌గా అనిపిస్తోంది.

కారు పార్క్‌చేసి ఆఫీస్‌లోకి వెళ్లాను. వెంటనే పని మొదలుపెట్టాను. ఉమ గుర్తుకురాలేదు.

సాయంకాలం యింటికొస్తుంటే, రేపు వుదయమే ఉమ వచ్చి తిరిగి యీ విషయాలు మాటాడితే, బాప్‌రే... వీటికి దూరంగా వుండాలి. లేకపోతే మనఃశ్శాంతి వుండదు. సాయంకాలం యింటికొచ్చాక ఫేస్‌బుక్ కాసేపు చూశాను. మనసులోంచి ఉమ వెళ్లిపోయింది.

తిరిగి వుదయమే ఉమ అమ్మతో మాటాడుతోన్న మాటలు వినిపి స్తున్నాయి. "పిల్లలు యెందుకు కలగట్లేదో తెలవదమ్మ. డాక్టర్ పరీక్షలకి డబ్బులు మా అమ్మనడిగి తెమ్మంటున్నాడమ్మా మా ఆయన... ఆటలా

వుందా... పెద్దల ముందు పంచాయితీకి వూరు పోదామన్నాను. రానంటున్నాడు. యెలా రాడో చూస్తాను. గుంజుకుపోతా. నాలుగు రోజులవ్వొచ్చు. పనికి రాను...'' ఉమ చెపుతోంది.

నా కళ్ల ముందు చర్మంతో మాత్రమే యెదురైన శ్రీలత... లోపల్నుంచి ఆందోళన.

గత కొంతకాలంగా నాకూ అమ్మకి మధ్య, మయూర్ గురించి నా ప్రవర్తన విషయంగా రకరకాలుగా సంభాషణలు జరుగుతున్నాయి.

మయూర్‌తో పెళ్లిని యింట్లోవాళ్లే నిశ్చయించారు. పెళ్లయిన తరువాత మయూర్ యు.యస్ వెళ్లే ముందు తనతో నన్ను కూడా రమ్మన్నాడు. అప్పటికి నా పిహెచ్.డి పూర్తికాలేదు. చదువు పూర్తయ్యాక వస్తానంటే సరేనన్నాడు. తరువాత వుద్యోగం వచ్చింది . కొద్దికాలం జాబ్ చెయ్యాలని వుందని చెప్పినప్పుడు మయూర్ వొప్పుకోలేదు. అక్కడికే వచ్చేయమన్నాడు. అమ్మ కూడా నన్ను మయూర్ దగ్గరకే వెళ్లిపోమంది. కష్టం మీద మయూర్‌ని వొప్పించి యీ జాబ్‌లో చేరాను.

''నువ్వు రిస్క్ తీసుకొంటున్నావ్. మయూర్ దగ్గరకే వెళ్లిపో విభాత,'' అంది అమ్మ.

''కొద్ది నెలలే కదమ్మా.''

''యిప్పటికే చాలా ఆలశ్యం అయింది. మనుష్యులు యెప్పుడు వొకేలా వుండరు. మయూర్‌కి చికాకు తెప్పించటం యెందుకు. అతను అక్కడ వొంటరిగా వుంటున్నాడు. కెరీర్‌దేముంది. అక్కడికి వెళ్లాక కూడా జాబ్ చేయొచ్చు,'' అంది అమ్మ.

''నువ్వు యెప్పట్నుంచో జాబ్ చేస్తూ నన్నొద్దంటున్నావ్ యేంటి. మయూర్ కూడా జాబ్ కోసమే వెళ్లాడు కదా. వొకసారి అక్కడికి వెళితే యేముంటుందింక... యిల్లు, కిడ్స్ యిలానే జీవితం బిజీ అయిపోతుంది. యివన్నీ సెటిల్ అయ్యేసరికి జాబ్ చెయ్యాలనే ఆసక్తి అసలు వుంటుందో లేదో. కొన్నాళ్లేగా యిక్కడ వుంటాను. మయూర్‌తో మాటాడు. నువ్వు అడిగితే వద్దని ఖచ్చితంగా అనడు,'' అమ్మని రిక్వెస్ట్ చేశాను.

“వద్దు విభాత. మేం మా జీవితాలని నిర్మించుకొన్నప్పటిలా యిప్పటి మీ జీవితాలు లేవు. మీవి చాలాచాలా ఐసొలైట్ అయిపోతున్న జీవితాలు. నువ్వు యిప్పుడు మాతో వున్నావ్. అందుకే నీకేమంత వొంటరి తనం అనిపించదు. మీ యీ పెళ్లి నుంచి మయూర్‌కి యేవో కొన్ని యెక్స్ పెక్టేషన్స్ వుంటాయి. డిసపాయింటింగ్‌గా వుంటుంది. అక్కడ నుంచి చికాకులు, టెన్షన్స్ మొదలవుతాయి. వెళ్లు, కొన్నాళ్లు అతనితో స్పెండ్ చేయి. అప్పుడు ఆలోచించు యేం చెయ్యాలో,” అంది అమ్మ.

“అతనికి నేనంటే చాలిష్టం. యేం టెన్షన్స్ వస్తాయి?”

“యిష్టం, ప్రేమ యివన్నీ శాశ్వతమైన యెమోషన్స్ యేం కాదు. సహచరులుగా వుండటం యెంతో అందమైన అపురూపమైన బంధమైనా అనుబంధాలన్నింటిలో కెల్లా చాలా వన్నరబుల్ అనుబంధం...” యిలా సాగుతున్నాయి మాటలు మా యిద్దరి మధ్య.

అలాంటి సమయంలోనే నా ముందు ఉమ, శ్రీలత జీవితానుభవాలు నిలబడ్డాయి. సందర్భాలు వేరైనా, యీ అనుబంధాన్ని నిలబెట్టు కొనే బాధ్యతారూపం మారుతూ తిరిగి తిరిగి మన భుజస్కందాల పైనే వున్నట్టుంది.

జీవితంలో కాంప్లికేషన్స్ వస్తాయనే అనుమానం వున్నప్పుడు అవొచ్చే వరకు యెదురు చూస్తూ కూర్చోటం యెందుకు... యీ యిన్‌సెక్యూరిటికి మనసులోని వో పొర చిట్లింది. అయినా సరే లెటస్ సేవ్ మై స్కిన్...

ఆ రాత్రి భోజనాలు అయ్యాక వాక్‌కి వెళదామని అమ్మని అడిగాను.

చాలా చిన్న వెన్నెల్లో యిద్దరం నడుస్తున్నాం.

“మయూర్ దగ్గరకి వెళదామనుకొంటున్నాను. కానీ యెందుకో నా మనసంతా అలజడిగా వుంది. సమస్యకి యిదేనా పరిష్కారం... నేను, నాలాంటి అమ్మాయిలం మేం ఫేస్ చేస్తున్న సమస్యలని యెదుర్కోలేక పరిస్థితులతో రాజీపడిపోతున్నామా... యేంటో చాలా చికాకుగా వుంది...” అన్నాను.

అమ్మ నిశ్శబ్ధంగా నడుస్తోంది.

యేం మాటాడదేంటో అనుకొంటుండగా, ''అలా యెందుకను కోవాలి. యేమో, నీ యీ అలజడి యీ సమస్యలని మొత్తంగా యెదుర్కో వటానికో లేదా కాసిన్ని పరిష్కారాలైనా తీసుకొసుకొచ్చే ఆలోచనో, వీటిని పంచుకొనే స్నేహమో దొరకొచ్చు కదా... మనకి మనుష్యులపట్ల కన్సర్న్ వుండాలి కాని యే దేశంలో వుంటేయేంటి...'' అంది అమ్మ.


''అంతేనంటావా?'' అడిగాను.

''నేనెప్పుడు అంటుంటాను చూడు, మానవ సంబంధాలలో, మరెన్నో విషయాలలో మూసుకుపోతోన్న యీ సమాజపు కళ్లు తెరిపించ డానికి యే లేజర్ చికిత్స కావాలోనని... అదేదో వెతుకుతావేమో... వొంటరి గానో, సామూహికంగానో... నీలానే ఆలోచిస్తున్న మరికొందరు నీకు యెదుర వ్వొచ్చేమో...'' అంది అమ్మ.

యేమో... అమ్మ అంటుందే జరగొచ్చేమో...

*నవ్య వీక్లీ, 27 ఫిబ్రవరి 2013*

# బ్రేకప్ బొకే...



మయూఖ రేఖలు మమ్మల్ని పలకరించే క్షణాల్లో మా మనసుల్లో వుత్సాహం వురకలేస్తోంటుంది. మరి కాసేపట్లో మేమంతా జాస్మిన్ పుష్ప గుచ్ఛాల దుకాణంలోకి చేరుకొంటాం. పసుపు, యెరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ, వూదా, వెండి, బంగారు వర్ణాలతో స్వచ్ఛంగా మిలమిలలాడుతోన్న మమ్మల్ని సంతోషంగా జాస్మిన్ తన తేనెరంగు కళ్లకి అద్దుకొనే ఆ క్షణాలు అత్యంత పరిమళవంతమైనవి... మేం ప్రకాశవంతమైన రంగులలో ఆకర్షిస్తాం కాని మా యెవ్వరికి స్వభావసిద్ధమైన

పరిమళం లేదు. కానీ జాస్మిన్ సహజ సుగంధ సువాసనలతో మా అందర్నీ మోహపు దొంతర మత్తులో స్కేటింగ్ చేయిస్తుంది.

మరికాసేపట్లో నిన్న రాత్రి వరకు వచ్చిన ఆర్డర్స్ ప్రకారం మా అందర్ని అందమైన పుష్పగుచ్ఛాలుగా మలుస్తారు, యీ దుకాణంలో పనిచేసే అమ్మాయిలు అబ్బాయిలు. రంగురంగుల రిబ్బన్స్‌తో, ముచ్చిక కాగితాలతో అలంకరిస్తారు. మా మీద చల్లనినీళ్లని చిలకరిస్తారు. రాత్రంతా మంచులో ఆడుకొన్నట్టు మా రేకులపై మంచుబిందువులు. ఆపై కస్టమర్స్ యిచ్చిన మెసేజ్‌కార్డ్‌ని సన్నని రిబ్బన్‌కి పిన్‌చేసి మామీద వేలాడ దీస్తారు, అందుకొనేవారికి కనిపించేలా. అప్పుడు తెలుస్తుంది మాకు... మేం పుట్టినరోజు శుభాకాంక్షలమో... వివాహదినోత్సవపు అభినందనలమో... ప్రేమని వ్యక్తపరిచే తొలి పలుకులమో... స్నేహాభినందనల మైత్రీ బంధనమో... విజయోత్సవపు అభినందనగీతికలమో... పుట్టినగడ్డకి వస్తున్నందుకు స్వాగతాంజలు లమో, విదేశయానపు సకల శుభ వీడ్కో లుమో... యిలా మేం యెవరిమో తెలిసిన క్షణాల్లో మా జన్మసార్థకమైన తలంపేదో మాకు తృప్తినిస్తుంది. అలానే వొక్కోసారి పై లోకాలకి ప్రయా ణించే వారికోసమూ దు:ఖసమూహాలకి వెళ్లాల్సి వస్తుంది. ఆత్మకి చివరి కానుకలమైనందుకు వినమ్రంగా నమస్కరిస్తాం.

ఆకాశంలో మేఘాలన్నీ వెండి అంచులని అద్దుకొన్న ఆ వుదయం యాపిల్ గ్రీన్ పేపర్‌లో యెర్రయెర్రని గులాబీలని చుట్టి సీగ్రీన్ రిబ్బన్‌తో సుతారంగా ముడివేసి అమూల్యమైన ప్రేమగుచ్ఛాన్ని దగ్గరుండి చేయిం చింది జాస్మిన్. తన మొబైల్ కెమెరాలో ఆ పూలగుచ్ఛం పిక్చర్‌ని తీసింది. అవునూ మెసేజ్ యివ్వలేదేంటో అనుకొంటూ ఆర్డర్ యిచ్చిన సమీప్‌కి కాల్ చేసింది.

‘‘వో మై డియర్ సమీప్... మెసేజ్ నేను రాయాలా... నీ ప్రేమ ప్రొపోజల్‌ని నేనెలా నా మాటల్లోకి ట్రాన్స్‌లేట్ చేస్తాను... నువ్వే చెప్పాలి...’’ అంటుంది జాస్మిన్.

అటుపక్క వాళ్లు యేమన్నారో తెలీదు కానీ, ‘‘యింత బద్దకమైతే యెలా... వోకె... రాస్తాను. కానీ మీరు విని యెలా వుందో చెప్పాలి,’’ అందామె.

ఆమె మెసేజ్ రాసి అతనికి వినిపించి పోల్కడాట్స్ వున్న బేబిపింక్ సన్నని రిబ్బన్‌కి పిన్ చేసింది. ఆ పుష్పగుచ్ఛాన్ని డెలివరి బాయ్ చేతుల్లోకి తీసుకోగానే యెలాగైనా వొక్కసారి ప్రేమ ప్రపోజల్‌ని అంత అందంగా రాసిన జాస్మిన్‌ని హగ్ చేసుకోవాలనిపించిందంట ఆ గులాబి గుచ్ఛానికి. షాపులోంచి బయటకి వచ్చే గుమ్మంకి పక్కనే వుంటుంది రిసెప్షన్ కౌంటర్. అక్కడ నిలబడి జాస్మిన్ పుష్పగుచ్చాన్ని కనులారా చూసు కొంటుంది. డెలివరీ బాయ్ చేతుల్లోంచి ఆమె వైపు తొణికింది పుష్ప గుచ్ఛం. జాస్మిన్ రెండు చేతులతో ఆ యాపిల్‌గ్రీన్ ట్రాన్స్‌పరెంట్ కాగితంలో చుట్టిన గులాబీగుచ్ఛాన్ని పట్టుకొని వొద్దిగ్గా హృయానికి హత్తు కొంది. పుష్పగుచ్ఛాపు పూరేకులన్నీ సుసంభరంగా మరింతగా ముడుచు కొన్నాయి. యిక అంత ప్రత్యేకమైన ప్రేమతో అమర్చిన తనని అందుకో బోయే అమ్మాయిని చూడాలని పుష్పగుచ్ఛంకి ఆరాటంగా వుంది.

అన్ని భద్రతావలయాలని దాటుకొని ఆమె ఫ్లాట్ ముందు నిలబడి యింటి కాలింగ్ బెల్ నొక్కాడు డెలివరి బాయ్. పనామె తలుపు తీసింది. సంతకం పెట్టి పుష్పగుచ్ఛాన్ని అందుకొని అమయ గది తలుపు మీద చిన్నగా తట్టింది.

"యస్... కమిన్," అని సుతారమైన స్వరం. గదిలోకి వెళ్లిన పనామె చుట్టూ చూసింది. గదిలో ఆమె లేదు. బాత్రూమ్ తలుపు దగ్గర నిలబడి, "యెక్కడ పెట్టమంటారు," అని అడిగింది.

"యిట్రా," తిరిగి అమయ సుతారమైన స్వరం పలికింది.

పనామె మెల్లగా తలుపు నెట్టింది.

బాత్‌టబ్ నిండుగా నీళ్లపై తేలుతున్న యెర్రని గులాబీరేకులు. ఆ టబ్‌లో అమయ. ఆమె ముఖం మాత్రం బాత్‌టబ్ పైభాగంలో ఆన్చి టబ్‌లో పడుకొని వుంది. వో పక్కగా చిన్ని ట్రాన్స్‌పరెంట్ గాజు బౌల్లో వెలుగుతోన్న ఫ్లోటింగ్ కేండిల్ లెవెండర్ పరిమళం మృదువుగా. పుష్ప గుచ్ఛం అందుకొంటున్న అమయ వైపు చూస్తుంటే అనిపించింది... గులాబీపూల ఆకాశంలో చందమామ.

పుష్పగుచ్ఛాన్ని చూస్తోన్న ఆమె కళ్లల్లో మెరుపుల ఫౌంటైన్.

ఆరోజు మొదలు అమయాకి అనేకానేక అందమైన పుష్పగుచ్ఛాలు వస్తుండేవి సమీప్ నుంచి... ఆమె అతను ప్రపోజ్ చేసిన ప్రేమ విషయం ఆలోచిస్తానన్నందుకు కృతజ్ఞతాపూరిత పుష్పగుచ్ఛాం పర్షియన్ పింక్స్‌తో... ఆమె మొదటిసారి అతనితో డేటింగ్‌కి వస్తానన్న రోజు ఆమె కోసం వో బొకేని ఆర్డర్ చేశాడు సమీప్. ఆరోజు జాస్మిన్ పసుపుపచ్చని క్రిసాంతిమమ్స్‌ని పర్పుల్ కలర్ దాల్మియాస్‌తో అమర్చి బాటిల్‌గ్రీన్ పేపర్‌లో రేప్ చేసింది.

జాస్మిన్ యికబెన్ కోర్సుని చేసింది. అంతేకాకుండా తన పేరెంట్స్‌తో ఆమె జపాన్‌కి హాలిడేకి వెళ్లినప్పుడు అక్కడున్నప్పుడూ ఆమె యికిబెన్‌లో క్రాష్‌కోర్స్ చేసింది. ఆమెకి పుస్తకాలు చదివే అలవాటు వుంది. తన కస్టమర్స్ మెసేజెస్ ప్రత్యేకంగా వుండాలనుకొనే ప్రతిసారీ ఆమె రాస్తుంది. నగరంలోని సినిమా, కార్పరేట్ రంగంలోనివాళ్లు, రాజకీయ నాయకులు యిలా దాదాపు సెలబ్రెటీస్ అంతా ఆమె కస్టమర్స్. మినిమమ్ మూడు వేలు నుంచి బొకేస్ దొరుకుతాయి. అంతకంటే తక్కువుంటే ఆమె షాప్ వైపే చూడలేరు యెవ్వరు. ఆమె బొకేస్‌తో పాటు ఫ్లోటింగ్ కేండిల్స్, హేండ్‌మేడ్ పేపర్‌తో చేసిన గ్రీటింగ్ కార్డ్స్, మెసేజ్ కార్డ్స్ తన స్టోర్‌లో అమ్ముతుంది. ఆమె యేం చేసినా శ్రద్ధగా ప్రేమగా చేస్తుంది.

జాస్మిన్ మెసేజ్ రాస్తుండగా ఆమె బాయ్‌ఫ్రెండ్ సుశాంత్ వచ్చాడు. అక్కడున్న బొకేని చూస్తూ, "లవ్లీ... యెవరు యెవరికి..." అని అడిగాడు.

"సారీ డూడ్... చెప్పలేను..."

"యేం?"

"ప్రైవసీ పాలసీ."

" వో... నువ్విలా పాలసీ మేటర్స్ అంటుంటావ్ కానీ అందుకొన్న వాళ్లు, పంపించిన వాళ్లు యిప్పుడు నిమిషాలలో పోస్ట్ చేసేస్తారుగా... యెన్ని లైక్స్ వచ్చాయని చూస్తుంటారు " అన్నాడు సుశాంత్.

"ప్రస్తుతం ప్రపంచం మూడు లైక్స్ ఆరు పోస్టింగ్స్‌గా జరుగుతున్నా నేనే ప్రైవసీ రూల్స్‌ని వైల్లెట్ చెయ్యలేను," నవ్వుతూ అంది జాస్మిన్.

బొకె సమీప్ డెలివరీ చెయ్యమన్న ఐదు నక్షత్రాల హోటల్‌కి బయలు దేరింది.

అమయ కంటే కాస్త ముందుగా ఆ హోటల్లోని పూల్ సైడ్ డైమండ్ హవుస్‌కి వెళ్లి ఆమెకోసం యెదురు చూస్తున్నాడు సమీప్. ఆమె వచ్చింది... రాగానే అతను ఆమెని కింద నుంచి పై వరకు చూస్తూ, ‘‘గార్జియస్,’’ అన్నాడు.

ఆమె చిన్ని సిగ్గుతో, ‘‘థ్యాంక్ యూ,’’ అంది.

ఆమెకి ఫ్లవర్స్ అందించాడు.

ఆమె వాటిని కన్నార్పకుండా చూస్తూ, ‘‘ నువ్వు పంపించే పువ్వులు యెంతో అందమైనవి. యింక ఆ రైటప్స్ యెప్పటికి మర్చిపోలేనివి. థ్యాంక్ యూ సో మచ్,’’ నిండైన మైమరపు ఆమె స్వరంలో.

అతను నవ్వి, ‘‘మై ప్లజర్,’’ అన్నాడు.

‘‘యిప్పుడేం చేస్తున్నావ్?’’

‘‘యేజన్సికి సైన్ చేసాను.’’

‘‘ చాలామంది ఫ్రెండ్స్ వున్నారు అన్ని యిండస్ట్రీలో... ’’

ఆమె నవ్వి ‘‘మీది చాలా పెద్ద ఫ్యామిలీ బిజినెస్ కదా’’ అంది.

అలా రాత్రి పన్నెండు గంటల వరకు మాటాడుకొన్నారు... అక్కడ నుంచి బయలుదేరే ముందు అతను ఆమె యెడమచేతిని కాస్త చొరవగా అందుకొని ఆమె సన్నని చేతివేలికి డైమండ్ రింగ్ తొడిగాడు.

‘‘వో... రియల్లీ క్యూట్... థ్యాంక్ యూ,’’ అందామె.

యిద్దరు లాంజ్ వరకు వచ్చాక అతను అడిగాడు, ‘‘లాంగ్ డ్రైవ్‌కి వెళదామా’’

‘‘మరోసారి. మామ్ యెదురుచూస్తుంటుంది,’’ అంది జాస్మిన్.

‘‘యువర్ విష్,’’ అంటున్నప్పుడు అతని కుడిచెయ్యి కాస్త పైకి లేచి చేతి వేళ్లు మొత్తం విచ్చుకొన్నాయి.

యిద్దరు యెవరి యిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు.

ఆమె అతనిచ్చిన పుష్పగుచ్ఛాన్ని తన గదిలో తన మంచానికి యెదురుగా వున్న పూల టేబిల్‌పై వుంచింది.

మెడ వరకు మెత్తని రొజాయిని కప్పుకొని ఆ పూలని చూస్తూ నిద్రపోయింది.

◆ ◆ ◆

వారిద్దరి మధ్య రోజు లెక్కలేనన్ని యస్‌యమ్‌స్‌లు మోగుతుండేవి.

ఆరోజు అమయ తల్లితో మాల్‌కి వెళ్లింది షాపింగ్‌కి. చెప్పుల షాప్‌లో హైహీల్స్‌ని వేసుకొని వాటి తన సెల్‌తో పిక్చర్ తీసి సమీప్‌కి పంపిస్తూ నీ ఛాయిస్ యేంటని మెసేజ్ పెట్టింది.

అతను జవాబు యిచ్చాడు. ఆమె వాటినే సెలెక్ట్ చేసుకొంది.

''యెవరతను,'' అమయని ఆమె తల్లిగారు అడిగారు.

''సమీప్. చాలా యిష్టపడుతున్నాడు. ఆ యిష్టం చూసో యేమో నాకు చాలా యిష్టం వచ్చేసింది,'' అంది అమయ.

''అతను యెలాంటివాడు,'' అడిగారామె.

అర్థంకాక అయోమయంగా తల్లి వైపు చూసింది అమయ.

''అంటే ఫ్యాన్సీ ఫ్రెండ్‌షిప్ చేస్తున్నాడా... లేక సీరియస్ పర్సనా,'' అడిగారామె.

''ఫ్రెండ్స్ ఫ్యాన్సీగా వుంటారా,'' కాస్త ఆశ్చర్యంగా అడిగింది అమయ.

''కొన్నిసార్లు... కేర్‌ఫుల్,'' మరీ యెక్కువగా అడిగితే అమయ అవమానంగా ఫీల్ అవుతుందేమోనని అంతకంటే అడగలేదు ఆమె.

◆ ◆ ◆

ప్రేమలో జాగ్రత్తనేది వానాకాలపు ప్రవాహంలోని కాగితం పడవ వంటింది. అమయ సమీప్ ప్రేమలో అన్ని జాగ్రత్తలని మర్చిపోయింది.

హనీమూన్ టైమ్ అయిపోయింది.

సమీప్ యిప్పుడు ఆమె కాల్స్‌ని పట్టించుకోవటం లేదు. ఆమె యస్‌యంస్‌లకి జవాబు యివ్వటం లేదు.

అమయ అతని కోసం యెదురు చూసిచూసి కన్నీటికెరటం అవుతోంది.

ఆరోజు అతన్ని యెలాగైనా కలవాలని దాదాపు వందసార్లు కాల్ చేసింది. అతను జవాబు యివ్వలేదు. ఆరోజు అతను జాస్మిన్‌కి డేట్‌కి వెళ్లడానికి వో బొకే కావాలని ఆర్డర్ చేశాడు. మెసేజ్ రాయమన్నాడు. యింతకు ముందు పేరు యీ పేరు వొకటి కాదు. సో మరో షిఫ్ట్ అను కొందామె. యిలా కొంతమంది అమ్మాయిలు అబ్బాయిలు షిఫ్ట్ అయిపో వటం గత కొన్నేళ్లుగా జాస్మిన్ చూస్తునే వుంది.

ప్రేమ చాలా పర్వర్‌బుల్ యెమోషన్ యెందుకవుతుందో...

◆ ◆ ◆

సమీప్,

అనేక సూర్యోదయాల్లో చంద్రోదయాల్లోని వెలుగుని మనం కలిసి కన్నుల్లో నింపుకొన్నాం. పువ్వుల్లోని అనేక రంగులతో ముచ్చటించుకొన్నాం. చిన్ని చిన్ని సరస్సుల పక్కన మనిద్దరికి మాత్రమే సరిపడేంత టేబుల్‌కి అటుయిటు కూర్చుని వైన్‌తో మెరిసిపోతోన్న పెదవులని చూపుడువేలితో నువ్వు మీటినప్పుడు నా తనువు మోహజలపాతమైందే.

నువ్వు... నువ్వు... నువ్వు తప్ప మరో ధ్యాసేలేనంతగా నీలో వొదిగి పోయిందే మనసు... యిప్పుడు కనీసం నువ్వు హలో అని కూడా యెందుకు అనటంలేదు. నేనేం చేశాను... నీ మనసు నావల్ల యేమైనా బాధపడిందా... నువ్వు యేదో వొకటి మాటాడితేనేగా తెలుస్తుంది.

ఆశ్చర్యం... నా సమక్షంలో నేను తప్ప మరో సంతోషమే లేనట్టుండే నువ్వు యిప్పుడు యింత కఠినంగా యెందుకు వుంటున్నావ్. వొకే హృదయం అత్యంత ప్రేమగా, అత్యంత కఠినంగా నా హృదయం పట్ల యెలా వుండగలదు. ఆ ప్రేమ సత్యమా... యీ కఠినత్వం సత్యమా...

నా యీ సందేహాలకి జవాబు యిస్తావని యెదురుచూస్తుంటాను.

అమయ.

చదవిన తరువాత చేతిలోని మొబైల్ నుంచి తలెత్తి, 'న్యూసెన్స్‌లా తయ్యారయింది,' అనుకొంటూ జాస్మిన్ షాప్‌కి ఫోన్ చేశాడు.

''వో బ్రేక్‌అప్ బొకే అమయా అడ్రెస్‌కి డెలివరి చెయ్యండి,'' అని చెప్పాడు సమీప్.

''మెసేజ్,'' ఫోన్ అటెండ్ అయిన అమ్మాయి అడిగింది.

''బ్రేక్‌అప్... అంతే... దానికేం మెసేజ్ వుంటుంది,'' గట్టిగా నవ్వాడు.

ఆర్డర్ రాసుకొన్న ఆమె ఆ ఆర్డర్ వైపు చూస్తు బ్రేక్‌అప్‌కి యే ఫ్లవర్స్ బాగుంటాయి అని అనుకొంటుండగా జాస్మిన్ షాప్‌లోకి వచ్చింది.

''బ్రేక్‌అప్ బొకేకి యే ఫ్లవర్ వాడమంటారు,'' అడిగింది ఆ అమ్మాయి జాస్మిన్‌ని.

''బ్రేక్అప్...'' అంటూ యెడ్రస్ చూసి జాస్మిన్ కళ్లలో వొక్కసారిగా సమీప్పై కోపం వచ్చింది.

సుశాంత్ వచ్చాడు యెప్పటిలా వుషారుగా నవ్వుతూ. ''హాయ్ం యేంటలా వున్నావ్,'' అడిగాడు.

''ప్రేమ పోవటాన్ని యింత అమానవీయంగా వ్యక్తపర్చాలా... తనింతవరకు యిలాంటి బొకే పంపలేదు... పంపను కూడా,'' అంది జాస్మిన్.

''నువ్వెందుకంత డిస్ట్రబ్ అవుతున్నావ్... అయినా నీది బిజినెస్ కదా,'' అన్నాడు సుశాంత్.

ఆమె కాసేపు మౌనంగా వుండి, ''బిజినెస్సే కానీ యెథిక్స్ వుంటాయి కదా సుశాంత్. అసలు నీకు అలా పంపాలనే ఆలోచనే చికాకుగా లేదా,'' అడిగింది జాస్మిన్.

''ప్రెజెంట్ ట్రెండ్. వాళ్లెవ్వరో పంపించుకొంటే మనకెందుకు చికాకు. నాకేం అర్థంకావటం లేదు నువ్వెందుకు అప్సెట్ అవుతున్నావో,'' అన్నాడు సుశాంత్.

''ప్రేమగా పంపిస్తారు. షిఫ్ట్ అయిపోతారు. వోకె... బ్రేక్అప్ బొకేలేంటి. యెంత హర్ట్ అవుతారు. ప్రేమలోంచి ముందు బయటకి వచ్చిన వాళ్లకి యేమంత బాధ వుండకపోవచ్చు. కానీ యింకా అందులోనే వున్న వాళ్లకి యిదంతా యెంత దుఃఖంగా వుంటుంది. అంత హ్యామిలేషన్ అవసరమా... వీటిని చూస్తూ చూస్తూ మనం యెలా ట్రెండ్ అనుకోగలం...'' అంది జాస్మిన్.


''కానీ అది యెమర్జింగ్ ట్రెండ్... నువ్వు నీ బిజినెస్ని ఆ ట్రెండ్కి దూరంగా యెలా వుంచగలవ్... నీ రెగ్యులర్ క్లయింట్ యీ షాప్లో అన్ని రకాల ఆర్డర్స్ యిచ్చి యీ వొక్కదాని కోసం మరోచోటకి వెళ్లలేడు కదా... పైగా నువ్విలా వీటిని రిజక్ట్ చేస్తావని మార్కెట్లో తెలిస్తే నీకు చాదస్థమని, వ్యాల్యూ జడ్జిమెంట్ అని నిన్ను బ్రాండ్ చేస్తారు కదా... అది నీ కెరీర్కి యేమంత మంచిది కాదుకదా... నువ్వు ఆ బొకేని యివ్వకపోతే మరొకరు యిస్తారు. అయినా బిజినెస్లో పర్సనల్ ఫీలింగ్స్ యేంటి,'' అన్నాడు సుశాంత్.

“అసలు నీ ఆలోచనలు మరింత చికాకుగా వున్నాయ్‌... పుష్ప గుచ్ఛాలంటే నాకెంతో యిష్టం. నన్నేమైనా అనుకోని యీ హింసలో నేను పార్ట్ కాలేను,” అని సుశాంత్‌కి చెప్పి, “ఆ బ్రేక్‌అప్ బొకేని డెలివరీ చేయటం లేదని ఆ కస్టమర్‌కి యిన్‌ఫామ్ చేయి... ముందెప్పుడైనా యెవ రైనా బ్రేక్‌అప్ బొకే ఆర్డర్స్ యిస్తే తీసుకోకండి,” అని షాప్‌లో వారికి చెప్పింది జాస్మిన్.

జాస్మిన్ మాటలు వింటుంటే మేం మానవీయ విషయాలకి ఆన వాలుగా వుండటాన్ని ఆనందిస్తాం కానీ అమానవీయ విషయాలకి గుర్తుగా వుండటానికి యిష్టపడం కదా... అందుకే మేం జాస్మిన్ పుష్పగుచ్ఛాల దుకాణంలోకి రావాలని తపిస్తాం... కోరుకొంటాం... ప్రతిసారీ మా ఆకాంక్ష తీరదు. నెరవేరినప్పుడు మా మనసు వేలవేల వర్ణాల పూలసముద్రంలా వుప్పొంగుతుంది.

*నవ్య దీపావళి సంచిక, 2013*

# పున్నమిలా వచ్చిపోమ్మని...



మళ్లీ వచ్చాను. యీ మమతల తోటకి రాలేకపోతే వుండలేని వసంతకోయిల్లా... కొండలకవతల లోయల్లోంచి తోటల మీదుగా విని పిస్తోన్న పూర్వబాల్య యవ్వన దినోత్సవాల సుసంభరాన్ని చెప్పాల్సిన సమయమిదే.

చుట్టూ చూశాను. అదే ప్రాంగణం. కొత్త రంగులతో, అవే యెత్తైన అరుగులు. వొకప్పుడున్నంత మట్టిలేదిప్పుడు. యెక్కువ మేర బండలు పరిచారు. అప్పటి నేరేడుచెట్టూ, వేపచెట్టూ లేవ్. అప్పట్లో యీ యింట్లో వున్నంత మంది మనుష్యులూ వుండటం లేదు.

అసలీ యిల్లు యెలా వుండేది!

యేవైపు నుంచి చూసినా కనిపించే యెత్తైన యిల్లు. చుట్టూ పరి పూర్ణమైన తోట. యెప్పుడు పువ్వులు, కాయకూరలు, ఫలాలతో సమ్మేళిత మైన సువాసనలు వీస్తుండేవి. యింట్లో, వాకిట్లో, పెరట్లో యెటుచూసినా మనుష్యులే. వీరందరిని పెనవేసిన అనురాగపు నారు అమ్మమ్మ కాదం బరి.

'పెళ్లయ్యాక కాపురమైతే పోరుగూరులో పెట్టారండి అమ్మగారు. కాని శర్వాణమ్మగారెప్పుడు అమ్మగారింటే వుంటారండి,' అమ్మ గురించి భీముడెప్పుడూ యిలానే చెపుతుండేవాడు.

నిజమే కదా... వూహ తెల్సినప్పట్నుంచి యీ యిల్లు, ఆ కొండలు, ఆ కొండలపై రాత్రిపూట కనిపించే సత్యదేవుని ఆలయదీపాలు. యీ యింట్లోని తాతగారు, పెద్దమ్మలు, పిన్నమ్మలు, బాబాయ్‌లు, మామయ్యలు, బావలు, వదినలు, అక్కలు, తన వయస్సు పిల్లలు యెందరో... యిదే యింట్లో యెన్నెన్ని సంక్రాంతులు జరుపుకొన్నాం.

అసలు సంక్రాంతి వచ్చిందంటే కొత్తబట్టల కోలాహలం. అప్పట్లో సంక్రాంతికి, పుట్టినరోజులకి, యెవరివైనా పెళ్లిళ్లుంటే కొత్త బట్టలు కొనే వారు. యిప్పట్లా యెప్పుడు పడితే అప్పుడు బట్టలు కొనేవారు కాదు. కొత్త బియ్యం దంచి, ఆ పిండిని కొత్త బెల్లంలో కలిపి చేసిన అరిశెల ఘుమఘుమలు. బంతి, చామంతులు, మగ్గిన రేగిపళ్ల సువాసనలతో యిల్లంతా రకరకాల తీపిగాలులు.

చిట్టత్త చిట్టి చామంతులతో జడలల్లాలని పిల్లలందరి వెంట తిరుగుతుండేది. వేసవిలో చిట్టత్తతో జడ కుట్టించుకోటానికి పోటీపడే వాళ్లం. కాని యీ చామంతుల బరువునెట్లా మొయ్యాలాని వాపోయే వాళ్లం. అయినా అప్పటకి నాలుగైదు జడలు ఆమె ముచ్చటని తీర్చేవి.

సాయంకాలమయ్యేసరికి అంతా రాధత్త చుట్టూ చేరేవాళ్లం. యే పాటైనా అడగటం ఆలస్యం చెంగుచెంగునా అందుకునేది. చినబావతో టూరింగ్ టాకీస్‌లో సినిమాకెళ్లే పథకాలొకవైపు, చిన్నపిల్లలకి రేగు పళ్లు పోసినప్పుడు యేరుకొంటే దొరికే చిల్లర డబ్బులతో డబ్బా ఐస్‌ఫ్రూటో, పీచుమిఠాయో తేల్చుకోలేని తర్జనభర్జనలు. యిప్పుడు మాల్స్‌లో ప్లాస్టిక్

డబ్బాల్లో పీచు మిఠాయిని అందంగా ప్యాక్ చేసి అమ్మటం చూసి పీచు మిఠాయికేం మహాద్భాగ్యం అనుకొన్నా. కాని యెప్పుడూ ఆ డబ్బాలోని పీచుమిఠాయిని రుచి చూడాలనిపించలేదు. ముగ్గులు వేయటం, యెక్కడ నుంచి వూరేవో కాని అందరూ అందరితో తెగ మాట్లాడేసు కోవటం. సులోచనారాణిగారి మీనా, ఆరడుగుల రాజశేఖర్‌ల గురించి చదివినవాళ్లు చదవినవాళ్లకే చెప్పేస్తుండేవాళ్లం.

మా అందరి మధ్యా వుండే ఆత్మీయతకి, స్నేహానికి అనుబంధానికి ఆయువుపట్టుమా అమ్మమ్మ, తాతగారు.

డిగ్రీ పరీక్షలు రాసిన వెంటనే పెళ్లి సంబంధమొచ్చింది. అతనో సాఫ్ట్‌వేర్ యింజినీర్. వాళ్లది గోదారికి అటుపక్క పల్లె. వివేక్ వుద్యోగం కోసం వుంటుందేమో పొరుగు రాష్ట్రం.

''చాముండేశ్వరిని చూడొచ్చన్నా, వూటి పొగమంచుని కప్పుకోవ చ్చన్నా అమ్మకి, అమ్మమ్మకి దూరంగా వెళ్లను. వెళ్లి వుండలేను. వున్న వూరిలో యే చిన్న వుద్యోగమో, వ్యవసాయం చేసుకునేవాళ్లనైనా చేసు కుంటా కాని వివేక్ వద్దంటే వద్దు,'' మావయ్యకి చెప్పాను.

''అలా అంటే యెలాగమ్మా. మన బంధువుల్లో యింజినీర్స్ వున్నారు. కాని సాఫ్ట్‌వేర్ యింజినీర్స్ లేరు. ఫస్ట్ జనరేషన్ సాఫ్ట్‌వేర్ యింజి నీర్‌కి భార్యవి అవ్వటం యెంత అదృష్టం,'' అన్నాడు మావయ్య.

యీ మావయ్యకి యేం చెప్పినా అర్థంకాదు. అమ్మతోనో, అమ్మమ్మ తోనో మాట్లాడాలి.

ఆరోజు కొండలకవతల పేదరాశి పెద్దమ్మ కుంకుమ ఆరపోస్తోన్న వేళ, ''అమ్మని, నిన్నూ వదిలి దూరంగా వుండలేను. యెప్పటికీ మీకు దగ్గర్లోనే, వీలైతే అమ్మ యింటి పక్కనున్న యింట్లోనే వుండాలని వుంది. మీరూ నన్ను వదిలి వుండలేరు కదా,'' అమ్మమ్మతో చెప్పాను.

అమ్మమ్మ చిన్నగా నవ్వి, ''నీ బెంగ నాకర్థమవుతోందిరా. నువ్వు దూరంగా వుంటే మాకు బెంగే. కానీ మన జీవితాల్లో మనకి దొరికే తోడు అన్నింటికన్నా ముఖ్యం. మనమంటే యిష్టం, గౌరవం, మన మనసు నొప్పించకూడదనే సంస్కారం, అర్థం చేసుకొనే తత్వం వుండే మనిషి మనకి దొరకకపోతే మనశ్శాంతి వుండదమ్మడూ. యిలాంటి లక్షణాలని

వివేక్‌లో చూశాను. యెలాగనంటావేమో, వాళ్ల కుటుంబం మనకి అసలు తెలియనిది కాదు. మనలానే కలిసిమెలసి వున్న పెద్ద కుటుంబం. మంచికి చెడుకి దన్నుగా నిలబడతారు. అమ్మానాన్న, అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ము లతో మనుష్యులు కలిసుండాలి. అలానే చుట్టుపక్కలవాళ్లతో బంధువు లతో స్నేహితులతో కలివిడిగా వుండాలి. యిలానే వివేక్ వున్నాడు. మనుష్యులకి దూరంగా వుండే వ్యక్తులతో జీవితం ప్రమాదకరం. యింక దూరం అంటావా... చూద్దాం. వివేక్ యిక్కడ దగ్గర్లో బిజినెస్ మొదలు పెట్టొచ్చు. వ్యవసాయం చేయొచ్చు. లేదా అక్కడే వుండొచ్చు. యెక్క డున్నా నీ జీవితం సంతోషంగా వుంటుంది,'' అని ఆగి చుట్టూ యేపుగా పెరిగిన తోటని చూస్తూ, ''యిది మా అమ్మగారి యిల్లు. అమ్మకి మగ పిల్లలు లేరు. తన యీ యింటిని పొలాన్ని చూసుకోటానికి వొక్క మగ పిల్లాడుంటే బాగుండేది. ఆడపిల్లలు ముగ్గురు పెళ్లిళ్లు చేసుకొని వెళ్లి పోయేవాళ్లే కదా అనుకునేది. మీ తాతగారితో నా పెళ్లయింది. అమ్మకి వున్న చింతని చెప్పానొకసారి. ఆయన ఆలోచించి వాళ్ల యింట్లోవాళ్లతో మాట్లాడి యీ యింట్లోనే మనముందామన్నారు. మా అమ్మ ఆనందానికి అంతేలేదు. అతనికేం ఆస్తులు లేక కాదు. అమ్మకి కొడుకునవుదామను కున్నారు. అంతే. తాతగారి మంచి మనసు, సంస్కారం వల్లే కదా యీ యిల్లు యిలా కళకళలాడుతోంది. లేకపోతే నేనేం చేయగలను. వొక్క రాత్రి ప్రయాణం చేసే దూరమే కదరా. వివేక్‌కి నువ్వు చాలా నచ్చావ్. యెలాగైనా యీ సంబంధం కుదిరేట్టు చూడమన్నారంట. నిన్ను యిష్టపడే మనిషి దొరకటం అదృష్టమే కదరా,'' యిలా అమ్మమ్మ పెళ్లికి వొప్పిం చింది.

'వివేక్‌కి నువ్వంటే యిష్టం...' అన్న అమ్మమ్మ మాటలు గుర్తొస్తుం డేవి. వో అపరిచిత యువకుడు యిష్టపడటం అంటే యెలా వుంటుంది. అతని రూపం అస్పష్టం. కుతూహలం మొదలయింది. పెళ్లయిపోయింది.

వివేక్ ప్రేమగా చూసుకునేవాడు. మా అత్తగారు మరో మా అమ్మమ్మలా ఆత్మీయంగా వుండేవారు. వివేక్ తరచుగా అమ్మ, అమ్మమ్మ దగ్గరకి పంపించేవాడు. యిక్కడికి వచ్చినప్పుడు తిరిగి వివేక్‌ని చూడాలని పించేది. అక్కడుంటే వీళ్లపై బెంగ. యిదిగో యిలా వద్దనే అమ్మావాళ్లకి

దగ్గరగా వుండాలనుకున్నా. యిలా నే పుట్టినప్పట్నుంచి వున్న ఆత్మీయులకి, యీ కొత్త ఆత్మీయునికి మధ్య హృదయం బెంగతో వూయలలూగేది.

తల్లిని కాబోతున్నానని తెలియగానే అనిర్వచనీయమైన వుద్వేగం. అమ్మమ్మని, అమ్మని చూడాలనే వుద్వేగం. వెంటనే వూరు ప్రయాణం.

ఆ పల్లె, ఆ పూర్వీకుల యిల్లు యీ నూతన జీవాన్ని ఆశీర్వదించాయి.

నెలలు నిండాయి.

పాప పుట్టింది. పేరు మాధురీలత.

మధూకి మూడో నెలొచ్చాక వివేక్ దగ్గరకి పంపిస్తామన్నారు. వివేక్ నన్నూ పాపని వదల్లేక వదల్లేక వెళ్లాడు.

సాయంకాలం తోటలో కొండలకి యిటు వైపునున్న ప్రాంగణంలో చెట్ల చుట్టూ కట్టిన చప్టా మీద మాధురీని వొళ్లో కూర్చోపెట్టుకొని అమ్మమ్మ ఆ కొండల వైపు, ఆకాశం వైపు, నదిపాయ వైపు, తోటల వైపు చూస్తుండేది. ఆ చూపులు చాలా లోతైనవి.

'యేం ఆలోచిస్తుంటోందో'.... అడిగానోరోజు.

''మా అమ్మని, అమ్మమ్మని, అమ్మమ్మవాళ్ల అమ్మని, మీ అమ్మని, నిన్ను, నీ కూతుర్ని చూశాను. యెన్ని తరాలో చూడు. యీ అన్నవరం, సింహాచలం, తిరుపతి, రాజమండ్రి, విశాఖ యిలా యీ చుట్టుపక్కల యిళ్లు, వూర్లు, మనుష్యులు యింతే నే చూసిన ప్రపంచం. వీటితోనే నా జీవితం పెనవేసుకుపోయింది. పిల్లల్ని మృదువుగా పెంచటంలో నాకెంతో ఆనందం దొరికేది, యిప్పుడిప్పుడే యీ యింట్లోని పిల్లలు పెళ్లిళ్లు, చదువులు పూర్తయ్యాయి. వుద్యోగాలని విశాఖకో, హైదరాబాద్‌కో వొకొక్కరూ వెళుతున్నారు. ప్రవాహం జీవలక్షణమని తెలుసు. యీ మధ్య యేమనిపిస్తుందంటే యీ యింట యీ కోలాహలాన్ని యెవరు సజీవంగా వుంచుతారు. యీ యింట దీపాన్ని యెప్పుడూ యెవరు వెలిగిస్తుంటారు,'' అంటూ నిశ్చలంగా నా వైపు, మాధురీ వైపు చూస్తూ, ''యీ యింట్లోని పిల్లలందరి కంటే నీకే యిల్లన్నా, మనుష్యులన్నా ఆపేక్ష యెక్కువ. యిల్లుదేముంది మనుష్యులు ముఖ్యం. యీ యింటి బాధ్యత నువ్వు తీసుకుంటావా. వివేక్ రిటైర్ అయ్యాక యిక్కడికి వస్తావా తల్లీ... అప్పటివరకు

నేను, తర్వాత మీ అమ్మ యీ యింటి వెలుగుని యిలానే వుంచుతాం,'' అడిగారామె.

తరతరాల జీవం నిక్షిప్తమైన ఆమె నేత్రద్వయాన్ని చూస్తూ, 'నా జీవన సాఫల్యాన్ని అన్వేషించే మార్గమిదేనేమో,' అనుకొంటూ వుదయిస్తున్న చంద్రుని సాక్షిగా ఆమెకి మాటిచ్చాను.

అమ్మమ్మ నవ్వింది అద్భుతంగా. బాంధవ్యపు కంటిన్యుటి దొరికిన సంతృప్తి చూశానామె కళ్ళల్లో.

ఆ యేడాది సంక్రాంతికి మాధురీలతకి భోగిపళ్లు పోస్తున్నాం. పళ్లు, చెరుకుముక్కలు, పైసలు యేరుకొనే సందడి. వివేక్‌కి ఫోన్ వచ్చింది. మాట్లాడొచ్చాడు.

అతని ముఖంలో కోటి సూర్యుల వెలుగు. 'అమెరికాలో వుద్యోగం వచ్చింది,' చెప్పాడందరి ముందు. 'అమెరికానా...' ఆశ్చర్యంగా, అద్భుతంగా అన్నారు కొందరు.

అమ్మమ్మ వైపు చూశాను.

చూపులు కలిశాయి.

ఆ రాత్రి వివేక్‌ని, ''నువ్వు అమెరికా వెళితే నేనూ, పాప,'' అడిగాను.

''ముందు నేవెళ్లి అన్ని అమరుస్తాను. తర్వాత నువ్వు పాపని తీసుకొని వచ్చెయ్,'' అన్నాడు.

''అంతదూరం యింతమందిని వదిలేసి. ఆ జాబ్ అంత ముఖ్యమా. యిక్కడ మనకేం తక్కువ,'' అడిగాను.

''మంచి అవకాశం. నాకున్న నాలెడ్జ్‌కి, అప్లికేషన్స్‌కి గొప్ప అవకాశం. యీ ఫీల్డ్‌లో నేనెంతో గొప్పగా నిలబడాలి,'' అన్నాడతను.

''యింతమందిని వదిలేసి రాలేను. అలాని నీకు దూరంగా వుండలేను. ప్లీజ్ వివేక్, ఆ ఆలోచన వదిలైలేవా,'' అడిగాను.

''అదెలా... రాకుండా యెలా... నేనెలా వుంటాను. రెండేళ్లు అంతే. తిరిగి వచ్చేద్దాం. ప్లీజ్,'' అడిగాడు వివేక్.

నాకిష్టం లేకుండా నా ప్రమేయం లేకుండా నిస్సహాయంగా నా జీవితయాత్ర మొదలయింది.

అక్కడే బాబు పుట్టాడు.

హాస్పిటల్లో వివేక్ నాతోనే వున్నాడు.

రెండేళ్లు కాస్త యిరవై రెండేళ్లు అయ్యాయి.

పిల్లలిద్దరి చదువులు అమెరికాలోనే. యీ యిరవై రెండేళ్ల కాలంలో అమ్మమ్మ పోయారు. ప్రాణమంతా ప్రేమైన అమ్మమ్మని చివరిచూపు చూడలేకపోయాను.

ప్రభుత్వాలు మారాయి. గ్లోబల్ యెకానమికి తలుపులు తెరిచిన కాలం. యుయెస్‌కి యిండియా నుంచి మనుష్యుల ప్రవాహం. చుట్టాలు, స్నేహితులూ వున్నారందులో. సెల్‌ఫోన్, యి-మెయిల్ త్వరత్వరగా చేరు కునే భావాలు, మాటలు. వెబ్ కెమెరా వచ్చాక మరింతగా పెరిగిన చూపులు. యిన్ని యిలా విప్లవాత్మకంగా దేశదేశాలని కలిపేస్తున్నా నా మనసెప్పుడు రైల్వే ప్లాట్‌ఫామ్‌పై సామాన్యులతో నిలబడినట్టుంటుంది. యెక్కవలసిన ట్రైన్ వస్తుంది, నా వూరికి వెళ్లిపోవాలనే ఆత్రంలోనే వుండేది మనసు.

వివేక్ తన ఫీల్డ్‌లో విజయాల మీద విజయాలు సాధించాడు. దేశ దేశాలకి పనిమీద తిరుగుతుండేవాడు. పిల్లల్ని పెంచుతూ యింట్లోనే వుండేదాన్ని. పిల్లల్ని చూస్తుంటే సంతోషంగా అనిపించేది.

ఆరోజు యిండియా నుంచి ఫోన్. నాన్నగారికి ఆరోగ్యం బాగోలేదని.

వెబ్ కెమెరాలో హాస్పిటల్లో వున్న నాన్నగారిని చూపిస్తున్నారు.

స్పర్శలేని యీ టెక్నాలజీ నా మనసుకి వూరటనివ్వటం లేదు.

ఆరోజు చాలాయేళ్ల తర్వాత వివేక్‌తో మాట్లాడాను... మనసు విప్పి.

' నేనెప్పుడూ యిలా బతకాలనుకోలేదు. నీ కోసం, నీ గోల్ కోసం యిక్కడికి వచ్చాను. నీ ప్రేమ, పిల్లలంటే వుండే ప్రేమతో వున్నాను. యీ యిల్లు, యీ గాలి అన్నీ అపరిచితంగానే వున్నాయి. మీ నాన్నగారికి బాగు లేనప్పుడు పక్కనుండగలిగావా. నీ విజయోత్సవాలప్పుడు మనవాళ్లు యెవరైనా నీ పక్కనున్నారా. రెండేళ్లు అన్నావ్, యెన్నేళ్లు అయింది వివేక్,'' అన్నాను.

''అరే... నువ్వు అలవాటుపడిపోతావనుకున్నాను. యిక్కడికి వచ్చిన వాళ్లెవ్వరు నీలా యింకా మా వూరు, యిల్లు అంటూ బెంగ పెట్టుకోవటం చూడలేదు. అంతా హ్యాపీగా, ప్రౌడ్‌గా ఫీలవుతుంటారు. యిక్కడికి రావా లని. తమ ఫ్యూచర్ బ్రైట్‌గా వుండాలని ప్రతిరోజు అమెరికన్ వీసా కోసం

యిండియాలో క్యూలు కడుతున్నారు. యిప్పుడిలా యెకానమి కింద పడినా జాబ్‌కి థ్రెట్ లేదు. మనమెంత రిచ్‌గా యెదిగాం. సాఫ్ట్‌వేర్ ఫీల్డ్‌లో యీ రోజు ఐయామ్ సమ్‌థింగ్ అంటే యెలా వీలయింది. యిక్కడికి రావటం వల్లే కదా మన పిల్లలకి యింత మంచి యెడ్యుకేషన్ వచ్చింది. యిదంతా నీకు తృప్తిగా లేదా,'' అడిగాడు.

''నీ విజయాలు, పిల్లల చదువులు నిజమే. అసలు యీ మొత్తంలో నేనేంటీ? మొదట్లో సంవత్సరానికి వొకసారి యిండియాకి వెళ్లటం రాను రాను తన పని బిజీ లేదా పిల్లల చదువు, మూడేళ్లు నాలుగేళ్ల గ్యాప్ వచ్చేది. అసలు నేనేమాత్రం కోరుకొని, యిష్టపడని యీ జీవితంలోకి నేనెలా వచ్చిపడ్డాను. యిక్కడ వుండటానికి యిష్టపడేవాళ్లు వుండొచ్చు. వాళ్లిష్టం, అలా యిష్టం లేనివాళ్లూ వుండొచ్చు కదా.'' బ్రయిన్ డ్రయిన్‌పై వ్యాసాలు చదివి, వ్యాసరచన వకృత్వపు పోటీల్లో పాల్గొన్న జనరేషన్ నుంచి వచ్చిన మనిషిని. గ్లోబల్ సినారియోలో పెరిగిన పిల్లలు యుయస్‌లో అవకాశాల కోసం వెతుక్కునేట్టు వాళ్ల మానసికస్థితి వుంటుంది. యీ తేడా వివేక్‌కి అర్థం కాదా. అసలు అర్థం చేసుకోకూడదనుకుంటున్నాడా... ముభావంగా వుండిపోయాడు.

వివేక్ యింత కాలం వో హోరులో కొట్టుకుపోయాడు. అతనికి సడన్‌గా యిండియాలో వో సాఫ్ట్‌వేర్ కంపెనీని ఫ్లోట్ చేస్తే బాగుండుననే ఆలోచన వచ్చింది.

''మనం యిండియా వెళదాం,'' అన్నాడు.

అయోమయంగా చూశాను.

''పిల్లలకి అక్కడే పెళ్లి చేద్దాం. నలభై ఐదేళ్ల వివేక్ యిండియాలో కంపెనీ పెడితే చాలా సక్సెస్ చేయగలడు,'' నవ్వుతూ అన్నాడు.

''నిజంగా వెళదామా,'' అక్కడికి వెళ్లగానే ఆ యింటిపని, పొలంపని చేయించటం, తోటల్ని చూసుకోవటం, వచ్చేపోయే మనుష్యులు వో నిండైన నదీప్రవాహం మనసంతా.

పిల్లలతో తనే చెపుతానన్నాడు వివేక్. కాని యేం చెప్పకుండా వెకేషన్ లో మా అందర్ని యిండియాకి తీసుకొచ్చాడు. మేం యింటికి వచ్చిన మర్నాడు సైబరాబాద్ వెళ్లాడు.

అక్కడికి వెళ్లిన రాత్రి ఫోన్ చేసి, ''వో మై గాడ్! వూహించలేనంత కరప్షన్. వినటం వేరు, అక్కడుండగా చూసింది వేరు. యిక్కడ యేదైనా పెట్టాలంటే ముందు లంచాలివ్వటం, తీసుకోవటం నేర్చుకోవాలి. సఫకేటింగ్,'' అన్నాడు.

''అంటే మనమిక్కడ,'' ఆగిపోయాను మధ్యలో.

''డౌటే,'' అన్నాడు.

వొళ్లు మండింది. యిండియా నుంచి అక్కడికి వెళ్లి కొన్నాళ్లుండి యిక్కడికి వచ్చిన వాళ్లంతా అదే మొదటిసారి వింటున్నంత ఆశ్చర్యంగా యిక్కడి విషయాల గురించి మాట్లాడతారు. కమ్యూనికేషన్ యింతగా పెరిగిన కాలం పెద్దపెద్ద వుద్యోగాల్లో వున్న వీళ్లకి నిజంగానే యేం తెలియకుండా వుంటాయా యిక్కడ పరిస్థితులు. ఆ చికాకులో మాధురి పెళ్లి విషయం కదిపింది అమ్మ. రాజమండ్రిలో మంచి సంబంధం వుందని, అబ్బాయి సాఫ్ట్‌వేర్ యింజనీర్, క్యాంపస్ సెలక్షన్ వచ్చి యిన్ఫోసిస్‌లో జాబ్ వచ్చిందని చెప్పింది.

మధుతో మాట్లాడాలనుకున్నాను.

చాలా సంవత్సరాల క్రితం అమ్మమ్మ మధుని వొడిలో పెట్టుకొని కూర్చున స్థలంలోనే కూర్చుని ఆలోచిస్తుండగా మధు వచ్చింది.

''మధు నీకు మేరేజ్ చేద్దాం అనుకుంటున్నాం. నీ దృష్టిలో యెవరైనా వుంటే చెప్పు, లేదా నీ ఛాయిస్ యేంటో చెప్పు,'' అడిగాను.

''వో మై గాడ్! మామీ అసలు నాకంత తీరిక యెక్కడుంది. నీకు తెలుసుగా నేనిప్పటివరకు వన్‌డే కూడా యెవ్వరితో డేట్ చేయలేదు. నాకసలు బాయ్‌ఫ్రెండ్ లేకపోవటాన్ని అంతా వింతగా చూసేవారని యెన్నిసార్లు చెప్పలేదు నీకు. అదొక ప్రెషర్... నీకు ఫ్రెండ్ యెందుకు లేడంటూ. నువ్వే వెతుకు,'' అంది మధు నవ్వుతూ.

''అది చాలా పెద్ద పని తల్లీ. నీ ఛాయిస్ యేంటి?'' అడిగాను.

''యెవరైనా పర్లేదు మామీ. నీకు నచ్చాలి. నీ ఛాయిస్ బాగుంటుంది. కాకపోతే నేనొక్కటే అనుకుంటున్నాను. మీరు యుయస్‌లో సెటిల్ అయిన టైమ్‌లో కాని అంతకుముందు కాని సెటిల్ అయిన

వాళ్ల యిళ్లలోని పిల్లల్ని చూడండి. అక్కడే పుట్టి పెరిగిన అబ్బాయి అయితే కాంప్లికేషన్స్ చాలా తక్కువగా వుంటాయి,'' అంది మధు.

''అదేంటి?'' అయోమయంగా అడిగా.

''అవును... యిక్కడ పుట్టి పెరిగి, యిప్పుడు వుద్యోగం కోసం అక్కడికి వచ్చే అబ్బాయి అయితే మా యిద్దరం పెరిగిన వాతావరణం వేరు. వో యిరవై ఐదేళ్లుగా అతనికి యిక్కడ వో జీవితం వుంటుంది. వాటి నుంచి సపరేట్ కావటానికి అతనెంత రెడీనో తెలీదు. నువ్వు నన్నెంత యిండియన్‌గా పెంచినా నా యాస్పిరేషన్స్ అమెరికన్‌వే. ఆ తేడా మా యిద్దరి మధ్యా వుండొచ్చు. మరొకటి మన యింట్లో నిన్ను, నీ యెమోషనల్ క్రైసిస్‌ని చూసాను. యిక్కడున్న నీ డియర్ అండ్ నియర్ కోసం నువ్వు పడిన ఆరాటం. అమ్మమ్మ, నాన్నమ్మల కోసం మనం యిండియా రావటం. తిరిగి వెళుతున్నప్పుడు వాళ్లు మనల్ని మిస్ చేస్తూ పడే బాధ, వాళ్లని వదిలి వెళుతూ చిన్నపిల్లలుగా నేను, తమ్ముడు పడిన బాధ... యిదంతా పెద్ద క్రైసిస్ మామీ. వున్న దేశంలో యే మారుమూల వున్నా యింత వెలితి వుండదు. బట్ బౌండరీస్ యెప్పుడూ అడ్డమే. మాకు అమ్మమ్మ, నాన్నమ్మ, తాతగార్లు, మామయ్యలు, అన్నలు యిలా బంధువులందరితో వుండాలని వుండేది. యిండియాలో వున్నంతమంది మాకక్కడ లేరు. అందుకే మీరు అక్కడే వుంటారు. అక్కడ అబ్బాయి అయితే నానమ్మ, తాతగారు, ఆ మిగిలిన ఫ్యామిలి మెంబర్స్ వుంటారు. పిల్లల్ని తీసుకొని ప్రతి యియరో, టు యియర్స్‌కో మేం అటూయిటూ ట్రావెల్ చేయనక్కర్లేదు. డిఫ్‌నెట్‌గా కొంత స్టేబుల్ యెమోషనల్ లైఫ్ వుంటుంది. అదీకాక ఆ అబ్బాయి యిక్కడివాడనుకో, ముందు అక్కడికి వచ్చినా, పేరెంట్స్‌ని యీ దేశాన్ని వదల్లేనివాడనుకో యిక్కడికి వచ్చాద్దామంటాడు. అప్పుడు నా జీవితం యేంటి? నేనిక్కడ వుండలేను. అందుకే యిలాంటి మెస్ లేకుండా అక్కడ సెటిల్ అయిన ఫ్యామిలీలోంచే అబ్బాయిని చూడు,'' అంది మధు స్పష్టంగా.

నెత్తి మీద బిందెడు చల్లనీళ్లు గుమ్మరించినట్లు మనసంతా నీళ్ల ధార. పొట్టలో తిప్పుతోంది.

జోఫర్... జోఫర్... మాత్ర మింగితే కాని తిప్పుడు తగ్గేట్టు లేదు.

యెప్పటికైనా యిండియా వెళ్లిపోతాం. అక్కడే సెటిల్ అవుతామని పిల్లలతో షేర్ చేసేదాన్ని. కాని వాళ్లు సీరియస్‌గా తీసుకున్నట్లు లేదు.

యిప్పుడు మనమిక్కడేనని చెపితే... వాళ్లు యిక్కడ యిమడలేరు.

యిరవై యేళ్లు బాల్యయవ్వన జ్ఞాపకాలతో నా జీవనం యిక్కడ వెలిగింది.

అలానే యిన్నాళ్లు వాళ్ల జీవనం అక్కడ వెలిగింది.

వివేక్‌కి యిక్కడ యేదైనా చేయటంపట్ల ఆసక్తి తగ్గుతుందంటున్నాడు. అతనికి అక్కడే యిష్టం. పిల్లలకీ అక్కడే వుండాలని వుంది. వీళ్లందర్నీ అక్కడ వదిలేసి తనిక్కడ సంతోషంగా వుండగలదా...

యిరవై యేళ్ల జీవనపు సారం మాత్రం యింకిన మనసు నాది. ఆ తర్వాత జీవితం సాగుతోంది, అంతే. ఆరోజు వెళ్లటం నా ఛాయిస్ కాదు. యీరోజు తిరిగి వెళ్లిపోవటం నా ఛాయిస్ కాదు. యెప్పటికైనా యిండియాకి వెళ్లిపోతాననే ఆశ యింక లేదు నిస్సందేహంగా.

''సరే మధు,'' దు:ఖాన్ని శ్వాశిస్తూ అన్నాను.

యీ మమతల తోటకి నేనో వసంతకోయిలనే శాశ్వతంగా.

*నవ్య దీపావళి సంచిక, 2011*

# అతుల్య



లేవండర్ మేఘం తన భుజాల వెనుక నుంచి ముఖంపైకి చిలక రించిన జల్లేదో మనసులోకి జారి నట్టనిపించి, నోట్‌బుక్‌పై నిమగ్నమై వున్న చూపులని తన కుడిభుజంపై నుంచి వెనక్కి తిప్పి చూశాడు సత్య దేవ్.

చేతితో నేసిన ముదురాకు పచ్చ మెత్తని నూలు చున్నీని కప్పు కొన్న నునుపైన భుజాలపై అతుక్కు పోయిన తన చూపులని అతికష్టంపై ఆమె ముఖంపై నిలిపాడు. ఆమె ముక్కుపుడక రవ్వపై పడుతోన్న

విద్యుద్దీపపు కాంతి చిన్నిచిన్ని సప్తవర్ణాలు చుక్కలై పెదవులపై మెరుస్తోన్న మెరుపుని చూస్తూ అప్రయత్నం గా, ''హలో,'' అన్నాడు సత్యదేవ్.

తనవైపు చూడగానే, 'కొబ్బరి నీళ్ళు నిండిన కొలనులో నల్లనికలువ పువ్వులు విచ్చుకొన్నట్టున్నాయే చూపులు,' అనుకొంటూ, ''ఐ యామ్ సత్యదేవ్,'' అన్నాడు.

బంతిపువ్వు రంగు కాటన్‌వరల్డ్ స్లిమ్‌ఫిట్ కుర్తా. యేపుగా లేయర్స్ లేయర్స్‌గా పెరిగిన నల్లని వొత్తైన జుట్టుని చూస్తూ, 'యేం షాంపు వాడ తారో భలే సిల్కీగా మెరుస్తోంది,' అనుకొంటూ, 'ప్రసన్న గోదావరి అల ల్లాంటి చూపులున్న యీ కుర్రాడెవరు'?! 'బిల్లింగ్ కౌంటర్‌కి పక్కనే చిన్ని టేబిల్‌పై కూర్చుని యింత హాయిగా పని చేసుకొంటున్నాడంటే యీ షాప్ మేనేజర్ అయి వుంటాడు. మొత్తానికి హాండ్‌సమ్ ఫ్రెండ్లీ మేనేజర్‌ని అపాయింట్ చేసుకొన్నట్టున్నారు. పాత మేనేజర్ కాస్త రిజర్వ్‌డ్. యితనికి చొరవ వుంది. ఆ మాత్రం చొరవ లేకపోతే యిలాంటి ఆల్టర్నేటివ్ థాట్ ప్రోసెస్‌తో పెట్టిన ఆర్గానిక్ స్టోర్స్‌ని నడపటం కష్టమే,' అనుకొంటూ ''హాయి, ఐ యామ్ అతుల్య... నైస్ మీటింగ్ యూ,'' అందామె.

కందిపప్పు, వేరుశెనగలు, పంచదార, బెల్లం, కొర్రలు, బ్రౌన్‌రైస్ యిలా చకచకా తనకి కావల్సినవి వొక్కో రేక్ నుంచి తీసుకొంటుంటే, 'సో... యీమెకి యీ స్టోర్స్ పరిచయమేనన్నమాట...' అనుకొన్నాడు జయ దేవ్. ఆమె ఆ మొత్తం సరుకుల్ని బిల్లింగ్ టేబుల్‌పై వుంచి, సోప్స్ వున్న ర్యాక్‌వైపు వెళుతోంటే అతనూ ఆమె వెనకే వెళ్ళాడు.

వొక్కో సోప్‌ని వాసన చూస్తూ తిరిగి తీసినచోటే పెట్టేస్తుంటే, ''మీకు యెలాంటి సోప్ బాగుంటుందో నేను చెపుతాను కదా,'' అంటూ వొక సోప్ తీసి యిచ్చాడు.

ఆ సోప్ వాసన చూస్తూ భలే వుందంటూ కనురెప్పలు యెగరేస్తూ తిరిగి మళ్ళీ ఆ పరిమళాన్ని గుండెల వరకు శ్వాసించిందామె.

''యీ యెసెన్షియల్ ఆయిల్స్ కూడా చూడండి. యిది ప్యూర్ లెవెండర్ ఆయిల్. మీరు ఆలివ్ ఆయిల్లో వొకటో రెండో డ్రాప్స్ వేసుకొని వాడితే చాలా బాగుంటుంది,'' అన్నాడు.

“దేనికి వాడితే.”

“బాడీ మసాజ్‌కి... స్కిన్‌తో పాటు మూడ్ కూడా రీజునవేట్ అవుతుంది,” అన్నాడు.

తను బాడీ మసాజ్‌కి వాడుతూ కూడా యింత స్టుపిడ్ క్వశ్చన్ వేశానేంటి అనుకొంటుండగా, “యీ షాంపూ చాల బాగుంటుంది” అన్నాడు.

‘అది తను వాడే షాంపూనేనా? అతను వాడే షాంపూ యేమిటో... అడిగితే... యేం బాగోదు... పర్లేదు అడిగేస్తే... ఆ షాంపూ ట్రై చెయ్యొచ్చు. కానీ అలా అడగటం యేం మర్యాదగుండదు కదా...’ అని అనుకొంటూ “వూఁ బాగుంటుంది,’ అంది అతుల్య.

“ఐ సీ. నచ్చిందా షాంపు,” అని వెంటనే మట్టితో చేసిన కొవ్వొత్తి దీపపు లాంతర్ని చూపిస్తూ, “యిందులో నీళ్లు పోసి మీకు నచ్చిన యెసెన్షియల్ ఆయిల్ రెండు చుక్కలు వేసి, యీ కింద నున్న యీ చిన్ని కొవ్వొత్తిని వెలిగించితే మీరున్న రూమ్ రూమంతా ఫ్రాగ్నెంస్ స్ప్రెడ్ అయి, మీ మూడ్‌ని చాలా యెలివేట్ చేస్తుంది,” అన్నాడతను.

“యింట్రెస్టింగ్... వొకటివ్వండి,” అంది.

“యీ స్టిక్స్‌ని పూజామందిరంలో వెలిగిస్తే దేముని హృదయమూ, పుస్తకాల గదిలో పెడితే అక్షరాల హృదయం, స్కూల్లో వుంచితే టీచర్ల హృదయమూ మరింత మృదువుగా వెలుగుతాయి,” అన్నాడు.

“మీరు మీ కస్టమర్ల హృదయాలని భలే దోచుకొంటున్నారు మీ టేస్ట్‌తో,” నవ్వుతూ అంటోన్న ఆమె నవ్వుని చూస్తుంటే చల్లనినీళ్ళు చిలకరించిన వట్టివేర్ల పరిమళం తాకినట్టనిపించింది అతనికి.

చిన్నగా నవ్వి, “కుంకుడికాయలతో చేసిన యీ పౌడర్ యిది. వాషింగ్‌మిషన్‌లో వేసి బట్టలు వుతికేసుకోవచ్చు. మళ్ళీ ఆ నీళ్ళని మొక్కలకి పోసుకోవచ్చు. అవే మనం డిటర్జెంట్స్ వాడిన నీళ్ళు పోస్తే మొక్కలు బతకవ్,” అన్నాడు.

“వెరీ ప్రోయాక్టివ్ మేనేజర్. నైస్. లాస్ట్‌వీక్ వచ్చాను.అప్పుడు లేరే. యెప్పుడు జాయిన్ అయ్యారు,” అడిగింది.

'మేనేజర్!? హాఁహాఁ... నేను... అని అతను యింకా యేదో చెప్పబో తోండగా పక్క గదిల్లోంచి యీ గదిలోకి వచ్చిన యీ స్టోర్స్ మేనేజర్ నీల్,

"హాయి మేడమ్, మీరు అడిగిన తులసి హనీ, పాలకూర విత్తనాలు వచ్చాయి. మీకు కాల్ చెయ్యాలని యిందాకే అనుకున్నాను," అన్నాడు.

నీల్ యీ స్టోర్స్‌లోనే వుంటే మరి యితను యెవరు? అతనివైపు చూసింది.

కళ్ళతో నవ్వుతోన్న సత్యదేవ్ కళ్ళని చూస్తూ వానచినుకులకి ముడుచుకొనే జాజిపువ్వులల్లే వున్నాయే అనుకొంటూ, "వో మీరు యిక్కడ సేల్స్ మేనేజరా," అందామె.

"మీరెక్కడైనా హెచ్ఆర్‌లో పనిచేస్తున్నారా, పోస్ట్‌ల పేర్లు భలే చెపుతున్నారే," అడిగాడతను.

"లేదు. నాకో చిన్న ఖాదీ స్టోర్స్ వుంది. రండొకసారి. ఐడియాస్ షేర్ చేసుకొందాం. జాబ్ ఛేంజ్ అవ్వాలనుందా? నా ఫ్రెండ్ కీర్తన హెచ్ ఆర్‌లోనే వుంది. నేను చెపితే ప్లేస్‌మెంట్ చూస్తుంది. యిక్కడెందుకు జాయిన్ అయ్యారు," అడిగింది.

"ప్రకృతికి దగ్గరగా వుండొచ్చని," అన్నాడు.

"వ్వావ్... దట్స్ నైస్... యీ స్టోర్స్ అంటే భలే యిష్టం నాకు. ప్రోడెక్ట్స్ బాగుంటాయి. వోనర్‌గారి సొంత యిల్లంట. యెంత యీస్థటిక్‌గా అమర్చారో... చుట్టూ చూపులు తిప్పుతూ, "యీ యింటిని యే డవలప్‌మెంట్‌కో యిచ్చేయకుండా చక్కగా యీ స్టోర్స్ పెట్టారంటే మీ ల్యాండ్ లార్డ్‌కి అందమైన టేస్ట్ వున్నట్టుంది," అంది.

"థ్యాంక్ యూ," అన్నాడు.

"యిక్కడ యెక్స్‌పీరియన్స్ వచ్చాక మీరు కూడా యెప్పటికైనా యిలాంటి స్టోర్స్ పెట్టండి. మీకు చాలా మంచి టేస్ట్ వుంది," అందామె.

"వ్వావ్... థాంక్ యూ," అన్నాడు.

ఆమె బిల్లు పే చేసి బయటకి రాబోతోంటే, ''యిక్కడ సండే మార్కెట్ వుంటుంది. మిమ్మల్ని ప్రీ ఆర్డర్ లిస్ట్‌లో జాయిన్ చెయ్యనా,'' అని అడిగాడు సత్యదేవ్.

''ఆల్‌రెడీ మెంబర్‌ని... మీ బాస్‌కి కొత్త మెంబర్స్‌కి ఆర్గానిక్ కాయ కూరలని పరిచయం చేశానని మీరు చూపించాల్సి వుంటే రాసుకోండి,'' నవ్వుతూ అని, ''వోకె... బై,'' అంటూ వెళ్ళబోతోన్న ఆమెకి తన నెంబర్‌ని పేపర్ మీద రాసి యిచ్చాడు.

''స్టోర్స్ నెంబర్ వుంది.''

''బట్... యిది నా పర్సనల్ నెంబర్,'' ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడతను.

'పర్సనల్ నెంబర్... యెందుకో... డోర్ డెలివరీ కోసం ఆర్డర్ చేసి నప్పుడు స్టోర్ నెంబర్ బిజీ వస్తే యీ నెంబర్‌కి ట్రై చెయ్యవచ్చన్న మాట... మరీ డెడికేటెడ్ పర్సన్‌లా వున్నారు వుద్యోగానికి,' అనుకొంటూ ఆమె బయటకి రాబోతూ, ''నీల్, య్యాప్ వుంటే బాగుంటుందని చెప్పానుగా. మీ బాస్‌కి చెప్పారా? ఆర్గానిక్ స్టోర్స్‌కదా, య్యాప్‌ని తక్కువ కాస్ట్‌కి చెయ్య మని మా య్యాప్ స్పెషలిస్ట్‌కి  చెప్పాను,'' అంది అతుల్య.

సత్యదేవ్ వైపు చూసి నీల్ యేదో చెప్పేలోగా, ''గుడ్ ఐడియా... రెండు నెలల్లో రాబోతోంది,'' గబగబా అన్నాడు సత్యదేవ్.

''గ్రేట్... మీ బాస్‌కి ఐడియా నచ్చింది కదా... స్పెషల్ డిస్కౌంట్ యివ్వాలని రికమండ్ చెయ్యండి,'' అంది.

''మీ ఐడియాకి డిస్కౌంట్ యేమిటి, యీ షాప్‌లోనే పార్ట్‌నర్‌షిప్ యివ్వొచ్చు మీకు,'' నవ్వుతూ అన్నాడు సత్యదేవ్.

''మీరు పెట్టినప్పుడు యివ్వండి. థ్యాంక్ యూ,'' అందామె.

''యీ స్టోర్స్ సర్‌దేగా,'' అయోమయంగా అన్నాడు నీల్.

''వ్వాట్,'' అని ఆగి సత్యదేవ్‌ని చూసి, ''చాలా కాంప్లిమెంట్స్ కొట్టేసారు... ఐడెంటిటి రివీల్ చెయ్యకుండా... యెంత సహజమైన దొంగ మీరు,'' అంది నవ్వుతూ.

"దొంగతనం వుత్సాహాన్నిస్తుందని యిప్పుడే తెలిసింది," అన్నాడు నవ్వుతూ.

◆ ◆ ◆

గదంతా కమ్ముకొంటున్న లెమన్ గ్రాస్ పల్చని వగరు సౌగంధం.

'తన వొంటికి, గదికి సరిపడేట్టు సౌందర్యాన్ని, ఆరోగ్యాన్ని అద్దిన ఆ సత్యదేవ్ గమ్మత్తైన మనిషి,' అనుకొంటూ అతనికి ఆ విషయమే మెసేజ్ చేద్దామా అనుకొంది అతుల్య. ఆ పర్సనల్ నెంబర్ ఆర్డర్ కోసం కాదు అని తెలుస్తునే వుంది కదా. కానీ, 'యింత రాత్రివేళ బాగోదేమో,' అనుకొంటుంటే, 'మీ గదిలో యిప్పుడు యెటు చూసినా నా టేస్టే కనిపిస్తుందాండీ... బ్రైటన్ దిస్ వరల్డ్ మోర్ అండ్ మోర్ బ్యూటిఫుల్ విత్ యువర్ థాట్స్. థ్యాంక్ యూ," అని సత్యదేవ్ నుంచి మెసేజ్ .

గదిలో వెలుగుతోన్న కాండిల్‌లైట్‌ని పిక్చర్ తీసి అతనికి వ్వాట్స్‌ప్ చేస్తూ, 'ప్రతిరోజు నా గదిని యిలానే సౌందర్యవంతం చెయ్యండి," అని పంపింది.

అది మొదలు యెటువంటి క్రిమిసంహారక మందులూ జల్లని సహజమైన మేలిమిపంటలా వాళ్ళ చెలిమి పెరిగింది ఆరోగ్యవంతంగా.

◆ ◆ ◆

ఆషాడం మలి దినాలు. సత్యదేవ్ ఫామ్‌కి వెళ్ళారిద్దరూ. తోటలో యీ సీజన్‌కి వచ్చే చివరి మామిడిపళ్ళని దింపుతున్నవాళ్ళతో సత్యదేవ్ మాట్లాడుతున్నాడు.

మబ్బుపట్టి వుందేమో చల్లగా వీస్తోంది గాలి. యెర్ర బిళ్ళపెంకులతో కట్టిన ఫామ్‌హౌస్ వరండాలో నిలబడి తరుముకొస్తున్న నల్లని మేఘాలని చూస్తోంది అతుల్య. టీ కాస్తున్న అల్లంబెల్లం కలగలిపిన కమ్మని వాసన. యెటు చూసినా నెమళ్ళే. జాజిపూల పందిరిపైనున్న నెమలి అటూ యిటూ తల తిప్పటంలోని సొగసుని చూస్తున్న అతుల్యని చూసి మాటలు ముగించుకొని వచ్చిన సత్యదేవ్, "బ్యూటిఫుల్," అన్నాడు.

ఆమె నవ్వి, " నెమలా," అంది.

''నెమలిని చూస్తున్న కళ్ళు కూడా,'' అన్నాడు.

ఆమె నవ్వుతూ, ''వాటిని గుర్తుపట్టిన కళ్ళు చాలా ముద్దు గున్నాయి,'' అంది.

యిద్దరు నవ్వుకొంటూ కప్పుల్లో టీ పోసుకొని టీ తాగుతూ తోటలో పెరిగిన ఆకుకూరలని చూస్తు నడుస్తున్నారు. పెద్దపెద్ద ఆకులు, దట్టమైన రంగులు లేవ్. యెరువుల్లేని ఆ మొక్కలు సహజంగా యెంత వుండాలో అంతే వున్నాయి. అక్కడక్కడా కొన్ని కోళ్ళు తిరుగున్నాయి. వో పక్కగా అప్పుడే మడిలోంచి తీసి వరుసగా క్రమపద్ధతిలో నాటిన వంగమొక్కలు తేమలూరుతున్నాయి.

పూలమొక్కలకి యెదురుగా గడ్డితో నేసిన గుండ్రని పాక. చుట్టూ చప్టాలా వున్న అరుగులపై ముచ్చటైన ముగ్గులు. పాక మీదకి యేపుగా పెరిగిన బీరపాదు. సాయంకాలపు మసక వెలుగుకి విచ్చుకొంటున్న చంద్రకాంతలు.

''ఐఐటిలో చదువుకొని, యుస్‌లో యంయస్ చేసి, వొక మంచి పేరున్న కార్పొరేట్ సంస్థలో చేస్తున్న జాబ్‌ని వదిలి యీ ఫీల్డ్‌లోకి వస్తానంటే మీ యింట్లో యేం అనలేదా,'' అడిగింది అతుల్య.

''డిస్సపాయింట్ అయ్యారు. కనీసం పెళ్ళి అయ్యేవర్కైనా జాబ్ మానొద్దన్నారు. యిలా వుంటే యెవ్వరూ పిల్లని యివ్వరని. పెళ్లి, లివ్ యిన్ యేదైనా సరే జీవితాంతం వుండే స్నేహం కదా. ఆ వుద్యోగానికి మెచ్చి వచ్చే అమ్మాయి తరువాత యిలా చెట్లంటా గట్లంటా తిరిగితే నెత్తి మీద రెండేసి వెళ్ళిపోవచ్చు. లేదా రోజు నా చెవి మెలేస్తూ సర్దుకొంటూ కూడా వుండొచ్చు. యెందుకొచ్చిన రిస్క్,'' నవ్వుతూ అన్నాడు.

''ఆ వొక్క కారణానికే మీ యింట్లో వద్దన్నారా,'' అడిగిందామె నవ్వుతూ.

''కాదు. యిందులో సక్సస్ కాలేనని కూడా. విలువైన ఛాలెంజ్‌స్‌ని ఫేస్ చెయ్యటమంటే చిన్నప్పట్నుంచి యిష్టం. చదువు నా ప్రపంచాన్ని చాల విశాలం చేసింది. మట్టివాసనంటే యిష్టం. వ్యవసాయమంటే క్రిమి

సంహారక మందులు, యెరువులు, విత్తనాలు యిలా యెన్నో కోట్ల రూపాయిల వ్యాపారం. అవి వద్దని సహజత్వాన్నే నమ్ముకొన్న రైతుకి మార్కెట్‌కి మధ్య వొక యుద్ధమిది. యిందులో సక్సెస్ వుండదని వాళ్ళ నమ్మకం. సరే యెవరికి నచ్చినా నచ్చకపోయినా యిక్కడే నా సమయాన్ని, విజ్ఞానాన్ని పెట్టి దీన్ని నమ్మేవాళ్ళతో కలసి పనిచెయ్యాలనుకొన్నాను. యిక యింట్లో యిప్పటికీ నేను యిదంతా వదిలేసి తిరిగి యే కార్పొరేట్ కంపెనీకో వెళ్ళిపోతే బాగుండుననుకొంటుంటారు. యిప్పుడు ఆంధ్రాలో చాలా కొత్తవి రాబోతున్నాయి. వెళ్ళమంటుంటారు. అభివృద్ధి విషయంలో మా చూపులు వేరు,'' అన్నాడు.

ఫ్యాషన్ ఫ్లవర్స్, రాధామనోహరాల గుత్తులుగుత్తులని చూస్తూ, ''నీతో యిలా యెప్పుడు నడుస్తున్నా భలే రంగులు కనిపిస్తాయి. చాలా యిష్టంగా అనిపిస్తుంది నీతో నడవటం,'' అంది.

''యెప్పటికీ నడిచే యిష్టముందా,'' మృదుత్వం అనురాగం చిందు తున్నాయి అతని స్వరంలో.

నీలిమేఘం వొక్కో చినుకుని సుతారంగా మెల్లగా భూమిపై చిలక రిస్తోంది.

నడుస్తున్న ఆమె ఆగి, అతని వైపు తిరిగి తన పాదాల మునివేళ్ళపై నిలబడి సన్నగా లేచి అల్లుకొంటున్న భూసుగంధంలా ఆమె అతన్ని అల్లు కొంటూ అతని కళ్ళల్లోకి చూస్తూ, ''యస్, యింతిష్టంగా,'' అంది.

''థ్యాంక్ యూ,'' అంటూ ఆమె కింది పెదవి వొంపు వైపు చూస్తూ, ''షెల్ ఐ,'' అని అడిగాడు. ఆమె నవ్వింది అంగీకారంగా.

నుదిటిపై స్నేహపు ముద్దొకటి... పెదవిపై మోహపు ముద్దొకటి, చెవిలో కాంక్షాపూరిత ముద్దొకటి ఆమెకి కాన్క చేస్తుండగా కురిసింది విప్పారిన మేఘాల్లోంచి విరిజల్లు మోదంగా. అతని జుట్టుల్లోంచి నుదిటి మీదపైకి జారుతోన్న వర్షబిందువులని నాలిక కొనతో స్పర్శిస్తూ, ''అవునూ, నిన్ను చూసినప్పటి నుంచి అడగాలనుకొంటున్నాను నువ్వే షాంపూ వాడతావ్...'' తడిసిన వొత్తైన అతని జుట్టుని చేతివేళ్ళలో చెల్లాచెదురు చేస్తూ అడిగింది.

అతను ఫక్కున నవ్వుతూ, ''యేం టైమింగ్,'' అన్నాడు.

ఆమె భుజాల చుట్టూ చేతులేస్తూ పాపిట్లో ముద్దు పెడుతూ, ''మీ యింట్లో చెప్పగలవా మన విషయం,'' అని అడిగాడు.

''వూఁ. మా యింట్లో విషయమేదైనా శిఖరాగ్ర సమావేశం లెవల్లో చర్చిస్తారు. అలాంటప్పుడు చెప్పేస్తాను. వర్రీ యేంలేదు. మా యింట్లో నా యిష్టాన్ని యెప్పుడూ కాదనరు. మా నాన్నగారికి నేనన్నా మా అక్కన్నా చాలిష్టం. 'సెల్ఫీ విత్ డాటర్' పంపించారు తెలుసా,'' అందామె.

''అవునా,'' ఆమెవైపు అనుమానాస్పదంగా చూస్తూ, ''నిజంగానే నమ్మకం వుందా వొప్పుకొంటారని,'' అని అతను అడుగుతోంటే, తడిసిన అతని జుట్టుతో ఆడుకొంటూ వుందన్నట్టు తలూపింది.

◆ ◆ ◆

''అదేంటి డాడ్... అలా ఠక్కని నో చెప్పేసారు... మీరెప్పుడు నో చెప్పరుగా.''

''చూడు స్వీటీ, లైఫ్‌లో ప్రాక్టికల్‌గా వుండటాన్ని నమ్ముతాను. యిప్పటివరకు అలానే వున్నాను. అందికే నా సక్సెస్‌గ్రాఫ్ వో రేంజ్‌లో వుంది. మీ చిన్న మేనత్త నీరజ ఆదర్శాలు చాలా గంభీర్యంగా చెప్పే కుర్రవాడిని పెళ్ళి చేసుకొంది మా యిష్టాలకి వ్యతిరేకంగా. అన్నగా తన కష్టం చూడలేక మీ అమ్మ జీతాన్ని గత పదిహేనేళ్ళుగా వాళ్ళకే యిస్తున్నా. మీ అమ్మా అడ్డు చెప్పలేదనుకో. జాబ్ సెక్యూరిటీ లేనివాళ్ళకి చూస్తూ చూస్తూ నా కూతుర్ని యిచ్చి పెళ్ళి చెయ్యను. చేసుకోనివ్వను. అసలు నువ్వు నీ లైఫ్ పార్ట్‌నర్‌గా యెంచుకొనే వ్యక్తికి యేవో కొన్ని లక్షణాలు వుండాలనుకొంటావ్ కదా. అందులో ప్రొఫెషనల్ స్టేటస్ కూడా వుండాలి కదా. వొక కార్పొరేట్ సర్కిల్‌లో వొక సియివోనో లేదా కనీసం అలా యెదగ డానికి అవకాశం వున్న కుర్రవాడో నీ ప్రయారిటీ యెందుకు కాలేదు. యిలాంటి ఫ్యాన్సీ ఐడియాల వాళ్ళు స్నేహితులుగా బాగుంటారు. నువ్వేం మాటాడవేం లతా,'' అన్నారు అతుల్య తండ్రి అనిల్ .

“వద్దు అతుల్య... యిలాంటి ఆలోచనలు. సత్యదేవ్ బాగా చదువుకొన్నారు. వాళ్ళ ఫ్యామిలీకి మంచి ప్రాపర్టీస్ వున్నాయి. అతను రన్ చేస్తున్న స్టోర్స్ అతనికి తనకి రావల్సిన ఆస్తిలో భాగంగానే వచ్చిందని చెప్పావ్. వాళ్ళ అక్కకి పెళ్ళప్పుడే యివ్వాల్సిన షేర్ యిచ్చేశారన్నావ్. అతను కొన్నాళ్ళు మంచి జాబ్‌లో వుండి సంపాదించిన మనీ యిందులో యిన్వెస్ట్ చేశారంటున్నావ్. సో... బాధ్యత తెల్సిన వ్యక్తే. అతను యెంత ఆస్థిపరుడైనా కానీ వొకప్పటిలా చిరాస్థులని నమ్మే పరిస్థితులు యెప్పుడో పోయాయి. యెప్పుడు యే బిల్డింగ్ యే రోడ్డు వైడినింగ్‌లో పోతుందో, మన లివింగ్ హాల్ యే ఫ్లైవోవర్ అవుతుందో, యే పంట పొలం యేర్‌పోర్ట్ అవుతుందో తెలీదు. యెవ్వరూ భూములు, యిళ్ళు గవర్నమెంట్స్‌కి యివ్వకపోతే డెవలప్‌మెంట్ యెలా అన్నదీ డిఫరెంట్ టాపిక్. యేదైనా మన నెత్తి మీదదో, కాళ్ళ కిందదో వున్న భూమి కదిలే వరకూ  ఆ పరిస్థితుల్లోని నష్టం యేమిటో తెలీదు. నువ్వు యిష్టపడుతున్నావంటే నిస్సందేహంగా మీ యిద్దరి మధ్యా యేదో కలిసిన మైండ్‌సెట్ వుండే వుంటుంది. నేనో సొల్యూషన్ చెపుతాను. ఆలోచించు. అతన్ని తిరిగి జాబ్‌లో జాయిన్ అయిపోమను... నీకు యిలాంటివి రన్ చేయ్యటం యిష్టం కదా వాటిని నువ్వు చూసుకో,” అన్నారామె.

తల్లి అంటుందేమిటో వొక్కక్షణం తరువాత అర్థం అయ్యి అవ్వగానే ఫక్కున నవ్వింది.

తను యెగతాళి చేస్తుందేమోననే అనుమానం తల్లి కళ్ళలో మెదలటం చూడగానే, “సారీ మామ్, సత్యా మదర్ పెళ్ళి అయ్యేవరకేనా జాబ్ చెయ్యి, లేకపోతే పిల్ల దొరకదన్నారంట... అది గుర్తొచ్చింది,” అంది.

“ఆ కుర్రాడు యెంచుకొన్న ఫీల్డ్ బాగుందిగా... యేదో రాజకీయ పార్టీవాళ్లయితే నువ్వు తగాదాపడొచ్చు,” అన్నారు తాతగారు ఆనంద్‌గారు.

“ఆ అబ్బాయి అక్కడ కూర్చుని రోజంతా సరుకులు అమ్ముకుంటాడనుకొంటున్నావా? తక్కెడ ముందు అల్లుడు... అలాంటి దృశ్యాలు యేమైనా కనిపించి నీకేమైనా అభ్యంతరంగా వుందేమో. అతను అతుల్యకి

పరిచయం అయినరోజు అక్కడేదో పనుండి అక్కడున్నాడు. అతను ఆ స్టోర్స్‌ని దేశమంతా చైన్‌గా స్టార్ట్ చేస్తాడంట. సో... అతనూ సియీవోనే... గుడ్," అన్నారు నాన్నమ్మ ఉమాదేవిగారు.

"అవునా! నీ అప్‌సెట్ చూసి అతుల్య యే స్కామ్‌స్టర్ కొడుకునైనా ప్రేమించిందేమోనని కంగారుపడ్డాననుకో. యెక్కడ యే ఆర్గానిక్ ఐటమ్స్ బాగుంటాయో కనిపెట్టలేకపోతున్నా... నికార్సయిన బ్రౌన్ రైస్ దొరుకుతాయన్న మాట మనకి," అన్నారు మేనత్త దేవిక.

"విన్నావా నీ ఛాయిస్ యెంత కామిడీ అయిపోయిందో," యిరిటేటింగా అన్నారు అనిల్.

"నాకేం వాళ్ళ మాటలు అలా అనిపించటం లేదు. మీకు, మమ్మీకే యెక్కువ అభ్యంతరం వుండటంతో మీరిద్దరూ అలా ఫీల్ అవుతున్నారు," అంది అతుల్య.

"మీ అత్తయ్య తీసుకొన్న నిర్ణయానికి ఆ ఫ్యామిలీని యిప్పటికీ మేమే ఫైనాషియల్‌గా చూస్తున్నాం. వాళ్ళు సమాజం కోసం పనిచేస్తారు కాబట్టి వాళ్ళని మేం చూడాలి... నీకు ఫైనాన్షియల్‌గా అవసరమైనప్పుడు అలా హెల్ప్ చేసే అన్నదమ్ములూ లేరు. మీ అక్క, బావ అమెరికాలో వుంటారు. అక్కకి నీకు హెల్ప్ చెయ్యాలని వున్నా, మీ బావ వొప్పుకొంటేనే చెయ్యగలదు. యిదంతా వద్దు. నువ్వు యింజినీరింగ్ చదవను సోషల్ సైన్స్ చదువుకొంటానన్నా, నువ్వు నర్సరీ నడుపుతానన్నా, కాటన్ చీరల దుకాణం పెట్టుకొంటానన్నా వోకే అనుకొన్నాం. యెందుకంటే నువ్వు యే ప్రొఫెషన్‌లో వున్నా అల్టిమేట్‌గా నీ స్టేటస్ డిసైడ్ చేసేది నీ హజ్బెండ్ చేసే జాబ్. అతనికున్న పవర్. నువ్వొచ్చి యిలా అసలు లిస్టెడ్ కంపెనీకి వెళ్ళటానికే పెద్ద అవకాశం లేని వ్యాపారస్థుణ్ణి యెంచుకొన్నావ్... యింత అన్‌ప్రాక్టికల్‌గా వుంటే యెలా," అన్నారు అనిల్.

"డాడ్, మే బి మీ అనుభవాలు మీకీ ఆల్టర్‌నేటివ్ ప్రొఫెషన్స్ మీద నమ్మకం పోగొట్టి వుంటాయి. నేనా స్టీరియో టైప్ జీవితాన్ని గడపలేనని చిన్నప్పట్నుంచి చూసిన మీకు అర్థమయ్యే వుంటుంది. ఖచ్చితంగా నా

జీవితానికి అవసరమయ్యే డబ్బులు నేను సంపాదించుకోగలను. సత్యాకి ఫైనాన్షియల్‌గా యెదగకూడదనే థాట్ యేంలేదు. బట్ నాకు అర్థం కాని దేంటంటే నన్ను, అక్కని మీరు చాలా ప్రేమగా యెలాంటి బయ్యాస్ లేకుండా పెంచారు. యెప్పుడూ మీకు మగపిల్లలు లేరనే దిగులు కానీ మరొకటేం చూడలేదు. కానీ మాకు స్టేటస్ వేం చేసుకోబోయే అబ్బాయిల నుంచి వస్తుందని మీరు నమ్ముతున్నారని యీ రోజు తెలియటం, రియల్లీ సర్‌ప్రైజ్‌డ్,'' అంది అతుల్య.

''అరే నీకు అర్థం కావట్లేదు... వొకప్పటికంటే యిప్పుడు డబ్బు చాలా ముఖ్యం. ముఖ్యమే కాదు, యిప్పుడు డబ్బే జీవితం. నేను మిమ్మల్ని అన్యాయమైన పద్ధతుల్లోనో, అక్రమమైన మార్గాల్లోనో డబ్బు సంపాదించమనటం లేదు. మీ చదువుకొన్న చదువుకి వచ్చే వుద్యోగాల్లో డబ్బుంది. స్టేటస్ వుంది. యిప్పటి లైఫ్‌స్టయిల్‌కి కావల్సిన డబ్బుల కోసం మహామహా నీతిపరులే దాదాపు అన్ని వ్యాల్యూస్‌ని, నీతిని వదులుకోవల్సి వచ్చిన యీ కాలంలో, మమ్మల్ని యిజాలు పాడుచేశాయని ఆఫ్ ద రికార్డ్ వాపోతుండే వాళ్ళని నా ఫ్రెండ్స్‌లోనే చూశాను. అప్పట్లో యే గవర్నమెంట్ యెంప్లాయి యెందుకు కాకపోయామాని లేదా అమెరికాకి యెందుకు పోలేదాని వాపోయేవాళ్ళు తెలుసు. యిప్పుడైతే ప్రతివాళ్ళు వాళ్ళ పిల్లలు అమెరికానే వెళ్ళాలని కోరుకుంటున్నారు. సో అంతా డబ్బు, పవరే ముఖ్యం. మొగుడు నుంచే యిప్పటికీ మీ అస్థిత్వం. బి విత్ ద ఫ్లో...'' అని ఆగి, ''నీకిచ్చిన స్వేచ్ఛతో వొక ప్రయోజకుడిని యెంచుకొంటావను కొన్నాను. రియల్లీ ఐ యామ్ అప్‌సెట్,'' నిక్కచ్చిగా చెప్పేశారు.

''డాడ్, మీరేమన్నారు ప్రయోజకుణ్ణి యెంచుకోవాలని కదా. వొక మల్లెపువ్వు పూసిందంటే దానిమీద జల్లిన మందులు, యెరువుల కంపెనీల వాళ్ళు యిలా చాలామంది లాభాలు పొందాలి. యీ సైంధవులందర్నీ దాటుకొని పువ్వుని పువ్వులా పూయించి దాని పరిమళాన్ని గుర్తించ గలిగినవాళ్ళు, దాన్ని ఆచరించాలనుకొంటున్న వాళ్ళకి యెంత తెలివి తేటలు, పట్టుదల, కృషి వుండాలి. వీటితోపాటు మార్కెట్‌లోకి

వచ్చే లాభాలు రైతుకి యెంత వరకు అందుతుందనే ప్రశ్నకి సరియైన జవాబు దొరికే దారీ చూడాలి. క్రిమిసంహారక మందులు, యెరువులు, విత్తనాలు యివన్నీ కోట్ల వ్యాపారం. ఆ మార్కెట్‌ని ఛాలెంజ్ చెయ్యటానికి, అక్కడ నిలబడటానికి ఆదర్శం మాత్రమే చాలదు. బిజినెస్ అండర్‌స్టాండింగ్ తప్పనిసరిగా వుండాలి. అవన్నీ సత్యాకి వున్నాయి,'' అని ఆగింది అతుల్య.

పేరెంట్స్ వైపు వొక్కక్షణం చూసి, ''కానీ మీరిద్దరూ అంటుందేంటంటే 'అన్ని వేలకోట్ల వ్యాపారాన్ని తనెట్లా ఛాలెంజ్ చేస్తాడు... అంత పెద్ద మార్కెట్ వున్నవాళ్ళ ముందు వోడిపోతాడు. అందుకని వోడిపోయే వాళ్ళతో చేరిపో,' అంటున్నారు మీరు. మీరు ముందే వోటమి వొప్పేసుకో అని వొత్తిడి చెయ్యటం యేం న్యాయం... చిన్నప్పట్నుంచి గెలువూ గెలువూ అని చెప్పి యిప్పుడు వోడిపోతావ్ కాబట్టి ముందే వోటమి వొప్పేసుకో అంటున్నారు. నేనెందుకు వొప్పుకోవాలి. అతనికంటే ప్రయోజకుణ్ణి నేను నా చిన్ని ప్రపంచంలో చూడలేదు. అతనికీ నాలో నచ్చినవి వున్నాయి కదా. మీరు మా యిద్దరి బేసిక్ కోర్‌నే మార్చేసుకోమంటున్నారు మీరు. నో వే మామ్... నేనెలాంటి కండీషన్స్ పెట్టలేను,'' అంది అతుల్య.

''ఐ యామ్ నాట్ కన్విన్స్‌డ్. నీ మెడలు వొంచి నీకు యిష్టం లేని పెళ్ళి చెయ్యం. కానీ నీ ఛాయిస్ యిర్రెస్పాన్స్‌బుల్ అయితే కూడా నేను వొప్పుకోను,'' మరింత యిరిటేట్ అవుతూ అన్నారు అనిల్.

'యిర్రెస్పాన్స్‌బుల్ ఛాయిస్ నాదా... యే కాలంలోనైనా పేరెంట్ పేరెంటే... డాడ్ బాధ, కన్సర్న్ అర్థం అవుతున్నాయి. కానీ డాడ్‌కే నాది రైట్ ఛాయిస్ అని అర్థం కావటం లేదు... 'నీది రైట్ ఛాయిస్ బేబీ,' అని డాడ్, మామ్ అనేలా వాళ్లకి అర్థం అయ్యేట్టు యెలా చెప్పాలో,' ఆలోచిస్తోంది అతుల్య.

◆ ◆ ◆

''యింట్లో చెప్పావా... యేమన్నారు,'' అడిగాడు సత్యా.

యెప్పుడు మంచి విత్తనాలని మాత్రమే వెదజల్లాలి. నేల మీదైనా మనస్సుల్లోనైనా అనుకొనే అతుల్య తమ సంభాషణని చెప్పలేదు. అతని ప్రొఫెషన్ పట్ల తన పేరెంట్స్‌కి నమ్మకం లేదని చెప్పి తన పేరెంట్స్‌ని తక్కువ చెయ్యాలనుకోలేదు. అతనికి బాధ కలిగించే విషయాలు చెప్పి బిట్టర్‌నెస్ పెంచటం కూడా కరెక్ట్ కాదనుకొంది. భవిష్యత్‌లో తన ఛాయిస్‌ని తన పేరెంట్స్ వొప్పుకొన్నప్పుడు వాళ్ళు సత్యా కలుసు కొన్నప్పుడు, సత్యాకి వాళ్ళు తనని నమ్మలేదనే విషయం గుర్తుండిపోతే యేం బాగోదు కదా.

''చెప్పాను, కొంత టైమ్ కావాలి సత్యా,'' అంది.

యేదో యిబ్బంది వుందని అతనికీ అర్థం అయింది.

''కావల్సినంత తీసుకో... అప్పటివరకు యిదిగో నీక్కావల్సిన షాంపూ,'' అన్నాడు.

ఆమె కళ్ళు మెరిశాయి తన జట్టు మరింత నిగనిగలాడబోతోందని.

◆ ◆ ◆

ఆదివారం వుదయమే గోల్ఫ్ క్లబ్‌లో గోల్ఫ్ ఆడి అనిల్, లత అలసి క్యాంటీన్‌లో కూర్చున్నారు. ఫ్రెష్ ఆరెంజ్ జ్యూస్ ఆర్డర్ చేస్తుంటే వాళ్ళ ఫ్యామిలీ ఫ్రెండ్ వివేక్, క్లబ్‌లోని మరో మెంబర్ దినేష్ వచ్చారు. ''దినేష్, నేను ఫ్రెండ్ స్టేటస్ నుంచి వియ్యంకులు కాబోతున్నాం. వచ్చే శుక్రవారం యీవెనింగ్ హోటల్ ఆవాసాలో మన కీర్తన యెంగేజ్‌మెంట్. మీరంతా తప్పకుండా రావాలి,'' అన్నారు వివేక్.

వివేక్ తన చెల్లెలి కొడుక్కి కీర్తనని యిచ్చి పెళ్ళి చెయ్యాలను కొంటున్నట్టు వివేక్ యింతకు ముందే వీళ్ళతో చెప్పారు. మరి దినేష్ కొడుకుతో పెళ్ళి యేమిటని ఆలోచిస్తోంది లత. ఆమె ముఖం చూసి ఆమెలో యీ విషయమే మెదుల్తోందని వూహించిన వివేక్, ''మీకు తెలుసు గా మా చెల్లెలి కొడుక్కే కీర్తనని ముందు యిద్దాం అనుకొన్నాం. కానీ కీర్తనకి యూయస్‌లో అక్కడే సెటిల్ అవ్వాలని వుంది. మా చెల్లెలి కొడుకు సివిల్స్‌లో టాప్ ర్యాంకర్. తనకి యిక్కడే వుండాలని వుంది.

సహజమే కదా. కీర్తనే అంత మంచి పొజీషన్‌లో వున్నవాడిని వద్దంది. వాడు ప్రాక్టికల్. కీర్తన వద్దంటే వోకే అనేశాడు కానీ వొప్పించే ప్రయత్నాలేం చెయ్యలేదు. కీర్తన సాఫ్ట్‌వేర్ యింజినీర్‌ని చూడమంది. లక్కీగా అన్నీ తెలిసిన దినేష్ కొడుకుతో పెళ్ళి కుదిరింది. మా చెల్లెలు చాలా అప్‌సెట్ అయింది. పిల్లలిద్దరికి లేని మిస్సింగ్ ఫీలింగ్ మీ యిద్దరికీ యెందుకర్రా అని మా అమ్మగారు తన కోపాన్ని తగ్గించారనుకో... మనం ఆ యేజ్‌లో వున్నప్పుడు మనకి జీవితంపై యింత క్లారిటీ లేదనుకొంటాను. యిప్పటి పిల్లలకి చాలా క్లారిటీ వుంది జీవితం పట్ల... వీళ్ళ పిల్లలకి యింకా యెక్కువ వుంటుందనుకొంటా,'' అన్నారాయన.

''యస్ యస్... పిల్లలు చాలా ప్రాక్టికల్. వాళ్ళ సంతోషమే ముఖ్యం... గుడ్ డెసిషన్. నైస్... తనవైపే కళ్ళప్పగించి చూస్తున్న లతని చూడగానే అతని మాటలు ఆగిపోయాయి.

''వోకే సీయూ,'' అని వివేక్, దినేష్ వెళ్ళిపోయారు.

కారు డ్రైవ్ చేస్తున్న లతని, ''అతుల్యా విషయంలో మన నిర్ణయం సరి కాదనిపిస్తుందా,'' అడిగారు అనిల్.

''నాక్కూడా అర్థం కావటం లేదు. తనేం మళ్ళీ మాటాడలేదు. మే బి... మనం కాస్త స్థిమితంగా ఆలోచించుకోడానికి టైమ్ యిద్దాం అను కొందనుకొంటాను. వొప్పుకోండని తిండి మానైటం, యింట్లోంచి పారిపోవ టాల్లాంటి పిచ్చి పనులు చెయ్యదు తను. తన నిర్ణయం కూడా యేం మార్చుకోకపోవచ్చు. మనం వొకసారి సత్యాతో మాటాడితే. అతన్ని చూడనే లేదింతవరకు,'' అన్నారు లత.

''చూడటం అనేది పెట్టుకొంటే యీ పెళ్ళికి మనం వోకే అను కుంటేనే. బాగా ఆలోచించు.''

''ఐ నో... అని చిన్నగా నిటూర్చి, ''అదీ నిజమే... సరే, మీ అమ్మ నాన్నగారితో కూడా మాట్లాడి అప్పుడు డిసైడ్ చేద్దాం,'' అన్నారామె.

◆ ◆ ◆

కాఫీషాప్‌లో కోల్డ్ కాఫీ ఆర్డర్ చేస్తున్న అతుల్యని, ''సత్యాని ఆంటీ అంకుల్ వొక్కసారి చూస్తే వొద్దనరు. యెలాగోలా వాళ్ళు చూసేట్టు చెయ్యి,'' అంది కీర్తన.

''యెలా చెయ్యగలను... మాకు కామన్ ఫ్రెండ్స్ లేరుగా,'' అంది అతుల్య.

''మై హు నా... నా యెంగేజ్‌మెంట్‌కి పిలుస్తాను. మీ ఫ్యామిలీ అంతా వొక్కసారే చూసైవచ్చు.''

''ఛీటింగ్.''

''నాకు సత్యాని పరిచయం చేశావ్. అతన్ని యెంగేజ్‌మెంట్‌కి పిలవాల్సిందే కదా. యిందులో ఛీటింగ్ యేముంది. యెవరో వొకరు ఐస్ బ్రేక్ చెయ్యకపోతే యెలా... నువ్వు యెలాగోలా వాళ్లని వొప్పించకపోతే మీరిద్దరు ఆ మ్యారేజ్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టేవాళ్ళు తప్ప యెవ్వరుండరు మీ పెళ్ళి,'' బెదిరిస్తున్నట్టు అంది కీర్తన.

''పో... నేనెందుకలా చేసుకొంటాను... మామిడాకులు. మల్లె పువ్వులు, కర్పూరం పుల్లలు, గోరింటాకు, అరటి చెట్లు యిలా పెళ్ళిని యెంతో ఫెస్టివ్ లుక్‌తో చేసుకొంటాను. ఆర్గానిక్ కాయకూరలతోనే. పచ్చి జీడిపప్పు బీరకాయ, పనసపొట్టు కూర, బూరెలు, కొర్ర పాయిసం స్పెషల్. అందరూ బ్రౌన్‌రైస్ తినలేరుగా. వైట్ రైస్ కూడా పెడతాం,'' నవ్వుతూ అంది.

''మెనూ కూడా రెడీ... అమ్మా తల్లీ నా ఐడియాని అమలుపరిచే అవకాశం యివ్వు,'' నవ్వుతూ అంది కీర్తన.

''వద్దులే మనకి తెలుసు కదా కావాలనే చేశామని... మన మనసుకి బాగోదు. వెయిట్ చేస్తాను. వాళ్ళు వొప్పుకొనే వరకు... అస...'' అని ఆమె మాటలని డిస్ట్రబ్ చేస్తూ ఫోన్ మోగింది.

''సత్యదేవ్‌ని మా అందరికి వొకసారి చూపించొచ్చుగా... మేం యే...'' నాన్నమ్మ చెపుతోన్న మాటలు తను కరెక్ట్‌గానే విన్నానో లేదోనని మళ్ళీ అడిగింది అతూల్య.

''యిన్‌వైట్ హిమ్,'' కీర్తనకి చెప్పింది అతుల్య.

''వ్వావ్...'' అంటూ కీర్తనని హగ్ చేసుకొంటునే సత్యాకి కాల్ చేసి పిలుస్తుంటే మధ్యలో అతుల్య ఫోన్ తీసుకొని, ''కీర్తనకి చాలా పరిమళ భరితమైన కానుక యివ్వాలి. ఆ సౌరభానికి నా ఫ్యామిలీ ఫ్యామిలీ మనకి వోకే చెప్పాలి,'' అంటుంటే, ''అరే నాకోసం కాదా ఆ గిఫ్ట్...'' నవ్వుతూ అంది కీర్తన.

కాదన్నట్టు తలతో చెపుతూ, ''వోకే... యే సువాసన వీస్తే యీ ప్రపంచంలో యెవ్వరు యెవ్వరికి నో అనరో ఆ సువాసన పట్రా... అసలు అలాంటిది యేమైనా వుందా,'' అడిగింది అతుల్య.


''వుంది.''

''యేంటది సత్యా.''

''ప్రేమ.''

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 26 జులై 2015*

# మౌన



వో చికెన్ ఫ్రాంకీని, వొక గ్లాసు నిండా బటర్‌స్కాచ్ మిల్క్‌షేక్‌ని పేరు తెలియని ఆమె కోసం వుంచి ఆ రోజు వచ్చిన క్యాష్‌ని లెక్కపెడు తోంది కమిలిని. షాప్‌ని క్లీన్ చేసి క్లోజ్ చేసే అతను మాత్రమే వున్నాడు. మిగిలిన స్టాఫ్ వెళ్లిపోయారు. సరిగ్గా యిలాంటి సమయంలోనే వొంటరి గా వచ్చిన ఆమె తింటానికి యేముంటే అది పెట్టమని అడిగింది వారం రోజుల క్రితం కమిలినిని. అప్పుడు సాలిడ్ ఫుడ్ యేంలేక బటర్ స్కాచ్ మిల్క్‌షేక్ స్వయంగా చేసి యిచ్చింది, ఆరోజు షావ్‌లో

మరెవ్వరూ లేకపోవటంతో. యీ వారం రోజులుగా ఆమె దాదాపు యిదే సమయానికి కాస్త అటుయిటుగా వస్తునే వుంది. ఆమె రెండు రోజులు వరుసగా రావటంతో మూడో రోజు నుంచి ఆమె కోసం వొక ఫ్రాంకీ కూడా వుంచుతోంది కమిలిని. ఆమె యీ రోజింకా రాలేదు. షాప్ మూసేసే సమయం అయింది.

'అసలు ఆమె గురించి యింతగా నేనెందుకు ఆలోచిస్తున్నాను,' అనుకొంది కమిలిని.

సిటి మధ్యలో వున్న ఆ మాల్‌లో వొక ఫ్లోర్ మొత్తం ఫుడ్ కోర్ట్సు వున్నాయి. రోజు చాలామంది వస్తుంటారు. రెగ్యులర్ కస్టమర్స్ ఆ చిన్ని ఫ్రాంకి జాయింట్‌కి రావటం తక్కువే. ఫ్లోటింగ్ పాపులేషన్ యెక్కువ. ఫ్రాంకీస్, డోనట్స్, కేరమిల్ కస్టర్డ్ , రకరకాలైన మిల్క్‌షేక్స్ మాత్రమే సర్వ్ చేస్తారు.

'కాస్త అలా రెగ్యులర్‌గా వచ్చే వాళ్లలో ఆ యిద్దరమ్మాయిలు కలిసి వచ్చేవారు. నాలానే వాళ్ళకి ముప్పైఐదు లోపలే వుండొచ్చు వయస్సు. యెప్పుడూ వాళ్ల చుట్టూ మరోలోకమే లేనట్టు వున్నంతసేపు కబుర్లు, నవ్వులతో ఫ్యూజన్ మ్యూజిక్ చిమ్మించేవారు యీ అవుట్‌లెట్ అంతా. యీమధ్య వొక్క అమ్మాయే వస్తుంది. డిస్ట్రబ్డ్‌గా కనిపిస్తోంది. యేమై వుంటుంది. ఆ రెండో అమ్మాయి యేమయిందో? యీ అమ్మాయి యీ రోజింకా యెందుకు రాలేదో,' అని కమిలిని అనుకొంటుండగా ఆమె వచ్చింది.

లోపలికి వెళ్లి ఆమె కోసం వుంచిన ఫ్రాంకీ, మిల్క్‌షేక్ తెచ్చి యిచ్చింది. ఆమె హేండ్ బ్యాగ్‌లోంచి డబ్బులు తీసి యిచ్చింది. ఆమెకి మిగిలిన డబ్బులు, బిల్ కాపీ యిచ్చింది కమిలిని. ఆమె యెప్పటిలానే కూర్చుని తింటూ, మెల్లగా మిల్క్‌షేక్ తాగుతోంది.

క్లోజ్ చేసే టైమ్ కాబట్టి ఆమె త్వరగా బయలుదేరితే బాగుండునని ఆమెవైపు కమిలిని చూస్తే ఆమె యెటో శూన్యంలోకి చూస్తోంది.

"యెక్స్‌క్యూజ్ మి," కమిలిని అంది.

ఆమె తలెత్తి చూసింది.

"సారీ, క్లోజింగ్ టైమ్."

“నేనిక్కడ వుండొచ్చా,” అని అడిగింది చప్పున.

“యిక్కడా,” అయోమయంగా అడిగింది కమిలిని.

“సారీ,” అని ఆమె లేచి మెల్లగా నడుస్తూ వెళ్లిపోయింది.

పార్కింగ్‌లోంచి కారు తీసుకొని వెళుతూ సిటి సెంట్రల్ దగ్గర సిగ్నల్ పడితే ఆగింది కమిలిని. గ్రీన్ లైట్ వెలిగింది. రైట్‌కి తిరగబోతుంటే ఆమె నిదానంగా నడుస్తూ వెళుతూ కనిపించింది.

ఆమె తనని, ‘యిక్కడ వుండొచ్చా,’ అని యెందుకు అడిగింది యిందాక. ఆమె యెక్కడికి వెళుతుందో కనుక్కొని దారిలోనైతే లిఫ్ట్ యివ్వొచ్చు. కాని ఆమె తన కారు యెక్కుతుందా! తను పూర్తిగా స్ట్రేంజర్ కాదుకానీ రాత్రి పదకొండున్నరకి తనతో వచ్చేంతకానీ తను లిఫ్ట్ యిస్తానని అడిగేంతగా కూడా వొకరికివొకరం తెలీయం కదా. అనుమానం, అభద్రతా టెంటికిల్స్‌లా వ్యాపించేస్తున్నాయి జీవితాల్లో.

ఆలోచిస్తునే డ్రైవ్ చేస్తున్నా, లోపలెక్కడో గిల్టీగా కూడా అనిపించింది కమిలినికి.

‘ఆ అమ్మాయి మానసికంగా వుత్సాహంగా లేదని తెలుస్తునే వుంది. నాలోంచి కూడా యెదుటివారిని పట్టించుకోనే మనసు వెళ్లిపోతుందా. యెదుటివారిని పట్టించుకోనితనం అంటువ్యాధిలా నాకు సోకిందా,’ అనుకొంటుండగా దిగులేసింది కమిలినికి. అప్రయత్నంగా వెనక్కి వెళ్ళింది.

ఆ అమ్మాయి అప్పటికి కార్నీ దాటి వెళ్లుతూ కనిపించింది. రైట్ యూటర్న్ తీసుకొని ఆమెకి కాస్త దూరంలో ఆపి, కారు దిగి, “యెక్కడైనా డ్రాప్ చెయ్యనా. నేనిటే వెళ్ళుతున్నాను,” అని అడిగింది.

ఆమె కాస్త అయోమయంగా చూస్తూ, “నో థ్యాంక్స్,” అంటూ ఆగి కమలిని వైపు తటపటాయింపుగా చూస్తూ, “ మీకు అభ్యంతరం లేకపోతే కెబిఆర్ పార్క్ వరకు లిఫ్ట్ యివ్వగలరా,” అని అడిగింది.

కారెక్కారు. మాటలేం లేవ్. పార్క్ దగ్గరకి వచ్చాక, “యెక్కడ ఆపను,” అని అడిగింది కమలిని.

ఆమె చుట్టూ చూస్తూ, “యిక్కడ ఫుట్‌పాత్ మీద చాలామంది పడుకొని వుంటారుగా రకరకాల హాస్పటల్స్ పనిమీద వచ్చినవాళ్లు. కాస్త అక్కడ ఆపుతారా,” అంది.

"యెందుకక్కడ'," అడిగింది కమలిని ఆసక్తిగా.

"అక్కడైతే సేఫ్." అంది.

"సేఫ్ అంటే? వోకె. ఐ యామ్ కమిలిని. మీ పేరేంటి."

"విమల."

"మీరు యేదో విషయంలో డిస్టర్బ్‌గా వున్నారని తెలుస్తోంది. మీకీ రాత్రికి వుండటానికి ప్లేస్ కావాలంటే నాతో రండి. మిగిలిన విషయాలు పొద్దున్నే చూసుకొందాం. నాకు నిద్రొస్తోంది," అంది కమిలిని.

ఆమె కళ్లల్లోంచి టపటపా నీళ్లు వడగళ్లలా.

కమిలిని నిద్ర తేలిపోయింది.

"సారీ... అంటుండగానే ఆమె కళ్లు నుంచి ధారాపాతంగా కన్నీరు.

యీ కొద్దిపాటి పరిచితురాలి బాధేంటో, యెలా వోదార్చాలో తెలీక అయోమయంగా కమిలిని ఆమె చేతిని చేతుల్లోకి తీసుకోబోతుంటే విమల తన చేతిని చప్పున వెనక్కి తీసుకొంది. యెక్కువ చొరవ చూపించానా అని సిగ్గుగా అనిపించింది కమిలినికి.

"సారీ... నన్ను మీతో రమ్మన్నారు. మనం వొకరికొకరు యేమంత తెలుసని. చాలా వికలంగా వున్నాను. మీ యింటికి రమ్మని పిలిచారు. మీకు నా గురించి తెలీదు. రేపు నేను యెవరినో తెలిశాకా మీరు ఫీల్ కాకూడదు. నేనెవరో తెలిశాక మీకు వోకె అంటే వస్తాను," అంది.

"యేదో వొక రాత్రి కొన్ని గంటలు మా యింట్లో వున్నంత మాత్రాన మీ ప్రైవసీలోకి నేను యెలా యెందుకు చొరబడతానండి. యిది క్రైమ్‌కి సంబంధించిన విషయం కానంత వరకు నాకు వోకె. మీరే ఆలోచించుకొని చెప్పండి," అంది కమలిని.

"నాక్కూడా అర్థం కావటం లేదండి నే చేసిన నేరమేంటో. కానీ నన్ను అందరూ నేరస్తురాలిగానే చూస్తున్నారు," అని ఆగి, " మంచినీళు వున్నాయా," అని అడిగింది.

పక్కన వున్న నీళ్ల బాటిల్ అందించింది కమిలిని.

విమల నీళ్లు తాగి కమిలిని పర్మిషన్ కూడా అడక్కుండానే వొక ట్రాన్స్‌లో వున్నట్టు చెప్పటం మొదలుపెట్టింది.

◆ ◆ ◆

అవి నేను యూనిర్సిటీలో జాయిన్ అయిన రోజులు. వేసవి వెళ్ళిపోయింది. వానలింకా మొదలు కాలేదు.

రోజూ వార్తల్లో వానలు రాకపోవటం మీద కథనాలు వస్తున్నాయి. ఆ మధ్యాహ్నం క్లాస్ అయిపోయింది. నన్ను యింట్రావర్ట్ అనేవారు డిగ్రీలో వుండగా లెక్చరర్స్. దానికి తోడు అంతా కొత్తగా వుందిక్కడ. యింకా యెవరితో స్నేహం కాలేదు. క్యాంపస్‌లోని హాస్టల్ రూమ్‌కి వొంటరిగా బయలుదేరాను.

చెట్ల మధ్య నుంచి నడుస్తున్నాను, నాలో నేనే ఆలోచించుకొంటూ, మాటాడుకొంటూ. 'సైకిల్ కొనుక్కోవాలి యీ శనివారం వెళ్ళి. ఆరోజు యెవరినైనా తోడు రమ్మనాలి.' అప్పుడు వినిపించింది హఠాత్తుగా మేఘ ఘర్జన వర్షాగమనపు సంకేతంలా. చల్లదనం పాకుతోంది వొళ్లంతా. అప్పటి వరకూ యెండ కాసిన వైనమే లేకుండా టపటపా జల్లు. అంతవరకు యెండకాసిన ఆనవాలుగా భూసుగంధం వెచ్చగా తాకుతోంది వుచ్ఛ్వాస నిశ్వాసాలని.

అప్పుడు వినిపించింది, "బ్యూటిఫుల్," అని.

తల తిప్పి చూశాను.

జీన్స్ మీద షార్ట్ షర్ట్ , బాయ్‌ఃకట్‌తో నవ్వుతూ చూస్తోన్న ఆమె చూపులు వానకి తడిసి శరీరానికి అతుక్కుపోయిన నా చున్నీ పైనే వున్నాయి.

సైకిల్ కి స్టాండ్ వేస్తూ, "యీ సీజన్‌కి మొదటి వాన కదా," అంది యింగ్లీషులో.

తిరిగి ఆమె కురుస్తున్న వాన వైపు చూస్తూ, " మొదటిసారి కురిసే వానలో తడుస్తుంటే వుండే మజానే వేరు," అంది.

తిరిగి ఆకాశం వురిమింది. భయంతో 'అర్జునా ఫాల్గుణా' లోలోపల పఠిస్తోంది నా మనసు.

"యేమయింది అలా బిగుసుకుపోతున్నావ్? వానంటే యిష్టం లేదా," అడిగింది.

"యిష్టమే."

"మరి."

"వురుములంటే భయం," చెప్పేశాను.

ఆమె నవ్వి, "సో నీ కోసం వురుముల్లేని వానల్ని యివ్వమని మేఘాలకి చెపుతాలే" అని యింకా నవ్వుతూనే "భయపడటం వలన అవి ఆగిపోవ్ కానీ చాలాకాలానికి వచ్చిన వానని యెంజాయ్‹ చై" అంది.

ఆమె యీ యూనివర్సిటి స్టూడెంట్ అని తెలుస్తూనే వుంది. ఆమె మాటల్లోనే కాదు ప్రతి కదలికలోనూ కనిపిస్తున్న వాగువేగాన్ని చూస్తూ, 'యెంత కలివిడిగా మాటాడుతుందో. తను యెప్పటికైనా యిందులో సగమైనా మాటాడగలనా,' ఆలోచిస్తున్నాను.

యెంత హడావుడి ప్రేమలా వచ్చిందో అంతే హడావడిగా వెళ్ళిపోయింది వాన.

ఆమె వెళ్ళబోతూ, "నా పేరు మౌన. చూశారా జీవితంలో యెంత కాంట్రాస్ట్ వుంటుందో... నా పేరుకి నా లొడలొడకి యేమైనా సంబంధం వుందా," అని ఆగి, "మీ పేరు," నవ్వుతూ, "నది అయితే కాదుగా. మరీ నిశ్శబ్దంగా వున్నారు. నిజానికి మీకు నా పేరు కరెక్ట్‌గా సూట్ అవుతుంది. మీ నిశ్శబ్దం చాలా అందంగా వుంది నదీతీరంలా," అంది.

ఆమె మాటల్లోనే కాంప్లిమెంట్‌ని యెంత బాగా చెప్పేస్తుందో యెఫర్ట్‌లెస్‌గా. మౌన నాకు నచ్చింది. కానీ తనతో వొక్క మాటా మాటాడలేకపోతున్నాను. యిదే, యీ మాటాడలేనితనాన్ని వదిలించుకోవాలి. యెలా...

"హలో, పేరు చెప్పటానికి అంతలా ఆలోచించకండి. మనం మౌనంగానే మాటాడుకొందాం. యిక్కడ పిహెచ్.డి చేస్తున్నాను. యింగ్లీష్ లిటరేచర్ స్టూడెంట్‌ని. మీరు," నవ్వుతూ అడిగింది.

"విమల. యం.యస్సీలో చేరాను," అన్నాను.

"హాస్టల్లోనేగా వుండేది. యిప్పుడు టీ తాగితే భలే వుంటుంది. చింత చెట్టు కింద వున్న క్యాంటీన్‌కి యెప్పుడైనా వెళ్లారా," అడిగింది.

'అన్నం ఆకలేస్తుంటే యిప్పుడీ టీ యేంటో,' అనుకొంటూ ఆ క్యాంటీన్ తెలీదన్నట్టు తలూపాను.

సైకిల్ యెక్కుతూ, "దా," అంది.

వెనక కూర్చున్నాను.

విచిత్రమైన పరిమళం తడిసిన చెట్ల ఆకుల్లోంచి. అప్పుడప్పుడు గాలికి చిన్నగా తగుల్తున్న ఆమె షర్ట్ చివరలు కొద్దిగా గిలిగింత కలిగిస్తోన్నాయి.

◆ ◆ ◆

అలా మొదలైంది మా స్నేహం.

సైకిల్ కొనుక్కోవాలని చెపితే మౌన తీసుకువెళ్లింది.

తరచూ కలుస్తుండేది. యెప్పుడు కలిసినా యూనివర్సిటీలోని కొత్త కొత్త లోలోపలి ప్రదేశాలు చూపించేది.

"నీకు బాయ్ ఫ్రెండ్స్ వున్నారా," అడిగిందో రోజు.

"లేరు."

"యిక్కడ కాదు. యిప్పటివరకు."

"లేరు."

"యేం."

"యేం అంటే..."

"స్ట్రేంజ్. యు ఆర్ వెరీ గుడ్ లుకింగ్. చాలామంది ప్రపోజ్ చేసుంటారుగా. యిట్స్ నేచరల్," అంది.

"నీకు," అడిగాను.

"వుండేది వొకమ్మాయి. కొద్దికాలమే. యం.యే. అవ్వబోతున్న టైమ్ లో పరిచయం. తరువాత యం.ఫిల్ చేస్తున్నప్పుడు కూడా కొంతకాలం ఫ్రెండ్స్మి. తరువాత తనకి మరో ఫ్రెండ్‌షిప్ వచ్చింది. అప్పట్నుంచి మరెవ్వరూ లేరు," అని చెప్పింది.

మౌన యిలా అవలీలగా విషయాలు మాటాడే ప్రతిసారీ యెప్పటిలానే ఆమె నాకు ఆశ్చర్యంగా తోస్తుంది. అందరూ చాలా దాచి దాచి మాట్లాడే స్నేహాలని, 'నాకు బాయ్‌ఫ్రెండ్స్ లేరు,' అని నేను చెప్పినంత మామూలుగా చెప్పిందామె.

చాలామంది ప్రపోజ్ చెయ్యటం నిజమే కానీ నాకెందుకో వాళ్ళు మాటాడినంతసేపు బానే వుంటుంది. వాళ్ళ చెయ్యి మామూలుగా తగిలినా కూడా యేంటోలా వుంటుంది. వొక ప్రత్యేకమైన కాంక్షతోనో,

మోహంతోనో, ఆసక్తితో తాకితే మరింత చికాకుగా అనిపిస్తుంది. అది వాళ్లపట్ల వున్న వ్యతిరేకతేం కాదు. అదేంటో మెల్లమెల్లగా అర్థమవ్వ సాగింది. ముఖ్యంగా మౌన పరిచయంతో రోజురోజుకి పెరుగుతున్న ఆ స్నేహంలో ఆ విషయం మరింత తేటగా తెలుస్తోంది. కానీ సహజంగానే యెవ్వరితో త్వరగా మాటాడలేనితనం వోవైపు. మరోవైపు విషయం మనసుకి సంబంధించింది. సున్నితమైనది.

◆ ◆ ◆

ఆ రోజు మెయిల్ చూస్తుంటే మౌన పంపిన పోయిమ్ కనిపించింది.

*వాన కురిసిన ఆ మధ్యాహ్నం*
*యెదురైన మరో వాన*

*దప్పికగొన్న మరో హృదయభూమిపై*
*వాన కురిసినప్పుడంతా మనసు సుగంధం*
*మరలమరల యెగసి చిమ్ముతుంటుంది*

*పుస్తకంలోని నెమలియీక*
*అనుకోకుండా కనిపించినట్టు*
*మర్చిపోయిన యిష్టమైన పాటొకటి*
*హఠాత్తుగా యఫ్‌యెమ్‌లో వినిపించినట్టు*

*యెదురైన వాన*

*తెరవని గది తలుపులల్లోంచో*
*తెరచీ తెరవని కిటికీ రెక్కల నుంచో*
*జీవనకాంతిని చిలకరిస్తాదేమోననే*
*యెదురు చూపు...*

యెంత బాగుందో... మౌనాకి జవాబు రాశాను.

◆ ◆ ◆

ఆ రోజు వుదయమే మౌన నా రూమ్‌కి వచ్చింది. చేతిలో వొక చిన్ని మట్టికుండీలో మనీప్లాంట్. ఆ కుండీ కింద పెట్టడానికి ఆరెంజ్ కలర్

ట్రే. అలానే కిటికి వూసకి వొక చిన్ని బెల్ కట్టింది. గాలికి ఆ చిన్నిగంట మెత్తగా మోగుతోంది.

కాసేపు అవీయివీ మాటాడాక, "సాయంత్రం లామకాన్‌లో నాటకం వుంది. వెళదామా," అని అడిగింది మౌన.

యిద్దరం ప్లే చూసి అక్కడికి దగ్గరలోనే వున్న మాల్‌లోని ఫ్రాంకీ అవుట్‌లెట్‌కి వచ్చాం. రెండు చికెన్ ఫ్రాంకిస్, రెండు డోనెట్స్, వొక బటర్ స్కాచ్ మిల్క్‌షేక్ ఆర్డర్ చేసింది మౌన.

అవి తినేశాక మిల్క్‌షేక్ వచ్చింది.

వొన్ బై టూ అనుకొని యెక్స్‌ట్రా గ్లాస్ తీసుకురమ్మన్నాను.

గ్లాస్ వచ్చింది. ఆ గ్లాస్‌లోకి వొంపటానికి ఆ మిల్క్‌షేక్ గ్లాస్ అందు కోబోతుంటే, "వన్ సెకెండ్," అంది మౌన.

"మనిద్దరం పార్టనర్స్‌గా వుండటం నీకు యిష్టమైనా," అడిగింది మౌన.

ఆమెవైపు చూపు చూశాను. కళ్లల్లో యేం చెపుతానన్న క్యూరియాసిటి. చిన్న ఆదుర్దా.

యేం చెయ్యాలో తెలీక నవ్వాను.

"ఆ నవ్వు నాకేం కన్వే చెయ్యలేదు విమల. నాకు నా పార్ట్‌నర్‌తో సెటిల్ అవ్వాలని వుంది. వో క్యూట్ యిల్లు కావాలనిపిస్తుంది. యీ హాస్టల్ జీవితం యిక చాలనిపిస్తుంది. మరీ యెక్కువ ఆలశ్యం చెయ్య కుండా నిన్ను అడగటమే మంచిదనిపించింది. నువ్వంటే యిష్టమని యిప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మనిద్దరం పార్టనర్స్‌గా హ్యాపీగా వుండగలమనే అనిపిస్తుంది. నీకు అలానే అనిపిస్తే, నీకు యిష్ట మైతే మిల్క్‌షేక్‌ని ఆ రెండో గ్లాస్‌లో పోయ్యకుండా రెండు స్ట్రాలు యిందు లోనే వేయి," అంది మౌన.

అప్పటికే యీ విషయంలో కాస్త ఆలోచించుకొని వున్నానేమో యెక్కువ తటపటాయింపు లేకుండానే మిల్క్‌షేక్‌లో రెండు స్ట్రాలు వేసాను.

"థ్యాంక్ యూ," అంటూ హగ్ చేసుకొంది.

◆ ◆ ◆

ఆ తరువాత మేం యిద్దరం హాస్టల్లో వొకే రూమ్‌లో వున్నాం కొంత కాలం. తరువాత వో యిండిపెండెంట్ యింట్లో వొక పోర్షన్ అద్దెకి తీసు కొన్నాం. ఆ యింటికి కావల్సినవి వొకొక్కటిగా యెంచుకొని కొనుక్కునే వాళ్ళం. మా వంట గదిని, లివింగ్‌రూమ్‌ని, బెడ్‌రూమ్‌ని మాకు నచ్చినట్టు కలర్‌ఫుల్‌గా అలంకరించుకొన్నాం. మా యింటికి వున్న వరండాలో వొక వూయల కట్టాం. వుదయం ఆ వూయల బల్లపై నేను కూర్చుంటే మౌన యెదురుగా వో వెదురు మోడాపై కూర్చునేది. యిద్దరం కబుర్లు చెప్పు కొంటూ వేడివేడి ఫిల్టర్ కాఫీ తాగుతూ ఆ అరోమాని ఆస్వాదిస్తూ కబుర్లు చెప్పుకొనేవాళ్ళం. మౌన తను రాసిన కొత్త కవితనో, నచ్చిన మరొకరి కవితనో, కథనో చదివేది. పాటలని వినటం యిద్దరికి చాలా యిష్టం. వంట యెవరికి వీలైతే వాళ్ళం చేసేవాళ్ళం. మా మా వుద్యోగాలకి వెళ్ళే వాళ్ళం. వీకెండ్స్‌లో సినిమాలకి వెళ్ళేవాళ్ళం. షాపింగ్ చేసేవాళ్ళం.

గిటార్ యిష్టమని నేర్చుకోడానికి జాయిన్ అవ్వాలనుకున్నప్పుడు గిటార్‌ని నాకు చెప్పకుండా మౌన కొనుకొచ్చి చాలా ఆశ్చర్యపర్చింది నన్ను. అలా మా యిద్దరం సంతోషంగా వుండేవాళ్ళం.

మా యింట్లో యీ విషయం చెప్పలేదు. మౌన తనింట్లో చెప్పింది.

వాళ్ళింట్లో వాళ్ళు, 'యింతకు ముందు అమ్మాయి నిన్ను తన అవ సరానికి వాడుకొని వదిలేసింది. యిప్పుడు సంపాదిస్తున్నావ్ కూడా. మోస పోతావ్. యీ స్నేహాన్ని యిలానే పెట్టుకొని పెళ్ళి చేసుకో,' అన్నారంది.

అప్పుడు వాళ్ళిద్దరి విషయం వివరంగా మాటాడింది మౌన.

''నన్ను తనేం తన అవసరాలకి వాడుకొని వదిలేయలేదు. మా యిద్దరి జీవితానికి సంబంధించిన చుట్టూ వున్న సమస్యలు తనకి, నాకు కూడా ప్రాక్టికల్‌గా అర్థమవ్వసాగాయి. తను తన ఫ్యామిలీని, యీ సొసైటీని యెదుర్కోలేనంది. అంతే. యింట్లోవాళ్ళు చేసే పెళ్ళి చేసుకొని కూడా వేరేగా మరో అమ్మాయితో వుండొచ్చన్నది ఆమె ఆలోచన. అభి ప్రాయం. దానికి నేను వొప్పుకొంటే మనిద్దరమే అప్పుడప్పుడు కలవచ్చుంది. వుండొచ్చుంది.

''కానీ నాకే అలాంటి లైఫ్ యిష్టంలేదు. అదేం జీవితం. మనః శ్శరీరాలు యేకమవ్వాలి. మాదైన వొక యిల్లుండాలి. మా పిల్లల్ని మేం

పెంచుకోవాలి. దత్తతా, సరొగసీయా అవన్నీ తరువాత. నాకు కంప్లీట్ యిల్లు కావాలి. అసలే మా జీవితాలు అన్ నేచురల్ అంటున్నారు. మాకేమో యిలా తప్పా మరోలా వుండలేమనిపిస్తోంది. అసలే రహస్యం. మళ్ళీ అందులో సబ్ రహస్యం. అంత కాంప్లికేషన్ అవసరమా అని అనిపించింది. అయినా సహజమో అసహజమో నాకు అలానే జీవించటం వచ్చు. నాకు నాదైన ఫ్యామిలీ కావాలి. మా యింట్లో వాళ్ళకి యివి అర్థం కావు. అఫ్‌కోర్స్ యెవరికి కావనుకొంటాను. కానీ వాళ్ళకి నేను తిరగబడతానని కాస్త భయం వుందనుకొంటాను. వూరిలో అందరికి తెలిసిపోతుందనే పరువు భయమూ వుంది. అదీకాక నేను యింట్లోవాళ్ళు అడిగిన డబ్బు సహాయం కూడా చేస్తున్నాను కదా. నిజానికి వాళ్ళకి అక్కర్లేదు. కానీ డబ్బుకి నో అనేది వుండదు కదా. యీ ఫ్యామిలి పాలిటిక్స్ అర్థమవుతాయి. కానీ కొన్నింటిని సీరియస్‌గా తీసుకోకూడదు. నా యీ జీవిత విధానాన్ని పూర్తిగా వాళ్ళు వొప్పుకోలేరు. అంతమాత్రాన నేను వాళ్ళని పూర్తిగా వదులుకోలేను. ఐ లవ్ దెమ్. మీ యింట్లో వాళ్ళకి చెప్పకపోతే నీ మీద పెళ్ళి చేసుకోమనే వొత్తిడి పెరుగుతుంది కదా,'' అంది మౌన.

''మా యింట్లోనా? అమ్మో నా వల్లకాదు.''

''మరి నువ్వు యెలా డీల్ చేస్తావ్.''

''యేమో... యిప్పుడే చెప్పను,'' అన్నాను.

◆ ◆ ◆

ఆ తరువాత కొంతకాలానికి మా యింట్లో వాళ్ళకి యీ విషయం చెప్పలేదు కానీ పెళ్ళి చేసుకోలేనని చెప్పాను. కానీ వాళ్ళకి మెల్లగా విషయం అర్థమవ్వసాగింది. మెల్లగా నాకు వాళ్ళకి మధ్య మాటలు బాగా తగ్గాయి. తన జాతకంలోనే పెళ్ళి అనేది లేదని యిలా వాళ్ళ కష్టాలు వాళ్ళు పడ్డారు యింటా బయటా నాకు యెందుకు పెళ్ళికాలేదో చెప్పుకోలేక.

మౌనకి మొక్కలని పెంచటం అంటే యిష్టం. ఆ యింటి గల వాళ్ళు మనుష్యులకే నీళ్ళు సరిపోవటం లేదు. మోటర్ వేస్తుంటే కరెంట్ బిల్లు యెక్కువ అవుతోందని గొడవ చేస్తుంటే మేం ఆ బిల్లుని షేర్ చేస్తాం

అని చెప్పింది. డబ్బులు తీసుకొని కూడా నస పెడుతుంటే భలే విసుక్కు నేది. యీ చికాకంతా పడలేం కానీ మనమే వొక యిల్లు కట్టుకుందా మంది. వూరికి దూరంగా వొక చిన్ని స్థలం కొనుక్కున్నాం. అప్పటివరకు దాచుకున్న డబ్బులు మరికొంత లోన్ తీసుకొన్నాం. చిన్న యిల్లు కట్టు కొన్నాం. ఆ అప్పులు కలిసే తీర్చాం. మేం దాదాపు పదిహేనేళ్ళుగా వుంటున్నాం.

పోయిన నెల యిద్దరం హాలిడేకి వెళ్ళాం. అక్కడ సడన్‌గా వచ్చిన వరదలో చాలమంది కొట్టుకుపోయారు. చెల్లాచెదురయ్యారు. చెల్లాచెదు రయిన వాళ్ళలో మౌన కూడా వుంది. గాలింపు చర్యలు చేస్తుంటే అక్కడే వున్నాను. మౌన కోసం రోజూ అక్కడ యేర్పాటు చేసిన క్యాంప్స్, ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతోంటుంటే, 'మీకేమవుతుంది,' అనే ప్రశ్న యెదురయ్యేది. యెలా చెప్పాలి పార్ట్‌నర్స్ అని. ఫ్రెండ్ అని చెప్పేదాన్ని. ఫ్యామిలి మెంబర్స్ యెవ్వరూ యిక్కడికి రాలేదా అని అడిగేవారు. ఫ్యామిలి మెంబర్స్ అని అడిగిన ప్రతిసారీ నేను, తను యెవ్వరం? అప్పటికీ మౌన యింట్లోవాళ్ళకి వెంటనే యిన్‌ఫామ్ చేశాను. కానీ వాళ్ళు రావటానికి అక్కడి దారులన్నీ కొట్టుకుపోయి వున్నాయి. విషయాలు చెపుతుండమన్నారు. అక్కడ అధా రిటీస్ యేమైనా తెలిస్తే చెపుతాం అని నన్ను వెళ్ళిపొమన్నారు. వచ్చేశాను ధుఃఖంతో.

నేను యిక్కడికి వచ్చేసరికి మౌన యింట్లోవాళ్ళు వూరి నుంచి వచ్చి మా యింట్లో వున్నారు. మా బెడ్‌రూమ్‌లోని బీరువా తాళాలని తీయిం చారు. వొక్క మాటలో చెప్పాలంటే వాళ్ళు యింటిని ఆక్యుపై చేసు కొన్నారు. యిక్కడ విషయాలు, మౌన విషయం చూసుకొంటాం అని నన్ను యింట్లోంచి వెళ్ళిపొమ్మన్నారు. నిర్ఘాంతపోయాను.

"యిది మా యిల్లు," అన్నాను.

"యిది మౌన యిల్లు. అందులో నిన్ను వుండనిచ్చింది, అంతే. వెళ్ళిపో," అన్నారు.

యేం చెయ్యాలి నేను?

సమాజం వొప్పుకోదు. మాకంటూ చట్టాలు లేవు. కానీ మేం నిజం. మా జీవితాలు నిజం. మా అనుబంధాలు నిజం. కుటుంబం, సమాజం,

స్నేహితులు, చట్టం అండగా వున్న వాళ్ళ జీవితాల్లోనే బోలెడంత హింస వుంది. అన్యాయం వుంది. భద్రత లేదు. ఆ సంబంధాల్లోనే అలా వుంటే యే వొక్క దన్నూ లేని, ఆధారం లేని మాపై జరిగే అన్యాయాన్ని యెక్కడ యెలా అడగాలి. యిప్పుడు మా విషయమే తీసుకోండి. ఆ యిల్లు మౌన పేరు మీద వుంది. కానీ అది మా యిద్దరం కలిసి నిర్మించుకొన్నాం. యిద్దరం కలిసి కూర్చుని కాఫీ తాగే వూయల బల్ల, కవిత్వం చదువుకొన్న అనేక స్థలాలు, పెంచుకొన్న మొక్కలు యిలా జ్ఞాపకాలున్నాయి. యిల్లంటే నాలుగు గోడలు వో కప్పు మాత్రమే కాదుకదా. అనుబంధాల గొడుగు కదా.

మౌన యింట్లోవాళ్లు కట్టుబట్టలతో నన్ను బయటకి పంపించారు. మౌన కానుకగా యిచ్చిన నాకెంతో అపురూపమైన గిటార్‌ని యిమ్మన్నాను. యివ్వలేదు. నా కళ్ళ ముందే వాళ్ళ అమ్మగారు దాన్ని విరిచేస్తూ, "నా కూతురి జీవితాన్ని నాశనం చేసినదానివి. నువ్వే తనని పట్టుకొని వుండి వుండకపోతే తను అందరిలా నిక్షేపంగా పెళ్ళి చేసుకొని వుండేది. చివరికి నా కూతురే తప్పిపోయింది. నువ్వెంత డబ్బుకి మరిగినదానివో నేను కని పెట్టలేనా? మౌన మనసు కష్టపెట్టలేక మేం వచ్చేవాళ్ళం కానీ యిదంతా నచ్చి కాదు," అంటూ ఆమె కడుపు తరుక్కుపోయినట్టు పెద్దగా యేడ్చింది. నా మనసంతా వికలం అయిపోయింది, ఆమె వేదన చూసి.

మమ్మల్ని అందరికి భిన్నంగా తయారుచేసింది యెవరు? యెందుకు యింతమందికి వ్యతిరేకంగా మా మానసిక శారీరక స్థితి వుంది. యిలా మమ్మల్ని సృష్టించినప్పుడు మమ్మల్ని మామూలుగానే చూసేట్టు మొత్తం సమాజం యెందుకు లేదు? అన్నీ ప్రశ్నలే. మ్యారేజ్ చేసుకొన్న వాళ్ళు యిలాంటి పరిస్థితుల్లో బయటకి గెంటవేయబడితే ఆ అమ్మాయిలు తమ హక్కుల కోసం, న్యాయం కోసం కోర్టులకి వెళ్ళతారు. టీవీల్లో, పేపర్లో మాట్లాడతారు. మేం అవి యేం చెయ్యలేం. మా ప్రేమ నిషిద్ధం. మా అనుబంధం నిషిద్ధం. చివరికి మా ప్రాణాలనే నిషేధించేస్తా రేమో అన్నంత భయంతో బతుకుతుంటాం. అసలు చట్టంలో మాకో చోటుంటే కదా యిది మా హక్కు అని అడగ్గలం. మాలాంటివాళ్ళు అడుగు తోన్న చట్టబద్ధత వస్తుందో రాదో. అప్పటివరకు మా జీవితాలకి

స్వేచ్ఛ లేదు. యేంటో చట్టబద్ధత లేదని యిలా బతకాలని వున్న వాళ్ళు యిలా వుండటం మానేస్తారా? చట్టబద్ధత వుందని యిలాంటి వాటిమీద ఆసక్తి లేనివాళ్ళు వస్తారా? మౌన కోసం దుఃఖించే వీలుకూడా లేదు. యేడవ టానికి చోటులేదు. యిదేం ప్రపంచం. యెవరినైనా గట్టిగా హత్తుకొని యేడవాలనుంది.

నిజమే టెక్నికల్‌గా ఆ యిల్లు మౌన పేరుమీదే వుంది. మా బంధానికి అనుబంధానికి యెటువంటి చట్టబద్ధత లేదు. సొసైటీ ఆమోదం లేదు. యెవరు మావైపు మాటాడతారు. మౌనా మిస్సింగ్ వొకవైపు నా మనసుని అతలాకుతలం చేస్తుంటే నిలబడే చోటుకోసం నేనెలా వెతుక్కోగలను. వొంటరిగా నిలబడ్డాను. మీకో విషయం చెప్పనా మా యిద్దరికి వున్న స్నేహితులు పలకరిస్తున్నారు. కానీ వాళ్ళ యింట్లో కనీసం వొక్క రోజు కూడా వుండమని అడగలేదు. యీ విషయాల్లో కల్పించుకోవటం వాళ్ళకీ యిబ్బందే కదా. కారు కూడా తీసేసుకొన్నారు. అదున్నా అందులోనే వుండేదాన్నేమో. ఆఫీస్ అయ్యాక మీ దగ్గరకి రావటం యెందుకంటే అక్కడ మా యిద్దరికి సంబంధించిన జ్ఞాపకాలున్నాయి,'' అంది విమల.

ఆశ్చర్యంతో వింటున్న కమిలిని కాసేపు నిశ్శబ్దంగా వుండిపోయింది. ఆమె మనసంతా వొకలాంటి నిస్తేజం ఆవరించింది. తనకి యిలాంటివి అసహజం అనే అభిప్రాయం వుంది. సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం కూడా యెప్పుడు కనిపించలేదు. ఆమె చెప్పేవరకు అసలు వాళ్ళిద్దరూ అలాంటివాళ్ళు అని తనకి అనిపించలేదు.

"మీకు ఆలశ్యం అవుతుంది. నేనిక్కడే యెక్కడో వుంటాను,'' అంది విమల.

"మా యింటికి వెళ్ళదాం,'' అంటు కమిలిని కారు స్టార్ట్ చేసింది.

"మీ యింట్లో యింకెవరుండరా,'' అడిగింది విమల.

"మా హజ్బెండ్, నేను వుంటాం. పిల్లలు హాస్టల్లో వుంటారు. మా యిన్‌లాస్ వచ్చి వెళుతుంటారు. యెవరికి డిస్ట్రబెన్స్ లేకుండా బయట నుంచి లాక్ చేస్తాను.''

యింట్లోకి వెళ్ళాక విమల పడుకోడానికి రూమ్ చూపించి, "నైట్ డ్రెస్ కావాలా,'' అని అడిగింది కమిలిని.

“నో థాంక్స్,” అని, “రియల్లీ థాంక్స్. సారీ ఫర్ ది ట్రబుల్,” అంది విమల.

“గుడ్‌నైట్,” అంది కమిలిని.

తన గదిలోకి వెళ్ళింది కమిలిని. నిద్రపోతున్న తన భర్త పక్కన చప్పుడు కాకుండా పడుకొని అతను కప్పుకొన్న బ్లాంకెట్‌లోకి మెల్లగా దూరుతూ అతని మీద చేయి వేసింది నిదానంగా. అలా వేసి పడుకొంటే యెంతో సెక్యూర్డ్‌గా ఆత్మీయంగా అనిపిస్తుంది. అతను ఆ నిద్రలోనే ఆమె చేతిని తన చేతుల్లోకి యిముడ్చుకొన్నాడు. వొక కంఫర్ట్.

యిదే, యిలాంటి వొక కంఫర్ట్‌గా మౌన, విమల కోరుకొంది. పొందింది.

◆ ◆ ◆

‘కంఫర్ట్‌గా వుండగలిగేదాన్నా ఆ ఫుట్‌పాత్ మీద. కొత్త యిల్లు తీసుకోవాలంటే అద్దె అడ్వాన్స్‌కి డబ్బులు లేవు. అయినా వొంటరి ఆడపిల్లలకి యిళ్ళెవరిస్తారు. సాఫ్ట్‌వేర్ వుద్యోగాలైతే కాస్త యిచ్చే ఛాన్స్ వుంది. హాస్టల్లో రూమ్ తీసుకోవాలి. ఆఫీస్‌వాళ్ళు అడ్వాన్స్ రేపైనా యిస్తారా? అసలు యిదంతా యేంటో? యీరోజుకి యిలా గడిచింది,’ ఆలోచనలు యెక్కువసేపు వెంబడించక ముందే నిద్రొచ్చేసింది విమలకి.

◆ ◆ ◆

మళ్ళీ మెలకువ వచ్చేసరికి గదిలోని కిటికీల నుంచి అతి పల్చని వెలుగు లోపలకి లీలగా దోబూచులాడుతోంది.

కొన్ని క్షణాల తరువాత ఆమెకి తను యీ కొత్త గదిలో యెందుకు వుందో గుర్తొచ్చింది. గదిలోకి వచ్చిన కమిలిని గుడ్ మార్నింగ్ చెప్పి కాఫీయా, చాయా అని అడిగింది.

కాఫీ అని చెపుతుండగానే, తను, మౌన కాఫీతో పరిమళింప చేసిన అనేక సమయాల పరిమళం మనసుని చుట్టుకోగానే విమల కళ్ళ నిండుగా కన్నీరు. యెంతలో జీవితం వుప్పగా మారిపోయిందో...

ఆఫీస్‌కి బయలుదేరుతూ, “థ్యాంక్ యూ. మౌన మిస్సింగ్ తరువాత కాసేపైనా కంఫర్టబుల్‌గా నిద్రపోయాను. వర్కింగ్ వుమెన్స్‌హాస్టల్లో

యివాళో రేపో చేరుతాను. తరువాత మెల్లగా ఆలోచించుకొంటాను యీ జీవితాన్ని తిరిగి యెలా చక్కదిద్దుకోవాలో... ఆ భగవంతుని దయవల్ల యే అడివిలోనో చిక్కుకొన్న మౌన తిరిగి వచ్చెయవచ్చు యెప్పటికైనా,'' అని ఆగి, ''నాకీ కష్టం వచ్చాక మొదటిసారి వొక వ్యక్తి దగ్గర నాలోని మొత్తాన్ని చెప్పుకున్నాను. మౌన స్నేహంలో నేను నా యింట్రావర్ట్ స్టేటస్ నుంచి యేమంత పెద్దగా మారలేదు. బట్ యీ దుఃఖం మీ దగ్గర మాట లుగా బరస్ట్ అయినట్టుంది. అందుకే మిమ్మల్ని కలిపాడా భగవంతుడు. థాంక్ యూ,'' అంది విమల.

''మా అవుట్‌లెట్‌కి వస్తుండండి. మీ యిద్దరి ప్లేస్ అలానే వుంటుంది. మౌన తిరిగి సాధ్యమైనంత త్వరగా రావాలని దేవుణ్ణి ప్రార్థిస్తాను. యిది నా మొబైల్ నెంబర్,'' అంది కమిలిని.

◆ ◆ ◆

విమల ఆ యింట్లోంచి బయటకి వచ్చి లిఫ్ట్ వైపు వెళుతుంటే ఆమె ఫోన్ రింగ్ అయింది. ఆ నెంబర్ చూసి యెవరా అనుకొంటూ, ''హలో,'' అంది.

''యెక్కడున్నావ్... నేను నిన్ను కలవడానికి వచ్చాను.''

''అమ్మా,'' ఆశ్చర్యపోతూ అంది విమల.

''అవును. నేను అన్నయ్య వచ్చాం. హోటల్లో వున్నాం,'' అంది అమ్మ.

'యిన్నాళ్ళలో వొక్కసారి కూడా చూడటానికి రాని తన తల్లి, అన్న యీరోజు యీ విషయం తెలిశాక వచ్చారు. అప్పుడప్పుడూ తమని చూడ డానికి వచ్చే మౌన యింట్లోవాళ్ళు యిప్పుడింత బిట్టర్‌గా తనపట్ల ప్రవర్తిస్తున్నారు. యేంటో యిదంతా,' అనుకొంటూ వాళ్ళు యెక్కడున్నారో కనుక్కుని అక్కడికి వెళ్లింది విమల.

పలకరించుకొన్నాక, ''యిన్నాళ్ళు రాని నువ్వు యిప్పుడెలా వచ్చావ్,'' కుతూహలంగా అడిగింది విమల తల్లిని.

''నీ గురించి మేం యింట్లో అప్పట్లో చాలానే మాటాడుకొన్నాం. మా అందరికి పెద్ద షాక్ నీ ప్రవర్తన. మాకు చాలా బాధని, ఆందోళనని కలిగించింది. నీకు దూరంగా వుంటే నువ్వు మారతావ్ అనుకున్నాం. కానీ

నువ్వు మారలేదు. యిప్పుడు నీ యీ కష్టంలో వొకసారి కలుద్దామనిపించి వచ్చాం. యింటికి వెళదామా,'' అంది అమ్మ.

వాళ్ళకి యిక్కడ విషయాలన్నీ చెప్పాలనిపించక, ''మౌన వాళ్ళ పేరెంట్స్, వాళ్ళ అక్క, అన్న కూడా వున్నారు. యిప్పుడు అక్కడికి వెళ్ళడం అవ్వదు. నేను ఆఫీస్‌కి వెళ్ళాలి. మీరు రెస్ట్ తీసుకోండి,'' అంది విమల.

యీరోజు అప్లై చేసిన అడ్వాన్స్ శాంక్షన్ కావొచ్చు. ముందు వుండ టానికి వొకచోటు వెతుక్కోవాలి అనుకొంటూ ఆఫీస్‌కి బయలుదేరు తుంటే, ''వాళ్ళు నిన్ను బయటకి గెంటేశారా,'' నిదానంగా అడిగారు విమల అమ్మ గారు.

నిశ్శబ్దంగా వున్న కూతురు వైపు చూస్తూ, ''యిలాంటిది యేదో జరుగుతుందనే అనుకున్నాం. నా మనసులోకి వచ్చింది నిజమే అవు తుంది. నిన్ను అమాయకురాలిని చేసి వాళ్ళు ఆడుకొంటున్నారు. అన్ని లక్షలు దానికే పోశావ్... అసలు,'' తల్లి మాటలని మధ్యలోనే కట్ చేస్తూ, ''అమ్మా, యిన్నాళ్ళు నా విషయాలు యెలా పట్టించుకోలేదో యిప్పుడు అలానే వుండండి. చూడ్డానికి వచ్చావు. థ్యాంక్ యూ. మౌన గురించి వ్యతిరేకంగా మాటాడొద్దు. తను నా మనిషి. తన కోసం నేను వెతుకుతునే వుంటాను,'' అంది విమల.

''నువ్వెప్పటికీ మాకు సంతోషాన్ని యివ్వలేవ్. యెప్పుడూ తలనొప్పే నీతో. నీ మాట యీసారి మేం వినం. ఆ యింట్లో నీ కష్టార్జితం వుంది,'' అంటూ ఆమె కళ్ళనీళ్ళు పెట్టుకొంది.

''ఆ ఆస్తిలో నీకు వాటా వుంది. యెలా వదులుకొంటాం. యిప్పుడు ఆ యేరియాలో ల్యాండ్ ధర చాలా పెరిగిందంటగా. కనుక్కున్నాను. మన యింట్లోనూ పిల్లలున్నారు. ప్రతి పైసా ముఖ్యమే. నువ్వు మాటా డకు. వాళ్లని యెలా ఆడిస్తానో చూడు,'' అన్నాడు విమల అన్నయ్య.

నిస్సహాయంగా వాళ్ళని చూస్తూ విమల ఆఫీస్‌కి బయలుదేరుతూ, ''అమ్మని, అన్నయ్యని బతిమాలైనా సరే యింటికి పంపించెయ్యాలి సాయంత్రమో రేపో. వాళ్ళకి కావల్సిందీ ఆ యిల్లే... ఛా... యేమి మానవ సంబంధాలు...' అని అనుకొంటుండగా ఆమెకి కమిలిని గుర్తు వచ్చింది.

ఆమెకి తనేం అవుతుంది. సింపుల్ కస్టమర్... కానీ ఆమె తనతో యెంత స్మూత్‌గా వుందో... మానవ సంబంధాలపై ఆశని కలిగించేట్టుగా...

'మౌనా దారి వెతుక్కుని రా మౌనా...అలాకాదు నేనే వెళతాను. వెతుకుతాను. నీ కోసం యీరోజే తిరిగి అక్కడికి బయలుదేరుతాను,' విమల నడక వేగవంతమైయింది.

◆ ◆ ◆

తనకి అసలు యిలాంటి విషయాలపై అవగాహనే లేదు. ఆ మౌన, విమల చూడటానికి నాలానే వున్నారుగా... అలాంటి వాళ్ళ జీవితవిధానం అసహజం అనుకోవటానికి తనెవరు... అనుకొంటుండగా యేదో చూచాయిగా గుర్తొచ్చి తన చేతిలోని ఫోన్‌లో మెసెంజర్ వోపెన్ చేసింది కమిలిని. రకరకాల విషయాలపై సంతకాల కోసం ఆన్‌లైన్‌లో వచ్చే వాటిని వెతకటం మొదలుపెట్టింది కమిలిని.

తనకి చాలా రోజుల క్రితం మౌనా, విమలలాంటి జీవనవిధానంలో వున్నవాళ్ళు, తమ హక్కుల కోసం సంతకాల సేకరణ చేస్తున్న వో ఆర్గనైజేషన్ మెసెంజర్‌లో పంపిన డాక్యుమెంట్‌ని వెతికితీసింది కమిలిని. సంతకం పెట్టింది. ఆ డాక్యుమెంట్‌ని తన టైమ్‌లైన్ మీదకి షేర్ చేసింది.

విమల తను మౌనని వెతకటానికి బయలుదేరుతున్నానని యస్‌యంయస్ పంపించింది కమిలినికి.

రిప్లై యిచ్చింది కమిలిని, "ఆల్ ద బెస్ట్."

*చినుకు ప్రత్యేక సంచిక, జూన్ 2015*



